ఈనాడు

విజయవాడ 3-10-2024 గురువారం సిటీ సంపుటి 51 . సంచిక 54

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 18

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru


BAJAJ ELECTRONICS
SONY
BRAVIA 7
XR Mini LED
IMAX ENHANCED
Google TV
XR70 SERIES NEW
Range starts from Rs.1,82,990/-
SPECIAL OFFERS
3 YEARS WARRANTY
INSTANT CASHBACK UPTO RS.12,500/-
UPTO 30% OFF
TV + SOUNDBAR COMBO OFFER
SAVE UPTO 45,490/-
BUY NOW AT RS.2,995/-
LG
Life's Good.
LG AI TV
5-YEAR GUARANTEED
New Smart Platform Experience
Celebration of Light. Years of Delight.
Up to 26% CASHBACK
1 EMI FREE
FIXED EMI Starting from ₹999
UPTO 30% OFF ON LG SOUNDBAR
OLED CIRCLE
FREE MIC
SAMSUNG
BIG TV FESTIVAL
Light up your festivities with AI Powered Samsung TV
14th Sept. - 10th Nov, 24
Neo QLED 8K
1 EMI off*
Long tenure EMI up to 36 months*
Up to 20% cashback
+ 10% Extra Cashback Samsung Axis Bank Credit Cards
Haier
QLED
POWERED BY Google TV
Dolby
harman/kardon
EXCITING OFFERS
UPTO 20% INSTANT DISCOUNT
0 DOWN PAYMENT
3 YEARS WARRANTY
FIXED EMI STARTING ₹1994#
1 EMI Off Long Tenure 36 Months
AKAI
Tokyo Japan
Simply Bright.
WOWSOME ENTERTAINMENT
QLED 4K
Akai (75) 190cm
HDR 10
HLG
Dolby VISION-ATMOS
1+1 Year Warranty
LG
Life's Good.
Light up this Diwali with exciting offers on the LG Objet Collection with MoodUP Refrigerator Series and let your mood set the vibe.
CELEBRATION OFFERS
INSTANT CASHBACK UP TO ₹39,000*
FIXED EMI Starting from ₹9999
0 DOWN PAYMENT
FREE 8 PIECE BOROSIL GLASS LOCK KIT Worth ₹5000
SAMSUNG
Bespoke AI™ Festival
28th Sept - 5th Nov, 24
Upgrade to AI - Powered French Door & Side by Side refrigerators and enjoy amazing Offers
20% CASHBACK UP TO ₹15,000*
EMI Starting ₹3990/-
20 Year Warranty**
Haier
OPEN 1 DOOR TO MORE WITH
3-DOOR CONVERTIMAX
SIDE BY SIDE REFRIGERATOR
EXCITING OFFERS
20% INSTANT DISCOUNT
18 LONG TENURE EMI
0 DOWN PAYMENT
2 Years Complete Warranty on Product
10 Years on Compressor
LG
Light up this Diwali by bringing home the New Form of Laundry with exciting offers on LG WashTower.
CELEBRATION OFFERS
CASHBACK UP TO 15%*
Max up to ₹9000/-
(Applicable on 10 kg and Above Select Models)
SAMSUNG
NEW ARRIVAL
Bespoke AI™ Festival
28th Sept - 5th Nov, 24
No load too big
Bespoke AI™ Laundry now available in 12kg.
WW12DB8B54GBTL
MRP ₹ 74999
Special Offer Price ₹ 59000
15% cashback of up to ₹ 9000*
EMI Starting @ ₹ 2490*
20 years warranty* on Digital Inverter Motor
Haier
DISCOVER THE FUTURE OF LAUNDRY with AI DBT
WASHING ASSURANCE WITH 30-DAY MONEYBACK GUARANTEE
EXCITING OFFERS
0 DOWN PAYMENT
FIXED EMI STARTING ₹994*
20% CASH BACK
5 YEARS WARRANTY
SPLIT AC RANGE STARTS FROM ₹29,990/-
ATTRACTIVE CASHBACK*
NO COST EMI*
INSTALLATION FREE*
LG LLOYD DAIKIN BLUE STAR SAMSUNG Haier GENERAL
iPhone
iPhone 16 128GB MRP ₹79,900/- EFFECTIVE PRICE ₹36,900/-
iPhone 13 128GB MRP ₹49,900/- EFFECTIVE PRICE ₹22,900/-
No Cost EMI Available for 24 Months
SAMSUNG
S24 Ultra 12GB + 256GB MRP ₹1,29,999/- EFFECTIVE PRICE ₹1,09,999/-
S24 8GB + 256GB MRP ₹79,999/- EFFECTIVE PRICE ₹59,999/-
*Price Including Upgrade / Cashback
vivo
V40e 8GB + 128GB AVAILABLE NOW MRP ₹33,999/- EFFECTIVE PRICE ₹26,100/-
Y58 8GB + 128GB MRP ₹23,999/- EFFECTIVE PRICE ₹16,650/-
Effective Price Includes Cashback & Offers*
oppo
Reno 12 Pro 5G 12GB + 256GB MRP ₹53,999/- EFFECTIVE PRICE ₹29,699/-
F27 Pro+ 5G 8GB + 128GB MRP ₹32,999/- EFFECTIVE PRICE ₹25,199/-
Effective Price Includes Cashback & Offers*
mi
Redmi Note 13 5G MRP ₹20,999/- EFFECTIVE PRICE ₹14,999/-
Redmi 13 C 5G MRP ₹13,999/- EFFECTIVE PRICE ₹10,499/-
*Effective Price Includes Cashback & Offers
OnePlus Nord CE4 RANGE STARTS FROM ₹20,499/-
OnePlus Nord CE4 Lite RANGE STARTS FROM ₹16,999/-
*inclusive of bank discount and offers
ASUS VIVOBOOK 15 MRP ₹44,990 OFFER PRICE ₹32,990*
DELL INSPIRON 3530 MRP ₹74,387 OFFER PRICE ₹58,490*
Lenovo SLIM 5 MRP ₹1,11,690 OFFER PRICE ₹83,490*
HP VICTUS FA1332TX MRP ₹1,18,668 OFFER PRICE ₹99,990*
WIDEST RANGE OF LAPTOPS
FREE BAG
Get ₹5,990 worth Accessories @ ₹1,990 only
ONE EMI FREE*
Applicable from 2nd Oct to 13 Oct 2024
HP Fest-O-Mania OFFER
Pay 299 and get VIP Trolly Bag of worth ₹9500/-*
Mac Book Air 256GB EFFECTIVE PRICE ₹60,000*
Mac Book Air 256GB EFFECTIVE PRICE ₹72,000*
No Cost EMI Available for 24 Months
విజయవాడ: వినాయక థియేటర్ దగ్గర, బందరు రోడ్, గుణదల | మీనాక్షి టవర్స్, ఏలూరు రోడ్, సూర్యారావు పేట |
71-2-9, మోహన్ దాస్ థియేటర్ ప్రక్కన, వెంకటేశ్వరపురం, పటమట | మచిలీపట్నం: ఓల్డ్ D. No. 11/313, సిరి ఎస్టేట్, చెమ్మన్నగిరి పేట
గిఫ్ట్ కార్డ్స్, కార్పొరేట్ బుకింగ్‌లు లేదా బల్క్ ఆర్డర్‌ల కోసం, దయచేసి మాకు ఈమెయిల్ చేయండి corporatesales@bajajelectronics.in



ఈనాడు



విజయవాడ 3-10-2024 గురువారం సిటీ సంపుటి 51 . సంచిక 54

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 18

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru


ఎండలతో ఉక్కిరిబిక్కిరి

నెల్లూరులో 40.7 డిగ్రీలు

ఈనాడు - విశాఖపట్నం, అమరావతి: రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. చాలాచోట్ల 35 డిగ్రీలకుపైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బుధవారం అధికంగా నెల్లూరులో 40.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కావలిలో 39.8, అనంతపురం 38.9, తిరుపతి 37.6, ఒంగోలు 37.7, కడప 37.4, నందిగామ 36.9, అమరావతిలో 36.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ప్రజలు ఉక్కపోత, వేడికి విలవిల్లాడిపోయారు.

నేడూ రేపూ వర్షాలు

మరోవైపు రాష్ట్రంలోని పలుచోట్ల బుధవారం వర్షాలు కురిశాయి. ఆరోగ్యవరంలో 57 మి.మీ., గన్నవరంలో 14 మి.మీ. అమరావతిలో 9 మి.మీ. వర్షపాతం నమోదైంది. గురు, శుక్రవారాల్లో రాష్ట్రంలో పలుచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది.



చెత్త పన్ను రద్దు

నేటి నుంచి అమలు • వైకాపా ప్రభుత్వం పన్ను వేసి చెత్తను తొలగించలేదు

85 లక్షల టన్నుల వ్యర్థాలను ఏడాదిలో తొలగిస్తాం • 2029 నాటికి స్వచ్ఛాంధ్ర లక్ష్యం సాధిస్తాం

2025 డిసెంబరు నాటికి బందరు పోర్టు పూర్తి • స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

ఈనాడు, ఈనాడు డిజిటల్ - అమరావతి: 'జాతిపిత గాంధీజీ జయంతి సందర్భంగా అందరం ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలి. 2029 నాటికి స్వచ్ఛాంధ్రప్రదేశ్ లక్ష్యంగా అడుగులు వేయాలి. ప్రతి ఒక్కరూ స్వచ్ఛ సేవకులుగా మారాలి. పారిశుద్ధ్య కార్మికులు స్వచ్ఛ సైనికులు. వారి వల్లే మనం ఆరోగ్యంగా ఉంటున్నాం. వైకాపాది చెత్త ప్రభుత్వం. చెత్తమీద పన్ను వేశారు కానీ వ్యర్థాలను తొలగించలేదు. కావాలని ఆ చెత్తను షాపుల ముందు వేశారు. జగన్ ప్రభుత్వ నిర్వాకంతో 85లక్షల టన్నుల చెత్త పేరుకుపోయింది. దీన్ని ఏడాదిలో తొలగించాలని పురపాలకశాఖ మంత్రి నారాయణను ఆదేశించా. ఏపీలో చెత్త పన్ను ఈరోజు నుంచి వసూలుచేయొద్దని అధికారులను ఆదేశిస్తున్నా. వచ్చే కేబినెట్‌లో పెట్టి ఆమోదం పొందిన తర్వాత ఉత్తర్వులు ఇస్తాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో గాంధీ జయంతి సందర్భంగా బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్ర జాతీయ కళాశాలలో గాంధీ విగ్రహానికి పూలదండ వేసి కళాశాల బయట పారిశుద్ధ్య కార్మికులతో కలిసి స్వచ్ఛసేవలో పాల్గొన్నారు. అనంతరం తితిదే కల్యాణమండపం ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు.



మచిలీపట్నంలో పారిశుద్ధ్య కార్మికులతో టీ తాగుతూ మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు కొల్లు రవీంద్ర, నారాయణ తదితరులు

స్వచ్ఛ సుందర చల్లపల్లి ఆదర్శం

'పదేళ్ల క్రితం ప్రధాని నరేంద్రమోదీ స్వచ్ఛభారత్‌కు శ్రీకారం చుట్టారు. ఆ స్ఫూర్తితో 2019 వరకూ రాష్ట్రంలో పార్కులు, రోడ్లు (మిగతా 2లో)

సాంకేతికతే విరుగుడు..

సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా రాష్ట్రంలో ఎక్కడా చెత్త లేకుండా చూస్తాం. ఇటీవల విజయవాడలోని ముంపుప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా ఆహారం సరఫరా చేశాం. వాటితోనే డ్రెయిన్లను గుర్తించి పొక్లెయిన్లతో శుభ్రం చేశాం. ఇటీవల అనంతపురం జిల్లా కణేకల్లు మండలంలో రథాన్ని తగలబెట్టారు. నేరస్థుల ఆట కట్టించాలంటే సాంకేతికతను వినియోగించాల్సిందే. సాంకేతికత ద్వారానే నేరాల అదుపునకు శ్రీకారం చుడుతున్నాం.

- చంద్రబాబు



మచిలీపట్నం ఆంధ్ర జాతీయ కళాశాల రోడ్డుపై చెత్తను ఊడుస్తున్న చంద్రబాబు

ఇళ్ల నుంచి చెత్త సేకరణకు రూ.500 కోట్లు అవసరం!

ప్రభుత్వానికి అధికారుల నివేదిక

చెత్త పన్ను మొత్తాలను మళ్లించిన వైకాపా సర్కారు

ఎన్డీయేకు భారంగా మారిన నాటి తప్పిదాలు

లోపలి పేజీలో



గాంధీ జయంతి సందర్భంగా బుధవారం దిల్లీలో పాఠశాల విద్యార్థులతో కలిసి చీపురు పట్టి పరిసరాలను శుభ్రంచేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ

విజయవంతమైన ఉద్యమం 'స్వచ్ఛ భారత్'

ఇటువంటి ప్రయత్నాలతోనే దేశం పరిశుభ్రం

స్వచ్ఛతా కార్యక్రమానికి 10 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోదీ

6లో

ఇజ్రాయెల్ లక్ష్యం ఖమేనీ?

అణు స్థావరాలు, చమురు క్షేత్రాలపై గురి

ఇరాన్ ఆర్థిక మూలాల్ని దెబ్బతీయడమే ధ్యేయం



ఖమేనీ

- లెబనాన్‌లోకి ప్రవేశించిన ఐడీఎఫ్
- హెజ్‌బొల్లాతో హోరాహోరీగా పోరు
- 8 మంది ఇజ్రాయెల్ సైనికుల మృతి



లెబనాన్ రాజధాని బీరుట్‌లో ఇజ్రాయెల్ దాడి చేసిన ప్రాంతం నుంచి వెలువడుతున్న పొగ


2లో

శ్రీవారి సేవలో పవన్‌కల్యాణ్

ప్రాయశ్చిత్త దీక్ష విరమణ

- డిక్లరేషన్‌పై సంతకం చేసిన చిన్న కుమార్తె
- నేడు తిరుపతిలో వారాహి బహిరంగ సభ

ఈనాడు, తిరుపతి - న్యూస్‌టుడే, తిరుమల: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ బుధవారం తన కుమార్తెలతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం పది గంటల సమయంలో ఆయన ఇద్దరు కుమార్తెలు ఆద్య, పొలెనా అంజనాతో శ్రీవారి ఆలయ మహద్వారం వద్దకు చేరుకున్నారు. తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి వారికి స్వాగతం పలికారు. అనంతరం ధ్వజస్తంభానికి మొక్కిన పవన్‌కల్యాణ్.. బంగారు వాకిలి నుంచి శ్రీవారి ఆలయంలోకి వెళ్లారు. అక్కడ శ్రీవారిని దర్శించుకుని వారాహి డిక్లరేషన్ పుస్తకాన్ని స్వామివారి పాదాల వద్ద ఉంచారు. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు స్వామివారి పంచబేరాలు, శ్రీవారి మూలవిరాట్టు విశిష్టతను పవన్‌కల్యాణ్‌కు వివరించారు. దర్శనం అనంతరం నేరుగా రంగనాయకుల మండపానికి (మిగతా 2లో)



శ్రీవారి ఆలయంలో ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

'ఈ' ప్రోత్సాహం

విద్యుత్ ఛార్జింగ్ కేంద్రాలకు రూ.3 లక్షల వరకు రాయితీ



మొదటి 500 కేంద్రాలకు వర్తింపు

ప్రత్యేక కేటగిరీ కింద విద్యుత్ టారిఫ్

మార్గదర్శకాలను వెలువరించనున్న ప్రభుత్వం

ఈనాడు - అమరావతి

రాష్ట్రంలో బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేయబోయే విద్యుత్తు వాహన ఛార్జింగ్ కేంద్రాలకు రాయితీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో కేంద్రం ఏర్పాటుకైన ఖర్చులో 25 శాతం.. గరిష్ఠంగా రూ.3 లక్షల చొప్పున ఇవ్వనుంది. ఈ మొత్తాన్ని ఐదేళ్లలో చెల్లిస్తుంది. అందుబాటులో ఉన్న చోట ప్రభుత్వ/ ప్రభుత్వ రంగ సంస్థల భూములను లీజుకు ఇవ్వాలనీ నిర్ణయించింది. రాష్ట్రంలో మొదట ఏర్పాటు చేసే 500 ప్రైవేటు ఛార్జింగ్ కేంద్రాలకు మాత్రమే రాయితీలు వర్తింపజేయనుంది. ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటు ప్రక్రియను నోడల్ ఏజెన్సీగా నూతన పునరుత్పాదక ఇంధన వనరుల సంస్థ (నెడ్‌క్యాప్) పర్యవేక్షించనుంది. ఈ మేరకు మార్గదర్శకాలను కొద్ది రోజుల్లో విడుదల చేయనున్నట్లు సమాచారం. ప్రభుత్వ/ ప్రభుత్వరంగ సంస్థల స్థలాల్లో ఏర్పాటు చేసిన ఈవీ ఛార్జింగ్ స్టేషన్లలో వినియోగించిన విద్యుత్‌పై నిర్వాహకుల నుంచి యూనిట్‌కు రూపాయి చొప్పున లీజుగా వసూలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటుకు ప్రాధాన్యం

రాష్ట్రంలో బహిరంగ ప్రదేశాల్లో ఛార్జింగ్ నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తేవడానికి ప్రభుత్వం.. వివిధ కార్పొరేషన్లు, జిల్లా కేంద్రాల్లో ప్రాంతాలను గుర్తించింది. డిమాండ్ రెస్పాన్స్ మేనేజ్‌మెంట్ ఆధారంగా స్మార్ట్ ఈవీ ఛార్జింగ్ కేంద్రాల నిర్వహణకు ఒప్పందం కుదుర్చుకోవాలని భావిస్తోంది. టెండర్ల ప్రక్రియ ద్వారా ఛార్జింగ్ పాయింట్ ఆపరేటర్లను నెడ్‌క్యాప్ ఎంపిక చేసేలా ప్రతిపాదించింది. అవసరమైన ఇన్‌పుట్ విద్యుత్‌ను ఓపెన్ యాక్సెస్/ గ్రీన్ అమ్మోనియా జనరేటర్ నుంచి తీసుకునే వెసులుబాటును నిర్వాహకులకే కల్పించాలని నిర్దేశించింది. వివిధ కార్పొరేషన్లు, జిల్లా కేంద్రాల్లో మొదట ఏర్పాటు చేసే 150 ఛార్జింగ్ కేంద్రాలకే ప్రభుత్వం నిర్దేశించిన రాయితీలు అందుతాయి. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి వంటి నగరాల్లో సాధ్యమైనన్ని ఎక్కువ కేంద్రాలను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. (మిగతా 2లో)

శరన్నవరాత్రి మహోత్సవాలు

ఇంద్రకీలాద్రిపై నేటి నుంచి



ఈనాడు, అమరావతి: విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం ప్రారంభమవుతాయి. ఈ నెల 12 వరకు ఉత్సవాలు జరుగుతాయి. దుర్గమ్మ వేడుకలను రాష్ట్ర పండగగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లూ చేసింది. తొమ్మిది రోజుల్లో.. తొమ్మిది రూపాల్లో అమ్మవారు దర్శనమివ్వనున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లూ చేశామని దేవస్థానం ఈవో కె.ఎస్.రామారావు వెల్లడించారు. తెలుగు రాష్ట్రాలతోపాటు దేశ విదేశాల నుంచి భక్తులు భారీ (మిగతా 2లో)

పిల్లల్లో కథన కుతూహలం

- ఫోన్ నుంచి ధ్యాస మరల్చేందుకు తమిళనాడు నూతన పంథా
- విద్యార్థులను ఆకట్టుకునేలా పుస్తకాల ముద్రణ

ఈనాడు - చెన్నై


ఖాళీ సమయం దొరికిందంటే చాలు, మొబైల్ ఫోన్లకు అతుక్కుపోతున్నారు పిల్లలు. చదువుపై దృష్టి సారించలేకపోతున్నారు. క్రమంగా వీడియోలకు, వీడియో గేమ్స్‌కు బానిసలవుతున్నారు. ఈ వ్యసనం నుంచి దూరం చేసేందుకు తమిళనాడులో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 'పఠన ఉద్యమం' ప్రారంభించింది అక్కడి విద్యాశాఖ. రాష్ట్రవ్యాప్తంగా 37,592 పాఠశాలల్లో మినీ గ్రంథాలయాలను ఏర్పాటు చేసింది. కంటికి నచ్చేలా కవర్ పేజీలు, లోపల రంగురంగుల బొమ్మలు, కట్టిపడేసే కథలు, చదివిన కొద్దీ చదవాలనిపించే పాటలు.. ఇలా ప్రతి పుటా ఆసక్తి రేకెత్తించేలా తీర్చిదిద్దిన పుస్తకాలను లైబ్రరీల్లో చేర్చింది. పిల్లలను మొబైల్ ఫోన్లకు, ఇతర వృథా కాలక్షేపానికీ దూరం చేసి, వారిలో చదువుపై ధ్యాస పెంచేందుకు 2023-24 నుంచి ఈ పఠనోద్యమాన్ని క్రమంగా విస్తరిస్తోంది. (మిగతా 2లో)



పుస్తక పఠనంలో నిమగ్నమైన విద్యార్థులు

మార్పు సాధ్యమవుతోందిలా..


- పుస్తక పఠనాన్ని నిత్యం పాటించేందుకు పాఠశాలల్లో ప్రత్యేక పీరియడ్‌ను నిర్దేశించారు. ఈ పీరియడ్‌లో విద్యార్థులు ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది బృందాలుగా విడిపోతారు. నచ్చిన పుస్తకాల్ని ఎంపిక చేసుకుంటారు. సభ్యుల్లో ఒకరు బిగ్గరగా చదువుతుంటే, మిగిలినవారు వింటూ అనుసరిస్తారు.
- చదివే ప్రక్రియలో గొలుసు విధానాన్ని అవలంబిస్తున్నారు. కథలో కొంతభాగాన్ని ఒక విద్యార్థి, మిగిలిన భాగాల్ని తక్కిన బృందసభ్యులు చదువుతారు. ఫలితంగా వారు కూడా చదివే అవకాశం కోసం వేచి చూడటంతో పాటు కథపైనే ధ్యాస ఉంచుతారు.
- కథ పూర్తయ్యాక బృందంలోని కొందరు సభ్యులు దాన్ని అభినయంతో ప్రదర్శించడం మరో ఆకట్టుకునే ప్రక్రియ. ఇది విద్యార్థుల్లో పఠన ఏకాగ్రతను పెంచేందుకు, వివిధ రకాల నైపుణ్యాలు అలవడేందుకు, వినడం, చూడటం, చదవడంపై ఆసక్తి పెరిగేందుకు ఉపకరిస్తోందని ఉపాధ్యాయులు వివరిస్తున్నారు. కొత్త పదాలు నేర్చుకొని, భాషపై పట్టు సాధిస్తున్నారని, సాహిత్యాన్నీ అర్థం చేసుకోగలుగుతున్నారని తెలిపారు.
- విద్యార్థులు ఇళ్ల వద్ద కూడా ఇలాగే సాధన చేసేలా ప్రోత్సహిస్తున్నారు. విద్యార్థుల్లో ఆసక్తి పెంచేలా స్థానిక రచయితలతో పరిచయాలు, గ్రంథాలయాల పర్యటనలు చేయిస్తున్నారు. నేర్చుకున్న అంశాలపై పోటీలు నిర్వహిస్తున్నారు.



10న మంత్రివర్గ సమావేశం

ప్రతిపాదనలు సిద్ధం చేయాలని శాఖల కార్యదర్శులకు సీఎస్ ఆదేశం

ఈనాడు, అమరావతి : ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఈ నెల 10న రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సమావేశంలో చర్చించేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాల్సిందిగా అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులను ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశించారు. నిర్దేశిత నమూనాలో ప్రతిపాదనలను 8వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు సాధారణ పరిపాలన శాఖకు అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.





కుమార్తె పొలెనా అంజనా కొణిదెల ఇచ్చిన డిక్లరేషన్‌పై సాక్షి సంతకం చేస్తున్న పవన్ కల్యాణ్.. చిత్రంలో మరో కుమార్తె ఆద్య

శ్రీవారి సేవలో పవన్‌కల్యాణ్

(మొదటి పేజీ తరువాయి)

వెళ్లారు. అక్కడ వేద పండితులు డిప్యూటీ సీఎంకు వేద ఆశీర్వచనం అందించారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపలికి వచ్చాక శ్రీవెంగమాంబ అన్నదాన సత్రానికి వెళ్లి పవన్‌కల్యాణ్ అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అన్నప్రసాదం తయారీ విధానాన్ని అదనపు ఈవో వివరించారు. అనంతరం శ్రీవారి సేవకుల వద్దకు పవన్ వెళ్లి వందనం చేశారు. అక్కడి నుంచి నేరుగా అతిథిగృహానికి వెళ్లారు.



తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రంలో అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న పవన్ కల్యాణ్

డిక్లరేషన్‌పై సంతకం

శ్రీవారి దర్శనానికి వెళ్లే ముందు పవన్‌కల్యాణ్ తన కుమార్తె పొలెనా అంజనాతో డిక్లరేషన్ పత్రంపై సంతకం చేయించారు. సాధారణంగా శ్రీవారిని దర్శించుకునేందుకు వచ్చే అన్యమతస్థులు తప్పనిసరిగా తమకు శ్రీవారిపై భక్తి విశ్వాసాలు ఉన్నాయని, దర్శనానికి అనుమతించాలని డిక్లరేషన్ పత్రంపై సంతకం చేస్తారు. పవన్‌కల్యాణ్ చిన్న కుమార్తె పలీనా అంజని అన్యమతస్థురాలు కావడంతో తితిదే అధికారులు ఆమె నుంచి డిక్లరేషన్ తీసుకున్నారు. తిరుమలలో డిప్యూటీ సీఎం విడిది చేసిన గాయత్రి నిలయం వద్దకు వెళ్లి సంతకాలు తీసుకున్నారు. ఆయన కుమార్తె మైనర్ కావడంతో పవన్‌కల్యాణ్ సాక్షి సంతకం చేశారు. ఆమెతోపాటు మరో ముగ్గురు అన్యమతస్థులు శ్రీవారి దర్శనానికి వారి వెంట రావడంతో వారూ డిక్లరేషన్‌పై సంతకాలు చేశారు.

అందరి చూపు పుస్తకం వైపు

భక్తులు, అధికారుల చూపు పవన్‌కల్యాణ్ చేతిలో ఉన్న వారాహి డిక్లరేషన్‌పైనే ఉంది. దాన్ని పవన్‌కల్యాణ్ స్వయంగా ఆలయంలోకి తీసుకువెళ్లారు. దీంతో ప్రతి ఒక్కరూ అందులో ఏముందని చర్చించుకున్నారు. ఐదేళ్ల శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వ్యవహారం వెలుగులోకి రావడంతో కలత చెందిన పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. 11 రోజులపాటు సాగిన దీక్షను బుధవారం శ్రీవారి దర్శనానంతరం విరమించారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం తిరుపతిలోని జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద వారాహి సభను నిర్వహించనున్నారు. ఇందులోనే వారాహి డిక్లరేషన్‌ సంబంధించిన అంశాలను వివరించనున్నారు. ఉప ముఖ్యమంత్రితో కలిసి శ్రీవారిని ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, తిరుపతి, రైల్వేకోడూరు శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు, అరవ శ్రీధర్, సినీ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, కూడా దర్శనం చేసుకున్నారు.




తిరుమల శ్రీవారి ఆలయం ముందు వారాహి డిక్లరేషన్ పుస్తకంతో పవన్ కల్యాణ్

చెత్త పన్ను రద్దు

(మొదటి పేజీ తరువాయి)

అలివిమాలిన దోపిడీ చేశారు. కానీ వైకాపా ప్రభుత్వం రాకతో వ్యవస్థలన్నీ నాశనమయ్యాయి. 2019లో చెత్త నుంచి సంపద సృష్టికి శ్రీకారం చుట్టాం. రాష్ట్రంలో 2,43,612 మరుగుదొడ్లు, 8,124 టాయిలెట్లు, 110 మున్సిపాలిటీలను తెదేపా ప్రభుత్వం ఓడీఎఫ్‌గా మార్చింది. తర్వాత వైకాపా ప్రభుత్వం ఓడీఎఫ్ ప్లస్‌ను పక్కన పెట్టేసింది. కృష్ణాజిల్లా చల్లపల్లిలో పదేళ్ల నుంచి డాక్టర్ ప్రసాద్ దంపతులు నిర్వహిస్తున్న 'స్వచ్ఛ సుందర చల్లపల్లి' కార్యక్రమం అందరికీ స్ఫూర్తి కావాలి.



ఆంధ్ర జాతీయ కళాశాలలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నమస్కరిస్తున్న సీఎం చంద్రబాబు

బందరు వైద్య కళాశాలకు పింగళి పేరు

1919లో గాంధీజీ ఇక్కడ సత్యాగ్రహ సభలో పాల్గొన్నారు. 1921లో అఖిలభారత మహాసభల్లో పాల్గొన్నారు. ఆ సమయంలో పింగళి వెంకయ్య తాను రూపొందించిన జాతీయజెండాను గాంధీజీకి అందించారు. ఆయన ఇక్కడ పుట్టినవారు కావడం మనందరికీ గర్వకారణం. స్వాతంత్య్ర పోరాటానికి బందరు ఊపిరి పోసింది. మచిలీపట్నంలో నిర్మిస్తున్న వైద్య కళాశాలకు బాలశౌరి సూచించిన విధంగా పింగళి వెంకయ్య పేరు పెడుతున్నాం. ముట్నూరు కృష్ణారావు, జెండాకర్ర తోట నర్సయ్యనాయుడు, భోగరాజు పట్టాభి సీతారామయ్య తదితర గొప్పవారు పుట్టిన గడ్డ కృష్ణాజిల్లా.

వరదలపై యుద్ధం చేశా

గత పాలకుల పాపాలు ప్రజలకు శాపాలుగా మారాయి. బుడమేరు పనులకు గతంలో రూ.60 కోట్లు కేటాయిస్తే ఆ డబ్బునూ వైకాపా ప్రభుత్వం రద్దుచేసింది. బుడమేరుకు గండ్లు పడి విజయవాడను వరద ముంచెత్తింది. ఈ పరిస్థితుల్లో నేను వరదలపై యుద్ధం చేశా. నాకంటే పారిశుద్ధ్య కార్మికులు బాగా పనిచేశారు. విజయవాడలో అంటువ్యాధులు ప్రబలకుండా చూడడంలో వీరు కీలకపాత్ర పోషించారు.



మచిలీపట్నం తితిదే కల్యాణ మండపంలో జరిగిన స్వచ్ఛతా హీ సేవ ప్రజావేదికలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. వేదికపై ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఎంపీ బాలశౌరి, మంత్రులు నారాయణ, పార్థసారథి, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్సీ అనురాధ, పారిశుద్ధ్య కార్మికులు, తదితరులు

ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు దీపావళి నుంచి మూడు గ్యాస్ సిలిండర్లను ప్రతియేటా ఇస్తాం. 2025 మార్చి నాటికి మరుగుదొడ్లు లేని ఇళ్లకు వాటిని నిర్మిస్తాం. 2027 నాటికి ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా రక్షిత తాగునీరు ఇస్తాం. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్, నేను కూర్చొని జల్‌జీవన్ మిషన్‌కు డీపీఆర్ సిద్ధం చేస్తున్నాం. రెండేళ్లలో పోలవరం పూర్తిచేస్తాం. అమరావతి రాజధాని కూడా నిర్మిస్తాం. 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే ప్రథమస్థానంలో ఉండాలి, అందులో తెలుగువారు 33% ఉండాలి.

2025 డిసెంబరు నాటికి బందరు పోర్టు పూర్తి

బందరు పోర్టును 2025 డిసెంబరు నాటికి పూర్తిచేస్తాం. ఎప్పుడో పూర్తికావాల్సిన పోర్టును దుర్మార్గులు నాశనం చేశారు. బందరు నుంచి రేపల్లెకు రైల్వేలైను ఏర్పాటుకు చొరవ తీసుకుంటాం' అని చంద్రబాబు చెప్పారు.

స్వచ్ఛతా హీ సేవ-2024 పురస్కారాల ప్రదానం

కార్యక్రమంలో స్వచ్ఛతా హీ సేవ పురస్కారాలను ముఖ్యమంత్రి ప్రదానం చేశారు. 'స్వచ్ఛతా మే జన్ భాగీధారి' అవార్డు అనంతపురం జిల్లాకు, స్థానికసంస్థల విభాగంలో విశాఖపట్నం కార్పొరేషన్‌కు దక్కింది. క్లీన్లీనెస్ టార్గెట్ యూనిట్స్ (సీటీయూ) పురస్కారం పశ్చిమగోదావరి జిల్లాకు, తణుకు పురపాలికకు వచ్చింది. సఫాయిమిత్ర సురక్ష శివిర్స్ పురస్కారం అన్నమయ్య జిల్లా, మచిలీపట్నం నగరపాలికను వరించింది.

వాతావరణం అనుకూలించక రోడ్డు మార్గాన ఉండవల్లికి

మచిలీపట్నంలో కార్యక్రమం ముగిసిన తర్వాత సీఎం చంద్రబాబు హెలికాప్టర్‌లో ఉండవల్లిలోని తన నివాసానికి వెళ్లాలి. కానీ విజయవాడలో భారీవర్షం పడింది. హెలికాప్టర్ ప్రయాణానికి వాతావరణం అనుకూలం కాదని పైలట్లు చెప్పడంతో.. సీఎం రోడ్డుమార్గాన వెళ్లారు.

ఇజ్రాయెల్ లక్ష్యం ఖమేనీ?

- భద్రతా క్యాబినెట్‌తో నెతన్యాహు భేటీ
- ఏ క్షణమైనా దాడులు..!
- పశ్చిమాసియాలో క్షణక్షణం భయంభయం

జెరూసలెం: ప్రపంచం యావత్తూ పశ్చిమాసియా వైపు ఊపిరి బిగపట్టి చూస్తోంది. ఇక్కడ రాజుకున్న అగ్ని ఎంతటి భయానక రూపంలో నిప్పులు విరజిమ్ముతుందోనని సర్వత్రా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం రాత్రి ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులతో తమ దేశంపై విరుచుకుపడిన ఘటనపై రగిలిపోతున్న ఇజ్రాయెల్ ఎలా స్పందిస్తుందోనన్న ఉత్కంఠ నెలకొంది. ఇరాన్‌పై భారీ దాడికి ఇజ్రాయెల్ సమాయత్తమవుతున్న సంకేతాలు స్పష్టంగా వెలువడుతున్నాయి. ఇరాన్ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు బుధవారం జెరూసలెంలోని ఓ బంకర్‌లో భద్రతా క్యాబినెట్‌తో సమావేశమయ్యారు. ఇరాన్‌పై దాడి చేసి తీరాల్సిందేనని ఇజ్రాయెల్ నిశ్చితాభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఇరాన్ అణుస్థావరాలపై దాడి సహా ఆ దేశ ఆర్థిక మూలాలైన చమురు, సహజవాయువు క్షేత్రాలను లక్ష్యంగా చేసుకోవాలన్న వ్యూహరచన జరిగినట్లు సమాచారం. దీంతో పాటు ఇరాన్ కీలక నేతలనూ అంతమొందించాలన్న అంశంపైనా భద్రతా క్యాబినెట్‌లో చర్చ జరిగింది. ఇజ్రాయెల్ జాబితాలో ఇరాన్ సుప్రీం నేత అయాతుల్లా ఖమేనీతో పాటు.. ఇరాన్ రివల్యూషనరీ దళంలోని కీలక కమాండర్ల పేర్లు కూడా ఉన్నట్లు సమాచారం. అయితే ఇరాన్ అణుకేంద్రాలపై దాడులను తాను సమర్థించబోనని అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఇజ్రాయెల్‌కు తెగేసి చెప్పారు. ''ఇరాన్ కీలక స్థావరాలతో పాటు.. ఖమేనీ లాంటి ముఖ్య నాయకులను ఏరివేయడమే ప్రధానంగా మా దాడులు ఉంటాయి'' అని ఇజ్రాయెల్ సైన్యానికి (ఐడీఎఫ్) చెందిన ఓ అధికారి పేర్కొన్నారు. ఇరాన్‌పై దాడిలో ఇజ్రాయెల్‌కు అండదండలు అందించడానికి అమెరికా, ఫ్రాన్స్‌లు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే ఈ దేశాల ఆయుధ సంపత్తి పశ్చిమాసియాకు చేరింది. మంగళవారం ఇజ్రాయెల్‌పైకి ఇరాన్ ప్రయోగించిన క్షిపణుల్లో చాలావాటిని అమెరికా, దాని మిత్రదేశాలే అడ్డుకున్నాయి. ఇప్పుడు కూడా ఈ దేశాల సహకారంతోనే ఇరాన్‌పై దాడిచేయాలని ఇజ్రాయెల్ వ్యూహాలు రచిస్తోంది. అయితే తమపై ఎలాంటి దాడి జరిగినా.. అంతకుమించిన స్థాయిలో విరుచుకుపడతామని ఇరాన్ హెచ్చరికలు చేస్తోంది. దీంతో ఎప్పుడేం జరుగుతుందోనన్న భయం సర్వత్రా వ్యక్తమవుతోంది.



ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణి తాకడంతో టెల్ అవీవ్‌లోని మొస్సాద్ కేంద్ర కార్యాలయం వద్ద ఏర్పడిన భారీ గొయ్యి

మొస్సాద్' సమీపంలో భారీ గుంత..

ఇరాన్ క్షిపణుల ప్రయోగం విఫలమైందని, వాటిని తాము అడ్డుకున్నామని ఇజ్రాయెల్, అమెరికాలు ప్రకటించినప్పటికీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితి కొంత భిన్నంగా ఉంది. ఈ దేశాల క్షిపణి రక్షణ వ్యవస్థలను ఛేదించుకుని ఇరాన్ క్షిపణులు కొన్ని నేరుగా ఇజ్రాయెల్ భూభాగాన్ని తాకాయి. టెల్ అవీవ్‌లోని ఇజ్రాయెల్ నిఘా సంస్థ 'మొస్సాద్' ప్రధాన కార్యాలయం లక్ష్యంగా ఇరాన్ భారీగా క్షిపణులు ప్రయోగించింది. ఈ దాడుల్లో కార్యాలయం సమీపంలో భారీ గుంత ఏర్పడింది. క్షిపణులు పడిన సమయంలో పెద్ద ఎత్తున దుమ్ము రేగడంతో అంతకుముందు అక్కడ పార్క్ చేసిన వాహనాలన్నీ మట్టిలో కూరుకుపోయినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ గుంతకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దాడి జరుగుతుందని తెలియడంతో ఈ కార్యాలయాన్ని ముందుగానే మొస్సాద్ ఖాళీ చేసినట్లు సమాచారం. దీంతో పాటు మరికొన్ని మౌలిక సదుపాయాలు, సైనిక స్థావరాల్ని ఇరాన్ క్షిపణులు తాకిన దృశ్యాలు వీడియోల రూపంలో దర్శనమిస్తున్నాయి. కొన్ని క్షిపణులు తమ వైమానిక స్థావరాలను తాకాయని ఇజ్రాయెల్ అంగీకరించింది. కానీ యుద్ధ విమానాలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని పేర్కొంది..

గుటెరస్‌పై ఇజ్రాయెల్ నిషేధం

ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్‌పై ఇజ్రాయెల్ నిషేధం విధించింది. తమ దేశంలోకి ఆయన అడుగుపెట్టడానికి వీల్లేదని ఇజ్రాయెల్ విదేశాంగమంత్రి కాంట్జ్ పేర్కొన్నారు. ఇరాన్ చేసిన దాడిని గుటెరస్ ఖండించలేదని.. ఆయన ఇజ్రాయెల్ వ్యతిరేక విధానాన్ని అనుసరిస్తున్నారని ఆరోపించారు. ఉగ్రవాదులకు, హత్యలకు, అత్యాచారాలకు పాల్పడుతున్న వారికి గుటెరస్ మద్దతిస్తున్నారని విమర్శించారు. అయితే బుధవారం జరిగిన అత్యవసర భద్రతా మండలి సమావేశంలో ఇరాన్ దాడిని గుటెరస్ ఖండించారు. పశ్చిమాసియా యుద్ధం అంచున ఉందని.. అన్ని వర్గాలు సంయమనం పాటించాలని చైనా పేర్కొంది.

సంయమనం పాటించండి: భారత్

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. అన్ని వర్గాలు సంయమనం పాటించాలని పిలుపునిచ్చింది. వివాదాన్ని చర్చలతో దౌత్యమార్గాల్లో పరిష్కరించుకోవాలని సూచించింది. ప్రస్తుత ఘర్షణ ప్రాంతీయ యుద్ధంగా మారకుండా చూసుకోవడం కీలకమని పేర్కొంది. ఈ మేరకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఒక ప్రకటనను విడుదల చేసింది. ఇరాన్‌కు వెళ్లొద్దని భారత పౌరులను హెచ్చరించింది. ''పశ్చిమాసియాలో తాజా పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నాం. అత్యవసరమైతే తప్ప ఇరాన్‌కు ప్రయాణం చేయొద్దని సూచిస్తున్నాం. ప్రస్తుతం ఆ దేశంలో నివసిస్తున్నవారు అప్రమత్తంగా ఉండాలి'' అని పేర్కొంది.

ఊహించని ఎదురుదెబ్బ

ఇరాన్‌పై దాడికి సమాయత్తమవుతున్న వేళ.. లెబనాన్‌లోకి ప్రవేశించిన ఇజ్రాయెల్ సైన్యానికి (ఐడీఎఫ్) ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. దక్షిణ లెబనాన్‌లోని ఓ గ్రామం సమీపంలో హెజ్‌బొల్లాతో జరిగిన భూతల పోరులో 8 మంది ఇజ్రాయెల్ సైనికులు మృతి చెందారని, ఏడుగురికి గాయాలయ్యాయని ఐడీఎఫ్ తెలిపింది. మూడు ఇజ్రాయెలీ ట్యాంకులను ధ్వంసం చేసినట్లు హెజ్‌బొల్లా ప్రకటించింది. మరోవైపు గాజాలోని ఖాన్‌యూనిస్ నగరంపై బుధవారం ఐడీఎఫ్ జరిపిన వైమానిక దాడిలో 51 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇందులో ఒకే కుటుంబానికి చెందిన 19 మంది ఉన్నారని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వశాఖ పేర్కొంది. మృతుల్లో 12 మంది చిన్నారులు, ఏడుగురు మహిళలు ఉన్నారు. 85 మందికి గాయాలయ్యాయి. సిరియా రాజధాని డమాస్కస్‌పైనా ఇజ్రాయెల్ దాడి చేసింది. ఈ దాడిలో ముగ్గురు చనిపోయారు, మరో ముగ్గురికి గాయాలయ్యాయి.

సనాతన ధర్మ పరిరక్షణే మన లక్ష్యం

- తిరుమల పవిత్రతను కాపాడేందుకు ప్రత్యేక కార్యాచరణ
- నేతలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం
- నేడు వారాహి డిక్లరేషన్

ఈనాడు– తిరుపతి, అమరావతి: వైకాపా ఐదేళ్ల పాలనలో తిరుమల పవిత్రతను పూర్తిగా దెబ్బతీసిందని, రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో సనాతన ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ముందుకు సాగేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. బుధవారం శ్రీవారి దర్శనానంతరం ఆయన్ను పలువురు నేతలు కలిశారు. రానున్న రోజుల్లో ఆలయాల్లో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు ఎటువంటి ప్రణాళికలు రూపొందించాలనే అంశంపై ఈ సందర్భంగా పవన్ వారితో చర్చించినట్లు తెలిసింది. 'బ్రిటిషర్లు దేశ సంపదను దోచుకోవడమే కాకుండా మన సంస్కృతీ వైభవాన్ని దెబ్బతీశారు. దీంతో భారతీయులకు స్వాతంత్య్ర హక్కు ఉందని పేర్కొంటూ, దీన్ని సాధించేందుకు చేపట్టాల్సిన పోరాటాలపై 1930లో పూర్ణ స్వరాజ్ పేరుతో డిక్లరేషన్ విడుదల చేశారు. భారత్-పాక్ మధ్య శాంతిని నెలకొల్పడంతోపాటు అణ్వాయుధాలను ప్రయోగించకూడదని పేర్కొంటూ 1999లో రెండు దేశాల నేతలు లాహోర్ డిక్లరేషన్‌ను ప్రకటించారు' అని పవన్ కల్యాణ్ నేతలకు తెలియజేశారు. ఇప్పుడు తాము తెస్తున్న వారాహి డిక్లరేషన్ ఇందుకు భిన్నమైందని చెప్పారు. స్వాతంత్య్రం వచ్చి ఇన్ని దశాబ్దాలు గడిచినా కూడా హిందూ ధర్మంపై పలు సందర్భాల్లో దాడులు జరుగుతూనే ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోని అన్ని కులాలు, మతాలను గౌరవిస్తూనే.. హిందూ ధర్మం, మతం, ఆధ్యాత్మికతను దెబ్బతీయకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. ఈ అంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు గురువారం వారాహి డిక్లరేషన్‌ను ప్రకటించనున్నట్లు నేతలతో పవన్ చెప్పారు.

వారాహి సభ.. నిబద్ధతకు నిదర్శనం

తిరుపతిలో గురువారం నిర్వహించనున్న వారాహి సభ సనాతన ధర్మ రక్ష బోర్డు ఏర్పాటు చేయాలనే నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. 'సుమారు 14 నెలల క్రితం వారాహి తొలిసారిగా రోడ్లపైకి వచ్చినపుడు వైకాపా నిరంకుశ పాలనలో రాష్ట్రం ఉక్కిరిబిక్కిరవుతోంది. అలాంటి సమయంలో బలానికి చిహ్నంగా మారి రాష్ట్రంలోని ప్రతి మూలలో ధైర్యాన్ని నింపింది. సనాతన ధర్మ రక్ష బోర్డుకు జీవం పోయాలని కోరుకునే లక్షల మంది స్వరాన్ని ప్రతిధ్వనించే మరో బృహత్తర లక్ష్యసాధనకు వారాహి తిరిగి వచ్చింది. మన ప్రాచీన సంప్రదాయాలు, విలువలను పరిరక్షించే లక్ష్యంతో గురువారం తిరుపతిలో నిర్వహించే సభలో వారాహి డిక్లరేషన్ ప్రకటిస్తాను' అని పవన్ వివరించారు.

'ఈ' ప్రోత్సాహం

(మొదటి పేజీ తరువాయి)

జాతీయ రహదారిపై 25 కి.మీ.లకు ఓ ఛార్జింగ్ కేంద్రాన్ని అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. మొదట వచ్చిన 150 ప్రతిపాదనలకే రాయితీ వర్తిస్తుంది. అవసరమైన స్థలాన్ని నిర్వాహకులే సమకూర్చుకోవాలి.

■ ప్రైవేటు, వాణిజ్య భవనాల్లో వందకు పైగా కార్ల పార్కింగ్‌కు అవకాశం (కనీసం 5వేల చ.మీ.స్థలం) ఉన్న వాటికి, అపార్టుమెంట్లు/సొసైటీలకు (500 ఫ్లాట్లు/ఇళ్లు) కలిపి రాయితీ ఇవ్వాలని భావిస్తోంది. మొదటి 50 ఛార్జింగ్ కేంద్రాల ప్రతిపాదనలకే ఇది వర్తిస్తుంది.

ఈవీ ఛార్జింగ్ కేంద్రాలను ప్రత్యేక కేటగిరీ టారిఫ్ తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేలా తక్కువ ధరకే విద్యుత్ అందించేలా ప్రతిపాదన సిద్ధం చేస్తోంది. ప్రస్తుత టారిఫ్ ప్రకారం గంటసేపు ఛార్జింగ్‌కు సగటున రూ.25 వరకు ఖర్చవుతోందని, దీన్ని కనీసం రూ.15కు తగ్గించాలని ఛార్జింగ్ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు.

శరన్నవరాత్రి మహోత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

సంఖ్యలో దర్శనం కోసం తరలిరానున్నారు. గతేడాది సుమారు 13 లక్షల మంది దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈసారి అంతకంటే ఎక్కువే వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

■ గురువారం దసరా ఉత్సవాల తొలిరోజు బాలాత్రిపుర సుందరీదేవి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. తొలిరోజు భక్తులకు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 11 వరకూ దర్శనాలకు అనుమతిస్తారు. ఈ నెల 9న మూలా నక్షత్రం రోజున సరస్వతీదేవి రూపంలో దర్శనమిచ్చే దుర్గమ్మను ముఖ్యమంత్రి చంద్రబాబు దర్శించుకుని.. ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలను సమర్పించనున్నారు.

5న పీఎం కిసాన్ నిధుల విడుదల

ఇంటర్నెట్ డెస్క్: పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద 18వ విడత నిధులను కేంద్రం ఈ నెల 5న విడుదల చేయనుంది. దీనిద్వారా 9 కోట్ల మందికి పైగా రైతులకు లబ్ధి చేకూరనుంది. పీఎం కిసాన్ పథకం కింద రైతులు విడతకు రూ.2 వేలు పొందాలంటే ఇ- కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని అధికారిక వెబ్‌సైట్‌లో సూచించారు. ఎవరైనా ఇ-కేవైసీ చేయించుకోకపోతే వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. లబ్ధిదారుడు కచ్చితంగా తమ ఆధార్‌ను బ్యాంకు ఖాతాతో అనుసంధానం చేసుకోవాలి.

గ్రహం అనుగ్రహం

3-10-2024 గురువారం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయణం; శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం
పాడ్యమి: రా. 12-47 తదుపరి విదియ
హస్త: మ. 2-57 తదుపరి చిత్త
వర్జ్యం: రా. 11-48 నుంచి 1-34 వరకు
అమృత ఘడియలు: ఉ. 8-18 నుంచి 10-04 వరకు
దుర్ముహూర్తం: ఉ. 9-51 నుంచి 10-39 వరకు
తిరిగి మ. 2-36 నుంచి 3-24 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ. 5.54; సూర్యాస్తమయం: సా.5.47
శ్రీదేవీ నవరాత్రి ప్రా॥, కలశస్థాపన, తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవ అంకురార్పణ

పిల్లల్లో 'కథ'న కుతూహలం

(మొదటి పేజీ తరువాయి)

తొలి ఏడాది 50 రకాల పుస్తకాల ముద్రణకు రూ. 10 కోట్లు ఖర్చు చేసింది. 90.45 లక్షల పుస్తకాలను ముద్రించి పాఠశాలలకు అందించింది. ఇటీవల మరో రూ. 1.31 కోట్లు వెచ్చించి 70 రకాల పుస్తకాలను ముద్రించారు. ఈ సంవత్సరంలో మరో 127 రకాల పుస్తకాలు ముద్రించనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. గత రెండు దశల కన్నా మరింత ఆసక్తి రేకెత్తించేలా పుస్తకాలు తెచ్చేందుకు రచయితలతో ఇటీవల వర్క్‌షాప్ నిర్వహించారు.

4 దశల్లో చక్కగా..

పఠనోద్యమంలో ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులను భాగస్వాముల్ని చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిభావంతులైన ఉపాధ్యాయుల్ని ఎంపికచేసి వారితో పిల్లలకు నచ్చేలా కథలు, కవితలు రాయించారు. 16 పేజీల చిన్న పుస్తకాలను తమిళ, ఆంగ్ల భాషల్లో తెచ్చారు. వాటిని ఒక్కసారిగా పిల్లలపై రుద్దకుండా, పఠనాసక్తి క్రమంగా పెరిగేలా 4 దశల్లో అందిస్తున్నారు. ప్రస్తుతం రెండు దశలు పూర్తయినట్లు అధికారులు తెలిపారు.



బృంద పఠనం



పాఠశాలలకు అందిన కొన్ని పుస్తకాలు

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	39.0	26.5
విశాఖపట్నం	36.4	27.0
నిజామాబాద్	36.2	24.6
కర్నూలు	35.5	26.7
నరసాపురం	35.2	27.2
విజయవాడ	35.0	26.6
విజయనగరం	34.0	26.0
హైదరాబాద్	33.6	22.1
తాడేపల్లిగూడెం	33.2	26.4
గుంటూరు	33.0	26.0
శ్రీకాకుళం	32.0	27.0

వాటర్ ట్యాంక్ ఎక్కిన చెరకుగడ!

40 అడుగులు పెరిగిన గడలు



తాగునీటి ట్యాంకు ఎత్తు వరకు పెరిగిన చెరకు గడలు

చెరకు గడలు సాధారణంగా ఐదారు అడుగుల పొడవుంటాయి. పరిస్థితులన్నీ అనుకూలిస్తే పది అడుగుల వరకు పెరుగుతాయి. పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు పంచాయతీలో మంగయ్య చెరువు గట్టున ఉన్న తాగునీటి సర్వీసు రిజర్వాయరు వద్ద వేసిన చెరకు మాత్రం దాదాపు 40 అడుగులు పెరిగి అబ్బురపరుస్తోంది. ఇక్కడి ట్యాంకు వాచర్ ఆళ్ల రమణ ఈ ప్రాంగణంలో రకరకాల మొక్కలు నాటి సంరక్షిస్తుంటారు. అయిదేళ్ల కిందట చెరకు నాటగా గడలు ఏపుగా వచ్చాయి. వాటిని తాడుతో వాటర్ ట్యాంక్ స్తంభాలకు చేర్చి సంరక్షించడంతో పైపైకి పెరుగుతూనే ఉన్నాయి. – న్యూస్‌టుడే, పాలకోడేరు

దిద్దుబాటులో వెనుకబాటు

- భూ దస్త్రాల్లో సమస్యల పరిష్కారంపై క్షేత్రస్థాయి నిర్లక్ష్యం
- బాధితులు మండలాలు, జిల్లాలు దాటి రాజధానికి రావడమేంటి?
- ఉన్నతాధికారుల విస్మయం
- సత్వర చర్యలు తీసుకోవాలని సీఎం చెబుతున్నా మారని తీరు

ఈనాడు, అమరావతి: భూ వివాదాల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి వేల సంఖ్యలో అభ్యర్థనలు అందుతూనే ఉన్నాయి. వీటిపై సత్వరం చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే చెబుతున్నా. . జిల్లాల్లో పరిష్కార చర్యలు మందకొడిగా ఉంటున్నాయి. దీంతో ముఖ్యమంత్రి కార్యాలయం, రెవెన్యూ శాఖ మంత్రి, మంత్రి లోకేశ్, ప్రజాదర్బార్‌కు రాష్ట్రం నలుమూలల నుంచి వినతులు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాది జూన్ 15 నుంచి సెప్టెంబరు 19 వరకు రెవెన్యూ శాఖకు 35,928 ఫిర్యాదులు/ వినతులు అందాయి. ఇందులో 66.52% ఫిర్యాదులు రెవెన్యూ భూ రికార్డులు, పట్టాదారు పాసుపుస్తకాల్లో పేర్లు, సర్వే నంబర్ల నమోదులో దొర్లిన తప్పులు సరిదిద్దేందుకు, స్థలాల ఆక్రమణలపై, పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వడంలో జాప్యం, మ్యుటేషన్‌లో సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చినవే. మంత్రి లోకేశ్ అందుకున్న ఫిర్యాదుల్లోనూ 850 వరకు రెవెన్యూ శాఖకు చెందినవే. రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు అందిన ఫిర్యాదులు 2 వేల వరకు ఉన్నాయి. ఇదే సమయంలో.. ఆయన కార్యాలయం నుంచి కలెక్టర్లకు 1,414 అర్జీలు వెళ్లగా 16 దరఖాస్తులకు మాత్రమే తిరుగు సమాధానం వచ్చింది. దీనిపై మంగళవారం కలెక్టర్లతో జరిగిన కలెక్టర్ల సమీక్షలో ఉన్నతాధికారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. రాజధానికి వివిధ రూపాల్లో అందిన ఫిర్యాదులు/అర్జీలను రెవెన్యూ శాఖ ద్వారా జిల్లా కలెక్టర్లకు ఆన్‌లైన్‌లో పంపుతున్నారు. కలెక్టర్లు వాటిని సంబంధిత మండలాల తహసీల్దార్లకు పంపుతున్నారు. అక్కడి నుంచి వీఆర్వోలు, ఇతర ఉద్యోగులకు వెళ్తున్నాయి. ఈ క్రమంలోనే నిర్లక్ష్యం చోటుచేసుకుంటోంది. దీంతో వీటి పరిష్కారంపై తహసీల్దార్లు దృష్టి పెట్టాలని ప్రభుత్వం ఆదేశించింది.

మండలాల నుంచి ఎందుకు వస్తున్నారు?

రాష్ట్రవ్యాప్తంగా అందిన ఫిర్యాదుల్లో 13,859 ఫిర్యాదులను ఇంకా పరిష్కరించాల్సి ఉంది. భూముల రికార్డులు, పట్టాదారు పాసుపుస్తకాల్లో వివరాల నమోదులో దొర్లిన తప్పులు సవరించాలని పది వేల వరకు వినతులు అందాయి. వీటిని పరిష్కరించేందుకు స్థానికంగా అవకాశం ఉన్నప్పటికీ.. రెవెన్యూ సిబ్బంది విధుల నిర్వహణలో ప్రదర్శిస్తున్న అలక్ష్యం వల్ల బాధితులు మండలాలు దాటి జిల్లా కలెక్టర్ కార్యాలయాల వరకు వస్తున్నారు. కొంతమంది జిల్లాలు దాటి.. రాష్ట్ర రాజధాని వరకు వస్తున్నారు. స్థానికంగా పరిష్కరించాల్సిన అంశాల్ని కూడా క్షేత్రస్థాయి నిర్లక్ష్యంతో ఇక్కడి వరకు తెస్తున్నారని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

సంతృప్తి చెందకపోవడంతో మళ్లీ రీ ఓపెన్!


రెవెన్యూ శాఖకు ఈ ఏడాది జూన్ నుంచి 35,928 ఫిర్యాదులు/వినతులు అందగా.. 20,213 పరిష్కరించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇందులో 4.41% (891) నిర్ణీత గడువు దాటిన తర్వాత చర్యలు తీసుకున్నారు. సమస్యలు పరిష్కరించినట్లు పేర్కొంటూ అధికారులు ఫిర్యాదులను మూసేస్తున్నారు. కొందరు బాధితులు తమ సమస్యలు పరిష్కారం కాలేదని చెప్పడంతో మళ్లీ వాటిని తెరుస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు 1,856 ఫిర్యాదులను తిరిగి తెరిచారు.

చిత్తూరు జిల్లా నుంచి అత్యధికంగా..

అత్యధికంగా చిత్తూరు జిల్లా నుంచి 4,357 ఫిర్యాదులొచ్చాయి. అన్నమయ్య జిల్లా 2,701, ప్రకాశం 2,157, నెల్లూరు 2,157, వైఎస్సార్ 2,117, తిరుపతి జిల్లా నుంచి 1,535 వచ్చాయి. విశాఖపట్నం, కుప్పం, గుడిపల్లి, శాంతిపురం, మదనపల్లి, రామకుప్పం, గన్నవరం, రాజమహేంద్రవరం రూరల్, నెల్లూరు అర్బన్‌లో పరిష్కరించాల్సిన ఫిర్యాదులు అత్యధిక సంఖ్యలో ఉన్నాయి.

ముస్లింల జనాభా పెరుగుదల అవాస్తవం

- ప్రజల్లో అపోహలను సృష్టిస్తున్నారు
- భారత మాజీ ఎన్నికల ప్రధాన కమిషనర్ డాక్టర్ ఎస్.వై.ఖురేషీ



యస్ వై ఖురేషీ

ఈనాడు, హైదరాబాద్: దేశంలో ముస్లింల జనాభా వేగంగా పెరుగుతోందని, భవిష్యత్తులో అధికారం హిందువుల నుంచి వారి చేతుల్లోకి వెళ్తుందంటూ చేస్తున్న ప్రచారాలన్నీ అవాస్తవాలని భారత మాజీ ఎన్నికల ప్రధాన కమిషనర్ డాక్టర్ ఎస్.వై.ఖురేషీ స్పష్టంచేశారు. మరో వెయ్యేళ్లు గడిచినా ఈ దేశంలో ముస్లింలు హిందువుల జనాభాను అధిగమించలేరన్నారు. దేశంలో అన్ని వర్గాల్లోనూ వివాహ వయసు పెరగడంతోనే జననాలు తగ్గాయని, సంతాన సాఫల్యత(ఫెర్టిలిటీ) రేటు తగ్గుతుండటంతో మహిళలు ప్రస్తుత పరిస్థితుల్లో ఇద్దరి కన్నా ఎక్కువ మందిని కనే పరిస్థితుల్లేవని వివరించారు. గాంధీజయంతి సందర్భంగా హైదరాబాద్ మాదాపూర్ శిల్ప కళావేదికలో బుధవారం నిర్వహించిన 'మంథన్ సంవాద్-2024'లో ఆయన పాల్గొన్నారు. ''దేశంలో ముస్లిం జనాభా పెరుగుదల-అపోహలు'' అనే అంశంపై ఖురేషీ మాట్లాడుతూ... ''దేశంలో ముస్లింలు అక్షరాస్యతలో కింది నుంచి రెండోస్థానంలో... ఉద్యోగాలు, మౌలిక సదుపాయాల్లో ఎస్సీలతో సమానంగా వెనుకబడి ఉన్నారు. కుటుంబ నియంత్రణలో ముస్లింలు చిట్టచివరి స్థానంలో, హిందువులు అడుగు నుంచి రెండోస్థానంలో ఉన్నారు. దేశంలో 1921 నుంచి 2011 వరకు ముస్లింల జనాభా 13.6 కోట్లు పెరిగితే... హిందువుల జనాభా 67.7 కోట్లు పెరిగింది. మరోవైపు 2011 తర్వాత జనాభా లెక్కలను చేయడం లేదు. ప్రస్తుతం ముస్లింలే... హిందువుల కన్నా అధికంగా కుటుంబ నియంత్రణ చేసుకుంటున్నారు'' అని పేర్కొన్నారు.

హైదరాబాద్-నరసాపురం ప్రత్యేక రైలు పొడిగింపు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్-నరసాపురం మధ్య నడుస్తున్న ఒక జత ప్రత్యేక రైళ్లను పొడిగిస్తున్నట్లు ద.మ.రైల్వే తెలిపింది. ప్రతి శనివారం హైదరాబాద్ నుంచి బయల్దేరి ఆంధ్రప్రదేశ్‌లోని నరసాపురం వెళ్లే ఎక్స్‌ప్రెస్ (నం.07631) రైలు అక్టోబరు 30వ తేదీ వరకు ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది. నరసాపురం నుంచి హైదరాబాద్‌కు ప్రతి ఆదివారం బయల్దేరే రైలు (నం.07632)ను డిసెంబరు 1 వరకు పొడిగించినట్లు జోన్ సీపీఆర్వో ఏ.శ్రీధర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన పారా క్రీడాకారులు

ఈనాడు, అమరావతి: ఏఎమ్ఎఫ్ ఫౌండర్ ఆదిత్య మెహతా నేతృత్వంలో కొందరు పారా క్రీడాకారులు ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్‌ను కలిశారు. రాష్ట్రంలో పారా క్రీడల అభివృద్ధికి కృషి చేస్తామని, క్రీడాకారులకు మద్దతుగా నిలుస్తామని వారికి మంత్రి హామీ ఇచ్చారు. పారాలింపిక్స్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారుడు షేక్ అర్షద్‌ను ప్రత్యేకంగా అభినందించారు.



అలాంటి వారితోనే మార్పు సాధ్యం

ఈ ప్రపంచానికి అవసరమైంది గొప్ప ఆలోచనలు చేస్తూ, వాటిపై చర్చలతో కాలం వెళ్లదీసే మేధావులు కాదు. నిత్యజీవితంలో తమ లాంటి సామాన్యులకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, తమకున్న వనరులతోనే వాటిని పరిష్కరించేందుకు నిబద్ధతతో ప్రయత్నించే పౌరులు. ఆలోచనలకన్నా ఆచరణకు కట్టుబడి ఉండేవారే సమాజంలో మార్పు తీసుకొచ్చి ప్రజల జీవితాన్ని సుఖప్రదం చేయగలరు.

– లీలా హార్మోజీ, వ్యాపారవేత్త

రక్షణ ప్రాజెక్టు వద్ద డ్రోన్ కలకలం

కూల్చివేసిన నేవీ అధికారులు

రాంబిల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా రాంబిల్లి, ఎస్.రాయవరం మండలాల్లో సుమారు 4500 ఎకరాల్లో నిర్మిస్తున్న ప్రత్యామ్నాయ నౌకా స్థావరం (ఎన్ఏఓబీ) ప్రాజెక్టు ప్రధాన ద్వారం వద్ద డ్రోన్ కలకలం సృష్టించింది. సెప్టెంబరు 30వ తేదీ రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు డ్రోన్‌ను ఎగురవేయడంతో నేవీ సిబ్బంది గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆ డ్రోన్‌పై 12 రౌండ్ల కాల్పులు జరిపి కూల్చివేసినట్లు సమాచారం. ఈ విషయమై సీఐ సీహెచ్.నరసింగరావు వద్ద ప్రస్తావించగా నౌకా స్థావరం ప్రధాన ద్వారం వద్ద డ్రోన్ ఎగరడం వాస్తవమేనని, దాన్ని రక్షణశాఖ సిబ్బంది కూల్చివేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వివాహాలు, దేవతామూర్తుల ఉత్సవాల్లో కొందరు అనుమతులు లేకుండా డ్రోన్లు ఎగురవేస్తుంటారు. ఇలానే కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఆ డ్రోన్‌ను ఎగురవేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

వైకాపా డాక్టర్స్ విభాగం అధ్యక్షుడిగా సీదిరి అప్పలరాజు

పలు అనుబంధ విభాగాలకు పదవుల కేటాయింపు

ఈనాడు, అమరావతి: వైకాపా డాక్టర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఓ ప్రకటన జారీ చేసింది. పార్టీ ఆవిర్భావం నుంచి చాలా కాలం పాటు ఈ విభాగం అధ్యక్షుడిగా పనిచేసిన గోసుల శివభరత్‌రెడ్డిని వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించింది. ఈయన గత ఎన్నికల్లో గన్నవరం నుంచి వైకాపా తరఫున ఎమ్మెల్యే టికెట్ ఆశించగా, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి అవకాశం దక్కింది. పార్టీలో గోసుల చాలా ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో సలహాదారుగా వ్యవహరించిన చంద్రశేఖరరెడ్డిని ఎంప్లాయిస్, పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడిగా నియమించింది. విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎ.రవిచంద్ర, ఇంటెలెక్చువల్ ఫోరం అధ్యక్షుడిగా వై.ఈశ్వర్‌ప్రసాద్‌ను నియమించింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా పుత్తా శివశంకర్, చల్లా మధుసూదన్‌రెడ్డి, పుత్తా ప్రతాప్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, కందుల రవీంద్రారెడ్డిలను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం పేర్కొంది.

ఎంబీబీఎస్, బీడీఎస్ కన్వీనర్ కోటా ఆర్మీ ప్రాధాన్య క్రమం వెల్లడి

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీబీఎస్/బీడీఎస్ కోర్సుల ఆర్మీ కేటగిరీ కన్వీనర్ కోటా సీట్ల ప్రాధాన్య క్రమాన్ని సైనిక్ వెల్ఫేర్ బోర్డు బుధవారం ప్రకటించింది. దరఖాస్తు చేసుకున్న వారిలో 447 మంది అర్హత పొందగా, 31 మందికి సరైన పత్రాలు లేవని తేల్చింది. మొత్తం 478 మంది అభ్యర్థుల ప్రాధాన్య క్రమాన్ని విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయానికి అందించింది. ఈ మేరకు విశ్వవిద్యాలయం తాజా ప్రకటన విడుదల చేసింది.

మిర్చియార్డులో అక్రమాలపై విచారణకు కమిటీ

గుంటూరు (మిర్చియార్డు), న్యూస్‌టుడే: గుంటూరు మిర్చియార్డులో జరిగిన అవినీతి, అక్రమాలపై మార్కెటింగ్ శాఖ విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. దీనికోసం 11 మంది సభ్యులతో ఒక కమిటీని మార్కెటింగ్ శాఖ నియమించింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలు, అధికారులు కుమ్మక్కై అవినీతికి పాల్పడ్డారని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని మిర్చియార్డు మాజీ ఛైర్మన్ మన్నవ సుబ్బారావు సీఎంకు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన సీఎం విచారణ జరపాలని మార్కెటింగ్ శాఖను ఆదేశించింది దీనికోసం వేసిన కమిటీలో మార్కెటింగ్ శాఖ విజిలెన్స్ జాయింట్ డైరెక్టర్ రాజశేఖర్, ఆర్జేడీ కాకుమాను శ్రీనివాసరావు, విజయవాడ డీడీఎం లావణ్య తదితరులు ఉన్నారు.



ఈనాడు

ప్రపంచానికి ప్రాణసంకటం

'ఆలోచనా శక్తి కలిగిన జీవిగా బతకడంలో మానవుడి అసమర్థతకు బండగుర్తులే 'యుద్ధాలు' అంటారు అమెరికన్ రచయిత, నోబెల్ పురస్కార గ్రహీత జాన్ స్టెయిన్‌బెక్. బలప్రయోగం ద్వారా సమస్యలేవీ పరిష్కారం కావని తెలిసినా- శాంతిస్థాపన కోసమంటూ అలవిమాలిన హింసకు పాల్పడటం మనిషికి అలవాటైంది. గడచిన రెండు శతాబ్దాల్లో యుద్ధభూమిలో ప్రత్యక్షంగా పోరాడుతూ దాదాపు నాలుగు కోట్ల మంది మరణించి ఉంటారన్నది అంచనా. యుద్ధరక్కసి రాజేసిన ఆర్థిక సంక్షోభాలు, ఆకలి మంటల్లో ఇంకెంత మంది ఆహుతి అయ్యారో ఇదమిత్థంగా తెలియదు. సాయుధ సంఘర్షణలు, కర్కశ కదనాలు, వాటి విపరిణామాల మూలంగా విశ్వవ్యాప్తంగా ఏడాదికి ఏడున్నర లక్షల మంది వరకు చనిపోతున్నారని ఐరాస లోగడ తీవ్ర ఆవేదన వెలిబుచ్చింది. జీవచ్ఛవాలవుతున్న శరణార్థులు, చదువులకు దూరమవుతున్న చిన్నారులు... అందరినీ కలిపితే యుద్ధ బాధితుల సంఖ్య ఊహకైనా అందదు. అయినప్పటికీ వినాశకర సమరాలను నిలువరించడంలో అంతర్జాతీయ సమాజం ఎప్పటికప్పుడు చేతులెత్తేస్తోంది. ఆ దారుణ వైఫల్యం ఫలితంగానే పశ్చిమాసియా సంక్షోభం ప్రపంచానికి ప్రాణసంకటంగా పరిణమిస్తోంది!

గాజాలో ఇజ్రాయెల్ నరమేధం, దానికి ప్రతిగా హెజ్‌బొల్లా దాడులు, టెల్‌అవీవ్ ప్రతీకారేచ్ఛ... వెరసి, పశ్చిమాసియాలో శాంతిదీపం కొన్నాళ్లుగా మిణుకుమిణుకుమంటోంది. దాన్ని ఇంకా కొండెక్కిస్తూ తాజాగా ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణి దాడులకు దిగింది. 1948లో ఇజ్రాయెల్ ఏర్పాటును గుర్తించిన తొలి దేశాల్లో ఇరాన్ ఒకటి. 1979 వరకు అది టెల్‌అవీవ్‌తో స్నేహసంబంధాలనే కొనసాగించింది. ఇస్లామిక్ విప్లవంతో ఇరాన్‌లో షా రాజ్యం కూలిపోయాక ఇరుదేశాల నడుమ మొదలైన శత్రుత్వం క్రమంగా ప్రబలమైంది. హమాస్, హెజ్‌బొల్లా, హూతీలకు అండగా ఉంటూ దశాబ్దాలుగా టెల్‌అవీవ్‌తో పరోక్ష యుద్ధం చేస్తున్న ఇరాన్- మొన్న ఏప్రిల్‌లో మొదటిసారి డ్రోన్లతో ఇజ్రాయెల్‌పై ప్రత్యక్షంగా దాడిచేసింది. చతికిలపడిన ఆర్థిక వ్యవస్థతో ఇప్పటికే ఇక్కట్ల పాలవుతున్న ఇరాన్ పూర్తిస్థాయి యుద్ధానికి దిగకపోవచ్చనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. కానీ, టెల్‌అవీవ్ తలకెత్తు మొలెయాల్సిందేనని ఇరాన్ చాందసవాదులు పట్టుబడుతుండటం- ఇజ్రాయెల్ ప్రభుత్వమూ యుద్ధపరిభాష తప్ప మరొకటి మాట్లాడటం లేదు. కాబట్టి ఇప్పుడేం జరుగుతుందో, మానవాళి దానికెంత మూల్యం చెల్లించాల్సి వస్తుందో ఎవరు చెప్పగలరు?

ప్రపంచ శాంతిని కోరుకునే వారందరూ యుద్ధాలకు వ్యతిరేకంగా బలంగా గళమెత్తాలన్నది పూజ్య బాపూజీ ప్రబోధం. శాంతి కోరినంత మాత్రాన లాభం లేదు... దాన్ని బలపరిచే చర్యలను కొనసాగించాలన్నది భారత ప్రథమ ప్రధాని నెహ్రూ నిశ్చితాభిప్రాయం. ఆయనతో పాటు అబ్దుల్ నాజర్, సుకర్నో, క్వామే ఇన్‌క్రూమా వంటి నేతలు అలీనోద్యమ నిర్మాతలై సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించారు. దేశాల సార్వభౌమాధికారాన్ని గౌరవించాలని పిలుపునిచ్చారు. విశ్వశాంతి పరిరక్షణకు వారు విశేష కృషి చేశారు. 'ఇది యుద్ధాల యుగం కాదు' అని విస్పష్టంగా వ్యాఖ్యానించిన భారత ప్రధాని మోదీ- ఉక్రెయిన్‌లో శాంతిని నెలకొల్పడానికి కృషిచేస్తామని హామీఇచ్చారు. ఇరాన్, ఇజ్రాయెల్‌తో చిరకాలంగా సత్సంబంధాలు కలిగిన ఇండియా- పశ్చిమాసియా సంక్షోభ నివారణకూ చొరవ తీసుకోవాలి. అందుకు అమెరికా, చైనా సైతం కలిసి రావాలి. ఇజ్రాయెల్‌కు ఇంతవరకు 31వేల కోట్ల డాలర్ల సాయం చేసిన అమెరికా- ఆయుధాలనూ సమకూరుస్తూ టెల్‌అవీవ్‌కు రక్షణగోడలా నిలబడుతోంది. కాబట్టి యుద్ధజ్వాలలను ఎగదోసే విపరీత చేష్టలకు పాల్పడకుండా, ఇజ్రాయెల్ సంయమనం పాటించేలా చూడాల్సిన ప్రధాన బాధ్యత అగ్రరాజ్యానిదే!

మైత్రీబంధానికి అవరోధాలు

భారత ప్రధాని నరేంద్ర మోదీ గత నెలలో మూడు రోజుల పాటు అమెరికాలో పర్యటించారు. ఇండియా-అమెరికా సంబంధాలు బలపడ్డాయని.. రోజురోజుకీ అవి మరింత దృఢమవుతున్నాయని అగ్రరాజ్య జాతీయ భద్రతా కమ్యూనికేషన్ల సలహాదారు జాన్ కర్బీ ఆ సందర్భంగా వ్యాఖ్యానించారు. భారత్, అమెరికా సంబంధాలు చరిత్రలో ఎన్నడూ లేనంత బలీయంగా, సన్నిహితంగా, క్రియాశీలంగా మారాయని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సైతం ఉద్ఘాటించారు. అంతర్జాతీయ సమస్యల పరిష్కారానికి జరుగుతున్న కృషిలో ఇండియా చురుగ్గా పాలుపంచుకొంటోందని ప్రశంసించారు.

మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితుల్లో రష్యాతో చెలిమిని కొనసాగిస్తూనే, అమెరికాకు ఇండియా చేరువవుతోంది. చాలా విషయాల్లో భారతదేశ ప్రాధాన్యాన్ని గుర్తించిన అగ్రరాజ్యం సైతం మనతో బంధానికి చేయిచాస్తోంది. కానీ ద్వైపాక్షిక మైత్రి బలపడటంలో అగ్రరాజ్యం వైపు నుంచి కొన్ని అవరోధాలు నెలకొన్నాయి.



వేర్పాటువాద మూకలకు దన్ను

అమెరికాకు మరీ దగ్గరైతే భారత్ వ్యూహపరంగా స్వయం నిర్ణయాధికారాన్ని కోల్పోతుందనే సంకోచాలు ఉండేవి. వాటిని పక్కనపెట్టి అగ్రరాజ్యంతో పొత్తుకు మోదీ అధిక ప్రాధాన్యమిచ్చారు. దానివల్ల రెండు దేశాలూ లబ్ధి పొందాయి. అమెరికా నుంచి కొత్త పెట్టుబడులను, ఆధునిక ఆయుధాలను దిల్లీ పొందగలిగింది. రక్షణ పరిశ్రమలు, నవీన సాంకేతిక పరిజ్ఞానాల్లో సహకార వృద్ధికి రెండు దేశాలూ ప్రత్యేక చర్యలు తీసుకున్నాయి. ఇండో పసిఫిక్ ప్రాంతంలో చైనా దూకుడుకు అడ్డుకట్టవేయడానికి అమెరికా ఏర్పరచిన క్వాడ్ కూటమిలో భారత్ ముఖ్య భాగస్వామి. ఒక దేశం లేదా కూటమినే అంటిపెట్టుకోకుండా బహుళ భాగస్వాములతో సహకారాన్ని పెంచుకోవాలని భారత్ ఆశిస్తోందని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఇటీవల పేర్కొన్నారు. ఇలా బహుళధ్రువత్వ సాధనకు అమెరికా తమకు ఎంతగానో తోడ్పడుతోందని అన్నారు. ఒకప్పుడు ఆయుధ అవసరాల కోసం భారత్ పూర్తిగా రష్యాపైనే ఆధారపడటాన్ని ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని స్పష్టమవుతోంది. రక్షణ, సెమీకండక్టర్లు, అంతరిక్ష రంగాల్లో అమెరికాతో సహకారం నానాటికీ బలపడుతోందనీ జైశంకర్ ప్రకటించారు.


మోదీ ఇటీవల ఉక్రెయిన్, పోలాండ్‌లలో పర్యటించడాన్ని బైడెన్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఉక్రెయిన్ యుద్ధానికి స్వస్తి పలికేలా రష్యా అధినేత పుతిన్‌ను ఒప్పించడానికి ఆయనతో మోదీకి ఉన్న సాన్నిహిత్యం ఉపకరిస్తుందని అమెరికా భావిస్తోంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని సైతం సంప్రతింపులకు మోదీ ఒప్పించగలరని విశ్వసిస్తోంది. ఉక్రెయిన్‌పై దాడి నేపథ్యంలో రష్యాపై అమెరికా, నాటోలు ఆర్థిక ఆంక్షలు విధించాయి. అయినా, రష్యన్ చమురును భారత్ చవకగా కొనుగోలు చేయడం అమెరికాకు కంటగింపుగా ఉండేది. ఆ ధనాన్ని ఉక్రెయిన్‌పై యుద్ధానికి రష్యా వెచ్చిస్తోందని అమెరికా రుసరుసలాడుతోంది. అయితే, చమురు కొనుగోలు వల్ల భారత్, రష్యాలు మరింత దగ్గర కావడం యుద్ధ సమాప్తికి తోడ్పడుతుందని అమెరికా గ్రహించింది.

షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో), బ్రిక్స్ ప్లస్‌లలో భారత్ భాగస్వామి. రష్యా, చైనాలు ఏర్పరచిన అమెరికా వ్యతిరేక కూటముల్లో దిల్లీ పాలుపంచుకొంటోందని వాషింగ్టన్ మొదట్లో అనుమానించింది. కొందరు అమెరికన్ నాయకులు, నిపుణులైతే భారత్ ఎస్‌సీవో నుంచి బయటకురావాలని ఆశించారు. అయితే బ్రిక్స్, ఎస్‌సీవోలు పూర్తిగా చైనా ఆధిపత్యంలోకి వెళ్లిపోయి అమెరికా, ఐరోపాలకు బద్ధ విరోధులుగా మారకుండా నిలువరించడానికి వాటిలో భారత్‌కున్న సభ్యత్వం ఉపకరిస్తోందని అమెరికా గ్రహిస్తోంది. చైనా ఆధిపత్య ధోరణులను నిలువరించాలంటే భారత్, అమెరికాలు చేయాచేయా కలపక తప్పదు. ఈ మైత్రి క్వాడ్ విజయవంతానికీ కీలకమవుతుంది.

అమెరికా అధ్యక్షుడు బైడెన్, రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్, విదేశాంగ మంత్రి ఆంటొనీ బ్లింకెన్‌లు భారత్‌కు మరింత దగ్గరవడానికి ప్రయత్నిస్తుంటే- అక్కడి ప్రభుత్వంలోని కొన్ని శక్తులు మాత్రం దిల్లీపై అక్కసు వెళ్లగక్కడం మానుకోలేదు. ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నుకు అమెరికాలో ఆశ్రయం లభించడం దీనికి ఉదాహరణ. తనపై హత్యాయత్నం వెనక దిల్లీ హస్తముందన్న పన్ను ఆరోపణను ఇండియా ఖండించింది. అయినా, అతడికి వత్తాసు పలికే శక్తులు అమెరికా సర్కారులో ఉన్నాయి. భారత ప్రధాని మోదీ గత నెలలో వాషింగ్టన్‌లో దిగడానికి కొద్ది రోజుల ముందు వైట్‌హౌస్ సిబ్బంది కొందరు అమెరికన్ సిక్కు బృందాలతో భేటీవేశారు. వారి రక్షణకు భరోసా ఇచ్చారు. ఈ బృందాల్లో ఖలిస్థాన్‌ను సమర్థిస్తున్న వేర్పాటువాద గ్రూపులూ ఉన్నాయి. నిరుడు శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత దౌత్య కార్యాలయంపై సిక్కు వేర్పాటువాదులు దాడి చేసినా ఇంతవరకూ దోషులను పట్టుకోలేదు. సీసీటీవీ కెమెరాల్లో వారిని గుర్తించి అన్ని వివరాలను అమెరికా దర్యాప్తు సంస్థలకు అందించినా ఉపయోగం లేకుండా పోయింది. అలాగే న్యూయార్క్, శాక్రమెంటోల్లో హిందూ దేవాలయాలపై దాడులు జరిగినా నేరగాళ్లను పట్టుకోలేదు.

సరఫరాలో ఆలస్యం

ఇటీవల బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా సర్కారు కూలిన తరవాత తాత్కాలిక ప్రభుత్వ నేత మహమ్మద్ యూనస్ అమెరికాను సందర్శించారు. ఆయన అక్కడ విదేశాంగ మంత్రి బ్లింకెన్, మాజీ దేశాధ్యక్షుడు బిల్ క్లింటన్‌లతో సమావేశమయ్యారు. యూనస్ ప్రభుత్వానికి పూర్తి సహకారం అందిస్తామని అమెరికా నాయకులు వాగ్దానం చేశారు. కానీ, బంగ్లాలో హిందువులు, ఇతర మైనారిటీలపై దాడుల గురించి వారు మాటమాత్రంగానైనా ప్రస్తావించలేదు. అమెరికా నుంచి ఫైటర్ జెట్ ఇంజిన్లు, డ్రోన్లు, హెలికాప్టర్ల కొనుగోలుకు భారత్ ఒప్పందం కుదుర్చుకున్నా వాటి సరఫరాలో ఆలస్యం జరుగుతోంది. అమెరికా ప్రభుత్వంలోని కొన్ని శక్తులు మోకాలడ్డటమే దీనికి కారణం కావచ్చు. ఇలాంటి అడ్డంకులను తొలగించుకుంటూ భారత్, అమెరికా నాయకత్వాలు ద్వైపాక్షిక బంధాన్ని పటిష్ఠం చేసుకోవాలి.



హర్ష కాకడ్

విశ్రాంత మేజర్ జనరల్



అనుబంధాల పాఠాలు


చదువైపోయింది... తరవాతేంటి అని బస్సులో కూర్చొని ఆలోచిస్తోందో యువతి. పక్కసీట్లోని బామ్మగారి పలకరింపుతో ఈ లోకంలోకి వచ్చింది. పేరు, ఊరు, చదువు వివరాలన్నీ కనుక్కుంటోంది. విసుగ్గా ఉన్నా... సమాధానాలిస్తూ వెళ్లిందామె. కొద్దిసేపయ్యాక ప్రశ్నలు ఆగిపోయాయి. హమ్మయ్య అని ఊపిరి పీల్చుకుంది. ఇంతలో బామ్మగారు 'నాతో మాట్లాడటం నీకు బోర్ అనిపిస్తోంది కదూ' అనడిగింది. ఆ మాటకి కంగుతిందామె. లేదని వారించబోయింది. కానీ ఆ పెద్దావిడ 'నీ వయసు దాటొచ్చా. కాబట్టి నీ మనసు చదవగలను. ఇక ఇంట్లో నాకీ పరిస్థితీ కొత్తకాదు. కాబట్టి, నువ్వు కాదన్నా అది నిజమే' అంది.

ఆమె విశ్లేషణకి మరి మాట్లాడకలేకపోయిందా అమ్మాయి. మనసులో అపరాధభావన. పాపం పెద్దావిడ... నవ్వుతూ సమాధానం చెప్పాల్సింది అనిపించి మాటల్లోకి దిగింది. వివరాలన్నీ టకటకా అడిగింది. బామ్మా చెప్పింది. అయినా ఆ సంభాషణ తృప్తినివ్వలేదు. అందుకని 'జీవితంలో మీరు పశ్చాత్తాపపడే సందర్భాలున్నాయా?' అనడిగిందా యువతి. దానికా బామ్మ కాసేపు ఆలోచించి 'పిల్లలతో ఎక్కువ సమయం గడపాల్సిందేమో! వాళ్లకి ఇంకా ప్రేమను పంచాల్సింది. భవిష్యత్తు పేరుతో పుస్తకాలే కాదు, అనుబంధాలనూ చదివించాల్సింది. అది తరవాతి తరానికీ కొనసాగేది. అప్పుడు వాళ్లా భవిష్యత్తులో నాలా ఒంటరి భావనతో మిగలరు. ఏ సాయం అడుగుతారో, ఎక్కడ మోసం చేస్తారో అనుకోకుండా పక్కవారిని ఇంకాస్త ప్రేమించాల్సింది. మనల్ని ప్రేమించినవారి ప్రేమను గ్రాంటెడ్‌గా తీసుకోకుండా వాళ్లు చెప్పింది ఓపిగ్గా విని వీలైనంత సమయం గడపాల్సింది' అంటూ ముగించిందామె.

అనవసరంగా బాధపెట్టినట్లు ఉన్నానే అనుకున్న అమ్మాయి... ఆమె మూడ్ మార్చాలనుకుని, జీవితంలో ఆనందక్షణాలు ఏవని అడిగింది. 'చదువుకునే రోజులు, ఉద్యోగంలో చేరిన తొలినాళ్లు, పిల్లలు చిన్నగా ఉన్నప్పుడు... అత్యంత ఆనందకర క్షణా'లన్న బామ్మ మాట విని ఆశ్చర్యపోయిందా యువతి. నిద్ర, స్వేచ్ఛ ఉండవు... మనకంటూ సమయం ఉండదు కదా అంటే... 'చాలామంది పదవీ విరమణ తరవాత ఆనందంగా గడిపేయాలనుకుని పరుగు తీస్తారు. నిజానికి పోటీపడి చదవడం, ఉద్యోగం కోసం కష్టపడటం, పిల్లలతో ఉరుకులు పరుగులు... అప్పుడవి కష్టంగా తోస్తాయి. కానీ ఇప్పుడు అవే ఆనందంగా అనిపిస్తున్నాయి' అంది బామ్మ. 'ప్రతిమనిషికీ ఏదో ఒక సందర్భంలో అసంతృప్తి మామూలే! కానీ ప్రేమించేవారు లేరు, నచ్చింది చేయలేకపోయాం, ఒంటరిగా మిగిలిపోయామన్న భావనే అత్యంత బాధాకరం. అది రావొద్దంటే చేసే పనినీ, చుట్టూ ఉన్నవారినీ ప్రేమించాలి. ఓపికగా ఉండాలి. పెద్దదానిగా నేను నీకు చెప్పే పాఠమిది' అని ముగించింది.

చాలాసార్లు పెద్దవాళ్ల సలహాలను పెడచెవిన పెడతాం. జీవితంలో వాళ్లు విజేతలు అయ్యుండకపోవచ్చు. కానీ వాళ్ల వైఫల్యాలు మాత్రం మనకు పాఠాలే. ఆ పాఠాలు తరవాతి తరాలకు అందిస్తున్నామా మరి?

– అనూష నీరుకొండ



సినిమా కొన్ని తరాలను ప్రభావితం చేయగల శక్తిమంతమైన మాధ్యమం. అందుకే కేవలం హిట్ అవ్వాలన్న ఆశయంతో కాక ముందు తరాల కోసం ఏం మిగులుస్తున్నాం- అన్నది ఆలోచించుకుని తీయాలి. ఏ సబ్జెక్టు ఎంచుకున్నా దాని గురించి లోతుగా పరిశోధించాలి.

– జె.పి.దత్తా, చిత్ర దర్శకుడు, నిర్మాత, రచయిత

అభయమిచ్చే అమ్మ

దేవి సకల సృష్టి స్థితి లయకారక మూలశక్తి. వేదకాలం నుంచి శక్తి ఉపాసన ఉంది. కాలం ఈశ్వర స్వరూపం. ఈశ్వరుడు అర్ధనారీశ్వరుడు. అందుకే కాలం స్త్రీ పురుష రూపాత్మకమైంది. చైత్రం మొదలు భాద్రపదం వరకు అర్ధభాగం పురుష రూపాత్మకమైతే, ఆశ్వయుజం నుంచి ఫాల్గుణం వరకు స్త్రీ రూపాత్మకం. అపరాజిత, దుర్గ, భవాని, లలిత, పార్వతి, గాయత్రి, పార్వతి, సావిత్రి, భ్రమరి, విశాలాక్షి, వింధ్యవాసిని, శాకంబరి మొదలైన పేర్లతో దేవీ ఆరాధన జరుగుతోంది. ఆ దేవీ మాహాత్మ్యాన్ని వివరించే గ్రంథమే దేవీభాగవతం. ఇది వ్యాసుడి రచన అని విద్వాంసుల మాట. మార్కండేయ, వాయు, పద్మ, వరాహ, స్కాంద పురాణాల్లోనూ దేవీగాథలున్నాయి. కానీ దేవీభాగవతం పూర్తిగా దేవీ లీలలను ప్రదర్శించే పురాణం.



ఆశ్వయుజ పాడ్యమి నుంచి తొమ్మిది రోజులను శరన్నవరాత్రులని, దేవీనవరాత్రులని అంటారు. ఈ సమయంలో దేవీభాగవత పారాయణం ముక్తిప్రదంగా భావిస్తారు. సకల లోకాలూ జలమయమై ఉన్నప్పుడు పద్మం నుంచి రజోగుణ సమన్వితుడై బ్రహ్మ ఉద్భవించాడు. తానెవరివల్ల పుట్టానని ఆలోచిస్తున్నప్పుడు 'తప తప' అనే మాటలు వినవచ్చాయి. కొంతకాలం బ్రహ్మ తపస్సు చేశాక 'సృజ సృజ' అని వినిపించిందట. ఏమి సృష్టించాలని అతడు ఆలోచనలో ఉండగా మధుకైటభులనే రాక్షసులు తరిమారు. బ్రహ్మ తామరకాడలోని జలంలో దిగాడు. అక్కడ యోగనిద్రలో ఉన్న విష్ణువు కనిపించాడు. బ్రహ్మ విష్ణువును ప్రార్థించగా అతడు యోగనిద్ర చాలించి అభయమిచ్చాడు. విష్ణువు శక్తిని స్తుతించగా, ఆ దేవి విష్ణువును ఆవహించింది. తనతో పోరాడలేరని శరణు వేడుకోమని రాక్షసులకు చెప్పాడు విష్ణువు. మదోన్మత్తులైన వారు తమను వేడుకుంటే తామే వరాలిస్తామన్నారు. వారిద్దరూ తన చేతిలో మరణించాలని విష్ణువు కోరుకోగా నిశ్చేష్టులై మాట తప్పలేక జలంలేని చోట చంపమన్నారు. చుట్టూ జలమయం కదా అని వారి ధైర్యం. విష్ణువు ఊరువులు పెంచి వాటిపై వారిని కూర్చోబెట్టి వధించాడు. అనంతరం రుద్రుడు అక్కడకు వచ్చాడు. వారు ముగ్గురూ తమ పుట్టుకకు కారణమైన దేవతను ప్రార్థించారు. ఆమె వారిని ఒక విమానంలో తన నివాసమైన మణిద్వీపానికి రప్పించింది. క్షీరసాగర మధ్యంలో ఉన్న ఆ ద్వీపంలో నవయవ్వనవతియైన స్త్రీమూర్తి గోచరించింది. సహస్ర బాహువులతో విశ్వరూపిణిగా కనిపించింది. త్రిమూర్తులు ఆ మాతను స్తుతించారు. ఆమె బ్రహ్మకు సృజనశక్తిని, విష్ణువుకు పాలనాశక్తిని, రుద్రుడికి సంహారశక్తిని అనుగ్రహించింది. అంతేకాదు, సూర్యుడిలో ప్రకాశనశక్తిని, అగ్నిలో దాహకశక్తిని నిక్షేపించింది.

త్రిమూర్తులతో సహా ఆ పరాంబిక మహిమలకు లోబడని వారెవరూ సృష్టిలో లేరు. బ్రహ్మ నారదుడికి దేవీ తత్వం ఉపదేశిస్తే, నారదుడు వ్యాసుడికి ప్రబోధించాడు. వ్యాసుడు ద్వాదశ స్కంద పరిమితమైన దేవీభాగవతం రచించాడు. దేవీభాగవతంలో మధుకైటభ వృత్తాంతం, మహిషాసుర మర్దనం, శంభునిశుంభుల వధ, మణిద్వీప వర్ణన మొదలైన ఘట్టాలున్నాయి. దేవి నివాసమైన మణిద్వీప వర్ణన పారాయణం గృహప్రవేశ సందర్భంలో శుభప్రదమని నమ్ముతారు.

– దామెర వెంకట సూర్యారావు

అంతర్యామి




బొగ్గు దిగుమతుల వెల్లువ

బొగ్గు వినియోగం వల్ల కర్బన ఉద్గారాలు భారీ మొత్తంలో వాతావరణంలోకి వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా పర్యావరణ మార్పులు తీవ్రరూపం దాలుస్తున్నాయి. కానీ, విద్యుదుత్పత్తి కోసం నేటికీ బొగ్గుపైనే భారత్ ఎక్కువగా ఆధారపడాల్సి వస్తోంది. మరోవైపు, ఇండియాలో బొగ్గు ఉత్పత్తి డిమాండుకు సరిపడా ఉండటం లేదు. దాంతో దేశీయ బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి సంస్థలు దాన్ని విదేశాల నుంచి పెద్దయెత్తున దిగుమతి చేసుకుంటున్నాయి. ఆయా ఆర్థిక సంవత్సరాల్లో ఎంత బొగ్గు దేశంలోకి దిగుమతి అయ్యిందంటే... (కోట్ల టన్నుల్లో)

2019–20	2.37
2020–21	1.03
2021–22	0.81
2022–23	3.51
2023–24	2.39

(ఆధారం: కేంద్ర నివేదిక)

పాలక మండళ్లకు రాజకీయ గ్రహణం!



దేశంలోని అనేక హిందూ దేవాలయాల పాలక మండళ్లు రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారిపోతున్నాయి. పాలకవర్గ సభ్యులతో పాటు వారి వందిమాగధులందరికీ ప్రొటోకాల్ మర్యాదలతో పాటు ప్రత్యేక వసతి, దర్శనాలు ఏర్పాటు చేయటం భారంగా పరిణమిస్తోంది. ఈ పరిస్థితిని మార్చడం అత్యావశ్యకం.

ఏపీలో వైకాపా హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానం(తితిదే) పాలకవర్గంలో ఏమాత్రం అవసరం లేకపోయినా 80మందికి పైగా సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులను నియమించారు. ఈ ప్రత్యేక ఆహ్వానితుల నియామకాన్ని న్యాయస్థానం తర్వాత రద్దు చేసింది. అయితే, ఇలా నియమితులైనవారికి ప్రయాణ భత్యాలు చెల్లించడం, అనవసర ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు వారి సిఫార్సుల మేరకు కొనుగోళ్లు చేపట్టడం, నిర్మాణ కాంట్రాక్టర్ల ఎంపికలో కోటాలు పాటించడం వంటివి చేయాల్సి వచ్చింది. స్వార్థ ప్రయోజనాలకోసం ముంబయి, కోల్‌కతా, తమిళనాడుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్తలు, వ్యాపారులకు దేవాలయ పాలకవర్గ పదవులను కట్టబెట్టినట్లు కథనాలు వచ్చాయి. వారిలో కొందరి నేర చరిత్ర బయటపడటం అందర్నీ విస్మయపరిచింది. శ్రీవారి లడ్డూ ప్రసాదంపై తాజా వివాదానికి మూలకారణం- పాలకమండళ్లు, అధికారుల నియామకాల్లో చొరబడిన మితిమీరిన బంధుప్రీతి, రాజకీయ వ్యక్తిగత స్వార్థాలేనన్నది జగద్విదితం!

పాలక మండళ్లు దేవాలయాల పాలనకు అవసరమే. ఈ వ్యవస్థ ఆలయ అభివృద్ధికి, భక్తుల సేవలకు, ఆస్తుల పరిరక్షణకు పనిచేయాలే తప్ప, దేవాలయాలకు భారం కాకూడదు. పాలకవర్గాల్లో నియామకాలు హిందూ సమాజంలోని భక్తితత్పరులు, దాతలతోపాటు తమ విజ్ఞానాన్ని, పరపతిని, అనుభవాలను దేవాలయాల ప్రయోజనాల కోసం వినియోగించే వారికే పరిమితం కావాలి. అంతేతప్ప ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులతో పాలకమండళ్లను నింపడం ఏమాత్రం సమర్థనీయం కాదు. దేవాలయాలను నిర్మించి, ధూపదీప నైవేద్యాలకు శాశ్వత ఆస్తులను సమకూర్చిన వంశపారంపర్య ధర్మకర్తలకు చట్టప్రకారం సగౌరవ ప్రాతినిధ్యం కల్పించక తప్పదు.

ఎలాంటి వారు కావాలి?

గతంలో రెవెన్యూ మంత్రిగా దీర్ఘకాలం పనిచేసిన కల్లూరి చంద్రమౌళి ఆ తరవాత రాజకీయాలను వీడారు. దైవభక్తి కలిగిన ఆయనను నాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ప్రాధేయపడి ఒప్పించి తితిదే ధర్మకర్తల మండలి ఛైర్మన్‌గా నియమించారు. అయితే, అంతకుముందు చేపట్టిన భద్రాచల సీతారామ చంద్రస్వామి ఆలయ నూతన గర్భాలయ నిర్మాణం విషయంలో చంద్రమౌళిపై ప్రత్యర్థులు ఆరోపణలు గుప్పించారు. తనపై వచ్చిన నిరాధార ఆరోపణలకు తీవ్రంగా కలతచెందిన చంద్రమౌళి ముఖ్యమంత్రి వారించినా ఖాతరు చేయకుండా తితిదే ఛైర్మన్ పదవికి రాజీనామా చేశారు. తితిదే పేష్కారుగా, ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగా సమర్థంగా, నిజాయతీగా పనిచేసి పదవీ విరమణ చేసిన చెలికాని అన్నారావు- ఆ తరవాత కర్ణాటక వంటి రాష్ట్రాల్లో దేవాలయాల పాలనలో సలహాదారుడిగా సేవలు అందించారు. రాజకీయాలతో సంబంధంలేని ప్రముఖ సినీ నిర్మాత బి.నాగిరెడ్డి వంటి వారెందరో తితిదే ఛైర్మన్లుగా భక్తితత్పరతతో శ్రీవారికి సేవలు చేశారు. దేవాలయ అభివృద్ధిలో తమదైన ముద్ర వేశారు. వివిధ దేవాలయాలకు ఛైర్మన్లుగా, పాలకవర్గ సభ్యులుగా పనిచేసిన వారెందరో కనీసం ప్రయాణ ఖర్చులు, అలవెన్సులను కూడా దేవస్థానాల నుంచి స్వీకరించేవారు కాదు. అటువంటి ఉన్నత ప్రమాణాలు ఇప్పుడు పాలకవర్గాల్లో నియమితులవుతున్న వారిలో కనిపించడంలేదు.

ఎటువంటి నేరచరిత్ర లేని, సమాజంలో గౌరవప్రదమైన స్థానంలో ఉన్నవారిని మాత్రమే రెండు సంవత్సరాల పదవీకాలంతో దేవాలయాల పాలక మండళ్లలో నియమించడం మేలు. ఇందులో న్యాయ కోవిదుడు (ప్రముఖ దేవాలయాలకైతే హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి లేదా న్యాయవాది), విశ్రాంత దేవాదాయ కార్యనిర్వహణ అధికారి, విశ్రాంత రెవెన్యూ అధికారి, గత పాలకవర్గ సభ్యుడు, దేవాలయానికి అత్యధిక విరాళాలు లేదా సేవలు అందించిన ప్రముఖుడు, ఆగమశాస్త్ర పండితుడు, వైష్ణవ లేదా శైవ మతాల ప్రతినిధులు ఒక్కొక్కరు చొప్పున ఉండేలా చూడటం ఉత్తమం. ఒకరిద్దరు ప్రజాప్రతినిధులకు స్థానం కల్పించవచ్చు. దేవాదాయ శాఖ కమిషనర్/ప్రాంతీయ అధికారి, ఆలయ కార్యనిర్వహణాధికారి, ప్రధాన పూజారులను ఎక్స్-అఫీషియో సభ్యులుగా చేర్చాలి. వీరిలో ఎవరూ ఆ దేవాలయంతో ఎలాంటి వ్యాపార సంబంధాలు కలిగి ఉండకూడదు. వంశపారంపర్య ధర్మకర్త సహా పాలకవర్గంలోని వారంతా హిందూ మత విశ్వాసులే అయిఉండాలన్నది భక్తుల ఆకాంక్ష. ఈ విధంగా ఏర్పడే పాలకవర్గాలవల్ల దేవాలయాలపై రాజకీయ ఒత్తిళ్లు తగ్గుతాయి. ఆలయ పాలన సజావుగా, న్యాయబద్ధంగా, సమర్థంగా కొనసాగే అవకాశం ఉంటుంది. ఆ మేరకు ఏపీ, తెలంగాణల్లోని వివిధ దేవాలయాలకు త్వరలో ఏర్పాటుచేసే పాలకవర్గాల విషయంలో ముఖ్యమంత్రులు తగిన జాగ్రత్తలు వహించడం మేలు.

– డాక్టర్ యంవీజీ అహోబలరావు

హాయ్! బుజ్జీ!! గర్వం

పూర్వం అనంతగిరి రాజ్యానికి దేవానందుడు మహారాజుగా ఉండేవాడు. ఆయన తన పిల్లల కోసం.. ఒక రామచిలుక, కోతిని తెచ్చి కోటలోనే పెంచసాగాడు. పిల్లలు వాటితో ఆడుకుంటూ.. చాలా సంతోషించేవారు. చిలుక చిట్టి చిట్టి కూతలు.. కోతి గెంతులు చూస్తూ ఆనందంగా గడిపేవారు. ఒకరోజు దేవానందుడు.. పిల్లలు కోతితో ఆడుకుంటుండగా 'చాలా చక్కగా ఆడిస్తున్నావు!' అని దాన్ని మెచ్చుకున్నాడు. రాజు పొగడ్తలతో దానిలో గర్వం పెరిగిపోయింది. దాంతో చిలుక దగ్గరకు వెళ్లి.. 'నేను రాజు ప్రేమ, పొగడ్తలను సొంతం చేసుకున్నాను. నీకంటే నేనే గొప్పదాన్ని' అంది. అంతేకాకుండా.. 'నిన్ను కొద్ది రోజుల్లోనే కోట నుంచి రాజు బయటకు పంపించేలా చేస్తాను' అని విర్రవీగింది. ఆ మాటలు విన్న చిలుక ఏమీ అనకుండా..



మౌనంగా ఉండిపోయింది. అలా రోజులు గడుస్తూ ఉన్నాయి. గర్వంతో కోతి చేష్టలు మితిమీరసాగాయి. దాంతో పిల్లలు భయపడటం, ఏడవటం చేశారు. అప్పుడు రాజు భటులను పిలిచి.. 'ఈ కోతిని చూసి పిల్లలు భయపడిపోతున్నారు. ఇది ఇక్కడ ఉండటం మంచిది కాదు. వెంటనే తీసుకెళ్లి.. అడవిలో వదిలిపెట్టి రండి' అని చెప్పాడు. ఆయన చెప్పినట్లుగానే భటులు కోతిని తీసుకొని అడవికి బయలుదేరారు. అక్కడే ఉన్న.. చిలుకను చూసి కోతి ఏం మాట్లాడాలో తెలియక తలదించుకుంది. కానీ చిలుక ఆ సమయంలో కూడా ఏమీ మాట్లాడకుండా.. దాన్ని హేళన చేయకుండా చూస్తూ ఉండిపోయింది. ఎదుటివారి పట్ల మన ప్రవర్తన, చూపించే గౌరవం మన స్థానాన్ని నిర్ణయిస్తాయి. కాబట్టి.. మితిమీరి ప్రవర్తించడం ఎప్పుడూ మంచిది కాదు.

– కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి

రాయగలరా?

ఇక్కడ కొన్ని పదాలు అసంపూర్తిగా ఉన్నాయి. మొదటి పదం చివరి అక్షరాలతోనే రెండోది ప్రారంభమవుతుంది.

1. CLO□□ND
2. HO□□□FULL
3. LA□□MPLE
4. SI□□NTAL
5. SENI□□ANGE
6. SA□□NTAL
7. CLE□□□TICAL
8. RI□□IN

జవాబు: 1.CLOSE, SEND 2.HOUSE, USE-FULL 3.LATE, TEMPLE 4.SIDE, DENTAL 5.SENIOR, ORANGE 6.SAME, MENTAL 7.CLEVER, VERTICAL 8.RICH, CHIN



57 ఏళ్ళ నమ్మకం | 144 షోరూమ్స్ | 20 నగరాలలో
బెస్ట్ ప్రైస్ | బెస్ట్ సర్వీస్
విజయ్ సేల్స్
Shop On www.vijaysales.com
ఉచిత డెలివరీ
₹1* డౌన్ పేమెంట్
విజయ్ సేల్స్ దసరా పండుగ సంబరాలు
గ్రాండ్ ఎలక్ట్రానిక్స్ సేల్
₹22,500/-* వరకు తక్షణ డిస్కౌంట్ మరియు క్యాష్‌బ్యాక్ ఎంపిక చేసిన బ్యాంకులు మరియు పేపర్ ఫైనాన్స్ పై
HDFC BANK INSTANT DISCOUNT UPTO ₹4,500* WITH EASYEMI ON HDFC BANK DEBIT / CREDIT CARDS
BANKS / CARDS / PAPER FINANCE
RBL BANK HSBC YES BANK IDFC FIRST Bank BOBCARD DBS IndusInd Bank kotak HDB FINANCIAL SERVICES
WE ACCEPT EMI CARDS
MyVS Rewards SHOP.EARN.REDEEM
VISE 32 (80 cm) Google TV
PRICE ₹34,000 | OFFER PRICE ₹11,990
ZERO DOWN PAYMENT | EMI ₹1,499 x 8 mths
LLOYD 43 (108 cm) 4K QLED webOS
PRICE ₹50,490 | OFFER PRICE ₹27,490
ZERO DOWN PAYMENT | EMI ₹3,436 x 8 mths | CASHBACK ₹2,000
SAMSUNG 55 (139 cm) 4K OLED TIZEN
EMI STARTS FROM ₹1,990
CASHBACK UPTO ₹12,000
LG 65 (164 cm) 4K OLED webOS
EMI STARTS FROM ₹1,999
CASHBACK UPTO ₹10,000
Lenovo
LENOVO GAMING, YOGA SERIES, SLIM 5 & FLEX 5, LOQ
YOGA 9, Yoga Pro, Yoga Slim 7X and Legion: 10% upto ₹ 10000/- Cash Back
Yoga 7/ Slim 7 (Ultra 7) and IP Pro 5: 10% upto ₹ 8000/- Cash Back
Yoga (others), Slim 5, Flex 5 and LOQ: 5% upto ₹ 5000/-
3 Years Warranty + 3 Years Premium Care + 3 Years ADP worth ₹19999/- @ ₹ 999/-*
Exchange Bonus Upto ₹ 25000/-*
hp
PAVILION, VICTUS, SPECTRE, OMEN, ENVY
Cash Back Upto ₹ 8,000/- (Terms & Conditions Apply)
Exchange Bonus Upto ₹ 10,000/-
Extended Warranty on select SKU @ ₹ 365 /-
Adobe PEPE Offer worth ₹ 9,999/- @ ₹ 5,999/-*
iPhone
Product | Vijay Sales Price* | Effective Price*
iPhone 16 | ₹79,900 | ₹36,900
iPhone 16 Plus | ₹89,900 | ₹46,900
iPhone 15 | ₹67,890 | ₹25,890
iPhone 15 Plus | ₹77,490 | ₹35,490
iPhone 13 | ₹48,490 | ₹19,490
0 Down Payment & Upto 24 Months No Cost EMI | Cashback Upto ₹5,000 ICICI Bank | kotak | SBI card
+ Exchange Bonus Upto ₹8,000 CASHIFY
BUY SELECT LAPTOPS & GET FREE BLUETOOTH SOUNDBAR WORTH ₹1,999
PS5 PLAYSTATION 5 DEALS
SAVE ₹5,000/-
₹49,990/-*
PLAY HAS NO LIMITS.
mi 13C 5G 6GB | 128GB
VSP ₹10,999
CASHBACK ₹1,000*
EFFECTIVE PRICE (AFTER ABOVE CASHBACK) ₹9,999
CMF by NOTHING
NOTHING PHONE 1 5G 6GB | 128GB
VSP ₹14,999
CASHBACK ₹2,000*
EFFECTIVE PRICE (AFTER ABOVE CASHBACK) ₹12,999
ONEPLUS
NORD CE4 LITE 5G 8GB | 256GB
VSP ₹21,999
CASHBACK ₹2,000*
OFFER PRICE ₹19,999
FREE ONEPLUS BULLETS WIRELESS Z2
boAt 2.1 Channel SOUNDBAR AAVANTE BAR AROHA
PRICE ₹15,990
OFFER PRICE ₹5,490
CONVECTION MICROWAVE OVENS
STARTING FROM ₹9,490
SEMI AUTOMATIC WASHING MACHINE
OFFER PRICE ₹7,990
TOP LOAD WASHING MACHINE
OFFER PRICE ₹11,990 + UPTO 7.5% CASHBACK
FRONT LOAD WASHING MACHINE (7 kg)
OFFER PRICE ₹21,990 + UPTO 7.5% CASHBACK
BEST OFFERS ON LATEST BRANDED APPLIANCES
HITACHI BLUE STAR DAIKIN Godrej VISE LLOYD Carrier LG SANSUI GENERAL MITSUBISHI ELECTRIC Panasonic SAMSUNG VOLTAS Haier Whirlpool BOSCH LIEBHERR IFB SIEMENS
AUDIO ACCESSORIES
STARTING FROM ₹999
AIR FRYER
Range Starting from ₹5,999
PHILIPS | Preethi
DIRECT COOL REFRIGERATOR (173 Ltr)
OFFER PRICE ₹10,990 + UPTO 5% CASHBACK
FROST FREE REFRIGERATOR (220 Ltr)
OFFER PRICE ₹18,990 + UPTO 5% CASHBACK
WIDEST RANGE OF AIR CONDITIONERS
STARTING FROM ₹26,990
LED TVs | Large Appliances | Air Conditioners
Mobiles | Laptops | Accessories
Kitchen Appliances
విజయ్ సేల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్
ఆంధ్ర ప్రదేశ్ | హైదరాబాద్ | వరంగల్ | ముంబయి | పూణే | అహ్మదాబాద్ | సూరత్ | వడోదర | ఢిల్లీ | గురుగ్రామ్ | నోయిడా | ఇందిరాపురం | ఫరీదాబాద్ | ఘజియాబాద్
విజయవాడ - ఎం జి రోడ్ రజనీ కుమార్ - 96665 03755 రెహ్మాన్ - 73373 76215,
విజయవాడ - ఎన్‌టిఆర్ సర్కిల్ ఈశ్వర్ - 88866 53042 చక్రపాణి - 91333 16947
రాజమండ్రి - జె ఎల్ ఎన్ రోడ్ గౌతం - 91549 03693 అనంత్ - 73373 76206
రాజమండ్రి - ఇన్నీస్‌పేట్ సతీష్ - 88866 74548 నారాయణ - 73373 76253
తిరుపతి - ఎం ఆర్ పల్లి కిరణ్ - 99482 28111 లోకేష్ - 91543 16624
తిరుపతి - లీలా మహల్ రాము - 99480 30111 వెంకటేష్ - 91543 85029
కాకినాడ - అపోలో హాస్పిటల్ ప్రక్కన శివ గంగాధర్ - 91543 16627 నాగశ్రీ - 73373 76220
వైజాగ్ - దొండపర్తి రమేష్ - 99482 41112 కిరణ్ కుమార్ - 91549 03528
SCAN FOR STORES
Scan to Shop Online www.vijaysales.com
*Conditions apply. This offer includes all other discounts also. No other offer can be clubbed with this offer. Images shown are for illustrative purpose only. Offer till stocks last. Finance offer applicable at the sole discretion of Financier. #Processing Fees and other charges is applicable as per Financier. For Paper Finance: Please bring Aadhaar Card, Pan Card, Electric Bill & Cancelled Cheque. Offer is based on minimum transactions slabs defined by Finance company. Kindly speak to our store sales staff for the "Terms and Conditions" of all the bank offers, and for the respective Instant Discount/Cashback amounts applicable on each Bank. No Cibil means new to credit. For corporate bookings or bulk orders, please mail us at corporatesales@vijaysales.com.

మంచుదిబ్బల నుంచి మంటల్లోకి..

- భారత వాయుసేన సైనికుడికి 56 ఏళ్ల తర్వాత అంత్యక్రియలు!

సహారన్‌పుర్‌ (యూపీ): అయిదు దశాబ్దాల కిందట వీరమరణం పొందిన భారత వాయుసేన సైనికుడు మల్ఖాన్‌సింగ్‌ పార్థివదేహానికి బుధవారం సాయంత్రం ఆయన స్వగ్రామమైన పతేపుర్‌లో అంత్యక్రియలు జరిగాయి. ఉత్తర ప్రదేశ్‌లోని సహారన్‌పుర్‌ జిల్లాలో ఈ ఆసాధారణ సంఘటన చోటుచేసుకుంది. 1968లో మల్ఖాన్‌సింగ్‌ బృందం ప్రయాణిస్తున్న ఎయిర్‌ఫోర్స్‌ విమానం ఏఎన్‌-12 రోహ్‌తంగ్‌ పాస్‌ వద్ద ప్రమాదానికి గురైంది. మంచుకొండల్లో నాడు గల్లంతైన మల్ఖాన్‌సింగ్‌ మృతదేహం.. ఇటీవల ఇండియన్‌ ఆర్మీకి చెందిన డోగ్రా స్కౌట్స్‌ గాలింపుల్లో బయటపడింది. బ్యాడ్జి ఆధారంగా ఆయనను గుర్తించారు. సియాచిన్‌ మంచుదిబ్బల్లో పూడుకుపోయినందున మృతదేహం పూర్తిగా ఏమీ పాడవలేదని, కుటుంబ సభ్యులు ఆయనను గుర్తించేలా ఉందని సహారన్‌పుర్‌ ఎస్పీ సాగర్‌ జైన్‌ తెలిపారు. భారత వాయుసేన సిబ్బంది బుధవారం మధ్యాహ్నం మల్ఖాన్‌సింగ్‌ పార్థివదేహాన్ని గ్రామంలోకి తీసుకురాగానే కుటుంబసభ్యులతోపాటు గ్రామస్థులు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. "మల్ఖాన్‌సింగ్‌ అమర్‌ రహే" అంటూ స్థానికులు నినాదాలు చేశారు. మల్ఖాన్‌సింగ్‌ తమ్ముడు ఇసమ్‌సింగ్‌ (68) కన్నీటిపర్యంతం అయ్యారు.

'కంబోడియా' ఉచ్చు నుంచి
60 మంది భారతీయులకు విముక్తి

సింగపూర్‌: కంబోడియాలో స్కాం కార్యకలాపాల్లో చిక్కుకున్న 60 మంది భారతీయులకు విముక్తి లభించింది. వేరే ఉద్యోగాల కోసం వెళ్లి ఏజెంట్ల చేతికి చిక్కిన వీరిని మే 20న కంబోడియాలోని జిన్‌బీ-4 అనే ప్రాంతం నుంచి రక్షించారు. వీరిని క్షేమంగా మాతృదేశానికి తిప్పి పంపించే విషయాన్ని భారత దౌత్యకార్యాలయ అధికారులు కంబోడియా అధికారులతో చర్చించారు. ఆ మేరకు ముందుగా అందరినీ గురువారం కంబోడియా రాజధాని నామ్‌పెన్‌కు తరలించారు. అక్కడి నుంచి స్వదేశానికి పంపించే ప్రయాణ పత్రాలను దౌత్య కార్యాలయ సాయంతో సమకూర్చిందని ఒక బృందం పనిచేస్తోంది. బాధితులను సాధ్యమైనంత త్వరగా భారత్‌కు పంపించడానికి ప్రయత్నిస్తున్నామని భారత దౌత్యకార్యాలయం 'ఎక్స్‌'లో పేర్కొంది.


న్యూజిలాండ్‌ వీసా రుసుముల మోత

ఇంటర్నెట్‌ డెస్క్‌: న్యూజిలాండ్‌ వీసా మరింత ప్రియం అయింది. అన్ని రకాల వీసా రుసుములను పెంచుతూ ఆ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అక్టోబరు 1 నుంచి అమల్లోకి వచ్చింది. ఇప్పటివరకూ ఉన్న ధరల్లో గరిష్ఠంగా 60% పెరిగినట్లు అంచనా. విద్యార్థి వీసా రుసుము ఇప్పటివరకూ 188 డాలర్లుండగా.. అది 300 డాలర్లకు పెరిగింది. 119 డాలర్ల పర్యాటక వీసా రుసుము 188 డాలర్లకు చేరింది.

జన్‌ సురాజ్‌ పార్టీని ప్రారంభించిన ప్రశాంత్‌ కిశోర్‌



పట్నా: ఎన్నికల ప్రచార వ్యూహకర్త ప్రశాంత్‌ కిశోర్‌ బుధవారం పట్నాలో కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించారు. పట్నాలోని వెటర్నరీ కళాశాల మైదానంలో నిర్వహించిన సభలో 'జన్‌ సురాజ్‌ పార్టీ'ని ఆయన అధికారికంగా ప్రకటించారు. ఇండియన్‌ ఫారిన్‌ సర్వీస్‌ మాజీ అధికారి మనోజ్‌ భారతిని కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ప్రకటించారు. వచ్చే ఏడాది మార్చిలో పార్టీ సంస్థాగత ఎన్నికలు జరిగే వరకు ఆ పదవిలో మనోజ్‌ కొనసాగుతారని ప్రశాంత్‌ కిశోర్‌ తెలిపారు. బిహార్‌లో తమ పార్టీ అధికారంలోకి వస్తే మద్యపాన నిషేధాన్ని గంటలో తొలగిస్తామని పేర్కొన్నారు. ఈ నిషేధం వల్ల రాష్ట్రం ఏటా రూ.20వేల కోట్ల ఆదాయాన్ని కోల్పోతుందన్నారు. బిహార్‌లో విద్యా రంగాన్ని మెరుగుపర్చడానికి రూ.4లక్షల కోట్లకుపైగా నిధులు అవసరమని తెలిపారు. మద్యంపై నిషేధం ఎత్తివేసే విద్యకు అవసరమైన నిధులను సమకూరుస్తామని వెల్లడించారు.



అహంతో ఎదుగుదలకు అవరోధం

అహం మనిషి ఎదుగుదలకు అవరోధం కలిగించే దుష్ట లక్షణం. దీన్ని తొలగించినప్పుడే మన నిజమైన స్వభావమేంటో తెలుస్తుంది. దాని స్థానంలో వినయాన్ని భర్తీ చేసుకోవాలి. అది మనలో దృఢవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది. అహం మనపై ఇతరుల్లో ద్వేషాన్ని పెంచుతుంది. వినయం మనల్ని ఉత్తములుగా తీర్చిదిద్దుతుంది. వినయం శక్తిమంతమైనది అయితే.. అహం వినాశపూరితమైంది. వినయంతో ఉన్నతమైన స్థానాలకు చేరుకోగలం.

-ర్యాన్‌ హాలిడే, రచయిత

ఇజ్రాయెల్‌కు అమెరికా సాయం

- ఇరాన్‌ క్షిపణి దాడుల నుంచి అడుగడుగునా రక్షణ
- బైడెన్‌, హారిస్‌ల పర్యవేక్షణ

ఇంటర్నెట్‌ డెస్క్‌: పశ్చిమాసియాను తీవ్ర యుద్ధ మేఘాలు కమ్ముతున్నాయి. హెజ్‌బొల్లా, హమాస్‌ అగ్ర నేతలను అంతమొందించినందుకు ఇజ్రాయెల్‌పై ఇరాన్‌ ప్రతీకార చర్యలకు దిగింది. ఒక్క రాత్రిలో దాదాపు 200 బాలిస్టిక్‌ క్షిపణులతో విరుచుకుపడింది. వీటిలో చాలా వాటిని అమెరికా సాయంతో ఇజ్రాయెల్‌ అడ్డుకుంది. ఈ ఉద్రిక్తత వేళ అగ్రరాజ్యం ఎలా అప్రమత్తమైంది.. ఇజ్రాయెల్‌కు ఎలా సాయం చేసిందనేది చర్చనీయాంశంగా మారింది. లెబనాన్‌లో ఇజ్రాయెల్‌ దాడులు ప్రారంభించిన నాటి నుంచి పశ్చిమాసియాలోని పరిస్థితులపై అమెరికా ప్రత్యేక దృష్టి పెట్టింది. నిత్యం అక్కడ ఏం జరుగుతుందనేది అధ్యక్షుడు జో బైడెన్‌ గమనిస్తూనే ఉన్నారు. ఇజ్రాయెల్‌పై దాడికి యత్నిస్తే.. తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని అగ్ర రాజ్యం హెచ్చరించింది. అయినప్పటికీ ఇరాన్‌ వెనక్కి తగ్గలేదు. అదే సమయంలో బైడెన్‌, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌ పశ్చిమాసియాలోని పరిస్థితులను ప్రతి క్షణం పర్యవేక్షించారు. ఇజ్రాయెల్‌కు సాయం చేయాలని ఆయన అమెరికా సైన్యానికి ఆదేశాలు జారీ చేసినట్లు శ్వేతసౌధం మీడియాకు వెల్లడించింది.



ఇజ్రాయెల్‌లోని గెదెరా పట్టణంలో ఇరాన్‌ క్షిపణి దాడిలో ధ్వంసమైన పాఠశాల భవనం, ఏర్పడిన గొయ్యి

ఇజ్రాయెల్‌ను అప్రమత్తం చేసి..

ఇరాన్‌ దాడి చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు నిఘా వర్గాల ద్వారా అమెరికాకు సమాచారం అందింది. ఈ ఏడాది ప్రారంభంలో ఇరాన్‌ చేసిన దాడి కంటే ఇప్పుడు జరగబోయేది పెద్దదంటూ ఇజ్రాయెల్‌ను హెచ్చరించింది. రాత్రి 12 గంటల్లో దాడి జరగొచ్చని అప్రమత్తం చేసింది.

క్షిపణులపై అమెరికా దాడి ఇలా..

దాడికి ముందు తూర్పు మధ్యధరా ప్రాంతంలో యూఎస్‌ఎస్‌ కోల్‌, బుల్కెలీ అనే రెండు డిస్ట్రాయర్లను అమెరికా మోహరించి ఉంచింది. ఇరాన్‌ దాడులను తిప్పికొట్టేందుకు ఇజ్రాయెల్‌, అమెరికా దళాలు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకున్నాయి. ఈ క్రమంలో ఇజ్రాయెల్‌పైకి ఇరాన్‌ ప్రయోగించిన క్షిపణులను అడ్డుకునేందుకు అమెరికా డజన్ల కొద్దీ ఇంటర్‌సెప్టర్లను పంపించిందని పెంటగాన్‌ ప్రతినిధి ఒకరు వెల్లడించారు. అమెరికా అడ్డుకోవడంతో ఇజ్రాయెల్‌ భూతలంలో తక్కువ నష్టం జరిగినట్లు తెలిపారు. ముఖ్యంగా ఐడీఎఫ్‌తో టచ్‌లో ఉంటూ ఇరాన్‌ కుట్రను ఎప్పటికప్పుడు గమనిస్తూ దాడులను తిప్పికొట్టినట్లు వివరించారు.

డెన్మార్క్‌లోని ఇజ్రాయెల్‌ దౌత్య కార్యాలయం వద్ద పేలుళ్లు

కోపెన్‌హేగన్‌: డెన్మార్క్‌లోని ఇజ్రాయెల్‌ దౌత్య కార్యాలయాల వద్ద బుధవారం పేలుళ్లు చోటుచేసుకొన్నాయి. రాజధాని కోపెన్‌హేగన్‌ శివార్లలో సూర్యోదయానికి పూర్వమే ఈ భవనాలకు అత్యంత సమీపంలో రెండు పేలుళ్లు జరిగినట్లు డానిష్‌ పోలీసులు ధ్రువీకరించారు. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని అధికారులు తెలిపారు. దీనిపై డెన్మార్క్‌లోని ఇజ్రాయెల్‌ దౌత్య సిబ్బంది ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు.

భాజపావి శుష్క వాగ్దానాలు: ఖర్గే



చండీగఢ్‌: ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంలో భాజపా ఎప్పుడూ విఫలమవుతూనే ఉంటుందని, అబద్ధాలు చెప్పడంలో ప్రధాని నరేంద్రమోదీ మహాదిట్ట అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. హరియాణా ఎన్నికల ప్రచారంలో భాగంగా చర్ఖీ దాద్రీలోని బాద్రాలో బుధవారం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. 'సత్యం, అహింస గురించి మహాత్మాగాంధీ మనకు ప్రబోధించారు. అధికారంలో ఉన్నవారు ఎన్ని నిజాలు, ఎన్ని అబద్ధాలు చెబుతున్నారో చూడండి. విశ్వాసాన్ని వమ్ము చేయడంలో మోదీ అగ్రగణ్యుడు. గత పదేళ్లలో ఆయన లెక్కకు మిక్కిలి హామీలిచ్చారు. కాంగ్రెస్‌ నేతలంతా నల్లధనాన్ని విదేశాల్లో దాచుకున్నారని, దానిని వెనక్కి తెచ్చి ప్రతి ఒక్కరి జేబుల్లో రూ.15 లక్షలు పెడతానని హామీ ఇచ్చారు. అదే మైంది? పదేళ్లుగా ప్రధానిగా ఉన్న వ్యక్తి అబద్ధాలు చెప్పడమేంటి? నెహ్రూ, లాల్‌బహదూర్‌ శాస్త్రి, ఇందిరాగాంధీ, రాజీవ్‌ గాంధీ వంటివారు ప్రధానులుగా ఉన్నప్పుడు ఆలాంటి అబద్ధాలు చెప్పలేదు కదా! ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తానని మోదీ మరో హామీ ఇచ్చారు. పదేళ్లలో 20 కోట్ల ఉద్యోగాలు రావాలి. అవి ఏమయ్యాయి?" అని ఖర్గే ప్రశ్నించారు.

పూర్తి వివరాలు www.eenadu.net లో..

కశ్మీర్‌లో 3 దశలు కలిపి
63.45% పోలింగ్‌

జమ్మూ: మూడు దశల్లో కలిపి జమ్మూకశ్మీర్‌ శాసనసభ ఎన్నికల్లో 63.45% ఓట్లు పోలయ్యాయని, ఇది ఐదేళ్ల లోక్‌సభ ఎన్నికల కంటే ఎక్కువని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) వెల్లడించింది. మంగళవారం నాటి తుది దశ పోలింగ్‌లో సుమారు 69.65% మంది ఓటర్లు తమ హక్కును వినియోగించుకున్నారని, వీరిలో గత 75 ఏళ్లుగా ఓటు హక్కులేనివారు కూడా ఉన్నారని బుధవారం ఈసీ విడుదల చేసిన ప్రకటన పేర్కొంది. కశ్మీర్‌ మాజీ మంత్రి, సురాన్‌కోట్‌లో భాజపా అభ్యర్థిగా ఉన్న ముస్తాక్‌ అహ్మద్‌ షా బుఖారీ (75) బుధవారం గుండెపోటుతో తన నివాసంలో కుప్పకూలి కన్నుమూశారు.

విజయవంతమైన ఉద్యమం 'స్వచ్ఛభారత్‌'

- ప్రధాని మోదీ వెల్లడి

దిల్లీ: ఇదొక ఒకటో శతాబ్దంలో విజయవంతమైన అతి పెద్ద ప్రజా ఉద్యమంగా స్వచ్ఛభారత్‌ కార్యక్రమం మారిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దీనిని ప్రజలు వ్యక్తిగత లక్ష్యంగా చేసుకున్నారని తెలిపారు. ఇలాంటి నిరంతర ప్రయత్నాల ద్వారా మనం దేశాన్ని పరిశుభ్రంగా మార్చగలమని పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్‌ మిషన్‌ను ప్రారంభించి 10 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోదీ మాట్లాడారు. 'స్వచ్ఛ భారత్‌ కార్యక్రమం- పరిశుభ్రత ఉద్యమం మాత్రమే కాదు. ప్రజా శ్రేయస్సుకు ఇదొక కొత్త మార్గం. స్వచ్ఛతకు సంబంధించిన రూ.10 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయి. మిషన్‌ అమృత్‌, ద్వారా దేశంలోని అనేక నగరాల్లో మురుగునీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయి. నమామి గంగ పనులైతేనేమి, వ్యర్థాలతో బయోగ్యాస్‌ తయారీ గోవర్ధన్‌ ప్లాంట్లు కానీ పనులు స్వచ్ఛభారత్‌ మిషన్‌ను ఉన్నత స్థాయికి తీసుకెళ్తున్నాయి. స్వచ్ఛభారత్‌ మిషన్‌ ఎంత విజయవంతమైతే అంతలా దేశకీర్తి పెరుగుతుంది" అని ప్రధాని మోదీ అన్నారు.

పాఠశాలలో చీపురు పట్టిన మోదీ

జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిల్లీలోని ఓ పాఠశాల విద్యార్థులతో కలిసి చీపురు పట్టి స్వచ్ఛభారత్‌ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు సైతం పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు పలువురు రాజకీయ నాయకులు స్వచ్ఛ అభియాన్‌ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, కిషన్‌రెడ్డి, రాజ్‌నాథ్‌సింగ్‌, మాండవీయతో పాటు ఉత్తర్‌ప్రదేశ్‌ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ తదితరులు పాల్గొన్నారు.

పుణెలో కుప్పకూలిన హెలికాప్టర్‌

- ఇద్దరు మాజీ ఐఏఎఫ్‌ పైలట్లు సహా ముగ్గురి మృతి

పుణె: మహారాష్ట్రలోని పుణె జిల్లాలో ఘోర హెలికాప్టర్‌ ప్రమాదం జరిగింది. టేకాఫ్‌ అయిన కొద్ది నిమిషాలకే హెలికాప్టర్‌ కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మాజీ ఐఏఎఫ్‌ పైలట్లు, ఓ ఇంజినీర్‌ ప్రాణాలు కోల్పోయారు. బుధవారం ఉదయం 7.40 గంటల సమయంలో బవ్‌ధాన్‌లోని కొండ ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. అనంతరం మంటలు చెలరేగడంతో హెలికాప్టర్‌ పూర్తిగా దగ్ధమైంది. దిల్లీకి చెందిన ఈ ప్రైవేటు హెలికాప్టర్‌ అగస్టా 109లో ముంబయి నుంచి రాయ్‌గఢ్‌కు వెళ్లేందుకు తమ పార్టీ అధినేత కోసం కుందని ఆ లోపే ప్రమాదం జరిగిందని లోక్‌సభ సభ్యుడు, రాష్ట్ర ఎన్సీపీ అధ్యక్షుడు సునీల్‌ తట్కరే తెలిపారు. కాగా బుధవారం ఉదయం 7.30 గంటల సమయంలో పుణెలోని ఆక్స్‌ఫర్డ్‌ గోల్ఫ్‌క్లబ్‌ హెలిప్యాడ్‌ నుంచి ముంబయిలోని జుహూ ప్రాంతానికి బయలుదేరిన హెలికాప్టర్‌ కొద్ది నిమిషాల్లోనే ప్రమాదానికి గురైందని పోలీసులు వెల్లడించారు.

వరదనీటిలో దిగిన ఐఏఎఫ్‌ హెలికాప్టర్‌

ముజఫర్‌పుర్‌: బిహార్‌లోని ముజఫర్‌పుర్‌ జిల్లాలో భారత వైమానిక దళానికి (ఐఏఎఫ్‌) చెందిన ఓ హెలికాప్టర్‌ అత్యవసరంగా ల్యాండ్‌ అయింది. హెలికాప్టర్‌లో చిన్న సమస్య ఎదురవడంతో ఔరాయి గ్రామంలో వరద నీటిలోకి అత్యవసరంగా కిందకు దించినట్లు బుధవారం అధికారులు వెల్లడించారు. ఆ సమయంలో హెలికాప్టర్‌లో నలుగురు ఐఏఎఫ్‌ సిబ్బంది ప్రయాణిస్తున్నారని తెలిపారు. స్థానికులు వాళ్లను కాపాడారని పేర్కొన్నారు.





ఝార్ఖండ్‌లోని గొడ్డ జిల్లాలో ధ్వంసమైన పేల్చివేసిన రైలు పట్టాలను బుధవారం పరిశీలిస్తున్న పోలీసులు

ఝార్ఖండ్‌లో బొగ్గురవాణా రైల్వేట్రాక్‌ పేల్చివేత

సాహిబ్‌గంజ్‌: ఝార్ఖండ్‌లో కొందరు దుండగులు బొగ్గు రవాణాకు వినియోగించే రైల్వేట్రాక్‌ను కొంతభాగాన్ని పేల్చివేశారు. ఈ రైల్వేలైన్‌ను నేషనల్‌ థర్మల్‌ పవర్‌ కార్పొరేషన్‌ (ఎన్టీపీసీ) నిర్వహిస్తోంది. సాహిబ్‌గంజ్‌ జిల్లాలో జరిగిన ఈ ఘటనలో దాదాపు అయిదు మీటర్ల మేర ట్రాక్‌ పేలిపోయినట్లు పోలీసులు తెలిపారు. బర్‌హెట్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని రంగా గ్రామ సమీపంలో అర్ధరాత్రి జరిగిన ఈ పేల్చివేతపై దర్యాప్తు ప్రారంభించినట్లు సాహిబ్‌గంజ్‌ ఎస్పీ అమిత్‌కుమార్‌ సింగ్‌ తెలిపారు. దీనివెనక క్రిమినల్‌ ముఠాల హస్తం ఉందని అనుమానాలు ఉన్నాయన్నారు. ఝార్ఖండ్‌లోని గొడ్డ జిల్లా లాల్‌మటియా నుంచి పశ్చిమబెంగాల్‌లోని ఫరక్కా పవర్‌ స్టేషనుకు బొగ్గును రవాణా చేసేందుకు ఏర్పాటుచేసిన ఈ లైను భారతీయ రైల్వే నెట్‌వర్కులో భాగం కాదని చెప్పారు.

ఇజ్రాయెల్‌ గగనతలానికి
'ఫతాహ్‌-2' చిల్లులు!

- ఏకంగా వైమానిక స్థావరాలను తాకిన ఇరాన్‌ క్షిపణులు

జెరూసలెం: ఇజ్రాయెల్‌పై ఇరాన్‌ మంగళవారం రాత్రి చేసింది మామూలు దాడి కాదు! 180కిపైగా క్షిపణులతో భీకరంగా విరుచుకుపడింది. వాటిలో చాలావాటిని టెల్‌ అవీవ్‌ అడ్డుకోగలిగినా.. కొన్ని ఏకంగా దాని వైమానిక స్థావరాలను తాకాయి. లక్షల మంది ప్రజలు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని బంకర్లలోకి పరుగులు తీశారు. బహుళ అంచెల్లో పటిష్ఠ గగనతల రక్షణ వ్యవస్థను కలిగి ఉన్న ఇజ్రాయెల్‌ను ఇరాన్‌ ఇంతలా ఎలా దెబ్బతీయగలిగిందనే విషయమై చర్చ జరుగుతోంది. ఒకింత ఆశ్చర్యం కలిగించేదే! టెల్‌ అవీవ్‌ రక్షణ వ్యవస్థలను ఛేదించిందని వతాహ్‌-2 అనే అత్యాధునిక హైపర్‌సోనిక్‌ క్షిపణులు టెహ్రాన్‌కు దోహదపడ్డాయి. ఈ నేపథ్యంలో- అసలు ఇజ్రాయెల్‌ బహుళ అంచెల గగనతల రక్షణ వ్యవస్థల్లో ఏమేం భాగంగా ఉన్నాయో పరిశీలిస్తే..

ది యారో

- ఈ గగనతల రక్షణ వ్యవస్థను అమెరికాతో కలిసి ఇజ్రాయెల్‌ అభివృద్ధి చేసింది.
- దీర్ఘశ్రేణి క్షిపణులను అడ్డుకునేలా దీన్ని తీర్చిదిద్దింది.
- వాతావరణానికి ఆవల ఇది పనిచేస్తుంది.
- ప్రస్తుత యుద్ధంలో యెమెన్‌లోని హూతీ తిరుగుబాటుదారులు ప్రయోగించిన దీర్ఘశ్రేణి క్షిపణులను కూల్చివేసేందుకు ఈ వ్యవస్థను టెల్‌ అవీవ్‌ ఉపయోగించుకుంది.

డేవిడ్స్‌ స్లింగ్‌

- దీన్ని కూడా అమెరికాతో కలిసి తయారుచేసింది.
- మధ్యశ్రేణి క్షిపణులను అడ్డుకునేలా తీర్చిదిద్దారు. లెబనాన్‌లోని హెజ్‌బొల్లా వద్ద ఎక్కువగా ఉన్నవి ఇలాంటి క్షిపణులే.
- ప్రస్తుత యుద్ధంలో పలుమార్లు ఈ వ్యవస్థను మోహరించారు.

'ఫతాహ్‌-2'తో తొలిసారిగా..


ఇజ్రాయెల్‌పై దాడికి ఇరాన్‌ తాజాగా ఉపయోగించిన 'ఫతాహ్‌-2' క్షిపణులు. ఇవి మధ్యశ్రేణి తరగతికి చెందిన అత్యాధునిక హైపర్‌సోనిక్‌ క్షిపణులు. వాటిలో హైపర్‌సోనిక్‌ గ్లైడ్‌ వెహికల్‌ (హెచ్‌జీవీ) వార్‌హెడ్‌ ఉంటుంది. ధ్వని కంటే 5-20 రెట్లు ఎక్కువ వేగం (మాక్‌ 5-20)తో క్షిపణి దూసుకెళ్తుంది అది దోహదపడుతుంది. 1,500 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఫతాహ్‌-2 ఛేదించగలదు. వివిధ రకాల విన్యాసాలు చేస్తూ.. గగనతల రక్షణ వ్యవస్థలను తప్పించుకొని దూసుకెళ్లే సామర్థ్యం దానికి ఉంది. ఇజ్రాయెల్‌పైకి ఈ క్షిపణులను ఇరాన్‌ తొలిసారిగా ప్రయోగించింది. 90%కుపైగా 'ఫతాహ్‌-2'లు లక్ష్యాలను ఛేదించాయని టెహ్రాన్‌ చెబుతోంది. నెవటిమ్‌, టెల్‌ నోఫ్‌, హట్జెరిమ్‌ వైమానిక స్థావరాలను వతాహ్‌-2 క్షిపణులు తాకాయి. 'ది యారో' గగనతల రక్షణ వ్యవస్థను ఫతాహ్‌-2 క్షిపణులు ఛేదించి దూసుకెళ్లాయని ఇరాన్‌ పేర్కొంది.

ఐరన్‌ డోమ్‌

- అమెరికా సహాయంతో ఈ వ్యవస్థను అభివృద్ధి చేసింది. ■ స్వల్పశ్రేణి రాకెట్లను కూల్చివేయడంలో ఇది దిట్ట.
- గత దశాబ్దకాలంలో క్రియాశీలంగా మారిన నాటి నుంచి వేలాది రాకెట్లను ఇది అడ్డుకుంది. ప్రస్తుత యుద్ధంలో హమాస్‌, హెజ్‌బొల్లా ప్రయోగించిన వాటిలో ఉన్నాయి.
- 90%కు పైగా కచ్చితత్వంతో ఇది లక్ష్యాలను చేధిస్తోందని ఇజ్రాయెల్‌ చెబుతోంది.

ఐరన్‌ బీమ్‌

- లేజర్‌ సాంకేతికతతో లక్ష్యాలను కూల్చివేసేందుకు ఈ సరికొత్త వ్యవస్థను ఇజ్రాయెల్‌ అభివృద్ధి చేస్తోంది.
- ఇప్పటిదాకా అందుబాటులో ఉన్న ఇతర వ్యవస్థలతో పోలిస్తే అత్యంత తక్కువ ఖర్చులోనే దీనితో లక్ష్యాలను ఛేదించవచ్చు.
- ఐరన్‌ డోమ్‌తో ఒక్కో లక్ష్యాన్ని కూల్చేసేందుకు 50 వేల డాలర్ల ఖర్చవుతుంది. ఇతర వ్యవస్థలతో ఒక్కో క్షిపణిని అడ్డుకునేందుకు ఏకంగా 20 లక్షల డాలర్ల దాకా వ్యయమవుతుంది. అయితే బీమ్‌తో మాత్రం ఐరన్‌ బీమ్‌తో కేవలం కొన్ని డాలర్లతోనే లక్ష్యాలను ఛేదించొచ్చు.
- ఈ వ్యవస్థ ఇంకా కార్యరూపం దాల్చలేదు.



జైలు నుంచి డేరా బాబా విడుదల

హరియాణాలో అడుగు పెట్టొద్దని ఆంక్షలు!

చండీగఢ్‌: డేరా సచ్చా సౌదా అధినేత, అత్యాచార దోషి గుర్మీత్‌ రామ్‌ రహీమ్‌ సింగ్‌ (డేరా బాబా) 20 రోజుల పెరోల్‌పై బుధవారం జైలు నుంచి విడుదలయ్యారు. హరియాణాలోని రోహ్‌తక్‌ జిల్లా సునారియా కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న ఆతడిని కట్టుదిట్టమైన భద్రత మధ్య విడుదల చేశారు. ఈ 20 రోజులు ఆతడు ఉత్తర్‌ప్రదేశ్‌లోని బాగ్‌పత్‌ జిల్లాలో ఉన్న డేరా ఆశ్రమంలో ఉండనున్నారు. డేరా బాబా విడుదలను పలు సంఘాలు వ్యతిరేకించాయి. కానున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అతనిపై ఆంక్షలు విధించింది. హరియాణాలోకి రాకూడదని నిషేధించింది. ఎన్నికల సంబంధిత కార్యక్రమాల్లో పాల్గొనకూడదని, ప్రసంగాలు ఇవ్వకూడదని పేర్కొంది. కాగా, హరియాణా ఎన్నికల ముందు డేరా బాబాకు బెయిల్‌ రావడం గమనార్హం. గతంలోనూ పంజాబ్‌ ఎన్నికలకు రెండు వారాల ముందు ఆతడు పెరోల్‌పై విడుదలయ్యారు. గుర్మీత్‌ రామ్‌ రహీమ్‌ సింగ్‌ ఇద్దరు సాధ్వీలపై అత్యాచారానికి పాల్పడ్డాడని తేలడంతో 2017లో సీబీఐ కోర్టు ఆతనికి 20ఏళ్ల జైలు శిక్ష విధించింది.

బ్లింకెన్‌తో జైశంకర్‌ భేటీ

వాషింగ్టన్‌: భారత, అమెరికా విదేశీ వ్యవహారాల మంత్రులు ఎస్‌.జైశంకర్‌, ఆంటోనీ బ్లింకెన్‌ మంగళవారం వాషింగ్టన్‌లో సమావేశమై ద్వైపాక్షిక సంబంధాలను మరింత పటిష్ఠపరచుకోవడం గురించి చర్చించారు. నరేంద్ర మోదీ మూడోసారి భారత ప్రధాన మంత్రి అయిన తరువాత జైశంకర్‌ అమెరికా రావడం ఇదే ప్రథమం. బ్లింకెన్‌తో కలసి ఆయన పశ్చిమాసియా సంక్షోభం గురించి, భారత ఉపఖండంలో ఇటీవలి పరిణామాలు, ఇండో-పసిఫిక్‌, ఉక్రెయిన్‌ యుద్ధం గురించి చర్చించారు. డిఫెన్స్‌ టెక్నాలజీలు, అంతరిక్షం, హరిత ఇంధనం, సెమీకండక్టర్ల రంగాలలో భారత్‌, అమెరికా సహకారం వర్ధిల్లుతోందని బ్లింకెన్‌ ఉద్ఘాటించారు.

దిల్లీ విమానాశ్రయంలో
26 ఐఫోన్లు స్వాధీనం

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో ఐఫోన్‌ 16 ప్రో మ్యాక్స్‌ ఫోన్లు భారీగా పట్టుబడ్డాయి. హాంకాంగ్‌ నుంచి మంగళవారం వచ్చిన ఓ మహిళ నుంచి దాదాపు 26 ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు కస్టమ్స్‌ అధికారులు బుధవారం తెలిపారు.



మహిళ తన చేతి బ్యాగులో టిష్యూ పేపర్లను చుట్టి మరీ వీటిని అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించిందని పేర్కొన్నారు. వీటి విలువ రూ.30.66లక్షల వరకు ఉంటుందన్నారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

పూటో చంద్రుడిపై
కార్బన్‌ డయాక్సైడ్‌, హైడ్రోజన్‌ పెరాక్సైడ్‌

- తొలిసారి గుర్తించిన శాస్త్రవేత్తలు

దిల్లీ: మరుగుజ్జు గ్రహం ప్లూటోకు అతిపెద్ద చంద్రుడైన 'చరోన్‌'పై కార్బన్‌ డయాక్సైడ్‌ (బొగ్గుపులుసు వాయువు), హైడ్రోజన్‌ పెరాక్సైడ్‌ వాయువుల ఉనికిని శాస్త్రవేత్తలు తొలిసారిగా గుర్తించారు. బాహ్య సౌర వ్యవస్థలో మంచు ఎలా ఆవిర్భవించింది, ఆ తర్వాత ఎలాంటి మార్పులకు లోనయింది అర్థం చేసుకునేందుకు ఈ పరిణామం దోహదపడే అవకాశం ఉన్నాయి. ప్లూటోకు ఐదు సహజ చందమామలు ఉన్నాయి. వాటిలో చరోన్‌ అతిపెద్దది. 1978లో దాన్ని కనుగొన్నారు. చరోన్‌పై మంచు, అమ్మోనియా, కర్బన సమ్మేళనాల ఉనికి గతంలోనే బయటపడింది. అమెరికాలోని సౌత్‌వెస్ట్‌ రీసెర్చ్‌ ఇన్‌స్టిట్యూట్‌ శాస్త్రవేత్తల నేతృత్వంలోని బృందం తాజాగా ఆ జాబిల్లిపై కార్బన్‌ డయాక్సైడ్‌, హైడ్రోజన్‌ పెరాక్సైడ్‌లను గుర్తించింది. ఎలక్ట్రాన్లు-ఫోటాన్లు వంటి ఆవేశ కణాలు ఢీకొట్టడంతో మంచు విడిపోయి.. హైడ్రోజన్‌, ఆక్సిజన్‌ పరమాణువులు విడుదలయ్యాయని, అవి కలిసి హైడ్రోజన్‌ పెరాక్సైడ్‌ ఏర్పడిందని శాస్త్రవేత్తలు తెలిపారు. ప్రధానంగా చరోన్‌ మంచు ఉపరితలంపై కార్బన్‌ డయాక్సైడ్‌ ఉందని వెల్లడించారు.

ఒకటిరెండు రోజుల్లో కేజ్రీవాల్‌
అధికార నివాసాన్ని వీడతారు: ఆప్‌

దిల్లీ: ఆమ్‌ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్‌, దిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ ఒకటిరెండు రోజుల్లో అధికార నివాసాన్ని వీడతారని బుధవారం ఆప్‌ వర్గాలు వెల్లడించాయి. దిల్లీలోని ఫిరోజ్‌ షా రోడ్డులో ఆప్‌ రాజ్యసభ ఎంపీల కోసం కేటాయించిన రెండు అధికారిక భవనాల్లో ఒకదానిలో కేజ్రీవాల్‌ కుటుంబం నివాసానికి అవకాశం ఉన్నట్లు పేర్కొన్నాయి. ఒక బంధీని ఖాళీ టికెట్‌ ఖరారు చేశారని, ఒకటిరెండు రోజుల్లో ప్రస్తుతం ఉంటున్న అధికార నివాసాన్ని కేజ్రీవాల్‌ ఖాళీ చేయనున్నారని తెలిపారు. మద్యం కుంభకోణం కేసులో హవాలా ఆరోపణలపై తిహాడ్‌ జైలు నుంచి విడుదలైన కేజ్రీవాల్‌ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆ స్థానంలో ఆతిశీకి పగ్గాలు కట్టబెట్టారు. ప్రస్తుతం నివసిస్తున్న అధికారిక నివాసాన్ని ఖాళీ చేయనున్నట్లు కేజ్రీవాల్‌ ప్రకటించిన విషయం తెలిసిందే.

నైజీరియాలో పడవ బోల్తా.. 100 మంది గల్లంతు

- 11 మృతదేహాలు లభ్యం

అబూజా: సామర్థ్యానికి మించి ప్రయాణికుల్ని తీసుకువెళ్తున్న పడవ బోల్తాపడిన ఘటనలో 100 మందికి పైగా గల్లంతయ్యారు. వీరిలో మహిళలు, పిల్లలు ఉన్నారు. ఇంతవరకు 11 మృతదేహాలు లభ్యమయ్యాయి. వాయవ్య నైజీరియాలో జరిగిన ఇస్లామిక్‌ పండుగకు హాజరైన ప్రయాణికుల్ని తిరిగి వెనక్కి తీసుకువస్తున్న సమయంలో సోమవారం రాత్రి ఈ దుర్ఘటన చోటు చేసుకుందని నైగర్‌ అత్యవసర సేవల సంస్థ బుధవారం తెలిపింది. సరైన రహదారులు లేకపోవడంతో మారుమూల ప్రాంతాలకు చెందిన చాలామంది ప్రజలు పడవల్లో ప్రమాదకరంగా ప్రయాణిస్తుంటారు. తాజా ఘటనలో కూడా 100 మంది ప్రయాణించాల్సిన పడవలో 300 మంది ఉన్నారు. గాలింపు చర్యల ద్వారా వీరిలో 150 మందిని బుధవారం ఉదయానికి రక్షించగలిగారు. ఇలాంటి ప్రమాదాలు ఆ ప్రాంతానికి కొత్తేమీ కాదు.. ఇటీవల కాలంలో ఇది నాలుగోసారి.

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
గురువారం అక్టోబరు 3, 2024



దసరా మహోత్సవాలను పురస్కరించుకొని నగర పోలీసుల తరపున సీపీ రాజశేఖర్ బాబు దంపతులు.. దుర్గమ్మకు తొలి సారెను బుధవారం సంప్రదాయ పద్ధతిలో సమర్పించారు.

అమ్మ పండగ.. అఖిలం నిండుగ



నేటి నుంచి దసరా వేడుకలు

ఈనాడు, అమరావతి - న్యూస్‌టుడే ఇంద్రకీలాద్రి

దుర్గమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోనున్నారు. ఇంద్రకీలాద్రి కొండ దిగువన వినాయక ఆలయం వద్ద నుంచి క్యూలైన్లను వేశారు. భక్తులు ఒకసారి క్యూలైన్లలోకి ప్రవేశించాక.. రెండు కిలోమీటర్ల దూరం నడిచి వచ్చి ఘాట్ రోడ్డు మీదుగా వెళ్లి అమ్మవారిని దర్శించుకోనున్నారు. అనంతరం శివాలయం మెట్ల మార్గానికి పక్కనే ఏర్పాటు చేసిన తాత్కాలిక మార్గం, మహామండపంలో ర్యాంప్, మెట్ల మార్గం ద్వారా భక్తులు కిందకు దిగనున్నారు. సరిగ్గా భక్తులు కిందకు దిగే ప్రాంతంలోనే అన్నదాన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అన్నప్రసాదం స్వీకరించిన తర్వాత.. పక్కనే కనకదుర్గానగర్‌లో లడ్డూ ప్రసాదం కౌంటర్లను ఏర్పాటు చేశారు. గురువారం నుంచి ఆరంభమయ్యే దసరా వేడుకలు.. ఈనెల 12 వరకూ జరగనున్నాయి. దసరా తొమ్మిది రోజుల్లో.. అమ్మవారు తొమ్మిది రూపాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

దర్శనాల సమయాలు...

తొలిరోజు ఉదయం 9 గంటల నుంచి దర్శనాలు

ఇంద్రకీలాద్రిపై ఘనంగా ఏర్పాట్లు

ప్రతిరోజు ఉదయం 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకూ భక్తులను అమ్మవారి దర్శనాలకు అనుమతిస్తారు. తొలి రోజు మాత్రం ఉదయం 9 గంటల తర్వాత నుంచి దర్శనాలు ఆరంభమవుతాయి.

ఈసారి దసరా వేడుకలు జరిగే తొమ్మిది రోజులు, అనంతరం ఈనెల 13, 14 వరకూ అంతరాలయం దర్శనాలు పూర్తిగా ఆపేస్తున్నట్లు ప్రకటించారు. ముఖమండప దర్శనాలకు మాత్రమే అనుమతిస్తారు. ప్రతిరోజు సాయంత్రం 6.30 నుంచి 7.30 వరకు అమ్మవారి మహానివేదన, పంచహారతులు నిర్వహిస్తారు. ఆ సమయంలో భక్తుల దర్శనాలను గంట సమయం పూర్తిగా ఆపేస్తారు.

25 లక్షల లడ్డూలు..

భక్తులకు విక్రయించేందుకు 25 లక్షల లడ్డూలను దసరా వేడుకల కోసం ముందస్తుగానే సిద్ధం చేస్తున్నారు. వీటిని విక్రయించేందుకు 18కౌంటర్లు ఏర్పాటు చేశారు. కొండ దిగువన కనకదుర్గానగర్‌లో 10, మిగతా ఘాట్లు, బస్టాండ్, రైల్వేస్టేషన్, స్టేట్ గెస్ట్‌హౌస్ వంటిచోట్ల ఒక్కొక్కటి చొప్పున ఎనిమిది కౌంటర్లను ఏర్పాటు చేశారు.



విద్యుత్తు కాంతుల్లో ఇంద్రకీలాద్రి



టిక్కెట్, ఉచిత క్యూలైన్లు..

ఐదు క్యూలైన్లలో భక్తులు అమ్మవారిని దర్శించుకోనున్నారు. వీటిలో రెండు ఉచిత దర్శనం లైన్లు. మిగతావి రూ.100, రూ.300, రూ.500 క్యూలైన్లు. దర్శన టిక్కెట్లను భక్తులకు విక్రయించేందుకు 14 చోట్ల కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో రిసెప్షన్, టోల్‌గేట్, ఓం టర్నింగ్, సహా అన్ని ఘాట్లు, కలెక్టర్ కార్యాలయం, స్టేట్‌గెస్ట్ హౌస్, బస్టాండ్, రైల్వేస్టేషన్లలో కౌంటర్లు ఉన్నాయి.



పుష్కలంగా తాగునీళ్లు..

ఉత్సవాలకు తరలివచ్చే భక్తుల కోసం 35 లక్షల తాగునీటి ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను సరఫరా చేసేలా ఏర్పాట్లు చేశారు.

వీవీఐపీ, వృద్ధులు, దివ్యాంగులకు..

సాధారణ భక్తుల దర్శనాలకు ఆటంకం కలగకుండా ఉండేలా వీఐపీ, వీవీఐపీ దర్శనాలు, వృద్ధులు, దివ్యాంగుల దర్శనాలకు ఈ ఏడాది ప్రత్యేక సమయాలను కేటాయించారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 10, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల మధ్యలో కేటాయించారు. ఈ సమయాల్లోనే రావాలని సూచించారు. ప్రముఖుల రాకపోకల కోసం పున్నమిఘాట్, కలెక్టర్ కార్యాలయం, స్టేట్‌గెస్ట్ హౌస్, భవానీఘాట్, జమ్మిదొడ్డి ప్రాంతాల నుంచి 28 ఇన్నోవా వాహనాలు, ఎనిమిది మినీ బస్సులను ఏర్పాటు చేశారు.



దివ్యాంగుల కోసం ప్రత్యేక ఎస్కలేటర్

ఉచిత ప్రసాదం, అన్నదానం..

ఆలయంలో తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకూ భక్తులకు ఉచిత ప్రసాదంగా పులిహోర, కట్టె పొంగలి, దద్దోజనం, సాంబారు అన్నం అందిస్తారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు కొండ దిగువన ఏర్పాటు చేసిన శిబిరంలో అమ్మవారి అన్నప్రసాదం అందుబాటులో ఉంటుంది.

తాత్కాలిక మరుగుదొడ్లు..

150 తాత్కాలిక మరుగుదొడ్లను విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. భక్తులు వేచి ఉండేందుకు సీతమ్మ వారి పాదాల వద్ద వేసిన షెడ్ వద్ద 40, బస్టాండ్, రాజీవ్‌గాంధీ పార్కు, కృష్ణవేణిఘాట్, కుమ్మరిపాలెం టీటీడీ పార్కింగ్ స్థలం, కెనాల్ రోడ్డు, భవానీఘాట్లలో 10 చొప్పున మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.

ప్రతిరోజు నగరోత్సవం..



ప్రతిరోజు సాయంత్రం 4గంటలకు నగరోత్సవం కనులపండువగా నిర్వహిస్తారు. మహామండపం నుంచి బయలుదేరి కనకదుర్గానగర్, రథం సెంటర్, వినాయకగుడి వరకూ వెళ్లి.. యూటర్న్ తీసుకుని కెనాల్ రోడ్డు మీదుగా ఆలయ ఘాట్‌రోడ్డు మీద నుంచి ఆలయంలోకి ప్రవేశిస్తుంది.



ఆలయ పరిసరాలు ముస్తాబు

ఘాట్లలో జల్లు స్నానాలకు ఏర్పాట్లు..

భవానీఘాట్, సీతమ్మవారి పాదాలు, పున్నమి ఘాట్లలో 700 షవర్లను ఏర్పాటు చేశారు. వీటిలో సీతమ్మవారి పాదాల ఘాట్ వద్దే 500 షవర్లు ఉన్నాయి. భక్తులు వీటి కింద నిలబడి జల్లు స్నానాలు చేసుకునేలా సౌకర్యాలు కల్పించారు. కొండ దిగువన దుర్గాఘాట్‌లో భక్తుల స్నానాలకు అనుమతి లేదు. ఇక్కడ నదీ హారతి కార్యక్రమాన్ని ప్రతిరోజు సాయంత్రం వేళ నిర్వహించనున్నారు.

భద్రతా వలయం....

దుర్గగుడి, ఘాట్లు, విజయవాడ సహా చుట్టుపక్కల మూడు షిఫ్టుల్లో 5,200 మంది పోలీసులు భద్రతా విధుల్లో పాల్గొంటున్నారు. ఆలయంలో ఉన్న 200 సీసీ కెమెరాలతో ఉత్సవాలను డేగ కళ్లతో పర్యవేక్షించనున్నారు. ఇవికాక అదనంగా మరికొన్ని కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. కలెక్టరేట్, పోలీసు కమిషనర్ కార్యాలయం, కమాండ్ కంట్రోల్ రూమ్‌ల వద్ద మానిటర్లను ఏర్పాటు చేసి 24 గంటలూ పర్యవేక్షించేలా సిబ్బందిని ఏర్పాటు చేశారు.



రాజగోపురం వద్ద పోలీసులు

కేశఖండనశాల...

సీతమ్మవారి పాదాల వద్ద కేశఖండనశాలను ఏర్పాటు చేశారు. ఒక్కో షిఫ్టుకు 200 మంది చొప్పున.. మొత్తం మూడు షిఫ్టుల్లో 600 మంది క్షురకులు అందుబాటులో ఉంటారు. భవానీ, పున్నమిఘాట్ల వద్ద కూడా 25మంది చొప్పున బార్బర్లను ఉంచుతున్నారు. హైదరాబాద్ వైపు నుంచి వచ్చే భక్తులు అక్కడే తలనీలాలు సమర్పించి.. ఘాట్‌లో స్నానం చేసి అమ్మవారి దర్శనానికి రావొచ్చు.

బందరుకు పూర్వ వైభవం తెస్తా

స్వచ్ఛతాహీ సేవ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ



బందరు పోర్టు పనులను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు. పక్కన ఎంపీ బాలశౌరి



చీపురుపట్టి వ్యర్థాలను శుభ్రం చేస్తున్న ముఖ్యమంత్రి. పక్కన మంత్రులు నారాయణ, కొల్లు రవీంద్ర


ఈనాడు డిజిటల్, మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: బందరుకు పూర్వ వైభవం తీసుకొస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం మచిలీపట్నంలోని తితిదే కల్యాణ మండపంలో నిర్వహించిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన బందరు చరిత్ర, స్వాతంత్ర్యోద్యమంలో ఇక్కడి నుంచి కీలకంగా వ్యవహరించిన ఉద్యమకారుల గురించి వివరించారు.

ఆంధ్ర జాతీయ కళాశాలకు మహర్దశ

'గాంధీజీ పర్యటించిన ఆంధ్ర జాతీయ కళాశాల వైకాపా ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో వెలవెలబోతోంది. కళాశాల భూములను కూడా కబ్జా చేసేందుకు కొందరు అక్రమార్కులు ప్రయత్నిస్తున్నారు. కళాశాల అభివృద్ధి బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుంది. ఉద్యమకారులను దేశానికి అందించిన కళాశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం. దేవాదాయశాఖ పరిధిలోని కళాశాలను తీసుకుని వసతు కల్పిస్తా'మన్నారు.

బందరుకు సీఎం వరాల జల్లు

'మంగినపూడి బీచ్‌ని పర్యాటకంగా అన్ని వసతులతో అభివృద్ధి చేస్తాం. నగరంలో ప్రధానమైన డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరిస్తాం. ఐవీఆర్ఎస్ ద్వారా నగరంలోని కొందరికి ఫోన్‌లు చేసి సమస్యలపై ఆరా తీయగా ఎక్కువ శాతం డ్రెయినేజీ, రహదారుల సమస్యలు చెప్పారని' సీఎం పేర్కొన్నారు. డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి ఇప్పటికే కార్యాచరణ చేపట్టామని, భౌగోళికంగా నగరం పల్లంగా ఉండంతో అవసరమైతే ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేసి నగరంలో నీరు నిలవకుండా చూస్తామన్నారు. రహదారులను అభివృద్ధి చేస్తామని, మత్స్యకారులకు ఉపాధి, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధతో కృషి చేస్తున్నామన్నారు.



స్వచ్ఛ చల్లపల్లి రథసారథి డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్‌ను సన్మానించిన సీఎం చంద్రబాబు

రోల్డ్‌గోల్డ్ పరిశ్రమ అభివృద్ధి

'బందరు రోల్డ్‌గోల్డ్ పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, కావాల్సిన నిధులను మంత్రి రవీంద్ర నా దృష్టికి తెచ్చారు. ఈ మేరకు చర్యలు తీసుకుంటాం. చిలకలపూడి రోల్డ్‌గోల్డ్ నగలకు ఆన్‌లైన్ మార్కెటింగ్ కల్పించి అంతర్జాతీయ స్థాయిలో విక్రయాలు జరిగేలా చూస్తాం. కలంకారీ పరిశ్రమను కూడా అభివృద్ధి చేసి ఆన్‌లైన్ విక్రయాలు జరిగేలా చూస్తాం. జలజీవన్ మిషన్‌తో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇస్తా'మన్నారు.

వైకాపా కార్యాలయ భవనంపై నివేదిక

నగరం నడిబొడ్డున రెండెకరాల ప్రభుత్వ స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా వైకాపా కార్యాలయ భవన నిర్మాణానికి అనుమతులు తదితరాలపై నివేదిక తీసుకుని తగు చర్యలు తీసుకుంటామన్నారు. భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారకభవన నిర్మాణ అంశాన్ని కూడా పరిశీలిస్తామని సీఎం పేర్కొన్నారు.

తెదేపా హయాంలో ప్రగతి

కొల్లు రవీంద్ర, మంత్రి

బందరులో ఏదైనా అభివృద్ధి జరిగిందంటే అది తెదేపా హయాంలోనే. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నగరంలో తెదేపా హయాంలోనే రిజర్వాయర్ల నిర్మాణం జరిగింది. 2014లో అధికారంలోకి వచ్చిన తరువాత 8 రిజర్వాయర్లు, పైపు లైన్ నిర్మాణం తదితర పనులు చేపట్టాం. ప్రస్తుతం బందరు మండలంలో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి ఇచ్చేందుకు రూ.220కోట్లు సిద్ధంగా ఉన్నాయి. త్వరితగతిన పనుల పూర్తికి కృషి చేస్తున్నాం.



బందరు వైద్య కళాశాలకు పింగళి వెంకయ్య పేరు

ఫలించిన ఎంపీ బాలశౌరి కృషి

దేశానికి మువ్వన్నెల జెండాను అందించిన పింగళి వెంకయ్య పేరు మచిలీపట్నంలో ఇక చిరస్థాయిలో నిలిచిపోనుంది. మచిలీపట్నానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధులు పింగళి పేరును మచిలీపట్నం వైద్య కళాశాలకు పెడతామని సీఎం చంద్రబాబు ప్రకటించడంతో.. మహనీయునికి ఘన నివాళి అర్పించినట్లయింది. ఎంపీ వల్లభనేని బాలశౌరి కృషి ఎట్టకేలకు ఫలించింది. వైద్య కళాశాలకు నిధులు కేటాయించినప్పటి నుంచి.. పింగళి వెంకయ్య పేరు పెట్టాలని బాలశౌరి విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు. ప్రభుత్వానికి విన్నవిస్తూనే ఉన్నారు. తాజాగా ముఖ్యమంత్రి స్వయంగా పింగళి పేరు ప్రకటించడంతో బందరులో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. దేశ స్వాతంత్ర్యోద్యమంలో పింగళి పోరాటం మరువలేనిది. కృష్ణా జిల్లాలో పుట్టి.. దేశానికి మువ్వన్నెల పతాకాన్ని రూపొందించి ఇచ్చి.. జాతిపిత గాంధీజీ మెప్పు పొందిన పింగళి పేరును వైద్య కళాశాలకు పెట్టడం శుభ పరిణామం.

అభినందనీయం: ఎంపీ బాలశౌరి



బందరు ప్రభుత్వ వైద్య కళాశాలకు పింగళి వెంకయ్య పేరు పెడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం అభినందనీయం. వైద్య కళాశాల నిర్మాణం వేళనే ఆయన పేరు పెట్టాలని కోరగా అప్పటి ఎమ్మెల్యే అహంకారంతో సాధ్యపడలేదు. కూటమి ప్రభుత్వంలో సమరయోధునికి గౌరవం దక్కనుంది. పింగళి పేరు పెట్టాలని గతంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు లేఖ రాశా. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక చంద్రబాబు తొలిసారి బందరు పర్యటనలోనే శుభవార్త చెప్పారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు. వరదల వేళ సీఎం చొరవ ఆదర్శనీయం. 15లక్షల క్యూసెక్కుల వరదవచ్చినా ఇబ్బంది లేకుండా కరకట్టలను బలోపేతం చేయాలి.

తినమరిగినోళ్లు.. వదలరంతే!

పోలవరం కట్టలపై తవ్వకాలు * రెండు జేసీబీలు, టిప్పర్లు స్వాధీనం

ఈనాడు, అమరావతి

గత ప్రభుత్వంలో పోలవరం కుడి కాలువ కట్టలను దాదాపు కరిగించారు. విచ్చలవిడిగా తవ్వారు. కొంత అనుమతి తీసుకుని జలవనరుల శాఖ ఆధ్వర్యంలో తవ్వితే.. మరికొంత అనధికారికంగా మాయం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం మారినా.. తవ్వకాలు మాత్రం ఆగడం లేదు. ఎలాంటి అనుమతులు లేకుండా కొద్దోగొప్పో ఉన్న కట్టలను తవ్వేస్తున్నారు. తమకు ఎమ్మెల్యే చెప్పారని.. అధికారులను సైతం బుకాయిస్తున్నారు. విచిత్రం ఏంటంటే.. గత ప్రభుత్వంలో తవ్విన నేతలే.. ప్రస్తుత ప్రభుత్వంలోనూ తవ్వేస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. ఎలాంటి సీనరేజీలు లేకుండా మట్టిని తరలిస్తున్నారు. మౌఖిక ఆదేశాలు ఉన్నాయని క్షేత్రాకి వెళ్లిన అధికారులను బుకాయిస్తున్నారు.



పాతపాడు వద్ద పోలవరం కట్ట తవ్వకాలు

గండ్లు పూడ్చే పేరుతో..!

ఇటీవల వరదలకు పలు చోట్ల గండ్లు పడ్డాయి. దారులకు గండ్లు పడగా.. కొన్ని అధికారులే నీరు ప్రవహించేందుకు వీలుగా గండ్లు కొట్టారు. ఇలా పడిన గండ్లు పూడ్చేందుకు మట్టి పెద్దఎత్తున అవసరం. ఈ గండ్లు పూడ్చేందుకు దగ్గరలో పోలవరం కట్టల నుంచి తవ్వాలని తమకు ఆదేశాలు ఉన్నాయని కొందరు విచ్చలవిడిగా తవ్వేసి తరలిస్తున్నారు. ప్రైవేటు వెంచర్లకు విక్రయిస్తున్నారు. వాస్తవానికి గండ్లు పూడ్చేందుకు తాము ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని అధికారులు చెబుతున్నారు. పోలవరం కుడి కాలువ కట్టపై పాతపాడు సమీపంలో రెండు జేసీబీలు పెట్టి ఓ వైకాపా నాయకుడు లారీలలో మట్టిని తరలించడంపై అధికారులకు ఫిర్యాదులు అందాయి. సోమవారం ఆ ప్రాంతంలో పలు లారీలు, ట్రాక్టర్లలో రెండు జేసీబీలు తవ్వుతున్న తీరు 'ఈనాడు'కు కనిపించింది. దీనిపై కొందరు అధికారులకు ఫిర్యాదు చేశారు. అప్పటికే చాలా వరకు తవ్వకాలు జరిపారు. దీనిపై ప్రశ్నించిన స్థానికులతో వాగ్వాదానికి దిగారు. తమకు ఎమ్మెల్యే చెప్పారనీ.. గండ్లు పూడ్చేందుకు తీసుకెళుతున్నామని భిన్నమైన వాదనలు వినిపించారు. ఈ తవ్వకాల విషయమై మరో ఎమ్మెల్యేకు సమాచారం అందడంతో ఆయన రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. పోలవరం కట్టలతోపాటు పలు ప్రాంతాల్లోనూ ఇంకా మట్టి తవ్వకాలు సాగుతున్నాయి. పోలవరం కట్టలపై గత ప్రభుత్వంలో జరిపిన తవ్వకాలపై విచారణ జరుగుతూనే ఉంది. గన్నవరంలో స్వయంగా జలవనరుల శాఖ అధికారులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులకే దిక్కు లేదు. నేటికీ కేసు నమోదు చేయకుండా వదిలేశారు. నాడు ప్రజాప్రతినిధులు కీలకంగా వ్యవహరించి మట్టి తవ్వకాలను ప్రోత్సహించారు.

రెండు జేసీబీలు పట్టివేత..!

ఫిర్యాదు అందిన వెంటనే విజయవాడ గ్రామీణ తహసీల్దారు సుగుణ ఆ ప్రాంతాన్ని పరిశీలించి రెండు జేసీబీలను స్వాధీనం చేసుకున్నారు. రెండు టిప్పర్లను పట్టుకున్నారు. దీనిపై ఇంకా కేసు నమోదు కాలేదు. ఓ ఎమ్మెల్యే చెప్పారని ఒక వర్గం వాదిస్తుండగా.. మరో ఎమ్మెల్యే చర్యలు తీసుకోమని ఆదేశాలు ఇచ్చారని అధికారులు చెబుతున్నారు. ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య ఈ మట్టి తవ్వకాలు వివాదంగా మారాయి. మరో కాంట్రాక్టరు ఈ పోలవరం కట్ట మట్టి తనదనీ.. తాను జలవనరుల శాఖకు దరఖాస్తు చేశానని సొమ్ములు కూడా చెల్లించానని చెబుతున్నారు.

బందోబస్తు సక్రమంగా నిర్వహించండి

దసరా విధుల పోలీస్ సిబ్బందికి సీపీ సూచన

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: విజయవాడ ఇంద్రకీలాద్రిపై ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అమ్మవారి దర్శనమయ్యేలా చూడాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్‌బాబు పోలీస్ సిబ్బందికి సూచించారు. నేటి నుంచి అక్టోబరు 12వ తేదీ వరకు జరిగే దసరా ఉత్సవాలకు వివిధ జిల్లాల నుంచి విధులు నిర్వహించడానికి వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి విజయవాడ ఆంధ్రా లయోల కళాశాల దేవయ్య ఆడిటోరియంలో ఆయన మార్గదర్శనం చేశారు. సీపీ మాట్లాడుతూ... ఉత్సవాలకు మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని బందోబస్తు విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. విధులు నిర్వహించే సమయంలో మీడియా, సామాజిక మాధ్యమాలు గమనిస్తుంటారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహించేలా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆలయ అర్చకులు, సిబ్బంది, వీఐపీలతో వివాదాలకు తావీయకుండా సమన్వయం చేసుకోవాలని చెప్పారు. ప్రతి భక్తుడితో మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ.. సక్రమంగా అమ్మవారి దర్శనం అయ్యేలా చూడాలని తెలిపారు. క్యూలైన్లలో ఇబ్బందులు ఎదురైతే వెంటనే స్పందించాలని, సమస్యలకు ఆస్కారం లేకుండా చూసుకోవాలని చెప్పారు. డీసీపీలు గౌతమిషాలి, ఉదయరాణి, ఉమామహేశ్వరరాజు, కృష్ణమూర్తి నాయుడు, ఏడీసీపీలు జి.రామకృష్ణ, ఏఎల్ ప్రసన్నకుమార్, ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు, విధులకు వచ్చిన 6 వేల మంది పోలీసులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీ రాజశేఖర్‌బాబు, వేదికపై ఉన్నతాధికారులు

నిధులిస్తేనే నీళ్లు.. లేదంటే బీళ్లు!

మూలకు చేరిన ఎత్తిపోతల పథకం ☛ పని చేస్తే సుమారు 50 వేల ఎకరాలకు మేలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

వైకాపా ప్రభుత్వ పాలనలో నిర్లక్ష్యానికి గురైన వేదాద్రి-కంచల ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేసి సాగునీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. గతంలో రూ.8 కోట్లతో ప్రతిపాదనలు పంపినా వైకాపా ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.15 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదనలు అందజేశారు. ఇంకా నిధులు మంజూరు కాలేదు.


వేదాద్రి-కంచల ఎత్తిపోతల పంప్‌హౌస్

మూడేళ్ల కిందట..

కృష్ణా నదిపై వేదాద్రి వద్ద ఎత్తిపోతల పథకం నిర్మించారు. ఎన్నెస్పీ కాలువలో నీటిని ఎత్తిపోసి ఆయకట్టులో పంటలకు అందించాలి. ఇందులో 2300 హెచ్‌పీ సామర్థ్యం గల నాలుగు మోటార్లు ఉన్నాయి. మూడేళ్ల కిందట మూడు మోటార్లు మరమ్మతులకు గురయ్యాయి. వాటికి మరమ్మతులు చేయించలేదు. అప్పటి నుంచి ఎత్తిపోతల మూలకు చేరింది. నందిగామ, చందర్లపాడు మండలాల్లోని ఏటూరు, కంచల ఎన్నెస్పీ మేజరు కాలువల ద్వారా 49,743 ఎకరాలకు సాగు నీరందించాలి. ఈ ఖరీఫ్‌లో రైతులు మిర్చి, పసుపు, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేస్తున్నారు.

నిలిచిన సాగర్ నీరు

నెల కిందట ఎన్నెస్పీ కాలువలకు నీరు విడుదల చేసినా ఈ ప్రాంతానికి అరకొరగా వచ్చాయి. తెలంగాణలోని ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయరు సమీపంలో సాగర్ ఎడమ కాలువకు గండి పడింది. దీంతో సాగర్ నీరు విడుదల కావడం లేదు. ఈ పరిస్థితుల్లో వేదాద్రి ఎత్తిపోతల వినియోగంలో ఉంటే ఆయకట్టుకు సాగునీరు ఇవ్వడానికి వీలుపడేది. ప్రస్తుతం నాలుగు మోటార్లు, పంపులు కొత్తవి ఏర్పాటు చేయాలి. వాటి ఏర్పాటుకు రూ.15 కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే సౌమ్య సీఎం చంద్రబాబు, నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడికి వినతి పత్రాలు ఇచ్చారు. నిధులు మంజూరైతే పథకం అందుబాటులోకి వస్తుంది.

ప్రతిపాదనలు పంపాం

ఎత్తిపోతలలో మోటార్లు, పంపులు, ప్యానెల్ బోర్డులు ఏర్పాటుకు రూ.15 కోట్లు మంజూరు చేయించాలని ఐడీసీ సీఈకి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే మరమ్మతులు చేయించి ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయిస్తాం. **- రత్నరాజు, ఐడీసీ డీఈఈ, జగ్గయ్యపేట**

చుక్ చుక్ బండి.. 30 ఏళ్లయిందండి

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విజయవాడ, విశాఖపట్నం మధ్య నడిచే రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభమై 30 సంవత్సరాలు పూర్తవడంతో బుధవారం విజయవాడ రైల్వేస్టేషన్‌లో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ రైలు అక్టోబరు 2వ తారీఖున 1994లో ప్రారంభమైంది. మొదట రత్నగిరి హిల్స్ పేరుతో నడిచేది. 1999 నుంచి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌గా మారింది. 2006 నుంచి ఈ రైల్లో అత్యాధునిక సౌకర్యాలు ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చాయి. సీసీటీవీ కెమెరాలు, పూర్తి స్టెయిల్ భద్రత, డబ్ల్యూఏపీ4 అత్యాధునిక ఇంజిన్‌తో పాటు ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రైలు వేగంతో పాటు 24 బోగీలకు పెంచారు. ఉదయం విజయవాడ నుంచి బయలుదేరి రాత్రికి తిరిగి చేరుకునే ఈ రైలుకు ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. ప్రతి రోజూ 140శాతం ఆక్యుపెన్సీ నమోదు చేసుకుంటుంది. ఉద్యోగులు, వ్యాపారులకు ఈ రైలు ఎంతో సౌకర్యవంతంగా మారింది. వేడుకల సందర్భంగా ప్రయాణికులు, రైల్వే సిబ్బంది విజయవాడ రైల్వేస్టేషన్‌లో కేక్ కోసి సంబరాలు నిర్వహించారు.


వేడుకల్లో ప్రయాణికులు, రైల్వే సిబ్బంది

గిరిజనుల సమగ్రాభివృద్ధికి పీఎం-జుగా దోహదం

కృష్ణలంక, న్యూస్‌టుడే: గిరిజనుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా ప్రధానమంత్రి మోదీ.. గాంధీ జయంతి రోజున ప్రధాన మంత్రి జన్ జాతీయ ఉన్నత్ గ్రామ అభియాన్ (పీఎం-జుగా) పథకాన్ని ప్రారంభించినట్లు కలెక్టర్ జి.సృజన తెలిపారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పథకంపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ సృజన, అధికారులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పథకం కరపత్రాలను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పదేళ్ల కిందట మహాత్ముడి జయంతి రోజున ప్రారంభమైన స్వచ్ఛభారత్ మిషన్ ప్రజా ఉద్యమంలా కొనసాగి మంచి ఫలితాలనిచ్చిందని, అదే విధంగా పీఎం-జుగా అమలవుతుందని చెప్పారు. ఇబ్రహీంపట్నం మండలం కాచవరం, దాములూరు, మూలపాడు, జూపూడి, తుమ్మలపాలెం, పెనుగంచిప్రోలు మండలం లింగంగూడెం, పెనుగంచిప్రోలు, ముచ్చింతల, అనిగండ్లపాడు, కొల్లికుళ్ల, కొనకంచి, సుబ్బాయిగూడెం, శనగపాడు, ఎ.కొండూరు మండలం కుమ్మరకుంట్ల, జగ్గయ్యపేట మండలం బూదవాడ, జయంతిపురం, మైలవరం మండలం కనిమెర్లదండ గ్రామాల్లో పథకం అమలు కానుందని చెప్పారు. గిరిజనుల సంక్షేమానికి అవసరమైన ప్రతి అంశాన్ని ఈ పథకం స్పృశిస్తుందని తెలిపారు. ఆయా గ్రామాల్లో హౌసింగ్, రహదారులు, మంచినీటి పథకాలు, విద్యుత్తు, సోలార్, ఆయుష్మాన్ కార్డులు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రులు, సమగ్రశిక్ష, టెలికాం సేవలు, నైపుణ్యాభివృద్ధి, డిజిటల్, వ్యవసాయం, ఆక్వాకల్చర్, పశుసంవర్ధకం, అటవీ హక్కులు, టూరిజం, పీఎంఏఏజీవై తదితర అంశాలపై దృష్టి సారించనున్నట్లు వివరించారు. జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జె.సునీత, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, డీఎంహెచ్‌వో సుహాసిని, నైపుణ్యాభివృద్ధి అధికారి నరేష్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సృజన తదితరులు

వంగవీటి రాధాకు సీఎం చంద్రబాబు పరామర్శ

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి కోలుకున్న మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫోన్‌లో పరామర్శించారు. ఇటీవల స్వల్పంగా గుండెపోటుకు గురైన రాధా. . గవర్నర్‌పేటలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చేరారు. చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేశారు. బుధవారం సీఎం చంద్రబాబు ఆయనికి ఫోన్ చేసి.. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

తితిదే నిత్యాన్నదానానికి కూరగాయలు


జెండా ఊపి లారీ పంపిస్తున్న మండవ వెంకటరత్నం, శీరం రామారావు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : శ్రీవారి దర్శనం కోసం వచ్చే లక్షలాది మంది భక్తులకు ఏర్పాటు చేసే అన్న ప్రసాదంలో నగరానికి చెందిన దాతలు భాగస్వామ్యం కావడం అభినందనీయమని ఇందిరా ఫుడ్స్ అధినేత మండవ వెంకటరత్నం, శ్రీరాంటెక్ ఇంజినీర్స్ అధినేత శీరం రామారావు అన్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా తితిదే నిత్యాన్నదానానికి మండవ కుటుంబరావు ఆశీస్సులతో నగరానికి చెందిన మండవ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దాతలు కంకణాల రమేష్, తుమ్మల భోగేశ్వరరావు, మండవ నాగేశ్వరరావు, లంకె ప్రసాదరావు, చలసాని వెంకటేశ్వరరావు, కాంతారావు, ప్రసాద్, ఆదిత్య, సాయి తదితరుల ఆర్థిక సాయంలో పది టన్నుల కూరగాయలు ఏర్పాటు చేశారు. వాటిని బుధవారం ఎ కన్వెన్షన్ నుంచి తిరుమలకు పంపించారు. కూరగాయల లారీకి పూజలు చేసిన అనంతరం వెంకటరత్నం, రామారావు జెండా ఊపి పంపించారు. కార్యక్రమంలో ధనేకుల సత్యనారాయణ, శ్రీహరిరావు, చలపతిరావు, గుమ్మడి సురేష్, చంటి, నాగేంద్ర, బ్రహ్మాజీ, గద్దె జయరాం తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి రూ.13 లక్షల వితరణ

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే : అమెరికాకు చెందిన ఆశా జ్యోతి సంస్థ.. వాంబే కాలనీలోని మాతృదేవో భవ వృద్ధాశ్రమానికి రూ.13 లక్షల చెక్కును వితరణగా ఇచ్చింది. ఆశ్రమ నిర్వహణ నిమిత్తం.. తుమ్మలపల్లి రాజేశ్వరరావు, భాగ్యలక్ష్మి, వంశీకృష్ణ వారి మిత్ర బృందం ఈ సాయం అందించింది. ఈ చెక్కును బుధవారం ఆశ్రమ నిర్వాహకులకు ఎం.రామకృష్ణ, ఎం.గోపీకృష్ణల చేతుల మీదుగా అందజేశారు.


రూ.13లక్షల చెక్కుతో ఆశాజ్యోతి మిత్ర బృందం

నగరంలో కుండపోత..!

రహదారులు జలమయం


సీతారాంపురం కూడలిలో..

సీతారాంపురం, న్యూస్‌టుడే : నగరంలో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం పడింది. ప్రధాన రోడ్లు జలమయమయ్యాయి. వేములశ్యామలాదేవి రోడ్డు, ఏలూరు రోడ్డు, సీతారాంపురం కూడలి, మాచవరం డౌన్‌లోని రెవెన్యూ కాలనీ ప్రాంతాలు వర్షపు నీటితో మునిగిపోయాయి. సుమారు మూడు గంటలకు పైగా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది.


వేముల శ్యామలాదేవి రోడ్డులో వాన నీరు

తుదిదశకు ఇంజినీరింగ్ అడ్మిషన్ల ప్రక్రియ

కానూరు, తాడిగడప, న్యూస్‌టుడే

ఉమ్మడి కృష్ణాజిల్లాలో సాంకేతిక విద్యాశాఖ కౌన్సెలింగ్ అనంతరం 2024 సంవత్సరానికి సీట్ల కేటాయింపు కార్యక్రమం సెప్టెంబరు చివరికి పూర్తయింది. జులై నుంచి సుదీర్ఘ కౌన్సెలింగ్‌లు(మొత్తం మూడు జరిగాయి). అనంతరం స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతోంది. ఈ నేపథ్యంలో పలువురు విద్యార్థులు ఇప్పటికే ప్రవేశాలు పొందారు. కన్వీనర్ కోటాలో 78.2శాతం, మేనేజ్‌మెంటు కోటాలో 82 శాతం సీట్లు నిండాయి.

ఫీజులు పెరిగాయి.. జిల్లాలోని ఇంజినీరింగ్ కళాశాలలో కన్వీనర్ కోటాకు గతంలో కనిష్ఠంగా రూ.35,000, గరిష్ఠంగా రూ.70,000 ఉండేది. ఈ సంవత్సరం ఫీజులు కనిష్ఠంగా రూ.40వేలు, గరిష్ఠంగా రూ.1,05,000 పెంచారు. అలానే మేనేజ్‌మెంటు కోటా సీట్లకు డిమాండ్‌ను బట్టి ఏటా రూ.లక్ష నుంచి 2 లక్షలు వరకు ఫీజును నిర్ణయించారు.



ఇంజినీరింగ్ కళాశాలలు	- 28
విశ్వవిద్యాలయాలు	- 2
అందుబాటులో ఉన్న కన్వీనర్ కోటా సీట్లు	- 14,670
ఇప్పటికి పూర్తయిన సీట్లు	- 11,481 (78.2%)
మిగిలిన సీట్లు (కన్వీనర్ కోటా)	- 3,189
మేనేజ్‌మెంటు కోటా సీట్లు	- 6,330
పూర్తయినవి	- 5,190 (82%)

బ్రాంచీల వారీగా నిండిన సీట్ల శాతం

బ్రాంచి	శాతం
సీఎస్ఈ, అనుబంధంగా ఉన్నవి	95
ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ	98
ఈసీఈ	84
ఈఈఈ	72
సివిల్	59
మెకానికల్	49

ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం సీట్లు (కన్వీనర్, మేనేజ్‌మెంటు కలిపి)- 21,000

కేసులు రాజీ చేసుకుందామని పిలిచి అసభ్య ప్రవర్తన

ప్రభుత్వాసుపత్రి ఉద్యోగిపై పోలీసులకు ఫిర్యాదు

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : పాత కేసులు రాజీ చేసుకుందామని, ఇంటికి పిలిచి ఇద్దరు మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన ప్రభుత్వ ఉద్యోగిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు అందింది. ప్రత్యక్ష సాక్షులు, బాధితురాలు చెప్పిన వివరాల మేరకు. . విద్యాధరపురానికి చెందిన ఓ మహిళ (51) పండ్ల వ్యాపారం చేస్తుంటారు. ఆమెకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో వన్‌టౌన్‌కు చెందిన మరో మహిళ (32)తో కలిసి పది రోజుల క్రితం కొత్త ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. తిరిగి వస్తుండగా ప్రభుత్వాసుపత్రిలో పనిచేసే హోంమెన్ ఎదురుపడ్డాడు. తనపై గతంలో పెట్టిన కేసులను రాజీ చేసుకుందామని కోరాడు. ఆ ఇద్దరు మహిళలు బుధవారం అజిత్‌సింగ్‌నగర్ గంగానమ్మగుడి సమీపంలోని హోంమెన్ ఇంటికి వెళ్లారు. అతడు.. వాళ్లిద్దరి చేతులు పట్టుకుని ఇంట్లోకి లాగాడు. దూషిస్తూ.. దుర్భాషలాడడంతో వారు భయపడిపోయారు. కేకలు వేస్తూ.. అతడికి దేహశుద్ధి చేశారు. ఇంతలో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకోవడంతో.. బాధితులు వెళ్లిపోయి అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై రాజీ చేసేందుకు కొంత మంది వైకాపా నాయకులు ప్రయత్నిస్తున్నారు.


పాత కేసుల వివరాలు ఇవే...

విద్యాధరపురానికి చెందిన మహిళ (51).. 2020, ఆగస్టు 19న పాత ప్రభుత్వాసుపత్రి గేటు వద్ద తన సోదరి నిర్వహించే హోటల్‌కు వెళ్లారు. పాత ప్రభుత్వాసుపత్రిలో పనిచేసే హోంమెన్ వచ్చి ఆమెను దుర్భాషలాడి, బెదిరించాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గవర్నర్‌పేట పోలీసులు 179/2020గా కేసు నమోదు చేశారు. వన్‌టౌన్‌కు చెందిన (32).. పాత ప్రభుత్వాసుపత్రిలో క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. హోంమెన్ 2020 సంవత్సరం నుంచి ఆమెను వేధిస్తున్నాడు. 2021, ఫిబ్రవరి 12న వాష్‌రూమ్‌కు వెళుతుండగా ఆమె వెంటపడి అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గవర్నర్‌పేట పోలీసులు 48/2021గా కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసులను రాజీ చేసుకుందామని ఇంటికి పిలిచిన హోంమెన్.. మహిళలతో అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితులు మరోసారి అతడిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నూతన మద్యం విధానం సవరించాలి

లెనిన్ కూడలిలో నిరసన దీక్ష

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం అక్టోబరు నుంచి తెచ్చిన నూతన మద్యం విధానాన్ని సవరించాలని మహిళా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. మద్యం విక్రయించే సమయాన్ని, దుకాణాలను కుదించాలని కోరుతూ బుధవారం లెనిన్‌కూడలిలో నిరసన దీక్ష చేపట్టారు. రైతు నాయకుడు వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా, ప్రజలను మద్యం మత్తులో ముంచేలా నూతన పాలసీని గాంధీ జయంతి రోజు నుంచే అమలు చేయడం సిగ్గుచేటన్నారు. మద్యానికి బానిసలైన వారి జీవితాలు నాశనం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ నాయకురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో మద్యం ప్రధాన ఆదాయ వనరుగా మారిందని పేర్కొన్నారు. మహిళలు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. వైకాపా హయాంలో ప్రభుత్వ నియంత్రణలో ఉన్న మద్యం.. నేడు ప్రైవేటు వ్యక్తులు, సిండికేట్ చేతుల్లోకి వెళ్లిందని ఆరోపించారు. భారత జాతీయ మహిళా సమాఖ్య, ఐద్వా, ప్రగతిశీల మహిళా సంఘం, మహిళా కాంగ్రెస్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుంకర పద్మశ్రీ, డి.రమాదేవి, పెన్మత్స దుర్గాభవానీ, పి.పద్మ తదితరులు పాల్గొన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటుపరం కాకుండా ప్రజలు పోరాటం చేస్తుంటే కూటమి ప్రభుత్వం.. దాన్ని పక్కదారి పట్టిస్తోందని విమర్శించారు. సనాతన ధర్మం పేరుతో మత, భక్తి విశ్వాసాలను రెచ్చగొట్టడం తగదన్నారు. తిరుమల లడ్డూ కల్తీ ఘటనను రాజకీయం చేస్తున్నారని దుయ్యబట్టారు. సోషలిస్ట్ నాయకుడు వి.వి.కృష్ణారావు మాట్లాడుతూ..


మహాత్మాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శోభనాద్రీశ్వరరావు, భాగ్యలక్ష్మి, దుర్గాభవానీ, పద్మశ్రీ, రమాదేవి తదితరులు

చిన్నారి మృతదేహం లభ్యం

పటమట, న్యూస్‌టుడే: విజయవాడ స్క్యూబ్రిడ్జ్ సమీపంలో తల్లి.. తన ఇద్దరు బిడ్డలతో కలిసి బందరు కాలువలో ఆదివారం దూకిన ఘటనలో చిన్నారి జాస్వి (18 నెలలు) మృతదేహం బుధవారం చోడవరం వద్ద లభ్యమైంది. నాలుగు రోజుల పాటు మృతదేహం నీళ్లలో ఉండటంతో ఉబ్బిపోయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంగళవారం లభ్యమైన తల్లి తిరుపతి సుధారాణి మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మరో చిన్నారి మృతదేహం ఆదివారం నాడే దొరికిన సంగతి తెలిసిందే. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పవన్ కిషోర్ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -116 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, 132, 143 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 585 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

కర్మాగారంలో కార్మికులకు గాయాలు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట పట్టణానికి చేరువలోని ఆటోనగర్‌లో ఉన్న రసాయన కర్మాగారంలో పని చేసిన ఇద్దరు కార్మికుల శరీరంపై తీవ్ర గాయాలై జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నాలుగు రోజుల క్రితం మల్కాపురం గ్రామానికి చెందిన మడుపల్లి వేణు, వడ్డెబోయిన గోపి రోజువారీ కూలీలుగా రసాయన కర్మాగారానికి వెళ్లారు. కనీస రక్షణ చర్యలు లేకుండా వారితో రసాయన బస్తాలు, ఐస్‌బాక్స్‌లను పైఅంతస్తుకు మోయించారు. పని ముగించుకొని ఇంటికి వెళ్లిన వారి శరీరంపై దురద, మంటలు రావడంతో స్థానిక ఆర్ఎంపీ వద్ద వైద్యం చేయించుకున్నారు. మూడు రోజులైనా తగ్గకపోగా.. చేతిపై బొబ్బలు రావడంతో బుధవారం జగ్గయ్యపేటలోని ప్రభుత్వాసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. విషయం తెలిసిన సీపీఎం, సీఐటీయూ నాయకులు ఆసుపత్రిలో వారిని పరామర్శించి పరిస్థితిని సమీక్షించారు. విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేయాలని తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం సమర్పించారు. కర్మాగారం వారు బాధితులకు మెరుగైన వైద్యం చేయించాలని, వారు కోలుకునే వరకు వారి కుటుంబాలకు అవసరమైన జీవనోపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు సోమోజు నాగమణి, రావెళ్ల శేషు, షేక్ గౌస్‌మియా, ఎస్.రామనాథం తదితరులు పాల్గొన్నారు.


క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు | కార్మికుడి చేతిపై బొబ్బలు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 85005 44088 మైలవరం: 80085 74705

? స్థానిక వంతెన సమీపంలో మైలవరం వైపు వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో గుంత ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.
- పి.విజయ్, గ్రామస్థుడు

✔ సమస్య మా దృష్టికి వచ్చింది. సిబ్బందిని పంపి మరమ్మతులు చేయిస్తాం.
- హేమంత్‌కుమార్ ఆర్అండ్‌బీ సహాయక ఇంజినీర్
– న్యూస్‌టుడే, జి.కొండూరు

నేటి నుంచి ఆలయాల్లో శరన్నవరాత్రులు

కొండపల్లి: కొండపల్లి మార్కెట్ సెంటర్, చెన్నకేశవ రామాలయం, దిగువ బజార్ మాంసం కొట్ల కూడలి, తూర్పు ఇబ్రహీంపట్నం రామాలయం, శక్తినగర్‌లలో గురువారం నుంచి శరన్నవరాత్రులను నిర్వహించనున్నట్లు ఆయా ఉత్సవ కమిటీలు తెలిపాయి. విజయవాడ కనకదుర్గ ఆలయం నియమాల మేరకు అమ్మవారి అవతారాలకు అనుగుణంగా స్థానికంగా అలంకరణలు చేస్తామని పేర్కొన్నారు. 17న ఊరేగింపు, అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

తిరువూరు
• తిరువూరు • మైలవరం

అలరించిన అమ్మవారి వేషధారణలు

మైలవరం, న్యూస్‌టుడే: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక వివేకానంద పాఠశాలలో చిన్నారులు అమ్మవారికి 9 రోజుల పాటు అలంకరించే వేషధారణలు ధరించి అలరించారు. ప్రిన్సిపల్ ఎం.వి.శ్రీనివాసరావు, కరస్పాండెంట్ పి.రాజారెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులకు దసరా పండగ విశిష్టతను వివరించారు.



స్వచ్ఛంద సంస్థల సాయం అభినందనీయం

కొండపల్లి, న్యూస్‌టుడే: వరద నీటిలో రాత్రంతా గడిపిన సంఘటన ఇందిరమ్మ కాలనీ వాసుల కళ్లల్లో ఇంకా కనిపిస్తూనే ఉందని ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ వీఆర్‌కే నగర మహిళ ఆధ్వర్యంలో ఇందిరమ్మ కాలనీ వాసులకు నిత్యావసరాలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల ఒకటిన ఈ ప్రాంతమంతా నీటి మునిగి కాలనీ వాసులు తీవ ఇబ్బందులకు గురయ్యారన్నారు. దాదాపు నాలుగు రోజులు పునరావాస కేంద్రంలో తలదాచుకున్న సంఘటనలు కళ్ల ముందు కనిపిస్తున్నాయన్నారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు బాధితులకు ఈ రకంగా సాయమందించడం ఆహ్వానించదగ్గ విషయమని కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.


వరద బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్, వీఆర్‌కే నగర మహిళలు

అర్హులందరికీ సాయం అందిస్తాం

గొల్లపూడి, న్యూస్‌టుడే: అర్హులైన ప్రతి ఒక్కరికీ వరద సాయాన్ని అందిస్తామని.. ఆపరేషన్ బుడమేరు పేరుతో ఆధునికీరణ చేపట్టేందుకు, భవిష్యత్తులో వరదలు రాకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం రాయనపాడులో నిర్వహించిన సబ్‌కీ యోజనా.. సబ్‌కా వికాస్ కార్యక్రమంలో రైతులు, వరద బాధితులు వాళ్ల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు వల్లే వరద విపత్తు నుంచి త్వరగా విముక్తి లభించిందన్నారు. బుడమేరు వరద కారణంగా మైలవరం నియోజకవర్గంలోని ప్రజలు ఎక్కువగా నష్టపోయారన్నారు. కొందరు అధికారుల తప్పిదం వల్లే రాయనపాడు, పైడూరుపాడు గ్రామాల వారికి వరద విపత్తు సాయం అందడంలో కొంత అన్యాయం జరిగిందన్నారు. గ్రామ సర్పంచి కాటంనేని కల్యాణి, నాయకులు అక్కల గాంధీ, శీలంనేని సాంబశివరావు, పూర్ణచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

గండం గడిస్తేనే.. బండ్లు కదిలేది..!

అధ్వానంగా మారిన రోడ్లతో ప్రయాణికుల అవస్థలు

గంపలగూడెం, న్యూస్‌టుడే

వరదలతో రహదారులకు పడిన గండ్లు ప్రయాణికులకు ప్రాణాపాయంగా మారాయి. గండ్లు పడి నెల రోజులైనా వాటిని పూడ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టలేదు. దీంతో వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. సెప్టెంబరు మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలకు నాలుగైదు రోజులపాటు ఆర్అండ్‌బీ రహదారులపై వరద నీరు ఉద్ధృతంగా ప్రవహించడంతో రహదారులు ధ్వంసమయ్యాయి. ఆర్టీసీ బస్సులు, లారీలు, కార్లు, ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులు గండ్లు పడిన ప్రదేశాల్లో ప్రయాణం ప్రమాదకరమని తెలిసినా ప్రత్యామ్నాయ మార్గాలు లేక అటుగానే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది.


చింతలనర్వ సమీపంలో పడిన గండి


మెట్టగుట్ట దారిలో తారు రోడ్డు ఇలా..

ఈ మార్గాల్లో జాగ్రత్త

✸ కొణిజెర్ల వెలుపల ఆర్అండ్‌బీ రోడ్డుకు పడిన గండి ప్రమాదకరంగా ఉంది. సింగిల్ రోడ్డు కావడంతో ఎదురెదురు వాహనాలు బోల్తాపడే ప్రమాదం ఉందని స్థానికులు కర్రలకు ఎరుపు రంగు వస్త్రాలు కట్టారు. అటుగానే నెమలి వేణుగోపాలస్వామి గుడికి భక్తులు రాకపోకలు సాగించాల్సి ఉంది. ✸ పెనుగొలను నుంచి మెట్టగుట్ట వెళ్లే దారిలో తారు రోడ్డుకు పడిన గండి మరింత దారుణంగా మారింది. అటుగా భక్తులు శేషాచల శ్రీనివాసస్వామి ఆలయానికి రాకపోకలు సాగిస్తారు. భారీ వాహనాలు కూడా వస్తుంటాయి. ఎర్రుపాలెం మండలానికి వయా గోసవీడు మీదుగా వెళ్లేందుకు ప్రయాణికులు సైతం వెళ్తుంటారు. సిమెంట్ పైపులు బయటకు కనిపిస్తూ ప్రమాదకరంగా ఉంది. ✸ మేడూరు నుంచి సొబ్బాల వెళ్లే తారు రోడ్డు కూడా ఏడాది కిందట నిర్మించారు. ఇటీవల వరదలకు సొబ్బాల చెరువు వాగు వద్ద తారు రోడ్డు అంచు రెండు నుంచి నాలుగు అడుగుల మేరకు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళ వాహనదారులు అజాగ్రత్తగా ఉంటే ప్రమాదం తప్పదు. ✸ చింతలనర్వ నుంచి చల్లగుండ్లవారిపాలెం వెళ్లే దారిలో చెరువుకు సమీపంలో భారీ గండిపడింది. ద్విచక్ర వాహనాలు, పాదచారులు కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. ఆ దారిలోనే గ్రామస్థులు రాకపోకలు సాగిస్తారు. ✸ గాదెవారిగూడెం- ఊటుకూరు రహదారిపై అడుగుకో గుంత ఉంది. వరదలకు తారు కొట్టుకుపోయి కంకర రాళ్లు బయటపడ్డాయి. ఆ రోడ్డులో ప్రయాణించడంతో ఒళ్లు గుల్ల అవుతోందని ప్రజలు వాపోతున్నారు.

రెండు రోజుల్లో పూడ్చిస్తాం

వినగడప, కొత్తపల్లి, పెనుగొలను సమీపంలో ఆర్అండ్‌బీ ప్రధాన రహదారుల వెంట వరదలకు పడిన గండ్లను వెంటనే పూడ్చించాం. ఊటుకూరు-గాదెవారిగూడెం రహదారికి వారంలో అతుకుల పనులు చేయిస్తాం. చింతలనర్వ, మెట్టగుట్ట, కొణిజెర్ల గ్రామాల పరిధిలోని గండ్లు కూడా రెండు రోజుల్లో పూడ్చిస్తాం.
– అచ్చారావు, ఆర్అండ్‌బీ ఏఈ, గంపలగూడెం

ఉపాధి హామీ పథకం పనులపై అవగాహన

గంపలగూడెం, ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామ సభలను అధికారులు గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లో బుధవారం నిర్వహించారు. ఉపాధి పనులు, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న సిబ్బందిని సత్కరించారు. ఎన్ఆర్ఈజీఎస్ పనుల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎ.కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామసభలో తెదేపా మండలాధ్యక్షుడు జి.కృష్ణారెడ్డి, గంపలగూడెం మండలం గోసవీడు సభలో తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి కె.రజనీకాంత్ పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.


గోసవీడులో సిబ్బందిని సత్కరించిన అధికారులు, నాయకులు


కార్మికురాలు భారతిని సత్కరిస్తున్న కమిషనర్ లోవరాజు, సిబ్బంది

ఉత్తమ పారిశుద్ధ్య కార్మికురాలికి సన్మానం

తిరువూరు, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవా మాసోత్సవాలు సందర్భంగా తిరువూరు నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఉత్తమ పారిశుద్ధ్య కార్మికురాలిగా ఎంపికైన మోదుగు భారతిని కమిషనర్ జి.లోవరాజు ఆధ్వర్యంలో సన్మానించారు. పట్టణంలో పారిశుద్ధ్య పనుల్లో ఆమె నిబద్ధతతో బాధ్యతలు నిర్వహించారని ఆయన ప్రశంసించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా అన్న క్యాంటీన్ వద్ద సింహాచలం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పలువురు వార్డు కౌన్సిలర్లు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్‌కు సహకరించాలి

గుంటుపల్లి (ఇబ్రహీంపట్నం(గ్రామీణం), న్యూస్‌టుడే: సామూహిక పరిశుభ్రత కలిగి స్వచ్ఛ భారత్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలను సంస్థలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా కేంద్రం స్వచ్ఛత కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిందన్నారు. కార్మికులు, ఉద్యోగులు సామూహిక పరిశుభ్రత, మొక్కలు పెంచడం వంటి కార్యక్రమాలు విస్తృతంగా చేయాలన్నారు.



మాట్లాడుతున్న వర్క్‌షాపు మేనేజర్ శ్రీనివాస్


మాట్లాడుతున్న ఎం.నాగేశ్వరరెడ్డి

సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: గ్రామాలే దేశానికి పట్టు కొమ్మలని.. సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తోందని తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం రెడ్డిగూడెం మండల పరిషత్తు కార్యాలయంలో ఉపాధి హామీ పనులు గుర్తించి గ్రామసభ ద్వారా ఆమోదించడానికి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేసుకునే బాధ్యత ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచి ఎం.రాణి, ఉప సర్పంచి కె.వెంకటేశ్వరరావు(బాబు), తెదేపా నాయకుడు ఆర్.వీరాస్వామి నాయుడు, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దేవినేని ఉమా తదితరులు


ఎ.కొండూరు : పోలిశెట్టిపాడులో..


తిరువూరు : బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..


తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో..


గొల్లపూడిలో నివాళులర్పిస్తున్న శాసనసభ్యుడు కృష్ణప్రసాద్, నాయకులు

బాపూజీ బాటలో నడవాలి

న్యూస్‌టుడే బృందం : మహాత్మాగాంధీ లాంటి దేశభక్తి, నిజాయితీ, సేవా భావం కలిగిన మహనీయుడిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం గాంధీజీ జయంతిని పురస్కరించుకొని పలు కూడళ్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో బాపూజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


గంపలగూడెం : తునికిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో దాతల సాయంతో గాంధీ విగ్రహావిష్కరణ


ఇబ్రహీంపట్నంలో..


మైలవరం: తెదేపా కార్యాలయంలో..


మైలవరం : బార్ కార్యాలయంలో న్యాయవాదుల నివాళి


జి.కొండూరు: వెల్లటూరులో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

జామ చెట్టుకు దోమతెర

జామ చెట్టుకు దోమతెర ఏంటా అనుకుంటున్నారా..అవును నిజమే చెట్టుకు దోమతెర కట్టారు..కానీ దోమల నుంచి రక్షణకు కాదు.. వానరాల నుంచి కాపాడుకోవడానికి.. మండలంలోని పెనుగొలను శివారు చల్లగుండ్లవారిపాలేనికి చెందిన రైతు ఉయ్యూరు జమలారెడ్డి తన ఇంటి పెరట్లో పెంచుకుంటున్న జామ చెట్టుకు రుచికరమైన కాయలు కాస్తున్నాయి. గమనించిన కోతులు వాటిని కొరికి ఆగం చేస్తున్నాయి. దీంతో కాయలు వానరాలకు కనపడకుండా చెట్టు మొదలు నుంచి చివరి కొమ్మల వరకు దోమ తెర చుట్టూ కట్టేశారు.
– న్యూస్‌టుడే, గంపలగూడెం



మాజీ సర్పంచుల విగ్రహాల ఆవిష్కరణ

నెమలి(గంపలగూడెం): నెమలిలో మాజీ సర్పంచులు బెల్లం కృష్ణయ్య, బెల్లం నాగేశ్వరరావు విగ్రహాలను బుధవారం రాత్రి తెదేపా, వైకాపా నాయకులు ఆవిష్కరించారు. సోదరులైన వారిద్దరు గ్రామాభివృద్ధికి చేసిన కృషి, వారి రాజకీయ జీవితం ఆదర్శనీయమని వక్తలు కొనియాడారు. స్వాతంత్య్ర సమరయోధుడిగా, సర్పంచిగా కృష్ణయ్య.. సర్పంచిగా, నెమలి వేణుగోపాలస్వామి గుడి ఛైర్మన్‌గా నాగేశ్వరరావు అందించిన సేవలను స్మరించుకున్నారు. తెలుగు రైతు జిల్లాధ్యక్షుడు సీహెచ్.రాజేశ్వరరావు, మాజీ ఎంపీపీ వై.పుల్లయ్యచౌదరి, ఏఎంసీ మాజీ అధ్యక్షుడు డి.సీతారామ్‌ప్రసాద్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పి.కొండలరావు, తెదేపా మండలాధ్యక్షుడు ఆర్.వీరారెడ్డి, వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి నల్లగట్ల స్వామిదాసు, మాజీ సర్పంచి కె.వినయ్‌కుమార్, రాజవరం సొసైటీ మాజీ అధ్యక్షుడు సీహెచ్.శేషగిరిరావు, జడ్పీటీసీ కె.శామ్యూల్, ఖమ్మం జడ్పీ ఉపాధ్యక్షుడు కె.అజయ్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. తెదేపా గ్రామశాఖ అధ్యక్షుడు బెల్లం మధుసూదనరావు పర్యవేక్షణలో విగ్రహాల ఆవిష్కరణ జరిగింది.

జూదరుల అరెస్టు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట శివారులో బుధవారం సాయంత్రం జూదమాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.9,080 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.


జగన్నాత ప్రతిమ

దేవీ శరన్నవరాత్రోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలో గురువారం నుంచి ప్రారంభమయ్యే దేవీశరన్నవరాత్రోత్సవాలకు భక్తులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నెమలి, పెనుగొలను, వినగడప, ఊటుకూరు, గంపలగూడెం, మేడూరు, తోటమూల, ఆర్లపాడు, గోసవీడు తదితర గ్రామాల్లో ఉత్సవాల నిర్వహణకు జగన్మాత ప్రతిమలను భక్తులు కొనుగోలు చేశారు. ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నారు.


సిద్ధమైన మండపం


సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

పరిహారం అందజేతపై హర్షం

మైలవరం, న్యూస్‌టుడే: వరద బాధితులకు రూ.10 వేల చొప్పున పరిహారాన్ని ప్రభుత్వం సకాలంలో చెల్లించడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఎస్సీ ఏరియా కమ్యూనిటీ కేంద్రం వద్ద తెదేపా ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

'జోగి రమేష్ బంధువులమని జేసీబీ లాక్కున్నారు'

తాడేపల్లి, న్యూస్‌టుడే: విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఉండవల్లి నివాసంలో బుధవారం నిర్వహించిన 'ప్రజా దర్బార్'లో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన వారిని నేరుగా కలుసుకుని సమస్యలు తెలుసుకున్నారు. వారి నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యల పరిష్కారానికి భరోసా ఇచ్చారు. తన వద్ద ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరుకు చెందిన వైకాపా నేతలు వేములకొండ తిరుపతిరావు, సాంబశివరావు జేసీబీ అద్దెకు తీసుకున్నారని, బాడుగ సొమ్ము ఎగ్గొట్టడంతోపాటు మాజీ మంత్రి జోగి రమేష్ బంధువులమంటూ జేసీబీని స్వాధీనం చేసుకున్నారని ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లికి చెందిన తలారు రంగారావు వినతి పత్రం అందజేశారు. వారి దురాగతాలు భరించలేక ప్రాణ భయంతో ఇల్లు వదిలి పారిపోయామని వివరించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు.

'ఎమ్మెల్యే కొలికపూడిపై చర్యలు తీసుకోవాలి'

తిరువూరు: తాను ఏర్పాటు చేసుకున్న సమావేశానికి రాలేదన్న అక్కసుతో కుక్కలకు ఉన్న విశ్వాసం రైతులకు లేదని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడడం దారుణమని వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి నల్లగట్ల స్వామిదాసు మండిపడ్డారు. బుధవారం స్థానిక కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ..మహిళలు, పాత్రికేయులు, కర్షకులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అతనిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నగర పోలీసుల తొలి సారె సమర్పణ



పూజా కార్యక్రమంలో సీపీ రాజశేఖర్‌బాబు దంపతులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే దసరా మహోత్సవాలను పురస్కరించుకొని నగర పోలీసుల తరఫున సీపీ రాజశేఖర్ బాబు దంపతులు తొలి సారెను బుధవారం సంప్రదాయ పద్ధతిలో సమర్పించారు. వన్‌టౌన్ పోలీసుస్టేషను ప్రాంగణంలో రావి చెట్టు వద్ద దుర్గమ్మకు పోలీసు కుటుంబాలతో కలిసి సీపీ దంపతులు పూజ చేశారు. స్టేషను ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అక్కడి నుంచి మేళతాళాలతో అలంకరించిన రథంపై అమ్మవారికి సమర్పించే సారెను దుర్గగుడి టోల్‌గేటు వరకు తీసుకువచ్చారు. అక్కడి నుంచి కాలి నడకన వచ్చారు. దేవస్థానం ఈవో రామారావు, స్థానాచార్య శివప్రసాద శర్మ సారెను స్వీకరించారు. డీసీపీలు గౌతమి షాలి, ఉదయరాణి, ఉమమహేశ్వర రాజు, కృష్ణమూర్తి నాయుడు, హరికృష్ణ, ఏడీసీపీ రామకృష్ణ, పశ్చిమ ఏసీపీ దుర్గారావు, వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్ దంపతులు, పోలీసుల అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే ఉత్సవాలు విజయవంతం



మాట్లాడుతున్న కలెక్టర్ సృజన. పక్కన మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

విద్యాధరపురం, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే దసరా ఉత్సవాలను ప్రతి సెక్టారులోని అధికారులు, సిబ్బంది సమన్వయంతో విజయవంతం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన సూచించారు. తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో బుధవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. 26 సెక్టార్లలో పనిచేసే అధికారులు సిబ్బంది ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 9 గంటల వరకు, రాత్రి 9 నుంచి ఉదయం 7 గంటల వరకు మూడు షిఫ్టులుగా నియమించినట్లు తెలిపారు. జిల్లా అధికారులతోపాటు పోలీసు, పంచాయతీరాజ్, రెవెన్యూ, మున్సిపల్ కార్పొరేషన్, వైద్య ఆరోగ్యం, అగ్నిమాపక, దేవాదాయ శాఖలకు చెందిన అధికారులు సిబ్బంది ప్రత్యేక బృందాల్లో ఉంటారన్నారు. డ్యూటీ పాయింట్ల వద్ద విధులు నిర్వహించే వారు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే సమాచారాన్ని కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, డీఆర్వో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు

మా దుర్గమ్మ.. బంగారం



నల్లపూసల దండ

మంగళ సూత్రాలు

కిరీటాలు, హారాలు, పాదాలు

కాసులపేరు

పూల జడ

ముత్యాల హారం

వీణ

దసరా ఉత్సవాల్లో ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాతను దర్శించుకునేందుకు దేశ నలుమూలల నుంచి భక్తులు వేల సంఖ్యలో విచ్చేస్తుంటారు. శరన్నవరాత్రుల్లో దుర్గమ్మ తల్లిని దర్శించుకుంటే జీవితం తరిస్తుందని భావిస్తారు. అదే సమయంలో ఉత్సవాల్లో అమ్మవారి అలంకారాలు కూడా ప్రత్యేకతను సంతరించుకుంటాయి. ఇందుకోసం భక్తులు కానుకగా ఇచ్చిన ఆభరణాలతోపాటు సంప్రదాయంగా వస్తున్న వాటిని లోకాలను ఏలే తల్లికి అలంకరిస్తారు. ఆ అలంకారాల్లో ఏ ఆభరణాలు వినియోగిస్తారో తెలుసుకోవాలనే ఆసక్తి భక్తుల్లో ఉంటుంది. **బాలాత్రిపుర సుందరీదేవి:** అభయహస్తాలు, బంగారు పూలజడ, కంఠాభరణాలు, బంగారు వడ్డాణం. **గాయత్రీదేవి:** స్వర్ణ పంచముఖాలు, బంగారు అభయ హస్తాలు, పచ్చల హారం, కంఠాభరణాలు. **అన్నపూర్ణాదేవి :** స్వర్ణ పాత్ర, బంగారు త్రిశూలం, హస్తాలు. **లలితా త్రిపుర సుందరీదేవి :** స్వర్ణ కిరీటం, కంఠాభరణాలు, స్వర్ణాభరణాలు, అభయహస్తాలతో అలంకరిస్తారు. **మహాచండీ దేవి :** సింహవాహనం, కంఠాభరణాలు, ఖడ్గం, కర్ణాభరణాలు, హస్తాలు. **మహాలక్ష్మీదేవి :** గజరాజు, అభయ హస్తాలు, ధనరాశులు, వడ్డాణం, కంఠాభరణాలు, కర్ణాభరణాలు. **సరస్వతీదేవి :** బంగారు వీణ, స్వర్ణహస్తాలు, పగడాల హారం, వడ్డాణంతో అలంకరిస్తారు. **దుర్గాదేవి :** శార్దూల వాహనం, బంగారు త్రిశూలం, సూర్యచంద్రులు, శంకుచక్రాలు. **మహిషాసుర మర్దినిదేవి :** సింహ వాహనం, బంగారు త్రిశూలం, స్వర్ణ ఖడ్గం, కంఠాభరణాలు, కర్ణాభరణాలు. **రాజరాజేశ్వరిదేవి :** స్వర్ణాభరణాలు, అభయహస్తాలు, చెరకుగడతో అలంకరిస్తారు. కాసులపేరు, బంగారు పూలజడ, దేవిపాదాలు అమ్మవారి రూపాన్ని అనుసరించి వినియోగిస్తారు.

- న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి

నేటి అలంకారం

3-10-2024, గురువారం

శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి



" అరుణకిరణ జాలై రంజితా సావకాశా
విధృత జపవటీకా పుస్తకా భీతిహాసా
ఇతర వరకరాఢ్య పుల్లకల్హారసంస్థా
నివసతు హృదిబాలా నిత్యకళ్యాణశీలా"

దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో మొదటి రోజు జగన్మాత దుర్గాదేవి బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను ఆవహించి ఉండే శక్తి స్వరూపమే త్రిపుర అని త్రిపురతాపినీ ఉపనిషత్తు చెబుతోంది. 'స్వర్గ, భూ, పాతాళం' అనే త్రిపురాల్లో ఉండే శక్తి చైతన్యాన్ని త్రిపురగా వర్ణిస్తారు. శ్రీచక్రంలో ఉండే తొమ్మిది అమ్మయాల్లో మొదటి అమ్మయం త్రిపురసుందరీదేవియే. 'శ్రీ' విద్యలో మొదటి విద్య బాల అందుకే ఆధ్యాత్మిక విద్యను సాధన చేసేవారు మొదట బాల మంత్రాన్ని ఉపాసన చేయడం జరుగుతుంది. త్రిపుర సుందరీ దేవి అభయహస్తముద్రతో చేతిలో అక్షరమాల ధరించి ఉంటుంది. మనసు, బుద్ధి, అహంకారం ఆమె ఆధీనంలో ఉంటాయి. ఆమెను ధ్యానించడంతో సమస్త మనోవికారాలు తొలగి నిత్యసంతోషం కలుగుతుందని భక్తుల నమ్మకం. బాలాత్రిపుర సుందరీదేవిని అరుణవర్ణ వస్త్రాలు ధరించి ఎర్రని పూలతో పూజ చేసి కట్టెపొంగలిని నైవేద్యంగా సమర్పిస్తారు.

సైబర్ నేరగాళ్ల ఆటకట్టించమ్మా..!

విజయవాడ పోలీసుల వినూత్న ప్రచారం




'రా... దుర్గమ్మ దగ్గరకు రా' అని సైబర్ నేరగాడిని లాక్కుని వెళుతున్న పోలీస్ వేషధారి

విజయవాడ నేర వార్తలు, న్యూస్‌టుడే : 'దసరా ఉత్సవాల్లో పది రోజుల పాటు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే అమ్మవారి భక్తులకు సైబర్ నేరాలపై అవగాహన కలిగిస్తాం' పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ప్రకటించారు. బుధవారం సాయంత్రం సైబర్ నేరస్థులను అమ్మవారికి అప్పగించే వినూత్న కార్యక్రమం చేపట్టారు. నేరాలకు పాల్పడే వ్యక్తిని పట్టుకుని దుర్గమ్మ ఆలయానికి మేళతాళాల మధ్య తీసుకు వస్తూ 'దుర్గమ్మా.. సైబర్ నేరగాళ్ల ఆట కట్టించు అంటూ వేడుకున్నారు. కర్రలపై... నేరగాడిని, పోలీసు తీసుకుస్తున్న తీరు అందరినీ ఆకర్షించారు. డప్పుల హోరులో ఎత్తైన కాళ్లపై నడుచుకుంటూ వస్తున్న పోలీసు వేషధారి.. 'ఐ యామ్ సైబర్ సిటిజన్' అంటూ ప్లకార్డు పట్టుకోవడం ఆకట్టుకుంది. ఉత్సవాల సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ సైబర్ నేరాలపై అవగాహన కలిగించేలా సీపీ సమక్షంలో ప్లకార్డులు చేతపట్టి చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. వీరిని సీపీ అభినందించారు.

కనకదుర్గ పైవంతెన వైపు అనుమతి లేదు

గొల్లపూడి, న్యూస్‌టుడే: దసరా నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని భారీ, గూడ్స్ వాహనాలను విజయవాడ నగరం, కనకదుర్గ పైవంతెన వైపు అనుమతించడం లేదని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. గొల్లపూడి వైజంక్షన్ వద్ద నుంచి వాహనాలను మళ్లిస్తున్నట్లు వెల్లడించారు. ఏలూరు, గుంటూరు వైపు వెళ్లే వాహనాలు కబేళా, సీవీఆర్ పైవంతెన, పైపులరోడ్డు, రామవరప్పాడు మీదుగా వెళ్లాలని సూచించారు. ఇబ్రహీంపట్నం నుంచి గొల్లపూడి వరకు బోర్డులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.



వాహనాల మళ్లింపు వివరాల ఫ్లెక్సీ

రైళ్లన్నీ బెజవాడ వైపే..!



దేశం నలుమూలల నుంచి భక్తుల రాక

దసరా వేళ.. సౌకర్యాలు పెంచాలి

విజయవాడ, న్యూస్‌టుడే

బెజవాడలో నిర్వహించే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు దేశ నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. నిత్యం వందలాది రైళ్లు విజయవాడ మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. ఎక్కువ మంది వీటినే ఆశ్రయిస్తుంటారు. ఏ బండి చూసినా.. కిక్కిరిసిపోతుంది. రద్దీకి అనుగుణంగా ఇక్కడి స్టేషన్‌లో వసతులు పెంచాల్సి ఉంది. అరకొర సౌకర్యాలు ప్రయాణికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. జేబుదొంగల సమస్య అధికంగానే ఉంది. రైల్వే అధికారులు ఒకవైపు చర్యలు తీసుకుంటున్నా.. పూర్తి స్థాయిలో ఫలితాలు లభించడం లేదు.

రోజువారీ ప్రయాణికుల రాకపోకలు : సీజన్‌లో రెండు లక్షలు, అన్‌సీజన్‌లో లక్ష వరకు

రైళ్లు : 250కి పైగానే..

దొంగల భయం..

విజయవాడ రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కేందుకు వేచి ఉండే ప్రయాణికులకు దొంగల బెడద తప్పడం లేదు. కళ్లుమూసి తెరిచేలోపే.. బ్యాగులు, సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను చోరీ చేస్తున్నారు. బుకింగ్ కౌంటర్లలో హడావుడిగా టిక్కెట్లు తీసుకునే వారిని లక్ష్యంగా చేసుకుంటారు. వారి జేబులను కత్తిరించి, పర్సులు నొక్కేస్తున్నారు. అన్ని ప్లాట్‌ఫారాల్లోనూ ఇలాంటి పరిస్థితి నెలకొంది. ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.



అదనపు కౌంటర్లు అవసరం

ప్రధాన రిజర్వేషన్ కార్యాలయంలో.. దసరా పండగ పది రోజులూ అదనంగా కౌంటర్లు ఏర్పాటు చేయాలి. రద్దీ ఎక్కువ ఉంటున్నా.. కౌంటర్లు ఏర్పాటు చేయడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. అన్ని రైళ్లలో రిజర్వేషన్లు పూర్తవడంతో తత్కాల్ టికెట్లకు డిమాండ్ పెరిగింది. అవి పక్కదారి పట్టకుండా రైల్వే పోలీసులు నిఘా ఉంచాలి.



నాసిరక ఆహార పదార్థాలు

రైల్వేస్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫారాలలో నాసిరకం ఆహార పదార్థాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అధికారులు తనిఖీలు చేస్తున్నా పెద్దగా ఫలితాలు ఉండడం లేదు. మార్పు కనిపించడం లేదు. ప్రయాణికులు ఆర్థికంగా నష్టపోతున్నారు. అనారోగ్యంపాలవుతున్నారు. నాసిరకం దందాకు అడ్డుకట్ట వేయాలి.

తక్కువ ధరకే అందించాలి

రైలు ప్రయాణికుల్లో అత్యధిక శాతం పేద, మధ్య తరగతి వర్గాలే ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. ఆహార పదార్థాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. తక్కువ ధరకే అందించే 'జనాహార్' స్టాళ్లు ఎక్కువగా లేవు. దసరా రద్దీని దృష్టిలో పెట్టుకొని అన్ని ప్లాట్‌ఫారాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి.

అదనపు రైళ్లు నడపరూ..

దసరా, దీపావళి, క్రిస్మస్ పండగలను దృష్టిలో పెట్టుకొని అదనంగా ప్రత్యేక రైళ్లు నడపాలి. నిర్వహణ పనుల దృష్ట్యా రైల్వే శాఖ ఇప్పటికే ఉన్న వాటిలో కొన్నింటిని రద్దు చేసింది. రద్దీ ఎక్కువగా ఉండే ఈ సీజన్‌లో.. ప్రత్యేక రైళ్లు నడపడం ద్వారా ప్రయాణికులకు సౌకర్యావంతంగా ఉంటుంది. ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుంది. డిమాండ్ అధికంగా ఉండే హావ్‌డా, బెంగళూరు, సికింద్రాబాద్ మార్గాల్లో సర్వీసులు పెంచాలి.

నిలువ దోపిడీకి అడ్డుకట్ట పడేనా..

రైలు దిగి ఇంటికి చేరుకునే ప్రయాణికులను.. కొందరు ఆటో వాలాలు నిలువదోపిడీ చేస్తున్నారు. రైల్వేస్టేషన్ ట్రాఫిక్ బూత్‌లో సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో.. ఎక్కువ ధరలు వసూలు చేస్తున్నారు. అదేమని అడిగితే.. ఎదురు దాడి చేసే పరిస్థితులు ఇక్కడున్నాయి. డ్రైవర్లందరూ ఏకమై.. ప్రయాణికుల మీదకు వెళ్లి భయాందోళనలకు గురిచేస్తున్నారు. రాత్రి సమయాల్లో ఈ దోపిడీ తారస్థాయిలో ఉంటోంది.

ఉరకలెత్తిన ఉత్సాహం.. అడుగడుగునా నీరాజనం



స్కౌట్స్ విద్యార్థులతో చంద్రబాబు



పారిశుద్ధ్య కార్మికుల హర్షాతిరేకాలు



బాబుకు గజమాలతో సత్కారం

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొదటిసారి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మచిలీపట్నం రావడంతో తెదేపా శ్రేణులు, కూటమి నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. నగరంలోని ఆంధ్ర జాతీయ కళాశాలలో హెలీప్యాడ్ దిగిన దగ్గర నుంచి ప్రజావేదిక సభ నిర్వహించి తితిదే కల్యాణ మండపానికి వచ్చేవరకు రహదారి పొడవునా కూటమి నాయకులతోపాటు ప్రజలు విజయ సంకేతం చూపుతూ, నమస్కరించారు. చరవాణీలు పట్టుకుని చిత్రాలు తీస్తూ కనిపించారు. వేదిక వద్ద సభా ప్రాంగణం అంతా నిండిపోవడంతో మండపంలోని హాల్లో డిజిటల్ తెర ఏర్పాటు చేసి కుర్చీలు వేయగా అది కూడా నిండిపోయింది. ముఖ్యమంత్రి నగరంలో దీర్ఘకాలిక సమస్య అయిన డంపింగ్‌యార్డుతోపాటు కోనేరు సెంటరులో సుందరీకరణ పనులు పరిశీలించారు. స్వచ్ఛ కార్యక్రమాల్లో పాల్గొన్న స్కౌట్స్ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఐవీఆర్ఎస్ ద్వారా నగరంలోని సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇవ్వడంతోపాటు ప్రభుత్వ వైద్యకళాశాలకు పింగళి నామకరణం చేసేందుకు కృషి చేస్తామని చెప్పడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వివిధ సంస్థలు, ప్రజలు అందించిన అర్జీలను స్వీకరించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలోని వివిధ డివిజన్‌లలో పనిచేస్తున్న స్వచ్ఛ సేవకులను సత్కరించి, పురస్కారాలు అందజేశారు. పురస్కారాలు అందుకున్న కార్మికులు ప్రభుత్వతీరు, వారికి కల్పించిన వసతులపై చంద్రబాబు సమక్షంలోనే వెల్లడించారు.

ఆరోగ్య పరీక్షలు చేయించారు: దుర్గాప్రసాద్



నాలాంటి కార్మికులు వేలాది మంది విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో పనిచేశాం. అక్కడకు వెళ్లే ముందు వసతులు ఎలా ఉంటాయో అని ఆందోళన చెందాం. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో భోజనంతోపాటు అన్ని వసతులు కల్పించారు. అక్కడ ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతోపాటు, తిరిగి మచిలీపట్నం వచ్చిన తరువాత కూడా మళ్లీ పరీక్షలు చేశారు. ఇలా ముఖ్యమంత్రి కార్మికులతో ప్రత్యేక శ్రద్ధ చూపారు.

చంద్రబాబు లెజెండ్: శ్రీనివాసరావు



నేను 23 ఏళ్లుగా పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాను. వరద ప్రభావిత ప్రాంతాలను చూస్తే మాకే భయం వేసింది. అలాంటి చోట్ల ముఖ్యమంత్రి పర్యటించారంటే ఆయన పనితీరు అర్థం చేసుకోవచ్చు. వరద నీళ్లలో కూడా మావద్దకు వచ్చి తమ్ముళ్లూ ఎలా ఉన్నారని అడగడం ఎంతో సంతోషంగా ఉంది. నాకు 52 ఏళ్లు. అనేక అనారోగ్య సమస్యలున్నాయి. ముఖ్యమంత్రి వయసు 75 ఏళ్లయినా లెజెండ్‌లా పనిచేస్తున్నారు. మరో పదేళ్లపాటు ఆయనే ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటున్నాను.

కుటుంబసభ్యుల్లా చూశారు



తెల్లవారక ముందే లేచి నగరంలోని ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపడుతుంటాం. ఇబ్బంది అయినా సరే నగర పరిశుభ్రత కోసం కృషి చేస్తాం. అలాంటి మమ్మల్ని ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుల్లా చూడటం ఎంతో సంతోషంగా ఉంది. వరదల సమయంలో విజయవాడలో పనిచేయడానికి వెళ్లిన సమయంలో ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ, అన్ని వసతులు అందించేలా అధికారులను ఆదేశించారు. 75 ఏళ్ల వయసున్న వ్యక్తి నీళ్లలో తిరుగుతూ కన్న తండ్రి పిల్లలను కంటికి రెప్పలా కాపాడినట్లు ముఖ్యమంత్రి అలా ప్రజలను కాపాడుతూ వస్తున్నారు. అలాంటి ముఖ్యమంత్రి చేతుల మీదుగా స్వచ్ఛ పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉంది. **- ఝాన్సీలక్ష్మి**

భరోసా ఇచ్చారు



మచిలీపట్నం నుంచి 200 మంది వరకు పారిశుద్ధ్య కార్మికులు విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో సేవలు అందించేందుకు వెళ్లాం. కొత్త ప్రాంతమైనా సరే ముఖ్యమంత్రి ఇచ్చిన భరోసాతో పని కష్టమైనా ఇష్టంగా చేయగలిగాం. వరదల్లో ముఖ్యమంత్రి మా ముందు ఉండి నడిపించడం సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి ఇచ్చిన పిలుపుతో తెదేపా కార్యకర్తలు కూడా మాతోపాటు పనిచేశారు. అభివృద్ధి కోసం తపించే ముఖ్యమంత్రి చేతులమీదుగా పురస్కారం అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నాను. **- విజయలక్ష్మి**



సీఎం నుంచి స్వచ్ఛత అవార్డులు అందుకున్న పారిశుద్ధ్య కార్మికులు



రంగుల ముగ్గుతో స్వచ్ఛతా హీ సేవ అలంకారం



పారిశుద్ధ్య కార్మికురాలిని ఆప్యాయంగా పలకరిస్తూ..

ఆక్రమణలు తొలగించాలి

స్వచ్ఛ చల్లపల్లి కోసం పదేళ్లుగా నిరంతర కార్యక్రమాలు చేస్తున్నాం. అలా గ్రామాల్లో అందరూ ఐక్యంగా ఉంటూ స్వచ్ఛపల్లెల కోసం కృషి చేస్తే స్వచ్ఛభారత్ కల సాకారం అవుతుంది. డ్రైన్‌లను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం వల్ల ఏర్పడుతున్న సమస్యలను గుర్తించాం. వాటిని తొలగించి మురుగు పారేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడంతో పాటు అధికారికంగా చేపట్టే పనులకు నిధులు విడుదల చేయాలని కోరుతున్నాం. **- డీఆర్‌కే ప్రసాద్, స్వచ్ఛ చల్లపల్లి రథసారథి**



మేమున్నామని

వరద బాధితుల సహాయార్థం ఈనాడు రిలీఫ్ ఫండ్‌కు రూ.లక్ష విరాళం అందజేసిన కోనేరు ఛారిటబుల్ ట్రస్టు ప్రెసిడెంట్ కె.నరేంద్రబాబు, ట్రస్టు కార్యవర్గ సభ్యులు. - ఈనాడు, అమరావతి

పట్టభద్రులూ.. ఓటు నమోదు చేసుకోండి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదుకు నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. మండలాల్లో తహసీల్దార్, ఎంపీడీవో, రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో ఓటరు దరఖాస్తు ఫారం-18 పూర్తి చేసి.. విద్యార్హతలకు సంబంధించిన నకళ్లు గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించి ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. రెండు ఉమ్మడి జిల్లాల్లో 188 సహాయ ఓటరు నమోదు అధికారులు, 104 డిజిగ్నేటెడ్ అధికారులు, 119 అదనపు డిజిగ్నేటెడ్ అధికారులు అందుబాటులో ఉన్నారన్నారు. పట్టభద్రులు నవంబర్ 6వ తేదీ లోపు ఓటరు నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని చెప్పారు.

శరన్నవరాత్రుల్లో... శక్తి ఆరాధన..!

శరన్నవరాత్రులు... ఎటు చూసినా కోలాహలమే. అమ్మవారి పూజలూ కుంకుమార్చనలూ లలితాసహస్ర నామ పారాయణాలూ బొమ్మల కొలువులూ బతుకమ్మ పాటలూ దాండియా ఆటలూ గర్బా నృత్యాలతో... సందడే సందడి. వీటన్నింటి వెనకా ఉన్నది శక్తి ఆరాధనే... అంటే స్త్రీని శక్తిస్వరూపంగా భావించి భక్తిశ్రద్ధలతో పూజించడమే.



మహాబలసంపన్నుడైన మహిషాసురుడు బ్రహ్మకోసం ఘోరతపస్సు చేసి మరణం ఉండకూడదని వరం కోరతాడు. 'పుట్టిన వాళ్లు గిట్టక తప్పదు, కుదరదు' అన్నా ఆ అసురుడు పట్టు వదలడు. దాంతో నీ మరణానికి ఓ మార్గాన్ని విడవమంటాడు బ్రహ్మదేవుడు. స్త్రీని అబలగా భావించి... ఆమెవల్ల ఎలాంటి ప్రమాదమూ ఉండదనుకుని... పురుషుల చేతిలో మరణం లేకుండా చేయమని అడుగుతాడు. బ్రహ్మ 'సరే' అనడంతో తనకిక తిరుగులేదనుకుని విర్రవీగుతాడా రాక్షసుడు. అతని ఆగడాలు మితిమీరతాయి. ముల్లోకాల్నీ ముప్పుతిప్పలు పెడుతుంటాడు. దేవతలందరూ త్రిమూర్తులతో మొరపెట్టుకోగా... ఆ ముగ్గురి అంశతో ఆవిర్భవించిన జగన్మాత తొమ్మిది రోజులపాటు అలుపెరగకుండా పోరాడి ఆ మహిషుణ్ణి సంహరిస్తుంది. విజయం సాధిస్తుంది. అబల అనుకునే స్త్రీ... అవసరమైతే ఆదిశక్తిలా మారుతుందని చెబుతూ...స్త్రీ శక్తిలోని గొప్పదనాన్ని చాటుతూ... శరత్కాలంలో అమ్మవారిని భక్తితో కొలిచేవే శరన్నవరాత్రులు.

మహిషాసుర సంహారం... చెడుపై మంచి సాధించిన విజయం. గెలుపు ఎప్పుడూ ప్రకృతి హితం, లోక క్షేమం, సత్యం, అహింస, శౌచం, నీతి, నిగ్రహం, సామరస్యం, సౌమనస్యం... వంటి దైవిక భావాలతో నిండి ఉంటుంది. కాబట్టి వీటిని సంరక్షించడం మన కర్తవ్యం అని చెప్పడమే నవరాత్రుల్లోని దేవీ ఉపాసన వెనకున్న పరమార్థం.

అంతేకాదు, మనిషిని తమో, రజో, సత్వ అనే మూడు గుణాలు ప్రభావితం చేస్తాయి. తమోగుణం కుంగుబాటు, భయం, నిలకడలేని మనస్తత్వానికి దారితీస్తుంది. రజో గుణంతో ద్వేషం, వ్యామోహం కలుగుతాయి. సత్వగుణం ప్రకాశవంతమైనది. ప్రశాంతంగా ఉంటూనే చురుగ్గా ఆలోచిస్తాం. నవరాత్రుల్లో ఆ జగదాంబను పూజించడం ద్వారా తమో, రజో గుణాలను తగ్గించుకుని... సత్వగుణాన్ని పెంచుకోవాలి. ఇది ఉంటే విజయం వెన్నంటే ఉంటుంది.

నవ రూపాలు!

దుష్టసంహారంకోసం ఆదిశక్తి తొమ్మిది రూపాలు ధరించింది అన్నది పౌరాణిక కథనం. అందుకే ఏటా ఆశ్వీయుజ శుద్ధపాడ్యమి నుంచి నవమి వరకూ ఆ జగదాంబను బాలాత్రిపుర సుందరి, గాయత్రీదేవి, అన్నపూర్ణ, లలితాత్రిపురసుందరి, మహాచండి, మహాలక్ష్మి, సరస్వతీదేవి, దుర్గాదేవి, మహిషాసురమర్దని... ఇలా భిన్న రూపాల్లో అలంకరించి షోడశోపచారాలతో పూజిస్తారు. పదోరోజు రాజరాజేశ్వరీదేవిగా కొలుస్తారు. సాహసానికీ ఆత్మవిశ్వాసానికీ ప్రతిరూపంగా దుర్గాదేవినీ, సంపదకి లక్ష్మీదేవినీ, విద్యామూర్తి సరస్వతినీ మూడేసి రోజుల చొప్పున పూజించే ఆచారం చాలాచోట్ల కనిపిస్తుంది. ఉత్తరాదిన నవదుర్గల రూపాల్లో అర్చిస్తారు. ఇలా ఒక్కోచోట ఒక్కోరీతిలో పరాశక్తిని పూజిస్తారు. దేవాలయాల్లో మూల విగ్రహాన్నే రోజుకో రూపంలో అలంకరించడం అంతటా కనిపిస్తుంది. అంటే- దివ్యత్వం ఒక్కటే... భిన్న రూపాల్లో పూజిస్తున్నాం అన్నది గుర్తించాలి. అందుకే... బతుకమ్మ పాట పాడినా దాండియా ఆట ఆడినా గర్బా నృత్యం చేసినా అమ్మవారి ఆరాధనే. అంతటా శరన్నవరాత్రుల కోలాహలమే.

వసుంధర

vasundhara@eenadu.in



అనురాధ

ఎవరైనా... జీవితంలో తాము కోల్పోయిన బాల్యాన్ని గుర్తు చేసుకుంటే చాలు... బతుకు పాఠాలెన్నో నేర్చుకోవచ్చు. అవే తనని బాలకార్మిక నిర్మూలన దిశగా నడిపించాయి అంటారు అనురాధ భోసలే. చిన్నారులను చదువుల బాట పట్టించేందుకు, సామాజిక చైతన్యం తెచ్చేందుకు గత మూడు దశాబ్దాలుగా నిర్విరామంగా కృషి చేస్తున్నారీ సేవా మూర్తి. దసరా నవరాత్రుల సందర్భంగా బాలాత్రిపుర సుందరి రూపంలో ఈ స్త్రీ శక్తి కథ ఏంటంటే...

చంపుతానని... విరాళమిచ్చాడు!

'ఇప్పుడు నేను ఏ సమస్యలకు వ్యతిరేకంగా పోరాడుతున్నానో... అవన్నీ ఒకప్పుడు నేను అనుభవించినవే...వాటిని రూపుమాపడమే నా లక్ష్యం' అని చెబుతారు అనురాధ. ఆమె స్వస్థలం మహారాష్ట్రలోని శ్రీరామ్‌పూర్. ఆర్థికంగా వెనకబడిన కుటుంబం. తల్లిదండ్రులకు పన్నెండు మంది సంతానం. అందులో ఆమె సంఖ్య పదకొండు. కుటుంబాన్ని పోషించడానికి తండ్రి కూలికి వెళ్తే, తల్లి ఇళ్లల్లో పాచిపనులు చేసేది. ఇల్లు గడవక ఆ దంపతులు పిల్లల్నీ పనులకు పంపించేవారు. అలా అనురాధ కూడా ఓ ఇంట్లో పనికి కుదిరారు. చదువుకోవాలన్న తన కల తెలుసుకున్న ఆ ఇంటి యజమానులు ఆ అవకాశాన్ని తనకి కల్పించారు. అయితే, ఆ అదృష్టం కొన్నాళ్లే సాగింది. పదేళ్లు వచ్చేసరికి ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో ఆ కుటుంబం అహ్మద్‌నగర్‌లోని భోకార్‌కు వెళ్లిపోయింది.

చదువు వద్దన్నా...

ఈసారి బడికి వెళ్తానంటే ఇంట్లో వాళ్లు మాకు స్థోమత లేదన్నారు. కానీ, అనురాధ ఊరుకుంటే కదా! బడికి వెళ్లి టీచర్ల సాయం కోరడంతో.. ఆమె పరిస్థితి అర్థం చేసుకున్నారు. వాళ్లే ఫీజుకట్టి వసతిగృహంలో చేర్చారు. పాఠశాల చదువు పూర్తయ్యాక కాలేజీ చదువుకోసం మళ్లీ పోరాటం చేయక తప్పలేదు. స్థానికంగా ఉండే చర్చి సాయంతో దాన్ని కొనసాగించారు. ఆ సమయంలోనే కొందరు బాలకార్మికుల్ని చూసి ఒకప్పటి తన పరిస్థితిని గుర్తు తెచ్చుకున్నారు. ఓ స్వచ్ఛంద సంస్థలో చేరి బడికెళ్లని పిల్లల్ని బడి బాట పట్టించడం ఆరంభించారు. సామాజిక సేవలోనే తన భవిష్యత్తుని ఊహించుకున్న ఆమె సోషల్‌వర్క్‌లో పీజీ చేయాలనుకున్నారు. అయితే, అనురాధకు ఇంగ్లిష్‌పై పట్టులేదన్న కారణంతో కాలేజీ సీటు నిరాకరించింది. కానీ, ఆమె మాత్రం 'అవకాశం ఇస్తే నేర్చుకుంటానని' యాజమాన్యాన్ని ఒప్పించారు. పీజీ అయ్యాక పుణెలోని ఓ కార్పొరేట్ కంపెనీలో సీఎస్ఆర్ విభాగంలో విధుల్లో చేరారు. అందులో భాగంగా 124 గ్రామాల్లో చేపట్టిన పారిశుద్ధ్య, పర్యావరణ ప్రాజెక్టు పనులను చేపట్టారు.

వలస కుటుంబాల గుర్తింపు...

తరవాత ప్రేమ, పెళ్లి, పిల్లలు... కానీ, కొన్నాళ్లకే వైవాహిక జీవితంలోనూ ఒడుదొడుకులు చూశారామె. ఆ తరవాతే ఉద్యోగాన్ని వదిలేసి సేవాభావం ఉన్న డాక్టర్ అరుణ్ చవాన్‌తో కలిసి 1995లో 'అవని-విమెన్ అండ్ చైల్డ్ రైట్స్' పేరుతో ఓ ఎన్జీవో స్థాపించారు. మొదట్లో ఈ సంస్థ వలస కుటుంబాలను గుర్తించి వారికి మైక్రోఫైనాన్స్ చేసేది. తరవాత క్రమంగా బడికి దూరమైన పిల్లలకోసం పాఠశాలల్ని నిర్మించింది. ఈ క్రమంలోనే బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం రాజకీయంగా, ఆర్థికంగా బలపడిన ఎందరితోనో పోరాటం చేసింది. 'కాఫీ హోటళ్లు, మెకానిక్ షెడ్లు, ఇటుక బట్టీలు... ఇలా చాలాచోట్ల బాలకార్మికులు కనిపించేవారు. పిల్లలతో బిచ్చమెత్తించే మాఫియాల్నీ గుర్తించి పిల్లలకు విముక్తి కల్పించా. వీళ్లకి పునరావాసం, చదువుకునేందుకు పాఠశాల్ని స్థాపించాం. అయితే, ఇవన్నీ అంత సులువుగా ఏమీ జరగలేదు. ఈ క్రమంలో కొందరు వ్యక్తులతో తీవ్రంగా ఘర్షణ పడాల్సి వచ్చేది. అలా ఓసారైతే నన్ను చంపుతామనీ బెదిరించారు. తరవాత పోలీసులు, ప్రభుత్వ సహకారంతో వారికి కౌన్సెలింగ్ చేయడంతో మార్పు వచ్చింది. ఆ వ్యక్తి తరవాత బడి నిర్మాణానికి 7 వేల ఇటుకలు విరాళంగా ఇచ్చారు' అని చెబుతారు అనురాధ. మరోపక్క స్త్రీలకు నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పన కేంద్రాలు, వారి పిల్లలకు డేకేర్ సెంటర్లు ఏర్పాటు చేశారు. 'కోట్లు సంపాదించినా రాని సంతృప్తి.. ఒక్కరినైనా ప్రమాదంలో పడకుండా కాపాడగలిగాం అన్నప్పుడు కలుగుతుంది. ఇదే నన్ను ముందుకు నడిపిస్తోంది' అంటారామె.

అత్యుత్తమ స్థానంలో ఆమె!

ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్‌కి డైరెక్టర్ జనరల్ (డీజీఏఎఫ్ఎంఎస్)గా ఎంపికయ్యారు వైస్ అడ్మిరల్ ఆరతీ సరీన్. ఆ హోదాను అందుకున్న తొలి మహిళా ఆఫీసర్ ఆవిడ. 45మంది మగవాళ్ల తరవాత ఆమె ఈ స్థానాన్ని అధిరోహించారు. డీజీగా త్రివిధ దళాల మెడికల్ సర్వీసెస్‌కి నాయకత్వం వహిస్తారు. రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలో సాయుధ దళాలకు సంబంధించిన మెడికల్ పాలసీలను పర్యవేక్షిస్తారీమె. భారత సాయుధ దళాల చరిత్రలోనే అత్యున్నత స్థాయి మహిళా అధికారిణి ఆరతి. ఈవిడది నేవీ నేపథ్యమున్న కుటుంబం. నాన్న 41 ఏళ్లు, సోదరుడు 30 ఏళ్లు సేవలు అందించారు. వాళ్ల స్ఫూర్తితో ఈమె కూడా రక్షణ రంగంలోకి అడుగుపెట్టారు. విశాఖపట్నంలో స్కూలింగ్ పూర్తయ్యాక పుణెలోని ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ కాలేజ్‌లో వైద్యవిద్యలో చేరారు. రేడియాలజీలో ఎండీ, రేడియేషన్ అంకాలజీలో పట్టానీ పొందారు. యూనివర్సిటీ ఆఫ్ పిట్స్‌బర్గ్‌లో 'గామా నైఫ్ సర్జరీ'లో శిక్షణనీ తీసుకున్నారు. ఈవిడ క్యాన్సర్ స్పెషలిస్ట్.

38ఏళ్ల కెరియర్ ప్రస్థానంలో త్రివిధ దళాల్లో పనిచేసిన ఘనత ఆరతిది. ఆర్మీలో లెఫ్టినెంట్ నుంచి కెప్టెన్ స్థాయికి ఎదిగారు. నేవీలో సర్జన్ వైస్ అడ్మిరల్‌గా... ఎయిర్‌ఫోర్స్‌లో ఎయిర్ మార్షల్‌గా పనిచేశారు. కోల్‌కతా ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో ట్రైనీ డాక్టర్ అత్యాచార ఘటన గుర్తుండే ఉంటుందిగా! దాన్ని సుప్రీంకోర్టు సుమోటోగానూ తీసుకుంది. వైద్య నిపుణులకు సురక్షిత వాతావరణం, ప్రోటోకాల్స్ రూపకల్పన కోసం ఓ టాస్క్‌ఫోర్స్ కమిటీనీ రూపొందించింది. దానిలో ఆరతి కూడా సభ్యురాలు. తన పనితీరుతో ఎన్నో పురస్కారాలను అందుకున్న ఆరతి ఈ ఏడాది రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అతి విశిష్ట సేవా మెడల్‌నీ అందుకున్నారు. 'నారీశక్తికి ఈమె ప్రతీక' అంటూ రక్షణ శాఖ కొనియాడటమే కాదు... ఈవిడని రక్షణ రంగంలోకి రావాలనుకునే యువతులకు స్ఫూర్తిగానూ పేర్కొంది.



ఆరతి



శక్తిరూపం

మనశ్శాంతినిచ్చే బాలాత్రిపుర సుందరి!

ముద్దులొలికే తొమ్మిదేళ్ల బాలిక రూపంలో ఉంటుంది బాలా త్రిపుర సుందరి అమ్మవారు. మన మనసు, బుద్ధి, చిత్తం, అహంకారాలు ఆమె ఆధీనంలోనే ఉంటాయి. శ్రద్ధగా కోరితే మానసిక బాధలన్నీ తొలగించి, సౌఖ్యాన్ని ఇస్తుందని చెబుతారు. ఈమె పుట్టుక వెనక బ్రహ్మాండ పురాణంలో ఓ కథ ఉంది. పూర్వం భండాసురుడు అనే రాక్షసుడు తపస్సు చేసి మరణం లేకుండా వరం పొందాడు. అతని 30 మంది పిల్లలతో కలిసి లోకాలను హింసించడం మొదలుపెట్టాడు. అతని ఘోరాలను తట్టుకోలేని దేవతలు శ్రీమహావిష్ణువును ఆశ్రయిస్తారు. ఆయనేమో అతన్ని అంతమొందించడం ఆదిపరాశక్తి చేతిలో ఉందని చెబుతాడు. వాళ్ల శరణు విన్న లలితా త్రిపుర సుందరి యుద్ధానికి బయల్దేరుతుంది. కానీ భండాసురుడు తన కుమారులను యుద్ధానికి పంపుతాడు. అమ్మ కదా... పిల్లలపై యుద్ధానికి ఎలా వెళ్లగలదు? అందుకని తన కనుబొమ్మల మధ్యనుంచి బాలా సుందరిని సృష్టిస్తుంది. ముద్దులొలుకుతున్న ఆ చిన్నారిని చూసి మురిసిపోయి, తన ఆయుధాలను ఇచ్చి యుద్ధానికి పంపుతుంది. కన్యక అనే హంసలు లాగే రథంపై వెళ్లిన ఆ అమ్మాయి రాక్షసులందరినీ మట్టుపెడుతుంది. చిన్నపిల్లలను మచ్చిక చేసుకోవడం తేలిక అంటారు కదా... ఈ అమ్మవారిని భక్తితో కోరితే త్వరగా ప్రసన్నమవడమే కాదు... జ్ఞానం, సంపదలను అనుగ్రహిస్తుందట. నవరాత్రుల్లో ఒక్కోరోజు ఒక్కో రూపంలో దర్శనమిచ్చే అమ్మవారు ఈసారి మొదటిరోజున బాలాత్రిపుర సుందరిగా దర్శనమిస్తున్నారు. ఆమె అనుగ్రహం పొందడానికి చాలాచోట్ల పాడ్యమినాడు చిన్నపిల్లలను ఆ రూపంలో తయారుచేసి కొలవడమూ కనిపిస్తుంది.

ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్, టెలిగ్రాంల ద్వారా పంపవచ్చు.

బంగారం వెండి



2న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం (24క్యా)	78,270	78,180	------	75,242
ఆర్నమెంట్	71,800	71,300	------	70,500
వెండి (కిలో)	92,790	92,920	------	92,700
	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం (24క్యా)	77,450	77,300	77,480	77,480
ఆర్నమెంట్	71,720	71,580	71,130	71,130
వెండి (కిలో)	91,000	91,200	93,200	93,200
	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం (24క్యా)	77,180	76,630	------	------
ఆర్నమెంట్	71,000	70,500	7,100	7,050 గ్రా
వెండి (కిలో)	92,000	93,000	101.00	101.00 గ్రా

జారి పడిపోకుండా...

బాత్రూమ్‌లో జారిపడి దెబ్బలు తగిలించుకోవటం... ఎముకలు విరగ్గొట్టుకోవడం... చాలామంది పెద్దవాళ్లకు ఎదురయ్యే అనుభవాలే ఇవి. ఏదైనా పట్టుకుని నడిచే వీలుంటే ఆ ఇబ్బంది ఉండదు కదా! అందుకే 'యాంటీ స్లిప్ గ్రాబ్ బార్' తెండి. దీన్ని గోడకు పెట్టి, వాటికి ఉన్న బటన్లను లాక్ చేస్తే చాలు. గోడకు బిగుసుకుపోతుంది. కొన్ని సీలలు కొట్టకుండా అతికించుకునేవీ వస్తున్నాయి. వాటిని అంటించినా చాలు. పెద్దవాళ్లు వాటిని పట్టుకుని జాగ్రత్తగా నడుస్తారు. పడిపోకుండానూ ఉంటారు. వీటిలో సైజులు ఉన్నాయి. అనువైన వాటిని ఎంచుకుంటే చాలు. పెద్దవాళ్లకు సాయమందిస్తూ భలేగున్నాయి కదూ! మీవాళ్లకీ అవసరమనిపిస్తోందా... ఇంకేం ఆన్‌లైన్‌లో వెతికేయండి మరి!



ఉద్యోగ, వ్యాపారాలు చేసే తల్లులకు పిల్లల పెంపకం సవాలే. పిల్లలకు అవసరమైనప్పుడు అందుబాటులో లేకపోతే తల్లి పాత్రకు న్యాయం చేయలేకపోతున్నామనే అపరాధ భావన కలుగుతుంది. ఈ సమస్యను అధిగమించడం గురించి పెప్సీకో మాజీ సీఈఓ ఇంద్రా నూయి ఏం సూచిస్తారంటే...



పిల్లల బాధ్యతను తండ్రులకీ పంచండి!

పెరిగే పిల్లలకు అమ్మగా, కంపెనీ ఎగ్జిక్యూటివ్‌గా ఉండటమంటే రెండు పూర్తిస్థాయి ఉద్యోగాలు చేస్తున్నట్టే! అలాంటప్పుడు మన కంటూ అసలు సమయమే ఉండదు, కానీ అందుకు వీలు కల్పించుకోవాలని చెబుతారు ఇంద్ర. అమ్మ పాత్ర పోషించడమంటే మన ప్రాధాన్యాల్ని వెనక్కి నెట్టేయడం కాదు.. అవకాశం దొరికినప్పుడల్లా మన కోసం కొన్ని పనులు చేసుకోమంటారు.

- తల్లులకు తమకంటూ టైమ్ దొరకడం కష్టమే. కానీ పిల్లలతో పార్కుకు, షాపింగ్‌కు, బ్యూటీ పార్లర్, స్పాలకు వెళ్తే సమయాన్ని సద్వినియోగం చేసుకోవచ్చంటారు. ఒకేలాంటి హాబీ ఉన్న కుటుంబ సభ్యులతో సమయం గడపమంటారు.
- ఆఫీసు నుంచి రోజూ అనుకున్న సమయానికి రాలేకపోవచ్చు. అలాగని వచ్చేంతవరకూ పిల్లల అవసరాలు ఆగవుగా, అందుకే అమ్మ అందుబాటులో లేకపోతే నాన్న సాయం తీసుకోవడం పిల్లలకు అలవాటు చేయాలంటారు. 'అలాగైతే లేనిపోని హైరానా ఉండదు, అలసి వచ్చినప్పుడు కాస్త విశ్రాంతీ దొరుకుతుంది' అనేది ఆమె సూచన.
- మాతృత్వ, పితృత్వ సెలవుల్ని పొడిగించడమంటే సమస్యను వాయిదా వేయడమేనంటారు ఇంద్ర. అలాగని పిల్లల్ని ఇంటి దగ్గర వదిలి వెళ్లినా పనిమీద దృష్టి పెట్టలేం! ఆఫీసు దగ్గరే ప్లేస్కూల్ చూసుకోవడం, వీలైతే ఫ్లెక్సిబుల్ పనివేళల్ని ఎంచుకోవడం ద్వారా సమస్యని అధిగమించవచ్చంటారు.
- పిల్లల పెంపకంలో తండ్రులదీ సమాన బాధ్యతనే విషయాన్ని గుర్తించాలనీ, దీనిపై జీవిత భాగస్వామికీ అవగాహన ఉండాలనీ చెబుతారు. ఒకరు స్కూల్‌కి దిగబెడితే, మరొకరు తీసుకొచ్చేలా. ఒకరు ఉదయం వారి బాగోగులు చూసుకుంటే, మరొకరు సాయంత్రం చూసుకునేలా ఉండాలనేది ఆమె సూచన.

నవరాత్రులు... నవరంగులు!

అమ్మవారిని నవరాత్రుల్లో ఒక్కో అవతారంలో పూజిస్తుంటారు కదా! అయితే, కొన్ని ప్రాంతాల్లో రూపానికి తగినట్లుగా తొమ్మిది రోజులూ తొమ్మిది రంగుల దుస్తులను ధరించి భక్తులు దుర్గామాతను కొలుస్తారు. అవేంటంటే...



మొదటిరోజు: శైలపుత్రి

ఈరోజు పర్వతపుత్రికని తెలుపురంగు దుస్తులు ధరించి పూజిస్తారు. తెలుపు స్వచ్ఛతకీ, నిజాయతికీ గుర్తు. ఇది మనలో ప్రశాంతతను కలిగిస్తుందట.

రెండోరోజు: బ్రహ్మచారిణి

ఈరోజు ఆకుపచ్చరంగు దుస్తులు ధరిస్తారు. ఇది ప్రకృతికీ, సంతానానికీ, శాంతికీ, వృద్ధికీ, ప్రశాంతతకూ ప్రతీక అట.

మూడోరోజు: చంద్రఘంట

నవరాత్రి మూడోరోజున చంద్రఘంట రూపంలో అమ్మవారిని పూజిస్తారు. ఈ రంగు సమతుల భావోద్వేగాలకు ప్రతీక. మనలోని కోపం, బాధ, సంతోషం...లాంటి భావోద్వేగాలు అదుపులో ఉండాలని దీని అంతరార్థం.

నాలుగోరోజు: కూష్మాండ

దేవిని ఈరోజు నారింజ రంగు దుస్తులు వేసుకుని పూజిస్తారు. ఈ రంగు మనలో ఉల్లాసాన్నీ, సానుకూల దృక్పథాన్నీ, ఉత్సాహాన్నీ నింపుతుంది.

ఐదో రోజు: స్కందమాత

పసుపు రంగు సంతోషానికీ, ఆశకీ, కాంతికీ చిహ్నమట.

ఆరోరోజు: కాత్యాయని

ఎరుపు రంగు ధైర్యసాహసాలకు చిహ్నం. విజయానికి ప్రతీక. మనలో అంతులేని శక్తిని నింపుతుందట.

ఏడోరోజు: కాళరాత్రి

నీలి వర్ణం ముక్తినీ, గాంభీర్యాన్నీ సూచిస్తుంది. ఈ రంగు దుస్తుల్లో అమ్మవారిని పూజించడం వల్ల మనలో స్థిరత్వం, ప్రశాంతత కలుగుతాయి..

ఎనిమిదోరోజు: మహాగౌరి

గులాబీరంగు ప్రేమ, ఆప్యాయత, సామరస్యాలను సూచిస్తుంది. మనోహరంగా ఉండి, బంధాలను మరింత దగ్గర చేస్తుంది.

తొమ్మిదోరోజు: సిద్ధిధాత్రి

ఊదా రంగు దుస్తులు ధరించడం ద్వారా జ్ఞానోదయం, విలాసం, వైభవం, శ్రేష్ఠత లభిస్తాయి. సకల సంపదలూ, ఐశ్వర్యాలూ కలుగుతాయని భావిస్తారు.

ఇలా దుస్తులే కాదు, ఇంటినీ, మందిరాన్నీ ఈ రంగుల పూలు, ఆకులతోనూ ఈ తొమ్మిదిరోజుల పాటు అలంకరిస్తారట. తద్వారా మనసంతా సానుకూల ఆలోచనలతో ఉండాలన్నదే వీటన్నింటి పరమార్థమట.

ఔషధాల గునుగు...!



ప్రకృతి పచ్చగా కళకళలాడుతున్నప్పుడు వచ్చే పూల పండుగే బతుకమ్మ. దసరా నాటికి పడ్డ వర్షాలతో బీడుభూముల్లో పూల తివాచీలా పరచుకుంటాయి గునుగు పూల మొక్కలు. ఇవి పేరుకి గడ్డి జాతి పువ్వులే కానీ బతుకమ్మ అలంకరణలో శోభంతా వీటిదే. గాలికి ఊగుతూ తెలుపు, గులాబీ రంగులతో మెరిసిపోతూ కనువిందు చేస్తాయివి. గునుగు పూలను ప్రపంచవ్యాప్తంగా అలంకరణకోసం ఉపయోగిస్తారు. ఈ పూల మొక్కకు ఔషధ గుణాలు ఎక్కువే. ముఖ్యంగా యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ డయాబెటిక్, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు దీనిలో పుష్కలంగా ఉంటాయి. వీటి ఆకులు చర్మంపై గాయాలు, పుండ్లను తగ్గించగలవట. అధిక రక్తపోటుని నియంత్రించగలవట. యూరినరీ ఇన్ఫెక్షన్లు, మలబద్ధకం నివారణలోనూ ఈ మొక్క ఉపయోగపడుతుందని చెబుతోంది ఆయుర్వేదం.

● మహిళల టీ20 ప్రపంచకప్‌లు ఎనిమిది జరిగితే.. అందులో ఆరు ఆస్ట్రేలియానే సొంతం చేసుకుంది. ఈ ఆరు విజయాల్లోనూ భాగస్వామి అయిన ఆల్‌రౌండర్ ఎలీస్ పెర్రీ.. ఈసారి కూడా బరిలోకి దిగుతోంది.

● ఇప్పటివరకు జరిగిన అన్ని టీ20 ప్రపంచకప్‌లు ఆడిన భారత్ ఒకసారి ఫైనల్ (2020) చేరింది. నాలుగుసార్లు సెమీస్ (2009, 10, 18, 23)లో ఇంటిముఖం పట్టింది. మూడుసార్లు (2012, 14, 16) తొలి రౌండ్లోనే నిష్క్రమించింది.

ఛాంపియన్

43 టీ20 ప్రపంచకప్‌లో అత్యధికంగా దక్షిణాఫ్రికా ఫాస్ట్‌బౌలర్ షబ్నం ఇస్మాయిల్ సాధించిన వికెట్లు.

1066 న్యూజిలాండ్ బ్యాటర్ సుజీ బేట్స్ టీ20 ప్రపంచకప్‌లో సాధించిన పరుగులు. టోర్నీ టాప్‌స్కోరర్ ఆమే.

క్రికెట్ అభిమానులను అలరించడానికి మరో పెద్ద టోర్నీ వచ్చేసింది. ఆటలో వేగం, ఆసక్తిని పెంచి.. అంతకంతకూ ఆదరణనూ పెంచుకుంటున్న అమ్మాయిలు.. టీ20 ప్రపంచకప్ కోసం అమీతుమీకి సిద్ధమయ్యారు. మూడు నెలల కిందటే రోహిత్ సేన పొట్టి కప్పును చేజిక్కించుకోవడంతో భారత అభిమానుల ఆనందానికి అవధులు లేకపోయాయి. ఇప్పుడు అమ్మాయిలూ అదరగొట్టేయాలని.. ఇప్పటిదాకా అందుకోలేకపోయిన ప్రపంచకప్‌ను సాధించి కల నెరవేర్చుకోవాలని అభిమానులు ఆశిస్తున్నారు. కానీ అదంత తేలిక మాత్రం కాదు.




నేటి నుంచే మహిళల టీ20 ప్రపంచకప్

అమ్మాయ్.. అదరగొట్టేయ్!

తొలి పోరులో బంగ్లాదేశ్ × స్కాట్లాండ్

షార్జా

అబ్బాయిలైనా, అమ్మాయిలైనా పరిమిత ఓవర్ల క్రికెట్లో తలపడితే అభిమానుల్లో ఉండే ఆసక్తే వేరు. అందులోనూ టీ20లంటే మరింత మజా. అందులో ప్రపంచకప్ అంటే టోర్నీ జరుతున్నన్ని రోజులు టీవీలకు అతుక్కుపోవాల్సిందే. మూణ్నెల్ల కిందట వెస్టిండీస్ వేదికగా జరిగిన పురుషుల టీ20 ప్రపంచకప్ భారత అభిమానులకు చిరస్మరణీయ జ్ఞాపకం. ఇప్పుడు యూఏఈలో మహిళల పొట్టి కప్పు మొదలవుతోంది. గురువారం తొలి మ్యాచ్‌లో ఆతిథ్య హోదాలో బంగ్లాదేశ్.. స్కాట్లాండ్‌ను ఢీకొంటోంది. ఆ తర్వాత మరో మ్యాచ్‌లో పాకిస్థాన్, శ్రీలంక తలపడతాయి. ఎప్పట్లాగే టోర్నీలో భారత జట్టు ఎన్నో ఆశలతో బరిలోకి దిగుతోంది. రెండుసార్లు వన్డేల్లో, ఓసారి టీ20ల్లో ఫైనల్ చేరినా కప్పు ఒడిసిపట్టలేకపోయిన భారత జట్టు.. ఈసారైనా కల నెరవేర్చుకోవాలని అనుకుంటోంది. అయితే ఈసారి ఫార్మాట్ చూస్తే సెమీస్ చేరడం అంత తేలిక కాదనిపిస్తోంది. భారత్ ఉన్న గ్రూప్-ఎలో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, పాకిస్థాన్, శ్రీలంక ఉన్నాయి. ఆరుసార్లు ఛాంపియన్ ఆస్ట్రేలియా సంగతి చెప్పాల్సిన పని లేదు. మిగతా జట్లతోనూ అంత తేలిక కాదు. కాబట్టి గ్రూప్ దశలో టాప్-2లో నిలవాలంటే హర్మన్‌ప్రీత్ సేన ఎంతో నిలకడగా ఆడాలి. అయితే భారత జట్టు ప్రస్తుతం గతంలో ఎన్నడూ లేనంత బలంగా ఉందన్నది వాస్తవం. కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కు తోడు స్మృతి మంధాన, షెఫాలి వర్మ, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్ లాంటి నాణ్యమైన బ్యాటర్లు జట్టు సొంతం. దీప్తి శర్మ, పూజ వస్త్రాకర్ బంతితో, బ్యాటుతో సత్తా చాటగలరు. రేణుక సింగ్, అరుంధతి రెడ్డి, రాధ యాదవ్, ఆశ శోభనలతో మిగతా బౌలింగ్ విభాగమూ బాగుంది. యూఏఈ పిచ్‌లు స్పిన్‌కు అనుకూలంగా ఉంటాయన్న సంగతి తెలిసిందే. భారత స్పిన్ విభాగం బలంగా ఉండడం.. బ్యాటర్లు స్పిన్‌ను బాగా ఆడగల సమర్థులే కావడం కలిసొచ్చే అంశం. అయితే ఏ మ్యాచ్‌నూ తేలిగ్గా తీసుకోకుండా సమష్టిగా, ఉత్తమ ప్రదర్శన చేస్తే కప్పు కలను నెరవేర్చుకోవచ్చు. భారత్ శుక్రవారం తన తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌ను ఢీకొంటుంది. ఆదివారం భారత్, పాకిస్థాన్ పోరు జరుగుతుంది.



ఎలీస్ పెర్రీ

ఆస్ట్రేలియా × మిగతా జట్లు: పురుషుల క్రికెట్లోనే కాదు.. మహిళల్లోనూ ఆస్ట్రేలియాదే పైచేయి. ఇంకా చెప్పాలంటే అక్కడ కంగారూ జట్టు ఆధిపత్యం ఇంకా ఎక్కువ. ఇప్పటిదాకా ఎనిమిది పొట్టి కప్పులు జరిగితే.. ఆరుసార్లు ఆ జట్టే విజేతగా నిలిచిందంటే దాని దూకుడు ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. ఈసారి కూడా హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది ఆస్ట్రేలియా. మేటి ఆల్‌రౌండర్ ఎలీస్ పెర్రీతో ఆష్లీ గార్డ్‌నర్, తాలియా మెక్‌గ్రాత్, అలీసా హీలీ, బెత్ మూనీ, అనాబెల్ సదర్లాండ్, అలయానా కింగ్, మెగాన్ షట్ లాంటి అగ్రశ్రేణి క్రికెటర్లతో ఆస్ట్రేలియా ఎంతో బలంగా కనిపిస్తోంది. ఆ జట్టుకున్న ఆల్‌రౌండ్ బలం మరే జట్టుకూ లేదు. తనది కాని ఏదో ఒక రోజు తప్ప ఆస్ట్రేలియా ప్రత్యర్థులకు అంత సులువుగా లొంగదు. గ్రూప్-ఎ నుంచి ఆస్ట్రేలియా సెమీస్ చేరడం ఖాయం. రెండో స్థానం భారత్‌దే కావచ్చు. అయితే టీమ్‌ఇండియా అయినా, మరో జట్టయినా.. ఆస్ట్రేలియాను దాటి కప్పు గెలవడం అంత తేలిక కాదు. అందుకోసం అసాధారణ ప్రదర్శన చేయాలి.

ఫార్మాట్ ఇలా..

టోర్నీలో పోటీ పడుతున్న పది జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్‌లోనూ ప్రతి జట్టూ మిగతా నాలుగు జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. లీగ్ దశ ముగిసేసరికి తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి. గ్రూప్-ఎలో భారత్, పాకిస్థాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, శ్రీలంక ఉన్నాయి. ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, బంగ్లాదేశ్, స్కాట్లాండ్ గ్రూప్-బిలోని జట్లు.

మహిళల టీ20 ప్రపంచకప్ షెడ్యూల్

తేదీ	మ్యాచ్	సమయం	వేదిక
అక్టోబరు			
3	బంగ్లాదేశ్ × స్కాట్లాండ్	మ. 3.30	షార్జా
	పాకిస్థాన్ × శ్రీలంక	రా. 7.30	షార్జా
4	దక్షిణాఫ్రికా × వెస్టిండీస్	మ. 3.30	దుబాయ్
	భారత్ × న్యూజిలాండ్	రా. 7.30	దుబాయ్
5	ఆస్ట్రేలియా × శ్రీలంక	మ. 3.30	షార్జా
	బంగ్లాదేశ్ × ఇంగ్లాండ్	రా. 7.30	షార్జా
6	భారత్ × పాకిస్థాన్	మ. 3.30	దుబాయ్
	స్కాట్లాండ్ × వెస్టిండీస్	రా. 7.30	దుబాయ్
7	ఇంగ్లాండ్ × దక్షిణాఫ్రికా	రా. 7.30	షార్జా
8	ఆస్ట్రేలియా × న్యూజిలాండ్	రా. 7.30	షార్జా
9	స్కాట్లాండ్ × దక్షిణాఫ్రికా	మ. 3.30	దుబాయ్
	భారత్ × శ్రీలంక	రా. 7.30	దుబాయ్
10	బంగ్లాదేశ్ × వెస్టిండీస్	రా. 7.30	షార్జా
11	ఆస్ట్రేలియా × పాకిస్థాన్	రా. 7.30	దుబాయ్
12	న్యూజిలాండ్ × శ్రీలంక	మ. 3.30	షార్జా
	బంగ్లాదేశ్ × దక్షిణాఫ్రికా	రా. 7.30	దుబాయ్
13	ఇంగ్లాండ్ × స్కాట్లాండ్	మ. 3.30	షార్జా
	భారత్× ఆస్ట్రేలియా	రా. 7.30	షార్జా
14	న్యూజిలాండ్ × పాకిస్థాన్	రా. 7.30	దుబాయ్
15	ఇంగ్లాండ్ × వెస్టిండీస్	రా. 7.30	దుబాయ్
17	తొలి సెమీఫైనల్	రా. 7.30	దుబాయ్
18	రెండో సెమీఫైనల్	రా. 7.30	షార్జా
20	ఫైనల్	రా. 7.30	దుబాయ్

అక్కడి నుంచి ఇక్కడికి..

ఈ టోర్నీ వాస్తవానికి బంగ్లాదేశ్‌లో జరగాల్సింది. కానీ ఆ దేశంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు తీవ్ర స్థాయికి చేరడం, ప్రధాని షేక్ హసీనా దేశం విడిచి వెళ్లిపోవడంతో అధికార మార్పిడి జరగడం.. ఈ క్రమంలో శాంతి భద్రతలు అదుపు తప్పిన నేపథ్యంలో అక్కడ టీ20 ప్రపంచకప్ నిర్వహించడం కష్టమని ఐసీసీ భావించింది. బంగ్లాదేశ్ బోర్డు కూడా టోర్నీని తరలించడానికి సుముఖత వ్యక్తం చేసింది. ప్రత్యామ్నాయ వేదికగా రెండు నెలల కిందటే యూఏఈని ఎంచుకున్నారు. టోర్నీ జరుగుతోంది అక్కడే అయినా ఆతిథ్య హక్కులు మాత్రం బంగ్లా బోర్డువే.

నంబర్‌వన్‌గా బుమ్రా



బుమ్రా

దుబాయ్: ప్రపంచ టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా మళ్లీ అగ్రస్థానానికి దూసుకెళ్లాడు. బుధవారం ఐసీసీ విడుదల చేసిన జాబితాలో బుమ్రా (870 పాయింట్లు) నంబర్‌వన్ ర్యాంకు సాధించాడు. స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ (869) రెండో స్థానానికి పడిపోయాడు. ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా (809) ఆరో స్థానంలో కొనసాగుతున్నాడు. బ్యాటింగ్‌లో యువ ఓపెనర్ యశస్వి జైశ్వాల్ రెండు స్థానాలు మెరుగై మూడో ర్యాంకు కైవసం చేసుకున్నాడు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి 6 స్థానాలు మెరుగుపరుచుకుని ఆరో ర్యాంకు సాధించాడు. రిషబ్ పంత్ 9, రోహిత్‌శర్మ 15, శుభ్‌మన్ గిల్ 16వ స్థానాల్లో నిలిచారు. టీమ్ ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా (124), భారత్ (120) వరుసగా తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి. అదే సమయంలో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ పట్టికలో 74.24 శాతంతో భారత్ నంబర్‌వన్ ర్యాంకుతో ఆధిపత్యం చలాయిస్తోంది. ఆసీస్ (62.50 శాతం) ద్వితీయ స్థానంలో ఉంది.



దివాంషి

భారత్‌కు మరో 5 స్వర్ణాలు

దిల్లీ: ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ ఖాతాలో మరో అయిదు స్వర్ణ పతకాలు చేరాయి. బుధవారం 25 మీటర్ల పిస్టల్ విభాగంలో భారత క్రీడాకారులు సత్తాచాటారు. మహిళల వ్యక్తిగత విభాగం ఫైనల్లో దివాంషి 35-33తో క్రిస్టినా మాగ్నాని (ఇటలీ)పై గెలిచి బంగారు పతకం సాధించింది. టీమ్ విభాగంలో దివాంషి, తేజస్విని, విభూతి భాటియాలతో కూడిన భారత జట్టు స్వర్ణం కైవసం చేసుకుంది. పురుషుల విభాగంలో ముకేశ్ నేలవల్లి అగ్రస్థానంతో స్వర్ణం నెగ్గాడు. ముకేశ్, సూరజ్‌శర్మ, ప్రద్యుమ్న సింగ్‌లతో కూడిన భారత జట్టు టీమ్ విభాగంలో బంగారు పతకం సాధించింది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్లలో శౌర్య సైని, వేదాంత్ నితిన్, పరీక్షిత్ సింగ్‌లతో కూడిన భారత బృందం స్వర్ణం గెలుచుకుంది.

క్వార్టర్‌ఫైనల్లో భారత్

దిల్లీ: బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ జూనియర్ మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన గ్రూపు-ఇ చివరి పోరులో భారత్ 110-99తో తుర్కియేపై విజయం సాధించింది. నాలుగు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన భారత్ గ్రూపు-ఇ లో అగ్రస్థానంతో నాకౌట్ బెర్తు సొంతం చేసుకుంది. గ్రూపు దశలో పెరూ, అజర్‌బైజాన్, మారిషస్‌లను భారత్ చిత్తుచేసింది. బీడబ్ల్యూఎఫ్ ప్రయోగాత్మకంగా రిలే స్కోరింగ్ పద్ధతిని ప్రపంచ జూనియర్ మిక్స్‌డ్ టోర్నీలో ప్రవేశపెట్టింది. దీని ప్రకారం 10 మ్యాచ్‌ల్లో మొదట 110 పాయింట్లు చేరుకున్న జట్టు విజేతగా నిలుస్తుంది. తొలి మ్యాచ్‌లో భారత ఆటగాడు తుషార్ సువీర్ 7-11తో మెహ్మెత్ తొరెమిస్ చేతిలో ఓడటంతో తుర్కియేకు ఆధిక్యం లభించింది. అయితే శ్రీనిధి-రేషిక జోడీ 22-18తో తుర్కియే జంటపై నెగ్గడంతో భారత్ ఆధిక్యం సంపాదించింది. అనంతరం సింగిల్స్, డబుల్స్ క్రీడాకారిణులు సత్తా చాటడంతో భారత్ విజయాన్ని అందుకుంది.

వాళ్ల వల్లే టెస్టుల్లో నేనిలా..



రోహిత్ శర్మ

ముంబయి: టెస్టు క్రికెట్లో తన పునరుజ్జీవానికి విరాట్ కోహ్లి, రవిశాస్త్రి ప్రధాన కారణమని టీమ్ ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ అన్నాడు. టెస్టుల్లో తాను ఓపెనర్‌గా మారడం వెనుక వాళ్లున్నారని చెప్పాడు. "బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందు రావడానికి అవకాశమిచ్చిన విరాట్ కోహ్లి, రవిశాస్త్రి (అప్పటి కెప్టెన్, కోచ్)లకు కృతజ్ఞతలు. టెస్టుల్లో నన్ను ప్రమోట్ చేయడమనేది తేలికైన నిర్ణయం కాదు. వాళ్లు నన్ను నమ్మారు. ముందు ఓ ప్రాక్టీస్ మ్యాచ్‌లో ఆడమన్నారు. అందులో ఆడాను. కానీ తొలి బంతికే ఔటయ్యా. కానీ నాకు మరో ప్రత్యామ్నాయం లేదని అర్థమైంది. టెస్టుల్లో నాకది పునర్జన్మలా అనిపించింది. అది ఓపెనర్‌గానైనా లేదా 5, 6వ స్థానంలోనైనా, ఇంకా దిగువన అయినా.. అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని నాకు తెలుసు" అని రోహిత్ అన్నాడు. "నా సహజ శైలిలో స్వేచ్ఛగా ఆడతానని చెప్పా. వాళ్లు నాకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. నేను ఓపెనింగ్ చేయాలని రవి భాయ్ బలంగా కోరుకున్నాడు" అని చెప్పాడు. టెస్టుల్లో ఓపెనర్‌గా మారిన తర్వాత రోహిత్ దశే మారిపోయింది. ఓపెనరయ్యాక అతడు 34 టెస్టుల్లో 2594 పరుగులు చేశాడు. ఇందులో 9 శతకాలు, ఏడు అర్ధశతకాలు ఉన్నాయి.

నేటి నుంచే జీసీఎల్

లండన్: గ్లోబల్ చెస్ లీగ్ (జీసీఎల్) గురువారం ఆరంభం కానుంది. ఆరు ఫ్రాంఛైజీల ఈ లీగ్‌లో విశ్వనాథన్ ఆనంద్, ప్రపంచ నంబర్‌వన్ కార్ల్‌సన్, నకముర, మహిళల మాజీ ప్రపంచ విజేత హు ఇఫాన్ వంటి మేటి గ్రాండ్‌మాస్టర్లు పోటీపడుతున్నారు. రెండో సారి జరుగుతున్న ఈ లీగ్‌లో మొత్తం 36 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. నిరుడు దుబాయ్‌లో జరిగిన తొలి టోర్నీలో త్రివేణి కాంటినెంట్ కింగ్స్ విజేతగా నిలిచింది. అల్పైన్ ఎస్‌జీ పైపర్స్, గ్యాంజెస్ గ్రాండ్‌మాస్టర్స్, ముంబయి మాస్టర్స్, అలాస్కన్ నైట్స్, అమెరికన్ గ్యాంబిట్స్ టోర్నీలోని ఇతర జట్లు. ప్రతి జట్టులో ఆరుగురు క్రీడాకారులు ఉంటారు. జట్లు డబుల్ రౌండ్ రాబిన్ ఫార్మాట్లో తలపడతాయి. చెస్ ఒలింపియాడ్‌లో గెలిచిన భారత జట్టులో సభ్యులైన ప్రజ్ఞానంద, అర్జున్, విదిత్, వైశాలి, హారిక కూడా జీసీఎల్‌లో ఆడుతున్నారు.

నగాల్ నిష్క్రమణ

షాంఘై: భారత అగ్రశ్రేణి టెన్నిస్ ఆటగాడు సుమిత్ నగాల్ షాంఘై మాస్టర్స్ టోర్నీ నుంచి నిష్క్రమించాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో నగాల్ 3-6, 3-6తో వు ఐబింగ్ (చైనా) చేతిలో పరాజయం చవిచూశాడు. నగాల్ తొలి రౌండ్లోనే వెనుదిరిగడం వరుసగా రెండోసారి. ఈ ఏడాది ఆగస్టులో యూఎస్ ఓపెన్‌లోనూ నగాల్‌కు మొదటి రౌండ్లో చుక్కెదురైంది.

మా అమ్మ గుర్తొచ్చింది

నీరజ్ చోప్రా తల్లితో ప్రధాని మోదీ



నరేంద్ర మోదీ

దిల్లీ: తన కోసం రుచికరమైన చూర్మాను చేసినందుకు కృతజ్ఞతలు చెబుతూ భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా తల్లి సరోజ్ దేవికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లేఖ రాశారు. ఆమె వంటకం తనకు తన తల్లిని గుర్తు చేసిందని అందులో పేర్కొన్నారు. చూర్మా.. హరియాణా, రాజస్థాన్‌లో ప్రఖ్యాత వంటకం. తన కోసం ఇంట్లో తయారు చేసిన చూర్మా తేవాలని మోదీ ఈ ఏడాది జనవరిలో నీరజ్‌ను కోరారు. మోదీ విజ్ఞప్తికి స్పందించిన సరోజ్ దేవి.. ప్రత్యేకంగా చేసిన చూర్మాను పంపిస్తానని హామీ ఇచ్చారు. జమైకా ప్రధానమంత్రి భారత పర్యటనకు వచ్చిన సందర్భంగా మంగళవారం నీరజ్‌ను మోదీ కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు చూర్మాను రుచి చూసే అవకాశం దక్కింది. చూర్మా తిన్న అనంతరం తాను భావోద్వేగానికి గురయ్యానని, లేఖ రాయకుండా ఉండలేకపోయానని నీరజ్ తల్లికి రాసిన లేఖలో మోదీ పేర్కొన్నారు. "గౌరవనీయులైన సరోజ్ గారికి, మీరు ఆరోగ్యంగా, సంతోషంగా ఉన్నారని ఆశిస్తున్నా. జమైకా ప్రధానమంత్రి భారత్ వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసిన విందులో నాకు నా నీరజ్‌ను కలిసే అవకాశం దక్కింది. అతడు మీరు చేసిన రుచికరమైన చూర్మా ఇవ్వడంతో ఎంతో సంతోషం కలిగింది. చూర్మా తిన్న తర్వాత మీకు లేఖ రాయలేకుండా ఉండలేకపోయా. సోదరుడు నీరజ్ ఈ చూర్మా గురించి ఇంతకుముందు నాతో కొన్నిసార్లు చెప్పాడు. కానీ ఇప్పుడు దాన్ని తిన్న తర్వాత నేను భావోద్వేగానికి గురయ్యా. మీ అభిమానంతో కూడిన ఈ బహుమతి నాకు మా అమ్మను గుర్తు చేసింది" అని లేఖలో మోదీ చెప్పారు. నీరజ్ తల్లికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

సర్ఫరాజ్ డబుల్..

ముంబయి 536/9



సర్ఫరాజ్

లఖ్‌నవూ: ముంబయి బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ (221 బ్యాటింగ్; 276 బంతుల్లో 25×4, 4×6) అదరగొట్టాడు. రెస్టాఫ్ ఇండియాతో జరుగుతున్న ఇరానీ కప్ పోరులో అజేయ డబుల్ సెంచరీతో సత్తాచాటాడు. సోదరుడు ముషీర్ ఖాన్ రోడ్డు ప్రమాదంలో గాయపడి మ్యాచ్‌కు దూరమైన సమయంలో.. సర్ఫరాజ్ స్ఫూర్తిమంతమైన ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఇరానీ కప్‌లో డబుల్ సెంచరీ సాధించిన మొదటి ముంబయి ఆటగాడిగా.. మొత్తంగా అయిదో బ్యాటర్‌గా సర్ఫరాజ్ రికార్డు సృష్టించాడు. గతంలో ఇరానీ కప్‌లో వసీం జాఫర్ (విదర్భ).. రవి శాస్త్రి, ప్రవీణ్ ఆమ్రే, యశస్వి జైశ్వాల్ (రెస్టాఫ్ ఇండియా) మాత్రమే డబుల్ సెంచరీలు సాధించారు. ఓవర్‌నైట్ స్కోరు 237/4తో బుధవారం ఉదయం ఆట కొనసాగించిన ముంబయి 138 ఓవర్లలో 9 వికెట్లకు 536 పరుగులు చేసింది. రెండో రోజంతా బ్యాటింగ్ చేసిన ముంబయి బ్యాటింగ్‌కు సర్ఫరాజ్ వెన్నుముకలా నిలిచాడు. కెప్టెన్ అజింక్య రహానె (97; 234 బంతుల్లో 7×4, 1×6)కు త్రుటిలో సెంచరీ చేజారగా.. సర్ఫరాజ్, తనుష్ కొటేన్ (64; 124 బంతుల్లో 6×4) జట్టును భారీస్కోరు దిశగా పరుగెత్తించారు. వీరిద్దరు కలిసి ఏడో వికెట్‌కు 183 పరుగులు జోడించి ముంబయిని 400 మైలురాయిని దాటించారు. అనంతరం శార్దూల్ ఠాకూర్ (36; 59 బంతుల్లో 4×4, 1×6)తో కలిసి సర్ఫరాజ్ తొమ్మిదో వికెట్‌కు 73 పరుగులు జతచేసి ముంబయికి భారీ స్కోరు అందించాడు.

కెప్టెన్సీకి గుడ్‌బై

ఇటు బాబర్



బాబర్

కరాచి: పాకిస్థాన్ వన్డే, టీ20 కెప్టెన్సీకి బాబర్ అజామ్ రాజీనామా చేశాడు. అతడి స్థానంలో మహ్మద్ రిజ్వాన్‌కు బాధ్యతలు అప్పగించే అవకాశముంది. నాయకత్వం నుంచి వైదొలగాలని అనుకుంటున్నట్లు నెల కిందే పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ (పీసీబీ), టీమ్ మేనేజ్‌మెంట్‌కు తెలిపానని బాబర్ బుధవారం ఎక్స్‌లో పేర్కొన్నాడు. "మీతో ఒక వార్త పంచుకుంటున్నా. పాకిస్థాన్ క్రికెట్ జట్టు కెప్టెన్ పదవికి రాజీనామా చేస్తున్నా. ఈ జట్టుకు నాయకత్వం వహించడం ఓ గౌరవం. కానీ బాధ్యతల నుంచి వైదొలగి ఆటగాడిగా నా పాత్రపై దృష్టిపెట్టాల్సిన సమయమిది" అని బాబర్ చెప్పాడు. 2023 వన్డే ప్రపంచకప్‌లో పాకిస్థాన్ పేలవ ప్రదర్శన అనంతరం కూడా బాబర్ సారథిగా బాధ్యతలను వీడాడు. అతడు అన్ని ఫార్మాట్ల కెప్టెన్సీకి గుడ్‌బై చెప్పాడు. ఈ ఏడాది మార్చిలో అతడు తిరిగి పరిమిత ఓవర్ల ఫార్మాట్ల సారథిగా నియమితుడయ్యాడు. కానీ కెప్టెన్‌గా అతడి రెండో ఇన్నింగ్స్ కూడా సవ్యంగా సాగలేదు. టీ20 ప్రపంచకప్‌లో పాక్ పేలవ ప్రదర్శన చేసింది. అమెరికా చేతిలో కూడా ఓడిన ఆ జట్టు సూపర్-8కు కూడా చేరలేకపోయింది.

అటు సౌథీ



సౌథీ

ఆక్లాండ్: న్యూజిలాండ్ టెస్టు సారథ్య బాధ్యతల నుంచి టిమ్ సౌథీ వైదొలిగాడు. అతడి స్థానంలో భారత్‌తో టెస్టు సిరీస్‌కు టామ్ లేథమ్ కివీస్ కెప్టెన్ నియమితుడయ్యాడు. సౌథీ 14 టెస్టుల్లో జట్టును నడిపించాడు. అందులో కివీస్ ఆరు గెలిచి, ఆరు ఓడింది. రెండు మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. "నా కెరీర్ ఆసాంతం జట్టు ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యమిచ్చా. ఈ నిర్ణయం కూడా జట్టుకు మంచే చేస్తుందని అనుకుంటున్నా" అని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో సౌథీ పేర్కొన్నాడు. 35 ఏళ్ల సౌథీ ఇప్పటివరకు 102 టెస్టుల, 161 వన్డేలు, 126 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. ఇటీవల శ్రీలంకతో జరిగిన టెస్టు సిరీస్‌లో సౌథీ సారథ్యంలోని కివీస్ పరాజయంపాలైంది. భారత్, న్యూజిలాండ్ మధ్య మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఈ నెల 16న బెంగళూరులో ఆరంభమవుతుంది.

మెరిసిన ఎనాన్, నిఖిల్

యువ భారత్ విజయం

చెన్నై: ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో అనధికారిక తొలి టెస్టులో యువ భారత్ విజయం సాధించింది. బౌలింగ్‌లో మహ్మద్ ఎనాన్ (6/79).. బ్యాటింగ్‌లో నిఖిల్ కుమార్ (55 నాటౌట్; 71 బంతుల్లో 3×4, 4×6) సత్తాచాటడంతో బుధవారం ముగిసిన మ్యాచ్‌లో భారత యువ జట్టు రెండు వికెట్ల తేడాతో గెలుపొందింది. ఓవర్‌నైట్ స్కోరు 110/4తో మూడో రోజు ఉదయం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్ 67.4 ఓవర్లలో 214 పరుగులకు ఆలౌటైంది. ఎనాన్, సోహమ్ పత్వర్ధన్ (3/27) విజృంభించి ఆసీస్‌ను కట్టడి చేశారు. 212 పరుగులు విజయ లక్ష్యంతో బరిలో దిగిన యువ భారత్‌కు ఆసీస్ బౌలర్లు ఐడాన్ ఓకానర్ (4/27), విశ్వ రాంకుమార్ (3/75) పరీక్షగా నిలిచారు. అయితే నిత్య పాండ్య (51; 86 బంతుల్లో 3×4), నిఖిల్ అర్ధ సెంచరీలతో రాణించడంతో భారత్ 61.1 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది.

ఏఆర్ డెయిరీ టెండర్‌లో తిరకాసులెన్నో!

మొదట కిలో నెయ్యి రూ. 428కి ఇవ్వలేనన్న డెయిరీ

- తర్వాత రూ. 320కి ఎలా ఇచ్చింది?
- టెండర్ నిబంధనల్ని అడ్డగోలుగా ఎందుకు మార్చారు?
- తెదేపా నేత ఆనం వెంకటరమణారెడ్డి ధ్వజం



ఈనాడు, అమరావతి, నెల్లూరు: ఐదు లక్షల కిలోల ఆవునెయ్యి కొనుగోలుకు 2023 అక్టోబరులో తితిదే టెండర్ పిలిస్తే.. చిత్తూరు జిల్లాలోని వైష్ణవి డెయిరీ స్పెషాలిటీస్ రివర్స్ టెండరింగ్‌లో కిలో రూ. 428.04కి కోట్ చేసి ఎల్1గా నిలిచింది. ఏఆర్ డెయిరీ ఫుడ్స్ కిలోకు రూ. 432.96 కోట్ చేసి ఎల్3గా నిలిచింది. నిబంధనల ప్రకారం వైష్ణవి డెయిరీ కోట్ చేసిన ధరకు నెయ్యి సరఫరా చేస్తే 35 శాతం ఆర్డర్ ఇస్తామని చెప్పినా.. ఏఆర్ డెయిరీ ముందుకు రాలేదు. ఆ ధరకు సరఫరా చేయలేమని 2023 నవంబరు 25న స్పష్టం చేసింది. అదే సంస్థ నాలుగు నెలలు తిరక్కుండానే 2024 మార్చిలో తితిదే పిలిచిన టెండర్లలో పాల్గొని.. రూ. 320 చొప్పున ధర కోట్ చేసి, 10 లక్షల కిలోల నెయ్యి సరఫరాకు కాంట్రాక్ట్ దక్కించుకుంది. నాలుగు నెలల ముందు కిలో రూ. 428కి ఇవ్వలేమన్న సంస్థ.. రూ. 320కే స్వచ్ఛమైన నెయ్యిని ఎలా సరఫరా చేయగలదు?

■ 2023 ఏప్రిల్ 3న నేషనల్ కోఆపరేటివ్ డెయిరీ ఫెడరేషన్ కిలో ఆవునెయ్యి రిటైల్ ధరను రూ. 483గా, 2023 నవంబరు 23న అగ్‌మార్క్ సంస్థ ఆవునెయ్యి నెట్ రేటును కిలో రూ. 578గా నిర్ణయించాయి. అలాంటప్పుడు రూ. 320కే ఏఆర్ డెయిరీ స్వచ్ఛమైన ఆవునెయ్యిని ఎలా సరఫరా చేస్తుంది?

■ ఆవునెయ్యి సరఫరా టెండర్లలో పాల్గొనే ఇతర రాష్ట్రాలోని డెయిరీలు అంతకుముందు సంవత్సర కాలం పాటు రోజుకు కనీసం 4 లక్షల లీటర్ల పాలు సేకరించి ఉండాలన్న నిబంధన (నం.19), ఆ డెయిరీలకు వాటి మార్కెట్ అవసరాలకు పోగా, అదనంగా 8 టన్నుల ఆవు నెయ్యి ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఉండాలన్న నిబంధనల్ని (నం.20) వైకాపా ప్రభుత్వ హయాంలో తితిదే ఎందుకు తొలగించింది?

■ టెండర్లలో పాల్గొనే డెయిరీ కనీసం మూడేళ్ల నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తూ ఉండాలన్న నిబంధనను ఒక ఏడాదికి ఎందుకు కుదించింది? ఎవరికి మేలు చేయడానికి?

కాలవ్యవధి	పరిమాణం (కిలోల్లో)	కిలో నెయ్యి ధర(రూ.ల్లో)
2019 ఆగస్టు నుంచి 2020 జులై	22,58,600	389.90
2020 ఆగస్టు నుంచి 2020 డిసెంబరు	7,00,000	294.10
2020 డిసెంబరు నుంచి 2021 మే	10,00,000	324.96
2021 జూన్ నుంచి 2022 మార్చి	25,00,000	392.22
2022 మార్చి నుంచి 2022 సెప్టెంబరు	25,00,000	329.00
2022 అక్టోబరు నుంచి 2023 జనవరి	30,00,000	467.86
2023 ఫిబ్రవరి నుంచి...	10,00,000	496.90

ఆ ట్యాంకర్ దిండిగల్‌లోని ఏఆర్ డెయిరీకి ఎందుకెళ్లింది?

తితిదేకు 10 లక్షల కిలోల నెయ్యి సరఫరా చేసే సామర్థ్యం ఏఆర్ డెయిరీకి లేదని వెంకటరమణారెడ్డి తెలిపారు. "వైష్ణవి డెయిరీ నుంచి ఈ ఏడాది జులై 2న 'ఏపీ 26 టీసీ 4779' నంబరు గల ట్రక్కు 151889406707 వేబిల్లు నంబరుతో బయల్దేరింది. ఆ ట్రక్కులో నెయ్యి ఉంది. 50 కి.మీ. దూరంలోని తిరుమలకు వెళ్లాల్సిన ఆ ట్రక్కు డ్రైవర్‌కు గూగుల్ మ్యాప్‌లో దారి తప్పుగా చూపించటంతో (వ్యంగ్యంగా).. కృష్ణగిరి, సేలం మీదుగా 508 కి.మీ. ప్రయాణించి దిండిగల్‌లోని ఏఆర్ ఫుడ్స్‌కు చేరింది. అదే ట్రక్కు కొత్త వేబిల్లు నంబరుతో (511673446306) జులై 4న 3.27 గంటలకు ఏఆర్ ఫుడ్స్ నుంచి బయల్దేరి తిరుమలకు వచ్చేసింది? దీని మర్మమేంటి? ఏఆర్ ఫుడ్స్ సంస్థ వైష్ణవి ఫుడ్స్ వంటి డెయిరీల నుంచి నెయ్యి కొని.. కొత్త వేబిల్లులతో తితిదేకి పంపిస్తోందని కాదా" అని ఆయన ప్రశ్నించారు.

■ తిరుమల నుంచి 800 కి.మీ. పరిధిలోని డెయిరీల నుంచే నెయ్యి కొనుగోలు చేయాలన్న నిబంధనను సడలించి.. 1,500 కి.మీ.కు పెంచడం ఎవరికి లాభం చేకూర్చడానికి? ఇలాంటి అనేక ప్రశ్నలు గత వైకాపా ప్రభుత్వంలోని పెద్దలకు, వారి హయాంలో తితిదేని భ్రష్టు పట్టించిన అప్పటి ఛైర్మన్లకు, వారి అస్మదీయ అధికారులకు వివిధ వర్గాల నుంచి ఎదురవుతున్నాయి.

తెదేపా అధికార ప్రతినిధి ఆనం వెంకట రమణారెడ్డి బుధవారం నెల్లూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైకాపా నాయకులకు అనేక ప్రశ్నలు సంధించారు. గత ప్రభుత్వ హయాంలో తితిదేలో నెయ్యి కొనుగోళ్లలో భారీఎత్తున అవకతవకలు జరిగాయంటూ పలు ఆధారాల్ని ఆయన బయటపెట్టారు. ముఖ్యమంత్రి పదవికి చంద్రబాబు రాజీనామా చేయాలంటూ వైకాపా నాయకులు డిమాండ్ చేయడంపై మండిపడ్డారు. "ఆయన ఎందుకు రాజీనామా చేయాలి? తిరుమలలో వైకాపా హయాంలో జరిగిన అరాచకాల్ని బయట పెట్టినందుకా? తప్పు మీరు చేస్తే.. రాజీనామా మేం చేయాలా? బుద్ధుందా?" అని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "జగన్ సాక్షాత్తు ఆ వేంకటేశ్వరస్వామికే అన్యాయం చేశారు. చేసిన తప్పునకు ఇప్పటికైనా క్షమాపణ కోరి, రాజకీయాల నుంచి వైదొలగాలి" అని డిమాండ్ చేశారు.

ఎవరు దొంగ.. సుబ్బారెడ్డా..? కరుణాకరరెడ్డా..?

"2023 ఫిబ్రవరిలో వైవీ సుబ్బారెడ్డి తితిదే ఛైర్మన్‌గా ఉండగా.. అహ్మద్‌నగర్‌కు చెందిన మాల్గంగా మిల్క్ అండ్ ఆగ్రో ప్రొడక్ట్స్ సంస్థకు కిలోకి రూ. 496.90 చొప్పున పది లక్షల కిలోల ఆవు నెయ్యి సరఫరాకు తితిదే ఆర్డర్ ఇచ్చింది. 2024 మార్చిలో భూమన కరుణాకరరెడ్డి హయాంలో ఏఆర్ డెయిరీకి కిలో రూ. 320 చొప్పున పది లక్షల కిలోల నెయ్యి సరఫరాకు కాంట్రాక్ట్ ఇచ్చారు. ఏడాది కాలంలో నెయ్యి ధర రూ. 496 నుంచి రూ. 320కి పడిపోతుందా? కిలో రూ. 496కి కాంట్రాక్ట్ ఇచ్చిన వైవీ సుబ్బారెడ్డి తప్పు చేశారా? రేటు తగ్గించి భూమన తప్పు చేశారా? వారిద్దరిలో దొంగ ఎవరు? అవన్నీ బయటకు రావాలనే సిట్ వేశాం" అని వెంకట రమణారెడ్డి తెలిపారు. "కిలో నెయ్యికి రూ. 411కి టెండర్ వేసిన ఏఆర్ డెయిరీ సంస్థ రివర్స్ టెండరింగ్‌లో రూ. 320కి ఎలా తగ్గిస్తుంది? పోలవరం ప్రాజెక్టులో మాత్రం రివర్స్ టెండరింగ్‌లో 0.1 శాతం మాత్రమే తగ్గుతుంది. తితిదేలో మాత్రం ఎంత కావాలంటే అంత రివర్స్ టెండరింగ్‌లో తగ్గించేస్తారు" అని మండిపడ్డారు.

లంచాల్ని బట్టి నెయ్యి ధర నిర్ణయించారు

"ఎవరు లంచం ఇస్తామంటే వారికి ఎక్కువ ధర ఇచ్చారు. రోజుకో సరఫరాదారు, రోజుకో కంపెనీ అంటూ నిర్దిష్ట ప్రమాణాలంటూ లేకుండా ఎవరికి తోచినట్లు వాళ్లు వ్యవహరించారు" అని ఆనం ధ్వజమెత్తారు. 2019 ఆగస్టు నుంచి 2024లో వైకాపా ప్రభుత్వం గద్దె దిగేంత వరకు నెయ్యి కొనుగోళ్ల వివరాల్ని ఆయన బయటపెట్టారు.

కష్టం వరదపాలు
కదిలిపోయిన హృదయాలు!

వ్యాపారంలో నష్టపోతే అప్పు చేసి మళ్లీ పుంజుకునే యత్నం చేస్తాం. మన ఇల్లు కురుస్తుంటే.. ఆ పూటకు చుట్టుపక్కల వారింట్లో తలదాచుకుంటాం. కానీ నెల కిందట వచ్చిన వరద ఇళ్లు, పరిశ్రమలు, పొలాలు.. ఇలా అన్నింటినీ ముంచేసి వేల మందిని బాధితులుగా మార్చేసింది. వారంతా కోలుకోవాలని కోట్ల హృదయాలు ప్రార్థిస్తున్నాయి. వేల ఆపన్న హస్తాలు ఏకమయ్యాయి.



మంతెన వెంకట సూర్య వంశీకృష్ణంరాజు (అమెరికా)
ఆత్రేయపురం
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా
విరాళం: రూ.1,00,000

తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితులకు అండగా నిలిచేందుకు రామోజీ గ్రూపు తరపున రూ.5 కోట్లతో ఏర్పాటు చేసిన 'ఈనాడు సహాయనిధి'కి ఉదారంగా విరాళాలు ఇస్తున్న దాతలకు కృతజ్ఞతలు. ఈనాడు పిలుపు అందుకొని స్పందిస్తున్న సహృదయుల వివరాలు..

ఈనాడు సహాయనిధికి విరాళాలిచ్చిన దాతలు

వ్యక్తులు / సంస్థలు	సాయం (రూ.లలో)
కోనేరు ఛారిటబుల్ ట్రస్టు, విజయవాడ	1,00,000
వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కాలేజీ వాకర్స్ అసోసియేషన్, చీరాల, బాపట్ల జిల్లా	40,005
పుణ్య ఛారిటీస్ ఓల్డేజ్ హోం సభ్యులు, చిన్న అవుటపల్లి, కృష్ణా జిల్లా	36,000
ఆదిత్య ఎడ్యుకేషన్ సొసైటీ, శ్రీకాకుళం	25,940
ఎస్.కృష్ణశ్రీవల్లి, హైదరాబాద్	25,000
బలుసు ఇంద్రయ్య, మండపాక రూరల్, పశ్చిమగోదావరి జిల్లా	25,000
శ్రీ లక్ష్మీగణపతి ఉత్సవ కమిటీ, దుద్దుకూరు, తూర్పుగోదావరి జిల్లా	20,000
కర్నల్ మోటూరి అంకినీడు ప్రసాద్(రిటైర్డ్), సికింద్రాబాద్	20,000
సోమరౌతు కనకమహాలక్ష్మి, హైదరాబాద్	20,000
బి.దశరథరామయ్య, హైదరాబాద్	15,116
రాయపు శరత్‌బాబు అండ్ ఫ్యామిలీ, విశాఖపట్నం	15,000
పిల్లి మోహనరావు, విజయవాడ	10,000
కొత్తపల్లి పద్మజ, సికింద్రాబాద్	10,000
కాజ రమేశ్, విజయరాయి, ఏలూరు జిల్లా	10,000
సిరావూరు శివరామకృష్ణరాజు, విశాఖపట్నం	10,000
సయ్యద్ మూసా, గద్వాల	5,000
ఆర్.వి.ఎస్.దీక్షితులు, హైదరాబాద్	5,000
ఆర్.వి.వి.ఎన్.జగపతిరాజు, విశాఖపట్నం	5,000
పి.లీల, విశాఖపట్నం	5,000
ఆర్వీఆర్ ఎంటర్‌ప్రైజెస్, హైదరాబాద్	5,000
కకురు నాగరాజరెడ్డి, నెల్లూరు	5,000
సాగి సన్యాసిరాజు, విశాఖపట్నం	5,000
కొండవీటి సాంబశివరావు, విజయవాడ	5,000
బి.విజయభాస్కర్, హైదరాబాద్	5,000
ఎంజీఎం చక్రపాణి, విజయవాడ	5,000
ఎం.లక్ష్మీగుణవతి, హైదరాబాద్	5,000
చింతలపాటి రామారావు, హైదరాబాద్	5,000
కుర్రా నరసింహారావు, హైదరాబాద్	5,000
అలిమెల సుదర్శనం, హైదరాబాద్	5,000

ఆపదలో ఉన్నారు ఆదుకుందాం రండి

RAMOJI GROUP

దాతలకు ముఖ్య సూచన: మీరిచ్చే విరాళాలకు రసీదులు పొందేందుకు ఈ వివరాలు పంపవలసిందిగా మనవి. 1. దాత పేరు 2. పూర్తి చిరునామా 3. పాన్‌కార్డు నంబరు.
- ఈ వివరాలను 9154990933 నంబరుకు లేదా relieffund@eenadu.in ఈ మెయిల్ ఐడీకి పంపగలరు.

విరాళాలు పంపవలసిన ఎకౌంట్ వివరాలు
ఈనాడు రిలీఫ్ ఫండ్,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,
సైఫాబాద్ బ్రాంచి,
SB A/C No: 370602010006658
IFSC: UBIN0537063

'వస్తున్నా మీ కోసం' చంద్రబాబు చేపట్టి 12 ఏళ్లు

తెదేపా కేంద్ర కార్యాలయంలో సంబరాలు

ఈనాడు, అమరావతి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2012లో 'వస్తున్నా మీ కోసం' పేరుతో చంద్రబాబు పాదయాత్ర చేపట్టి...బుధవారానికి 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా తెదేపా శ్రేణులు సంబరాలు చేసుకొన్నాయి. మంగళగిరిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ నేత వర్ల రామయ్య తదితరులు 12 కిలోల కేకు కోసి శుభాకాంక్షలు తెలిపారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గాలను ఎండగడుతూ.. చంద్రబాబు 63 ఏళ్ల వయసులో 208 రోజులు 2,817 కి.మీ. పాదయాత్ర చేసి ప్రజల్ని చైతన్యవంతుల్ని చేశారని గుర్తుచేసుకున్నారు. పాదయాత్ర ఫలితంగానే 2014లో నవ్యాంధ్రలో తెదేపా అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు.

■ చంద్రబాబు చేసిన 'వస్తున్న మీ కోసం' పాదయాత్ర చరిత్రలో నిలిచిపోతుందని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మాటిచ్చారు.. నెరవేర్చారు



యువకుడికి ఇ-ఆటోను అందజేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు తదితరులు

24 గంటల్లోనే పలువురికి అందిన సీఎం చేయూత

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా పత్తికొండ మండలం పుచ్చకాయలమడలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటించి 24 గంటలు గడవక ముందే పలువురికి ఇచ్చిన హామీలు నెరవేరాయి. పింఛన్ల పంపిణీ చేసేందుకు తలారి గంగమ్మ ఇంటికి వెళ్లిన సమయంలో ఆమె కుమారుడు అశోక్‌కు ఉపాధి లేదని తెలుసుకున్న సీఎం ఆ యువకుడికి వెంటనే ఎలక్ట్రిక్ ఆటోను అందజేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. సభా వేదిక వద్ద సీఎం ప్రసంగించే సమయంలో మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న వెంకటరాముడికి, నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్న రాముడికి చెరో రూ.లక్ష మంజూరు చేయాలని తెలిపారు. ఆదేశాలు జారీ చేసి ఒక రోజు కూడా గడవక ముందే అశోక్‌కు రూ.3.80 లక్షల విలువ చేసే ఆటో, వెంకటరాముడు, రాముడికి సీఎం సహాయ నిధి కింద రూ.లక్ష చొప్పున కర్నూలులో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సమక్షంలో కలెక్టర్ రంజిత్‌బాషా బుధవారం అందజేశారు.



కవితకు చెక్కు ఇస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

ప్రవీణ్ ప్రకాష్‌కు నెలరోజుల జైలుశిక్ష

- ఇంటర్ బోర్డు మాజీ కార్యదర్శి శేషగిరిబాబుకు సైతం..
- అప్పీల్‌కు వీలుగా తీర్పు అమలు నాలుగు వారాలు నిలుపుదల



ఈనాడు, అమరావతి: న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులకు వక్రభాష్యం చెబుతూ అధికారులు వాటిని అమలు చేయకుండా ఉండటానికి వీల్లేదని హైకోర్టు తేల్చిచెప్పింది. కోర్టు ఉత్తర్వులను యథాతథంగా అమలు చేయడమే అధికారుల బాధ్యత అని స్పష్టంచేసింది. న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులను అమలుచేయని పాఠశాల విద్యాశాఖ పూర్వ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, ఇంటర్మీడియట్ బోర్డు అప్పటి కార్యదర్శి ఎంవీ శేషగిరిబాబులకు నెల రోజుల సాధారణ జైలుశిక్ష, రూ. 2 వేల చొప్పున జరిమానా విధిస్తూ ఇటీవల తీర్పు ఇచ్చింది. వారిద్దరి తరఫు న్యాయవాదుల అభ్యర్థన మేరకు తీర్పు అమలును నాలుగు వారాలు సస్పెండ్ చేసింది. తమ తీర్పుపై అప్పీల్ కోర్టు స్టే ఇవ్వకపోతే జైలుశిక్ష అమలు నిమిత్తం ఈ నెల 21న హైకోర్టు రిజిస్ట్రార్ జ్యుడిషియల్ ముందు లొంగిపోవాలని ప్రవీణ్‌ప్రకాష్, శేషగిరిబాబుకు స్పష్టం చేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు గత నెల 24న ఈ మేరకు తీర్పు ఇచ్చారు.

■ ఇంటర్మీడియట్ బోర్డులో పరిపాలన అధికారి(ఏఓ)గా పనిచేసిన ఎం.విజయలక్ష్మి 2022 ఆగస్టు 31న పదవీవిరమణ చేశారు. ఆర్థికశాఖ 2022 జనవరి 31న జీఓ 15 జారీ చేస్తూ ప్రభుత్వ ఉద్యోగుల పదవీవిరమణ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంచింది. తనను 62 ఏళ్ల వరకు సర్వీసులో కొనసాగించాలని ఇంటర్ బోర్డు కార్యదర్శికి ఆమె వినతి సమర్పించారు. సానుకూలంగా స్పందించకపోవడంతో 2023లో హైకోర్టులో వ్యాజ్యం వేశారు. విచారణ జరిపిన న్యాయమూర్తి.. ఆమెను 62 ఏళ్ల వరకు సర్వీసులో కొనసాగించాలని అధికారులను ఆదేశిస్తూ 2023 ఫిబ్రవరిలో ఉత్తర్వులిచ్చారు. ఈ ఆదేశాలను అధికారులు అమలు చేయకపోవడంతో విజయలక్ష్మి హైకోర్టులో కోర్టు ధిక్కరణ వ్యాజ్యం వేశారు.

ఇంటర్మీడియట్ బోర్డు 'కంపెనీ చట్టం' కింద ఏర్పడిందని, ఈ నేపథ్యంలో బోర్డులో పనిచేసిన పిటిషనర్‌కు ప్రభుత్వ ఉద్యోగుల్లా 60 నుంచి 62 ఏళ్లకు పదవీ విరమణ వయస్సును పెంచడం సాధ్యం కాదని మరో ప్రతివాది శేషగిరిబాబు చేసిన వాదనను న్యాయమూర్తి తోసిపుచ్చారు. చట్ట నిబంధనలను పరిశీలిస్తే.. బోర్డు ఉద్యోగులు అన్ని విషయాల్లో ప్రభుత్వ ఉద్యోగులతో సమానమన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల్లా బోర్డు ఉద్యోగులు 62 ఏళ్ల పదవీవిరమణ వయస్సు పొందేందుకు అనర్హులని భావించడం చట్టాన్ని తప్పుగా అర్థం చేసుకోవడమేనన్నారు. మరోవైపు కార్పొరేషన్ల ఉద్యోగుల పదవీవిరమణ వయస్సు విషయంలో హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పును కారణంగా చూపుతూ తమ తీర్పును అమలు చేయకపోవడాన్ని తప్పుపట్టారు. కోర్టు ఆదేశాలను అమలు చేయనందుకు కనీసం క్షమాపణలు చెప్పేందుకు శేషగిరిబాబు యత్నించలేదన్నారు.

తప్పయినా.. ఒప్పయినా కట్టుబడాల్సిందే

న్యాయస్థానం ఆదేశాలు జారీచేశాక అందులో లోపాలను వెతక్కుండా వాటిని యథాతథంగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఒకవేళ కోర్టు ఉత్తర్వులు చట్ట నిబంధనలకు భిన్నంగా ఉన్నాయనుకుంటే అప్పీల్ దాఖలు చేసుకోవచ్చని గుర్తుచేశారు. న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులు తప్పయినా, ఒప్పయినా వాటి అమలుకు అధికారులు కట్టుబడి ఉండాలన్నారు. ప్రస్తుత కేసులో శేషగిరిబాబు కోర్టు ఉత్తర్వులను ధిక్కరించారని స్పష్టంచేశారు. కోర్టుధిక్కరణ వ్యాజ్యంపై ప్రవీణ్‌ప్రకాష్‌కు సమాచారం ఉన్నా కౌంటర్ వేయలేదని, ఇంటర్ బోర్డు కార్యదర్శి శేషగిరిబాబుకు సరైన మార్గనిర్దేశం చేయలేదని తప్పుపట్టారు. ఇద్దరికీ నెలరోజుల సాధారణ జైలుశిక్ష, రూ.2వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. పిటిషనర్ తరఫున న్యాయవాది బాచిన హనుమంతరావు వాదనలు వినిపించారు.



సమస్యల గురించి అతిగా ఆలోచించకండి

ఒకప్పుడు మిమ్మల్ని కుదిపేసిన ఒక చేదు విషయాన్ని ఇప్పుడు తలచుకోండి.. మీకు మీరే 'అప్పుడు నేనొక మూర్ఖుడిని' అనుకుంటారు. ఎందుకంటే అప్పటి ఆ అవరోధాన్ని మీరు అవలీలగా అధిగమించారు కాబట్టి. జీవితంలో ఎదురయ్యే ప్రతి సమస్య గురించి అతిగా ఆలోచించడం మానేయండి. సమస్యలు ఇప్పుడూ ఉంటాయి, భవిష్యత్తులోనూ వస్తాయి అన్న విషయాన్ని గుర్తుంచుకోండి. వాటిని అధిగమించే ప్రయత్నం చేస్తూనే ఆనందంగా జీవించడానికి మార్గాలను అన్వేషించండి.

– రోమన్ సైనీ, వ్యాపారవేత్త

పెట్టుబడిదారుల కోసం త్వరలో
ప్రత్యేక యాప్

- సందేహాల నివృత్తి.. పరిశ్రమల ఏర్పాటుకు సహకారం
- డాలస్ సదస్సులో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడి



ఈనాడు, అమరావతి: పెట్టుబడిదారుల సందేహాలను నివృత్తి చేయడంతోపాటు పరిశ్రమల ఏర్పాటుకు సహకారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొస్తోందని సూక్ష్మ, మధ్య, చిన్న తరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్నారై సాధికారత శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. యాప్‌లో పెట్టుబడిదారులు రిజిస్టర్ అయిన వెంటనే ప్రభుత్వ అధికారులే వర్చువల్ కాల్స్ ద్వారా వారికి అందుబాటులోకి వస్తారని తెలిపారు. అనుమతులు సులభంగా పొందేందుకు త్వరలోనే పోర్టల్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఎన్ఆర్ఐలు తగిన ప్రతిపాదనలతో ముందుకు రావాలని కోరారు. 10 రోజుల అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి మంగళవారం డాలస్‌లో ఎన్ఆర్ఐ తెదేపా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇన్వెస్టర్స్ మీట్‌లో పాల్గొన్నారు. 'ఔత్సాహిక పెట్టుబడిదారులు తమ ప్రతిపాదనలతో ప్రభుత్వాధికారుల చుట్టూ తిరిగే రోజులకు ఎన్డీయే ప్రభుత్వంలో కాలం చెల్లింది. ఇప్పుడు అధికారులే వర్చువల్‌గా పెట్టుబడిదారులకు అందుబాటులోకి వచ్చేలా విధానాలు రూపొందిస్తున్నాం. ఫార్మా, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్, హెల్త్‌కేర్ తదితర రంగాల్లో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ స్వర్గధామం వంటిది. రాష్ట్రంలో ఏడాదికి 50 వేల మంది విద్యార్థులకు చివరి సెమిస్టర్ నుంచి ఐటీ శిక్షణ అందించనున్నాం. కేంద్ర ప్రభుత్వ సహకారంతో కెపాసిటీ బిల్డింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఇదే సరైన సమయం' అని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమానికి ఎన్ఆర్ఐ తెదేపా కన్వీనర్ కోమటి జయరాం అధ్యక్షత వహించారు. సుధీర్ చింతమనేని, కేసీ చేకూరి, రవీంద్ర చిట్టూరి, వినోద్, సతీశ్ కొమ్మన, కిశోర్ చలసాని, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఇళ్ల నుంచి చెత్త సేకరణకు రూ.500 కోట్లు అవసరం!

- ఎన్డీయేకు భారంగా మారిన నాటి తప్పిదాలు

ఈనాడు, అమరావతి: గత ప్రభుత్వం ఏ ప్రాజెక్టు సవ్యంగా నిర్వహించలేదు. నిధులు మళ్లించేసి గుత్తేదారు సంస్థలకు భారీగా బిల్లులు పెండింగ్‌లో పెట్టింది. ఆనాటి కార్యక్రమాలను కొనసాగించాలంటే ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై భారీగా భారం పడుతోంది. ఇళ్ల నుంచి రోజూ చెత్త సేకరించే ప్రాజెక్టే ఇందుకు నిదర్శనం. 2021 అక్టోబరులో 40 పట్టణ స్థానిక సంస్థల్లో ఇళ్ల నుంచి చెత్త సేకరించే కార్యక్రమాన్ని గత ప్రభుత్వం ప్రారంభించి క్రమంగా భ్రష్టు పట్టించింది. ప్రజల ముక్కుపిండి ప్రతి నెలా వసూలు చేసిన వినియోగ రుసుములను (చెత్త పన్ను) ఇతర అవసరాలకు మళ్లించేసింది. గుత్తేదారు సంస్థలతో గత సర్కారు చేసుకున్న ఒప్పందం ప్రకారం కార్యక్రమాన్ని ప్రస్తుత ప్రభుత్వం 2026 సెప్టెంబరు వరకు కొనసాగించాలంటే.. పెండింగ్ బిల్లుల చెల్లింపులకు రూ.25 కోట్లు, భవిష్యత్తు అవసరాలకు మరో రూ. 475 కోట్లు మొత్తంగా రూ.500 కోట్లు అవసరమని అధికారులు తాజాగా అంచనాలు వేశారు.



నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో పడిఉన్న చెత్త సేకరించే ఆటోలు

ఇళ్లలోనే చెత్త... షెడ్లలో ఆటోలు

ఇళ్ల నుంచి చెత్త సేకరించి ఆటోల్లో తరలించేందుకు కనిష్ఠంగా రూ.30, గరిష్ఠంగా రూ.120 చొప్పున ప్రజల నుంచి ఏటా రూ.170 కోట్లు చొప్పున వసూలు చేసిన గత ప్రభుత్వం వాటిని ఇతర అవసరాలకు మళ్లించేసింది. మరోవైపు బిల్లులు సరిగా విడుదల చేయని కారణంగా ఆటోలు తిప్పే గుత్తేదారు సంస్థలు వాటిని షెడ్లకు చేర్చాయి. ఫలితంగా అనేక చోట్ల ఇళ్ల నుంచి చెత్త సేకరణ నిలిచిపోయి పారిశుద్ధ్య సమస్య మళ్లీ మొదటికొచ్చింది. ఉదాహరణకు నంద్యాలలో గత పది నెలలుగా చెత్త సేకరణ నిలిచిపోయింది. అప్పటివరకు తిప్పిన 31 ఆటోలను మున్సిపల్ కార్యాలయానికి పరిమితం చేశారు. విజయనగరానికి కేటాయించిన 63 ఆటోల్లో 45 వినియోగంలో ఉన్నాయి. 18 ఆటోలను పక్కన పెట్టారు. చెత్త సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించాక 40 పుర, నగరపాలక సంస్థలకు కేటాయించిన 2,182 ఆటోల్లోనూ ప్రస్తుతం 1,500 వరకే వినియోగంలో ఉన్నాయి.

రుసుముల వసూళ్లలోనూ 5 నగరపాలికల్లో నిధుల గోల్‌మాల్

వినియోగ రుసుముల వసూళ్లలోనూ భారీగా అవకతవకలు జరిగాయి. వార్డు సచివాలయాల్లో ఉద్యోగులకు గత ప్రభుత్వంలో వసూళ్ల బాధ్యత అప్పగించారు. పర్యవేక్షణ లోపించడంతో ప్రజల నుంచి వసూలు చేసిన మొత్తం ఎంత? పట్టణ స్థానిక సంస్థలకు జమైంది ఎంత? అనే దానిపై సరైన లెక్కల్లేవు. రుసుముల వసూళ్లలో పట్టణ స్థానిక సంస్థల, సచివాలయాల సిబ్బంది అప్పట్లో చాలా దందుడుకుగా వ్యవహరించారు. అయినప్పటికీ రుసుముల వసూళ్లు ప్రతి నెలా సగటున 50 శాతంలోపుగానే జరిగాయని అధికారులు ప్రస్తుత ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికల్లో పేర్కొనడం విశేషం. విజయవాడ, నెల్లూరు, కర్నూలు, విశాఖపట్నం, కాకినాడ తదితర నగరపాలక సంస్థల్లో రుసుముల వసూళ్లలో అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులున్నాయి. ఉద్యోగులతో మున్సిపల్ అధికారులు కుమ్మక్కయ్యారనే ఆరోపణలున్నాయి. వీటిపై సమగ్ర దర్యాప్తు చేయించాలని ప్రస్తుత ప్రభుత్వం యోచిస్తోంది.

కూటమి ప్రభుత్వంపై 30 నెలల చెత్త పన్ను భారం!

చెత్త పన్ను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో గుత్తేదారు సంస్థలతో గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ప్రకారం ప్రాజెక్టుని కొనసాగించేందుకు ప్రభుత్వం 30 నెలల నిర్వహణ భారాన్ని భరించాల్సి ఉంటుంది. గుత్తేదారు సంస్థలు చెత్త సేకరణకు తిప్పుతున్న ఒక్కో ఆటోకు నెలకు రూ.62 వేల చొప్పున మొత్తం ఆటోలకు నెలకు రూ.13.94 కోట్లు చెల్లించాలి. బకాయిలు పెండింగ్‌లో ఉన్న 2024 ఏప్రిల్ నుంచి 2026 సెప్టెంబరు వరకు గడువు ముగిసే నాటికి 30 నెలలకు రూ.433.91 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఇతర నిర్వహణ ఖర్చులకు మరో రూ.66.09 కోట్లు అవసరమని అధికారులు పేర్కొన్నారు. ఇందుకు సర్కారు సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలుస్తోంది.



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి రామానాయుడు

హంద్రీ-నీవా ప్రధాన కాలువ విస్తరణపై 3 రోజుల్లో నివేదిక ఇవ్వండి


చింతలపూడి ఎత్తిపోతల ఏడాదిలో పూర్తి చేయాలి • అధికారులతో మంత్రి నిమ్మల

ఈనాడు, అమరావతి: చింతలపూడి, హంద్రీ-నీవా ఎత్తిపోతల పథకాలపై జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు బుధవారం అధికారులతో సమీక్షించారు. చింతలపూడి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ఉన్న అడ్డంకులు, భూసేకరణ ప్రక్రియపై లోతుగా చర్చించారు. హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకం రెండు దశల్లోని పెండింగ్ పనులు పూర్తి చేయడంతో పాటు, కాలువ సామర్థ్యాన్ని పెంచడానికి ఎక్కడెక్కడ ఏమేం చేయాలో అడిగి తెలుసుకున్నారు. విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, హంద్రీ-నీవా సీఈలు నాగరాజు, రాంభూపాల్, కృష్ణా డెల్టా సీఈ బి.రాంబాబు తదితరులతో మంత్రి సమీక్షించారు. ఇటీవల ఆయన హంద్రీ-నీవా పథకాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి వచ్చారు.

దశాబ్దాలుగా నెరవేరని కల

హంద్రీ-నీవా అనుసంధానంలో భాగంగా రెండు దశల్లో ఉమ్మడి కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాలకు కృష్ణా జలాలను అందించాల్సి ఉంది. దశాబ్దాలుగా సాగుతున్న ఈ ప్రాజెక్టు పనులు 80 శాతం మాత్రమే పూర్తయ్యాయి. చివరి ప్రాంతాలకు నీరందించేలా ప్రధాన కాలువ విస్తరణ, లైనింగ్ పనుల్లో ఎక్కడెక్కడ ఏమేం చేయాలి? అంచనా ఖర్చు ఎంతో మూడు రోజుల్లో నివేదిక సమర్పించాలని మంత్రి ఆదేశించారు. తర్వాత దీనిపై సీఎం చంద్రబాబుతో చర్చించనున్నట్లు తెలిపారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు భూసేకరణ అడ్డంకులపై కూడా మంత్రి సమీక్షించారు. అటవీ, దేవాదాయ భూములు సేకరించాల్సి ఉన్నందున ఏలూరు జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏడాదిలోగా ఈ ప్రాజెక్టు పూర్తి చేయాల్సి ఉందన్నారు. అంతకు ముందు మంత్రి తన క్యాంపు కార్యాలయంలో మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ



విద్యుత్తు వెలుగుల్లో శ్రీవారి ఆలయం

తిరుమల, న్యూస్‌టుడే: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నవాహ్నిక సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణానికి ముందురోజు నిర్వహించే అంకురార్పణ కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం వేడుకగా నిర్వహించనున్నారు.

శ్రీవారి వాహన సేవల వేళలు ఇలా..

తేదీ	వారం	వాహన సేవల వేళలు
04:	శుక్రవారం	ధ్వజారోహణం (సాయంత్రం 5.45- 6.00) పెద్దశేష వాహనం (రాత్రి 9-11)
05:	శనివారం	చిన్నశేష వాహనం (ఉ.8-10) హంస వాహనం (రాత్రి 7-9) ★ మధ్యాహ్నం ఒంటిగంట నుంచి మూడు గంటల వరకు స్నపన తిరుమంజనం
06:	ఆదివారం	సింహవాహనం (ఉ. 8-10) ముత్యపు పందిరి వాహనం (రాత్రి 7-9) ★ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు స్నపన తిరుమంజనం
07:	సోమవారం	కల్పవృక్ష వాహనం (ఉ.8-10) సర్వభూపాల వాహనం (రాత్రి 7-9) ★ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు స్నపన తిరుమంజనం
08:	మంగళవారం	మోహిని అవతారం (ఉ.8-10) గరుడ వాహనం (సాయంత్రం 6.30-రాత్రి 11.30)
09:	బుధవారం	హనుమంత వాహనం (ఉ.8-10) గజవాహనం (రాత్రి 7-9) ★ స్వర్ణ రథోత్సవం (సాయంత్రం 4-5)
10:	గురువారం	సూర్యప్రభ వాహనం (ఉ.8-10) చంద్రప్రభ వాహనం (రాత్రి 7-9)
11:	శుక్రవారం	రథోత్సవం (ఉదయం7) అశ్వవాహనం (రాత్రి 7-9)
12:	శనివారం	చక్రస్నానం (ఉదయం 6-9) ధ్వజావరోహణం (రాత్రి 8.30-10.30)

నిరుద్యోగ యువతకు భరోసా

- ఐటీ సహా వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ.. ఉపాధి
- అమెరికా, గల్ఫ్ సహా స్థానికంగా ఉద్యోగాలు
- 4 వేల మందికి శిక్షణ... 2,400 మందికి ఉద్యోగాలు
- శిక్షణ కోసం 50 వేల మందికి పైగా నమోదు

తెదేపా ఎంపవర్‌మెంట్ సెంటర్ విజయాలు

తరుణ్ తేజది గుంటూరు జిల్లా, ఫిరంగిపురం మండలం. దిగువ మధ్యతరగతి కుటుంబం. ఓ ప్రైవేటు కళాశాలలో బీకాం (కంప్యూటర్స్) పూర్తి చేశారు. వెంటనే ఉద్యోగంలో చేరి కుటుంబ బాధ్యతలు తీసుకోవాల్సిన పరిస్థితి. తరుణ్‌కున్న డిగ్రీ అర్హతతో ఉద్యోగం పొందడం అసాధ్యంగా మారింది. సీనియర్లను సలహా అడిగితే...డిగ్రీ ఉంటే చాలదు...కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్చుకోవాలి, అకౌంట్స్, టాలీలో నైపుణ్యం పొందాలని చెప్పారు. ఇందుకోసం హైదరాబాద్, బెంగళూరులో మంచి ఇన్‌స్టిట్యూట్స్ ఉన్నాయని అక్కడికి వెళ్లి శిక్షణ తీసుకోవాలని సూచించారు. దీనికి సుమారు రూ.70 నుంచి 80 వేల ఖర్చవుతుంది. అంత ఖర్చును భరించే ఆర్థిక స్తోమత అతడి కుటుంబానికి లేదు. దీంతో ఆవేదన చెందుతున్న తరుణ్...స్నేహితుడి ద్వారా తెదేపా ఎంపవర్‌మెంట్ సెంటర్ గురించి తెలుసుకున్నారు. అందులో చేరి 3 నెలల శిక్షణను పూర్తి చేసి.. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ... మంచి జీతం సంపాదిస్తున్నారు. ఇలాంటి ఎంతో మంది నిరుద్యోగ యువతీయువకులకు శిక్షణ ఇస్తూ...దేశవిదేశాల్లో ఉద్యోగాలు కల్పిస్తూ టీడీపీ ఎంపవర్‌మెంట్ సెంటర్ ఆశాజ్యోతిగా నిలుస్తోంది.

అమెరికాలో ఉద్యోగాలు



హోటల్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాంలో శిక్షణ పొందిన విద్యార్థులు

అమెరికా తదితర దేశాల్లో ఉపాధ్యాయులు, హోటల్ సిబ్బందికి మంచి డిమాండ్ ఉండడంతో మన దగ్గర బీఈడీ, హోటల్ మేనేజ్‌మెంట్ పూర్తి చేసిన వారి కోసం ప్రత్యేక ప్రోగ్రాం నిర్వహిస్తున్నారు. మూడు వారాల నిడివి ఉన్న ప్రోగ్రాంలో.. అమెరికా యాసలో ఇంగ్లీష్ మాట్లాడటం, ఇతర కమ్యూనికేషన్ స్కిల్స్, ఫుడ్ అండ్ బెవరేజస్, వీసా కోసం చేసే ఇంటర్వ్యూను ఎలా ఎదుర్కోవాలి.. ఇలా అనేక అంశాలపై అవగాహన కల్పిస్తారు. కొందరికి ఎలక్ట్రీషియన్ కోర్సులో శిక్షణ ఇచ్చి.. గల్ఫ్ దేశాల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నారు. ఇలా సుమారు 200 మందికి అమెరికాలో, 10 మందికి గల్ఫ్‌లో ఉద్యోగాలు కల్పించారు.



శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రాలు అందజేస్తున్న చంద్రబాబు

చంద్రబాబు ఆలోచన నుంచి..

గత వైకాపా ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధి కల్పన, యువతకు నైపుణ్య శిక్షణను పూర్తిగా గాలికొదిలింది. దీంతో యువత భవిత అగమ్యగోచరంగా మారింది. ఉద్యోగాలు రాక, పక్క రాష్ట్రాలకు వెళ్లి శిక్షణ తీసుకోలేక వారు నలిగిపోతున్న తరుణంలో ప్రతిపక్షంలో ఉన్నా యువతకు ఉద్యోగాలు కల్పించాలనే తలంపుతో చంద్రబాబు కదిలారు. ఆయన సూచనతో తెదేపా ఎన్నారై విభాగం ముందుకొచ్చింది. నైపుణ్య శిక్షణ, ఉద్యోగ, ఉపాధి కల్పనపై వేమూరి రవి నేతృత్వంలో ఓ ప్రణాళిక రూపొందించారు. కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి వారి అవసరాలు తెలుసుకున్నారు. ప్రస్తుత అవసరాలకు తగ్గట్టు కోర్సుల్ని రూపొందించారు.

రూ.లక్షలయ్యే కోర్సులు ఉచితంగా..

మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో డిసెంబర్, 2022లో మొదటి బ్యాచ్ మొదలైంది. తరగతుల నిర్వహణ, కంప్యూటర్ ల్యాబ్‌లు, కార్యాలయం కోసం ఓ భవనాన్ని, కొన్ని గదులనూ పార్టీ కేటాయించింది. విద్యార్థులు తమ వివరాల్ని నమోదు చేసుకోవడానికి www.tdpempowerment.com పేరుతో ఓ వెబ్‌సైట్‌ను రూపొందించారు. ఇప్పటి వరకు ఇందులో రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల నుంచి 51,253 మంది యువత తమ వివరాల్ని నమోదు చేసుకొన్నారు. వీరిలో మూడు వేల మందికి శిక్షణ ఇవ్వగా 2,400 మందికి దేశవిదేశాల్లో, స్థానికంగా ఉద్యోగాలు కల్పించారు. ప్రైవేటు ఇన్‌స్టిట్యూట్‌లలో రూ.లక్షలు ఖర్చయ్యే కోర్సులను ఉచితంగా నేర్పిస్తున్నారు.



ఉద్యోగాల కోసం శిక్షణ పొందుతున్న ఎలక్ట్రీషియన్లు



ఎంపవర్‌మెంట్ సెంటర్‌లో తరగతుల నిర్వహణ

45 రోజు నుంచి ఆరు నెలల కాలపరిమితి

కామర్స్ విద్యార్థుల కోసం అకౌంట్స్, టాలీ.. బీటెక్, బీఎస్సీ, ఎమ్మెస్సీ విద్యార్థులకు జావా, పైథాన్, వెబ్ డెవలప్‌మెంట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డాట్.నెట్‌లో శిక్షణ ఇస్తున్నారు. దీంతో పాటు ఏదైనా డిగ్రీ విద్యార్హతతో డిజిటల్ మార్కెటింగ్ బ్యాచ్‌లను నడుపుతున్నారు. వీరికి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విజయవాడ, మంగళగిరిలోని వివిధ కంపెనీలు, కాల్‌సెంటర్లలో ఉద్యోగాలు కల్పిస్తున్నారు. కోర్సును బట్టి శిక్షణ కాలపరిమితి 45 రోజుల నుంచి ఆరు నెలల వరకు ఉంటుంది. బ్యాచ్‌కు 30 మందిని తీసుకుంటారు. గతంలో ఒక బ్యాచ్‌కు 150 మందిని కూడా తీసుకున్నారు. శిక్షణలో భోజన వసతి, వారికి కావాల్సిన పుస్తక, వస్తు సామగ్రిని అందిస్తున్నారు.

బాగోగులు చూస్తున్న ఎన్నారైలు

అమెరికా, గల్ఫ్ వెళ్లిన విద్యార్థులను విమానాశ్రయంలో రిసీవ్ చేసుకోవడం నుంచి వారికి కొద్దిరోజుల పాటు ఉచిత వసతి, భోజన సదుపాయాలను టీడీపీ ఎన్నారై ప్రతినిధులు కల్పిస్తున్నారు. స్థానికంగా వారికి కావాల్సిన సహకారాన్ని అందిస్తున్నారు.

ప్రతి జిల్లాలోనూ సెంటర్..

– వేమూరి రవి, తెదేపా ఎన్నారై విభాగం ఇన్‌ఛార్జి

'భవిష్యత్తులో ప్రతి జిల్లా కేంద్రంలోనూ ఎంపవర్‌మెంట్ సెంటర్ నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. లక్ష మందికి ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. యూరోపియన్ దేశాల్లో సేవా రంగంలో అపార అవకాశాలు ఉన్నాయి. అందుకు తగ్గట్టు ఇక్కడి వారికి శిక్షణ ఇప్పిస్తాం. ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నాం'

– ఈనాడు, అమరావతి

మూడు నెలలు దాటినా.. రూ.301 కోట్లు ఇవ్వలేదు!

- వానల ముందు ప్రతిపాదనలకు.. వరదలు ముంచెత్తినా దిక్కులేదు
- జలవనరుల శాఖలో ఆగిన అత్యవసర పనులు
- ఇప్పటికీ దక్కని పాలనామోదం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో అనేక ప్రాజెక్టులు, కాలువల అత్యవసర నిర్వహణ పనులకు రూ.301 కోట్ల నిధుల విడుదలలో జాప్యం తీవ్ర సమస్యగా మారింది. జలవనరులశాఖ నుంచి ఎప్పుడో జులైలో ఆర్థికశాఖకు వెళ్లిన ఫైలు అనేక రోజుల పెండింగ్ తర్వాత నిధులివ్వకుండా వెనక్కి వచ్చింది. మళ్లీ ఆ ఫైలును కొత్త రూపంలో తిరిగి పంపినా ఇప్పటికీ నిధుల జాడ లేదు. ప్రభుత్వంలో అత్యవసర పనులు చేపట్టేందుకు ఇలా అడ్డంకులు ఎదురైతే ఎలాగన్న ప్రశ్న తలెత్తుతోంది. గత ప్రభుత్వ హయాంలో ఆర్థికశాఖలో సకాలంలో నిధులివ్వకపోవడం వల్లే గుండ్లకమ్మ గేట్లు కొట్టుకుపోయాయి. పులిచింతల నిర్వహణ పనులకూ ఇబ్బందులు ఎదురయ్యాయి. లస్కర్ల నియామకానికి అప్పట్లో ఆర్థికశాఖ అడ్డుచక్రం వేసింది. వివిధ శాఖల్లోని అత్యవసర పరిస్థితిని ఆర్థికశాఖ గమనించకపోతే ఎన్నో సవాళ్లు ఎదురవుతాయి. తాజాగా సెప్టెంబరు నెలలో బుడమేరు పొంగింది. అక్కడ వెలగలేరు రెగ్యులేటర్ తలుపులు తెరిచేందుకు అధికారులు నానా ఇబ్బందులు పడ్డారు. ప్రాజెక్టుల అత్యవసర మెకానికల్ పనులకు రూ.56 కోట్లు ప్రతిపాదించినా సకాలంలో ఇవ్వలేదు. భారీ వరదలు, వర్షాలకు సరైన నిర్వహణ పనులు లేక ఎదురైన ఇబ్బందులు ఎన్నో. ప్రాజెక్టుల, కాలువల నిర్వహణ పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు పచ్చజెండా ఊపినా ఫైలును సకాలంలో ఆమోదించక సమస్యలు తలెత్తాయి.

తగ్గించి పంపినా..

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడగానే జలవనరులశాఖ అప్రమత్తమైంది. మంత్రి నిమ్మల రామానాయుడు, అధికారులు సాయిప్రసాద్, వెంకటేశ్వరరావు రాష్ట్రంలోని అందరు సీఈలు, ఎస్ఈలను పిలిపించి వరదలు, వర్షాల నేపథ్యంలో అత్యవసరంగా చేపట్టవలసిన పనుల జాబితా ఇవ్వాలని కోరారు. ప్రతి పని అవసరాన్నీ సమీక్షించారు. తొలిదశలో పెద్దమొత్తంలో ప్రతిపాదనలు వచ్చినా ఉన్నతాధికారులు అంగీకరించలేదు. ఎంతో అత్యవసరమైతేనే ప్రతిపాదించాలన్నారు. చివరకు 2,346 అత్యవసర పనులను రూ.301 కోట్లతో ప్రతిపాదించి ఆర్థికశాఖకు జూన్ చివర్లో ఫైలు పంపారు. ఇందులో ప్రాజెక్టుల అత్యవసర మరమ్మతులకు, మెకానిక్ పనులకు రూ.56 కోట్లు, వరద రక్షణ పనులకు రూ.48 కోట్లు, పూడిక తొలగింపు, కాలువల రక్షణ పనులకు రూ.93 కోట్లు, ఒప్పంద లస్కర్ల నియామకానికి రూ.29 కోట్లు, ఇతర పనులకు రూ.57 కోట్లు.. మరికొన్ని వేరే పనులు ప్రతిపాదించారు.

ఆర్థికశాఖ నుంచి వెనక్కి

చాలా రోజులు ఈ ఫైలు ఆర్థికశాఖలోనే ఉండిపోయింది. అసలు ఏ హెడ్ కింద నిధులివ్వాలని ఆర్థికశాఖ అధికారులు సందేహం వ్యక్తం చేస్తూ వదిలేశారు. జగన్ హయాంతో పాటు.. ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్ సమయంలోనూ నిర్వహణ పనులకు అవసరమైన హెడ్‌ల కింద నిధులు కేటాయించకపోవడంతో ఆ హెడ్‌ల కింద నిధుల్లేకుండా పోయాయి. చివరకు విపత్తు నిర్వహణ నిధుల కింద ఈ పనులను ప్రతిపాదించుకోవాలని ఆర్థికశాఖ ఉన్నతాధికారి ఆ ఫైలుపై సలహా ఇస్తూ వెనక్కి పంపేశారు. ఏదైనా విపత్తు సంభవిస్తే దానివల్ల నష్టపోయినవాటికి విపత్తు నిధులు ప్రతిపాదిస్తారు. ఆ పేరు చెప్పి.. అత్యవసర నిర్వహణ పనులకు నిధులు ఇవ్వకపోవడం ఏమిటన్న ప్రశ్నలు వినిపించాయి. దాంతో మళ్లీ జలవనరులశాఖ ఆ ఫైలును రెవెన్యూశాఖకు పంపి అక్కడి నుంచి విపత్తు నిధుల ప్రతిపాదనలతో మళ్లీ సమర్పించాల్సి వచ్చింది. ప్రస్తుతం ఈ ఫైలు రాష్ట్ర అత్యున్నతాధికారి వద్ద ఉన్నట్లు సమాచారం. ఇప్పటికీ ఆ పనులకు పాలనామోదం దక్కలేదు.

రేపు తిరుమలకు చంద్రబాబు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజు శుక్రవారం జరిగే ధ్వజారోహణంలో సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు. ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఉండవల్లి నుంచి శుక్రవారం సాయంత్రం 4 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి విజయవాడలోని విమానాశ్రయం చేసుకుంటారు. అక్కడి నుంచి బయలుదేరి 5.10 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు. తిరుమలలోని పద్మావతి అతిథిగృహంలో కొంతసేపు విశ్రాంతి తీసుకుని రాత్రి 7.40 గంటలకు బేడి ఆంజనేయ స్వామిని దర్శించుకుంటారు. అనంతరం ప్రభుత్వం తరపున చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి.. శ్రీవారికి పట్టువస్త్రాలను సమర్పిస్తారు. అనంతరం మాడవీధుల్లో జరిగే పెద్దశేష వాహన సేవలో పాల్గొంటారు. రాత్రి 9.20 గంటలకు పద్మావతి అతిథిగృహం చేరుకుని రాత్రికి అక్కడే బసచేస్తారు. శనివారం ఉదయం 7.35 గంటలకు పాంచజన్యం వెనుక నూతనంగా నిర్మించిన వకుళమాత నూతన కేంద్రీయ వంటశాలను ప్రారంభిస్తారు. అనంతరం తిరుపతి విమానాశ్రయం చేరుకుని అక్కడి నుంచి హైదరాబాద్ బయలుదేరి వెళతారు.

రైల్వే ప్రాజెక్టులపై రేపు కీలక సమావేశం

జోనల్ మేనేజర్‌తో ఎంపీల భేటీ

ఈనాడు, అమరావతి: దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో మన రాష్ట్రంలో ఉన్న విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్ల పరిధిలోకి వచ్చే లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో..రైల్వే జోనల్ మేనేజర్ శుక్రవారం విజయవాడలో సమావేశం కానున్నారు. రాష్ట్రంలో చేపట్టాల్సిన రైల్వే లైన్ల నిర్మాణం, కొత్త ప్రాజెక్టులపై ఎంపీలు ఇచ్చే ప్రతిపాదనలపై ఈ సమావేశంలో చర్చిస్తారు. రాష్ట్రంలో కీలకమైన రైల్వే ప్రాజెక్టులు గత ఐదేళ్లలో పడకేశాయి. జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులేవీ పూర్తికాలేదు. విశాఖ కేంద్రంగా మంజూరైన కొత్త జోన్ కార్యాలయాల నిర్మాణానికి భూములు అప్పగించలేక వైకాపా ప్రభుత్వం చేతులెత్తేసింది. రాజధాని అమరావతికి మంజూరైన కొత్తలైన్‌ను కూడా విస్మరించింది. ఇలా గత వైకాపా ప్రభుత్వంలో రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టుల పరంగా తీవ్ర నష్టమే జరిగింది. ఇప్పుడీ నష్టాన్ని పూరించుకొని, వేగంగా ప్రాజెక్టుల పనులు చేపట్టేలా చూసేందుకు.. కొత్తవి మంజూరు చేయించేందుకు ఈ సమావేశం కీలకం కానుంది.

మరిన్ని వివరాలు https://epaper.eenadu.net లో

సత్యదేవుని ప్రసాదం కోసం విజయ నెయ్యి

అన్నవరం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుని ఆలయంలో ప్రసాదం తయారీకి వినియోగించే నెయ్యిని తాత్కాలికంగా విజయవాడలోని విజయ డెయిరీ నుంచి కొనుగోలు చేయాలని అధికారులు నిర్ణయించారు. నెయ్యి సరఫరా చేస్తున్న టెండరుదారు రైతు డెయిరీ గడువు సెప్టెంబరు 30తో ముగిసింది. అయితే ప్రస్తుతం ఆలయాల్లో వినియోగిస్తున్న నెయ్యి నాణ్యతపై చర్చ జరుగుతోంది. మరోవైపు నెయ్యి కొనుగోలుపై దేవాదాయశాఖ నుంచి ఇంకా ఎటువంటి మార్గదర్శకాలు రాలేదు. అక్టోబరు 1 నుంచి నెయ్యి సరఫరాకు టెండరు ఖరారైనా ప్రస్తుత పరిస్థితుల్లో ఇంకా అనుమతి ఇవ్వలేదు. ప్రసాదం తయారీకి నెయ్యి నిల్వలు తక్కువగా ఉన్నాయి. దీంతో తాత్కాలికంగా విజయ డెయిరీ నుంచి నెయ్యిని కొనుగోలు చేయాలని నిర్ణయించారు. దేవాదాయశాఖ మార్గదర్శకాలు వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

నదీమ తల్లికి నవహారతులు



నదీమ తల్లికి ఇస్తున్న నవహారతులు

విజయవాడ దుర్గా ఘాట్ కళకళలాడుతోంది. దసరా నుంచి కృష్ణమ్మకు నవ హారతులు ఇవ్వాలని అధికారులు ఘాట్‌లో ఏర్పాట్లు చేశారు. మంగళవారం రాత్రి నుంచే హారతుల ట్రయల్ రన్ కూడా ప్రారంభించారు. ఈ దసరా నుంచి రోజూ హారతులు ఇవ్వనున్నారు. గత తెదేపా ప్రభుత్వం 2014 నుంచి 2019 వరకు ఫెర్రీ ఘాట్‌లో పంచ హారతులు ఇవ్వగా.. వైకాపా ప్రభుత్వం దీన్ని అంతగా పట్టించుకోలేదు. దీంతో ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం ఈ సంప్రదాయాన్ని నవ హారతులుగా ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించింది.

– ఈనాడు, అమరావతి

రేపటి నుంచి అంతరిక్ష వారోత్సవాలు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్‌లో శుక్రవారం నుంచి ఈ నెల పదో తేదీ వరకు ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు డైరెక్టర్ రాజరాజన్ పేర్కొన్నారు. షార్ ఆధ్వర్యంలో మూడు రాష్ట్రాల్లో ఎనిమిది ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రంలో శ్రీహరికోట (4, 10 తేదీల్లో), భీమవరంలో 6, 7 తేదీల్లో, నరసరావుపేట (7-9), నెల్లూరు(7-9), కడప(7-9), తమిళనాడులోని దిండిగల్(8, 9), ధర్మపురి(7-9), ఒడిశాలోని బర్గర్(4-6) తేదీల్లో వారోత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. ఇస్రో సీనియర్ శాస్త్రవేత్తలు ఉపన్యాసాలు ఇస్తారని, ప్రయోగాలు, ఉపగ్రహాల ప్రదర్శనలు, విద్యార్థులకు వివిధ పోటీలు ఉంటాయని ఆయన వివరించారు.

మృత్యు రహదారిలా ఎన్‌హెచ్-69

- ఐదేళ్లలో 376 మరణాలు.. మొగిలి ఘాట్‌లోనే 90



సెప్టెంబరు 13న మొగిలిఘాట్‌లో ఆర్టీసీ బస్సును ఢీకొన్న రెండు లారీలు

ఈనాడు, చిత్తూరు: చిత్తూరు జిల్లా మీదుగా వెళ్లే చెన్నై- బెంగళూరు జాతీయ రహదారి (ఎన్‌హెచ్-69) తరచూ రక్తమోడుతోంది. గత ఐదేళ్లలో ఈ మార్గంలో 700 ప్రమాదాలు జరగ్గా, వాహనదారులు, పాదచారులు కలిపి 376 మంది మృతిచెందారు. 900 మందికి పైగా గాయపడ్డారు. ముఖ్యంగా బంగారుపాళ్యం మండలంలో 2 కి.మీ పొడవైన మొగిలిఘాట్‌లో 90 మంది ప్రాణాలు కోల్పోయారు. తాజాగా సెప్టెంబరు 13-28 వరకు 16 రోజుల్లోనే 11 మంది చనిపోయారు. ఇన్ని ప్రమాదాలు, మరణాలు నమోదవుతున్నా, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ), రోడ్డు నిర్మాణ గుత్తేదారు స్పందించడం లేదు. రాష్ట్ర పోలీసు, రవాణా విభాగాలే తాత్కాలిక చర్యలతో సరిపెడుతున్నాయి.

ఇంజినీరింగ్ తప్పిదాలకు అధిక వేగం తోడై..

దక్షిణాదిన రెండు పెద్ద రాజధానులైన చెన్నై-బెంగళూరును కలిపే కీలక రహదారి అయిన ఎన్‌హెచ్-69 చిత్తూరు జిల్లాలో 84 కి.మీ. దూరం ఉంది. ఈ మార్గంలో ఆక్వా, పౌల్ట్రీ ఉత్పత్తులతో పాటు పూలు, పండ్ల రవాణా అధికం. వీటిని సకాలంలో గమ్యస్థానాన్ని చేర్చాలన్న లక్ష్యంతో వాహనాలను డ్రైవర్లు వేగంగా నడుపుతున్నారు. గ్రానైట్, వ్యవసాయ సరకులతో భారీ లారీలు తిరుగుతుంటాయి. ఈ రహదారిని అనుసంధానిస్తూ కాణిపాకం, తిరుమల, శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. దూరప్రాంతాల నుంచి వచ్చే డ్రైవర్లకు ఈ మార్గంపై అవగాహన ఉండదు. పైగా మొగిలిఘాట్ వద్ద ఇంజినీరింగ్ తప్పిదాలు దొర్లాయి. ఇక్కడ ఘాట్ 'ఎస్' ఆకారంలో ఉండటం, రోడ్డు సిమెంట్‌తో వేసింది కావడంతో గ్రిప్ లేకపోవడం, కనుమ దిగేటప్పుడు వాహనాల వేగం పుంజుకోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. డివైడర్ ఎత్తు తక్కువగా ఉండటంతో వాహనాలు ఆవలి వైపునకు వెళ్లి మరీ పడిపోతున్నాయి. గతంలో ఇక్కడి ట్రాఫిక్ బూత్‌లో ఓ కానిస్టేబుల్ పర్యవేక్షించేవారు. కొన్నాళ్ల క్రితం ఈ బూత్‌ను ఎత్తివేశారు. సెప్టెంబరు 13న మొగిలిఘాట్‌లో ఆర్టీసీ బస్సును రెండు లారీలు ఢీకొన్న ఘటనలో 8 మంది చనిపోయినా, ఎన్‌హెచ్ఏఐ స్పందించలేదు. గంగాసాగరం, యాదమరి మార్గంలోనూ అనేక బ్లాక్‌స్పాట్లు ఉన్నాయి. ఈ మార్గంలో ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

మైలవరం టెక్స్‌టైల్స్ పార్కు పూర్తికి చర్యలు

- ఏడాదిలోగా సిద్ధం చేయాలని ప్రభుత్వ నిర్ణయం
- ఉత్పత్తి యూనిట్ల ఏర్పాటుకు ప్లాట్ల కేటాయింపు పూర్తి



వైఎస్సార్ జిల్లా మైలవరంలోని టెక్స్‌టైల్స్ పార్కు

ఈనాడు, అమరావతి: వైఎస్సార్ జిల్లా మైలవరంలో ఏళ్లుగా మూలకు చేరిన టెక్స్‌టైల్స్ పార్కు నిర్మాణాలను పూర్తి చేసేందుకు ఎన్డీయే ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏడాదిలో పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభించేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. 2005-06 ఏడాదిలో టెక్స్‌టైల్స్ పార్కుకు 62.18 ఎకరాలు కేటాయించగా....కొద్ది మేర అప్పట్లో పనులు జరిగాయి. ఆ తర్వాత అటకెక్కింది. తాజాగా కొలువుదీరిన ఎన్డీయే ప్రభుత్వం మొదటి వంద రోజుల్లోనే పార్కు ఏర్పాటు పనుల్లో వేగం పెంచింది. ఇప్పటికే వివిధ రకాల ఉత్పత్తి యూనిట్ల ఏర్పాటుకుగాను 97 మందికి ప్లాట్ల కేటాయింపు కూడా పూర్తయింది.

10 వేల మందికి ఉపాధి: వైఎస్సార్ జిల్లాలో చేనేతలు అత్యధికంగా మైలవరం, జమ్మలమడుగు తదితర చుట్టుపక్కల ప్రాంతాల్లోనే ఉన్నారు. ఇక్కడ టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటు చేయాలనేది చాలా కాలంగా ఉన్న డిమాండ్. ఈ పార్కు ఏర్పాటైతే 3 వేల మందికి ప్రత్యక్షంగా, మరో 7 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభించనుంది. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు ద్వారా చేనేత కార్మికుల ఆదాయ వనరులు పెరగనున్నాయి. ఆ ప్రాంత రూపురేఖలు మారనున్నాయి. మొత్తం ఇక్కడ 118 యూనిట్లు ఏర్పాటుకానున్నాయి. ఇందులో చేనేత, పవర్‌లూమ్స్, డైయింగ్, గార్మెంట్స్, డ్రాయింగ్, స్టిచింగ్, సిల్క్ ట్విస్ట్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారు.

యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు..: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో త్వరితగతిన టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ శివశంకర్ చర్యలు తీసుకుంటున్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఉత్పత్తి ఏర్పాట్లకుగాను ఒక్కొక్కరికి రూ.50 లక్షల చొప్పున రుణాలు అందించేందుకు బ్యాంకులతో సంప్రదింపులు పూర్తి చేశారు. ఇందులో లబ్ధిదారు వాటా రూ.2.5 లక్షలుకాగా... ప్రభుత్వం రూ.17.5 లక్షల గ్రాంట్‌గా అందించనుంది. మిగతా మొత్తాన్ని రుణ వాయిదాల్లో బ్యాంకులకు చెల్లించాలి. రాష్ట్ర ప్రభుత్వం మీద ఆర్థిక భారం లేకుండా సెల్ఫ్ ఫైనాన్స్ ద్వారా పార్కు ఏర్పాటుకు కలెక్టర్ చర్యలు తీసుకుంటున్నారు.

మహిళల్లో రన్నింగ్ అలవాటు పెరగాలి



శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవడానికి చాలా సులువైన మార్గం రన్నింగ్ చేయడం. మీకు ఒక జత బూట్లు, సంకల్పం ఉంటే చాలు. ఉదయాన్నే ఆరుబయట పరిగెత్తడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఫిట్‌నెస్ పెరగడంతో పాటు ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుంది. రన్నింగ్‌పై ఆసక్తి ఉన్న అన్ని వయసులవారిని ఒక్కచోటుకు చేర్చే ఈ అలవాటు కొత్త స్నేహితులను పరిచయం చేస్తుంది. అయితే మన దేశంలో రన్నింగ్ చేసేవారి సంఖ్య ఇప్పటికీ చాలా తక్కువ ఉంది. అందులోనూ మహిళలు 10 శాతం కంటే తక్కువ ఉన్నారు. ఈ సంఖ్య పెరగాలి.

– షాజన్ శామ్యూల్, మారథాన్ రన్నర్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగదుర్గారావు. చిత్రంలో నిందితుడు శివమణి

ఆడబిడ్డను అమ్మకానికి పెట్టాడు.. ఎవరూ కొనలేదని మట్టుపెట్టాడు!

కాకినాడ (మసీదు సెంటర్), న్యూస్‌టుడే: అమ్మాయి పుడితే ఇంటికి మహాలక్ష్మి వచ్చిందని అంతా మురిసిపోతారు. ఆ కసాయి తండ్రి మాత్రం అలా అనుకోలేదు. ఆ ఆడబిడ్డను అమ్మడానికి ప్రయత్నించాడు. ఎవరూ రాకపోవడంతో అభంశుభం తెలియని 35 రోజుల శిశువును చంపి పరారయ్యాడు. పోలీసులు 24 గంటల్లోనే అతడిని పట్టుకున్నారు. కాకినాడ వన్‌టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు బుధవారం తెలిపిన వివరాల మేరకు.. కాకినాడ జగన్నాథపురం చెక్కవారి వీధిలో ఉండే భవాని భర్త కేత శివమణి వ్యసనాలకు బానిసయ్యాడు. ఆదాయం సరిపోక వీరికి పుట్టిన అబ్బాయిని గతంలో విశాఖపట్నానికి చెందినవారికి అమ్మేశాడు. 35 రోజుల క్రితం పుట్టిన ఆడ శిశువునూ అమ్మకానికి పెట్టాడు. కొనేందుకు ఎవరూ రాకపోవడంతో మంగళవారం మధ్యాహ్నం శిశువును గోడకేసి బలంగా కొట్టి, పీక నొక్కి చాప మీద పడేసి వెళ్లిపోయాడు. పాప ఎంతసేపటికీ కదలకపోవడంతో తల్లి అనుమానంతో జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. తల్లి ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదుచేశారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం ఆధారాలతో శివమణిని బుధవారం సాయంత్రం అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

వామ్మో.. 24% మంది డుమ్మా!

- పాఠశాలలకు భారీగా గైర్హాజరవుతున్న విద్యార్థులు

ఈనాడు, అమరావతి: పాఠశాలల రిజిస్టర్లలో విద్యార్థుల పేర్లు ఉంటాయి.. కానీ, తరగతులకు హాజరు కారు.. వారు ఎక్కడున్నారో తెలియని పరిస్థితి. వైకాపా ప్రభుత్వంలో బడి మానేస్తున్న వారిని తగ్గించి చూపేందుకు చేసిన గిమ్మిక్కులు ఇప్పుడు బయటపడుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా గత వారం రోజుల్లో పాఠశాలలకు సరాసరిన గైర్హాజరవుతున్న విద్యార్థులు 24.3% మంది ఉన్నారు. ఇంత భారీ సంఖ్యలో గైర్హాజరు నమోదవుతున్నా.. ఇప్పటివరకు పట్టించుకోలేదు. ప్రభుత్వ, ప్రైవేటు బడుల్లో కలిపి 70.37 లక్షల మంది విద్యార్థులు ఉండగా.. సరాసరిన 53.28 లక్షల చొప్పున మాత్రమే హాజరు నమోదవుతోంది. ప్రభుత్వ, ఎయిడెడ్ కలిపి 36.02 లక్షల మంది ఉండగా.. ఇక్కడా అలాంటి పరిస్థితే. పట్టణాల్లో హాజరు కొంచెం ఎక్కువగా నమోదవుతుండగా.. గ్రామీణ ప్రాంతాల్లో తక్కువగా ఉంటోంది. వ్యవసాయ పనులు, పండగలు, స్థానికంగా నిర్వహించే జాతరలు, సీజనల్ వ్యాధులు, వరదల కారణంగా పిల్లల గైర్హాజరు ఉంటున్నట్లు క్షేత్రస్థాయి అధికారులు చెబుతున్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. అసలు రికార్డుల్లో ఉన్న పిల్లలందరూ బడికి వస్తున్నారా? రాకపోవడానికి కారణాలేంటో తెలుసుకోవాలని విద్యా శాఖ మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు.

ఆధార్ అనుసంధానంలోనూ జాప్యమే

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు బడుల్లో చదువుతున్న 15 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన ఆధార్ వివరాలు అనుసంధానం కాలేదని పాఠశాల విద్యా శాఖ ఇటీవల తేల్చింది. 1.19 లక్షల మంది విద్యార్థుల ఫోన్ నంబర్లు తప్పుగా నమోదైనట్లు గుర్తించింది. వీటిని సరిచేయాలని క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలిచ్చింది. ఆధార్ లేని వారు దసరా సెలవుల్లో తీసుకోవాలని సూచించింది. ప్రభుత్వ, ప్రైవేటు బడుల్లో ఏటా సరాసరి ప్రవేశాలు 6 లక్షల వరకు ఉంటాయి. 15 లక్షల మంది ఆధార్ అనుసంధానం కాలేదంటే కొన్నేళ్లుగా బడులకు వస్తున్న వారి వివరాలు నమోదు కాలేదని అర్థమవుతోంది. వ్యవస్థలో ఇన్ని లోపాలుంటే విద్యార్థులను కచ్చితంగా ట్రాకింగ్ చేసే పరిస్థితి ఉండదు.



ఏడాదిలో 20 రోజులు మించితే తీవ్రమే

విద్యా సంవత్సరంలో విద్యార్థి 20 రోజులకు మించి బడికి రాకపోతే దాన్ని దీర్ఘకాలిక గైర్హాజరుగా పరిగణించాల్సి ఉంటుంది. ఈ కారణంగా వారు అభ్యసనలో వెనకబడిపోతారు. పాఠాలు సరిగా అర్థంకావు. దీంతో వారు మధ్యలో చదువు మానేసే ప్రమాదం ఉంటుంది. అలాంటి విద్యార్థులు బడికి వచ్చినా.. వారికి ప్రత్యేకంగా తరగతులు నిర్వహించడం లేదు. వీరిపై ప్రత్యేక శ్రద్ధ చూపకపోతే చదువుపై ఆసక్తి తగ్గిపోతుంది. ఫిన్లాండ్ లాంటి దేశాల్లో విద్యార్థుల గైర్హాజరు 2.8 శాతం మాత్రమే ఉంటోంది. మన దగ్గర 10 శాతం బడి మానేసినా పట్టించుకునే పరిస్థితి ఉండటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వరసగా నెల రోజులు తరగతులకు హాజరవ్వకపోతే చాలాచోట్ల వారి పేర్లు డ్రాప్ బాక్సులో పెడుతున్నారు. కానీ, వారు ఎందుకు రావడం లేదో తెలుసుకోవడం లేదు.

గత ప్రభుత్వంలో గిమ్మిక్కులు

బడి బయట ఉన్న పిల్లలు, చదువు మధ్యలో మానేస్తున్న వారిని తగ్గించి చూపేందుకు గత వైకాపా ప్రభుత్వంలో అనేక గిమ్మిక్కులు చేశారు. కర్నూలు లాంటి జిల్లాల్లో పనుల కోసం తల్లిదండ్రులతోపాటు పిల్లలూ వలస వెళ్తారు. కొన్నిచోట్ల వ్యవసాయ పనులకు వెళ్తారు. ఇలాంటి సమయంలో హాజరు తగ్గిపోతుంది. వీరికోసం సీజనల్ వసతిగృహాలు నిర్వహించాల్సి ఉన్నా.. గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎక్కువ రోజులు బడికి రాని విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో డ్రాపౌట్ బాక్సులో పెట్టగా.. వాటిని వెనక్కి తీసుకోవాలంటూ గత ప్రభుత్వంలో ఉపాధ్యాయులపై ఒత్తిడి తెచ్చారు. బడి బయట పిల్లల సంఖ్యను తక్కువగా చూపేందుకు అప్పటి విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ ఒత్తిడితో పాఠశాలల నుంచి వెళ్లిపోయిన వారి పేర్లను కొన్నిచోట్ల రికార్డుల నుంచి తొలగించలేదు. ఇలాంటివి గైర్హాజరు సంఖ్య ఎక్కువగా ఉండటానికి కారణాలుగా నిలుస్తున్నాయని విద్యావేత్తలు పేర్కొంటున్నారు.

ఏకలవ్య పాఠశాలలను వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ



లకేయిపుట్టులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర తదితరులు

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పెదబయలు మండలం లకేయిపుట్టు, అరకులోయ మండలం బొండాం పంచాయతీ మజ్జివలస, చింతపల్లిల్లో కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలను బుధవారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఝార్ఖండ్ నుంచి వర్చువల్‌గా పాల్గొని ప్రారంభించారు. హుకుంపేట మండలం నక్కలపుట్టు, అనంతగిరి మండలం పాతకోటలో భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. లకేయిపుట్టులో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ దినేష్‌కుమార్, జిల్లా పరిషత్తు అధ్యక్షురాలు సుభద్ర ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు.

విశాఖ స్టీల్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

- ఒప్పంద కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి: షర్మిల



కార్మికుల దీక్షలో మాట్లాడుతున్న షర్మిల

విశాఖపట్నం (ఉక్కు నగరం), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు పరిశ్రమలో పనిచేస్తున్న ఒప్పంద కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే కర్మాగారం ఆవరణలోనే నిరాహార దీక్ష చేస్తానని, అవసరమైతే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని విశాఖకు తీసుకొస్తామని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హెచ్చరించారు. బుధవారం విశాఖ వచ్చిన ఆమె కూర్మన్నపాలెంలో కార్మికుల ఆందోళనలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఆంధ్రుల హక్కు అయిన విశాఖ ఉక్కును ప్రైవేటీకరించాలని చూస్తే ప్రతిఘటిస్తామన్నారు. 30 ఏళ్లుగా పనిచేస్తున్న 4 వేల మంది ఒప్పంద కార్మికుల పట్ల యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరును ఆమె ఖండించారు. 'పదేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్టీల్ ప్లాంట్‌ను పట్టించుకోనందునే ఉత్పత్తి తగ్గి, నష్టాలు వస్తున్నాయి. మాజీ సీఎం జగన్‌కు ఈ నష్టాల గురించి తెలియకపోవడం విడ్డూరం. ప్లాంట్ పరిరక్షణకు గత ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీ నేటికీ అమల్లోకి రాలేదు. పరిశ్రమ భూములపై ప్రధాని మోదీ కన్ను పడింది. అందుకే కార్మికులు 1,300 రోజులుగా దీక్షలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడంతో పాటు సొంత గనులు కేటాయించి, కార్మికుల తొలగింపు ప్రయత్నాలు మానుకొని, 14 వేల మంది ఒప్పంద కార్మికుల్ని క్రమబద్ధీకరించాలని షర్మిల డిమాండ్ చేశారు.

నెయ్యి కల్తీపై సీబీఐతో దర్యాప్తు చేయించాలి

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదానికి వాడే నెయ్యి కల్తీ అయ్యిందన్న ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వ తీరు సరిగాలేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిందని షర్మిల పేర్కొన్నారు. విశాఖ కార్పొరేషన్ సమీపంలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించిన తర్వాత ఆమె మీడియాతో మాట్లాడారు. నెయ్యి కల్తీ వ్యవహారంపై కేంద్రం సీబీఐతో దర్యాప్తు జరిపించాలని కోరారు. మతాన్ని రాజకీయ స్వార్థానికి వాడుకునేందుకు చంద్రబాబు, పవన్, జగన్ పోటీ పడ్డారని ఆమె విమర్శించారు.

విచారణకు జోగి రమేష్ సహకరించడం లేదు

- ఈ విషయాన్ని సుప్రీంకోర్టుకు విన్నవిస్తాం
- మరోసారి నోటీసులిచ్చి పిలుస్తాం
- గుంటూరు ఉత్తర డీఎస్పీ మురళీకృష్ణ



విచారణకు హాజరయ్యేందుకు మంగళగిరి పోలీసుస్టేషన్‌కు వచ్చిన మాజీ మంత్రి జోగి రమేష్

ఈనాడు-అమరావతి, మంగళగిరి, న్యూస్‌టుడే: తెదేపా అధినేత నారా చంద్రబాబునాయుడి ఇంటిపై దాడి కేసులో వైకాపా మాజీ మంత్రి జోగి రమేష్ విచారణకు సహకరించడం లేదని గుంటూరు ఉత్తర మండల డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. మంగళగిరి పోలీసుస్టేషన్‌లో రమేష్‌ను బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విచారించారు. గత వారం ఆయన అనుచరులను విచారించిన విషయం తెలిసిందే. ఘటన జరిగిన రోజు ఎవరెవరు ఆ దాడిలో పాల్గొన్నారన్న వివరాలను అప్పుడు విధుల్లో ఉన్న పోలీసులను అడిగి అధికారులు తెలుసుకున్నారు. వీటి ఆధారంగా జోగి రమేష్‌కు పలు ప్రశ్నలు వేసి సమాచారం నిర్ధారించుకునే ప్రయత్నం చేశారు. ఈ విచారణ అనంతరం డీఎస్పీ మురళీకృష్ణ విలేకరులతో మాట్లాడారు. 'చంద్రబాబు ఇంటిపై దాడి కేసులో ప్రథమ నిందితుడు జోగి రమేష్ విచారణకు సహకరించని విషయాన్ని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్తాం. నిందితులకు ఇచ్చిన రక్షణ తొలగించాలని అఫిడవిట్ దాఖలు చేస్తాం. విచారణలో ఇప్పటివరకు గుర్తించిన అంశాలతోపాటు సాక్షులు చెప్పిన విషయాలకు.. గతంలో జోగి రమేష్ చెప్పిన అంశాలకూ మధ్య పొంతన లేదు. ఈ విషయాలపై స్పష్టత కోసం కొన్ని సాక్ష్యాలను అందించాలని కోరితే కొన్నింటికే సమాధానాలిచ్చారు. అవసరమైతే మరోసారి నోటీసులిచ్చి విచారణకు పిలుస్తాం. విచారణలో 27 ప్రశ్నలు వేయగా కొన్నింటికి పొంతన లేని, వాస్తవ విరుద్ధమైన సమాధానాలు చెప్పారు. విచారణలో ఉన్నందున అన్ని వివరాలూ బహిర్గతం చేయలేం. జోగి రమేష్ నుంచి సామాజిక మాధ్యమాల ఖాతాలు సేకరించాం. వాటిని కూడా పరిశీలిస్తాం. సెల్‌ఫోన్ అప్పగించాలని కోరితే ఇప్పటికీ ఇవ్వలేదు. దాడి సమయంలో వినియోగించిన సిమ్ ఇచ్చి దర్యాప్తునకు సహకరించాలని కోరినా ఆయన స్పందించలేదు. ఇప్పటికే నాలుగుసార్లు విచారించాం. పొంతన లేని సమాధానాలు చెబుతుండడంతో మళ్లీమళ్లీ పిలవాల్సి వస్తోంది. ఇప్పటివరకు 8 సెల్‌ఫోన్లు, ఐదు పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకున్నాం. జోగి రమేష్‌కు పాస్‌పోర్టు ఉన్నా అది మన గడలో లేదు' అని డీఎస్పీ వివరించారు.

రిజిస్ట్రార్‌గా రామప్రసాద్‌రెడ్డి నియామకంపై విద్యార్థుల ఆగ్రహం

- కళంకితుడికి కీలక పదవి ఎలా ఇస్తారని కడపలో ఆందోళన
- పదవి నుంచి తొలగించాలని డిమాండు



రిజిస్ట్రార్ రామప్రసాద్‌రెడ్డి



వీసీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

ఈనాడు, కడప: కడపలోని యోగి వేమన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌గా ఆచార్య రామప్రసాద్‌రెడ్డిని నియమించడంపై విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆయన విద్యార్థినులను వేధించారనే అభియోగాలు ఎదుర్కొన్నారు. దీనిపై త్రిసభ్య కమిటీ విచారణ చేపట్టి వాస్తవాలుగా తేల్చింది. అయినా.. ఆయనకు ఏకంగా రిజిస్ట్రార్ పదవి కట్టబెట్టడంపై విద్యార్థి సంఘాలు బుధవారం ఆందోళనకు దిగాయి. ఆయనను నియమించిన వీసీ కృష్ణారెడ్డి దిష్టిబొమ్మను కడపలో దహనం చేసి తీవ్ర నిరసన తెలిపాయి. రామప్రసాద్‌రెడ్డి 2010 డిసెంబరులో తెలుగుశాఖ విద్యార్థులను విజ్ఞాన యాత్రకు తీసుకెళ్లారు. ఆ సందర్భంగా విద్యార్థినులను లైంగికంగా, మానసికంగా వేధించారంటూ అప్పటి ఉపకులపతికి పలువురు రాతపూర్వక ఫిర్యాదు చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని వర్సిటీలో ఆందోళనలు చేశారు. చివరికి వర్సిటీ ఆరోపణలపై విచారణకు త్రిసభ్య కమిటీ వేసింది. విచారణలో ఆరోపణలు నిజమేనని తేలాయి. దీంతో రామప్రసాద్‌రెడ్డికి 2 ఇంక్రిమెంట్ల నిలిపివేత, మూడేళ్ల పాటు ఆయనకు మహిళా పరిశోధకులను కేటాయించొద్దని, మూడేళ్లపాటు పరిపాలన పరమైన పదవులకు దూరంపెట్టాలని అధికారులు నిర్ణయించారు. అయితే రామప్రసాద్‌రెడ్డి అప్పటి పాలకమండలి సభ్యులను, ఉపకులపతిని చేతిలో పెట్టుకొని చర్యలకు సంబంధించిన పత్రాలు ఎవరికంటా కనపడకుండా చేశారనే విమర్శలున్నాయి. పైగా.. వైకాపా హయాంలో పలు పదవులు అనుభవిస్తూ చేతివాటం ప్రదర్శించారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. సమాచార హక్కు ద్వారా సేకరించిన విచారణ కమిటీ నివేదికనూ విద్యార్థి నేతలు బయటపెట్టారు. బాధిత విద్యార్థినుల్లో ఎక్కువ మంది ఎస్సీ, ఎస్టీలే ఉన్నారని పేర్కొన్నారు. కళంకిత రిజిస్ట్రార్‌ను వెంటనే తప్పించాలని, లేదంటే ఎస్సీ, ఎస్టీ కమిషన్, మహిళా కమిషన్‌లకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

ఉక్కు కార్మికుల పాస్‌ల పునరుద్ధరణకు అంగీకారం

- ఏడు రోజుల్లోనే బయోమెట్రిక్ హాజరు విధానం



మొహంతి చేతుల మీదుగా ఒప్పంద పత్రాన్ని అందుకుంటున్న కార్మిక నాయకులు

విశాఖపట్నం (ఉక్కు నగరం), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కర్మాగారంలో పనిచేస్తున్న 4,200 మంది ఒప్పంద కార్మికులకు పాత విధానంలోనే పాస్‌లు ఇచ్చేందుకు, బయోమెట్రిక్ హాజరు విధానాన్ని పునరుద్ధరించేందుకు యాజమాన్యం అంగీకరించింది. ఉక్కు శాఖ ఆదేశాలతో ఒప్పంద కార్మికుల శాశ్వత పాస్‌లు రద్దుతో పాటు, ఆన్‌లైన్ హాజరులో వారి పేర్లను ఇటీవల తొలగించారు. దీనిపై కార్మికుల ఆందోళనకు యాజమాన్యం దిగొచ్చింది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆర్‌జేసీఎల్ (రీజినల్ జాయింట్ లేబర్ కమిషనర్) ఎస్.కె.మొహంతి సమక్షంలో ఉక్కు అధికారులు, కార్మిక సంఘాల నాయకులు చర్చించారు. వారం రోజుల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు సమ్మతించారు. సమావేశంలో ఉక్కు జీఎం (హెచ్‌ఆర్)ఎన్.భాను, డీజీఎం(హెచ్‌ఆర్) ఎస్.కె.ఖర్, కార్మిక సంఘాల నాయకులు జి.శ్రీనివాస్, ఎం.రవి, పి.వి.నగేశ్, ధనలక్ష్మి, బి.శివరాజేశ్, శశిభూషణ్, యు.అప్పారావు పాల్గొన్నారు.

రజనీకాంత్ ఆరోగ్య స్థితిపై ప్రధాని వాకబు

చెన్నై, న్యూస్‌టుడే: ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రముఖ సినీ నటుడు రజనీకాంత్ ఆరోగ్య పరిస్థితి గురించి ప్రధాని మోదీ అడిగి తెలుసుకున్నారు. రజనీకాంత్ సతీమణి లతా రజనీకాంత్‌తో మోదీ ఫోన్‌లో మాట్లాడినట్లు భాజపా తమిళనాడు అధ్యక్షుడు అన్నామలై 'ఎక్స్'లో వెల్లడించారు. రజనీ త్వరగా కోలుకోవాలని ప్రధాని ఆకాంక్షించారని పేర్కొన్నారు.

మహిళా వీఆర్వోపై ఇసుక మాఫియా దౌర్జన్యం



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్‌ను దారి మళ్లించి తీసుకెళ్తున్నారిలా..

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో మహిళా వీఆర్వోపై ఇసుక మాఫియా దౌర్జన్యం చేసింది. సూళ్లూరుపేట మండలం ఇలుపూరు సమీపాన కాళంగి నది నుంచి రేయింబవళ్లు ఇసుక రవాణా యథేచ్ఛగా జరుగుతోంది. బుధవారం ఇలుపూరు నుంచి ఇసుక తెస్తున్న ట్రాక్టర్‌ను వీఆర్వో శ్రీదేవి, వీఆర్ఏ సుబ్రహ్మణ్యం పట్టుకున్నారు. ఆ తర్వాత పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లేందుకు ట్రాక్టర్‌లో వీఆర్ఏను ఎక్కించి పంపారు. వెనుకనే ద్విచక్ర వాహనంపై వీఆర్వో బయలుదేరారు. మార్గమధ్యలో మన్నారుపోలూరు వద్దకు వచ్చే సరికి ట్రాక్టర్‌కు చెందిన ఎ.మణికంఠ వచ్చి అడ్డుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లకుండా అక్కడి నుంచి దారి మళ్లించారు. దీనిపై వీఆర్వో ప్రశ్నిస్తూ.. అడ్డుకుంటూ, సెల్‌ఫోన్‌లో వీడియో తీస్తుండగా మణికంఠ ఆమెపై తిరగబడ్డారు. ఆమె చేతిలో నుంచి సెల్‌ఫోన్‌ను తీసుకుని కింద పడేశారు. ట్రాక్టర్లో ఉన్న వీఆర్ఏను కిందకు తోసేసి, వాహనంతో పాటు వెళ్లిపోయారు. వీఆర్వో శ్రీదేవి అక్కడి నుంచే ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దార్ నరసింహారావుకు జరిగిన విషయాన్ని చెప్పారు. వారి సూచన మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసినట్లు వీఆర్వో తెలిపారు.

ఉన్నవారిని కనిపెట్టి... లూటీ

- సైబర్ నేరగాళ్ల కొత్త పంథా

ఈనాడు, హైదరాబాద్

- హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి నుంచి స్టాక్‌మార్కెట్ పెట్టుబడుల పేరుతో రూ.13.26 కోట్లు కొల్లగొట్టారు. మరో వ్యాపారి నుంచి రూ.8 కోట్లు, సింగరేణి సంస్థ డీజీఎం స్థాయి అధికారి నుంచి రూ.3.31 కోట్లు, మరో వృద్ధుడిని బురిడీ కొట్టించి రూ.1.36 కోట్లు లూటీ చేశారు.
- వర్ధమాన్ గ్రూప్ సంస్థల సీఎండీ ఎస్పీ ఓస్వాల్‌ను బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లు రూ.7 కోట్లు కొట్టేశారు. అక్రమ లావాదేవీలు జరిగాయని బెదిరించి మరీ మోసానికి పాల్పడ్డారు. చివరకు జరిగింది తెలుసుకొని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేస్తే రూ.5.25 కోట్లు మాత్రం రికవరీ చేయగలిగారు. వరుసగా జరుగుతున్న ఈ సంఘటనలు సైబర్ నేరగాళ్లు ఉన్నత స్థాయి అధికారులను, ఆర్థిక స్థితిగతులున్న వారిని లక్ష్యంగా చేసుకుంటున్నట్లు స్పష్టం చేస్తున్నాయి...

ఒకప్పుడు చిన్నాచితకా వ్యాపారాలు చేసుకునేవారు, చిరుద్యోగులకు టోకరా వేసేందుకు ప్రయత్నించిన సైబర్ దొంగలు ఇప్పుడు పెద్ద మొత్తంలో గిట్టుబాటు అవుతుందనుకున్న వారిని మాత్రమే ఎంచుకొని లూటీ చేస్తున్నారు. బ్యాంకు లావాదేవీలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి మరీ రంగంలోకి దిగుతున్నారు. ఈ మధ్య కాలంలో ఎక్కువగా ఇలాంటి కేసులే నమోదవుతున్నాయి. రూ.కోటికి పైగా పోగొట్టుకుంటున్న కేసులు వందల్లో ఉంటున్నాయి. నేరగాళ్లు ఆయా వ్యక్తులు సామాజిక మాధ్యమాల్లో పెట్టే పోస్టుల్లో వివరాలను బట్టి ఆర్థిక పరిస్థితులను అంచనా వేస్తూ జాబితా రూపొందించుకుంటున్నారు. ఆ తర్వాత వారి ఫోన్ నంబర్లు, ఈ మెయిల్ చిరునామాలను సేకరించి మోసానికి తెరలేపుతున్నారు. సైబర్‌నేరాలు ఎప్పుడో వ్యవస్థీకృతమయ్యాయి. నేరాలు చేసేది ఒకరైతే, వారికి సిమ్‌కార్డులు సమకూర్చేది ఇంకో ముఠా. దోచుకున్న డబ్బు బదిలీ చేయడానికి కావాల్సిన బ్యాంకు ఖాతాలు అందించేది మరొకరు. మోసం చేయడానికి అవసరమైన ఫోన్ నంబర్లు, ఇతర వివరాలు సేకరించి పెట్టే ముఠాలు వేరే ఉంటాయి. వీరంతా కలిసి దోచుకోవడానికి అవకాశం ఉన్న వ్యక్తుల వివరాలను తేలిగ్గా సేకరించి, మోసం చేయగలుగుతున్నారని నిపుణులు చెబుతున్నారు. అందుకే ఎక్కువ ఆర్థిక లావాదేవీలు నిర్వహించేవారు, స్టాక్‌మార్కెట్లో పెట్టుబడులు పెట్టేవారు, బ్యాంకు ఖాతాల్లో ఎక్కువ నిల్వలు ఉన్న వారు మరింత అప్రమత్తంగా ఉండాలని వారు హెచ్చరిస్తున్నారు.

కొలువు పోయింది.. జైలుకెళ్తే కడుపు నిండుద్దేమో!

- అక్కడైతే భోజనం, వసతి దొరుకుతాయని పేరాశ
- బస్సులో కండక్టర్‌ను కత్తితో పొడిచిన యువకుడు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: ఉద్యోగం కోల్పోయిన దశలో బెంగళూరు మహానగరంలో భోజనం, వసతి ఖర్చుల నుంచి తప్పించుకునేందుకు జైలుకెళ్లాలనే ఉద్దేశంతో ఓ యువకుడు దాడికి పాల్పడిన ఘటన ఇది. పోలీసులు తెలిపిన మేరకు.. ఝార్ఖండ్‌కు చెందిన హరి (27) బీకాం చదివి బెంగళూరులో ఓ కంపెనీలో పనిచేసేవాడు. ఆ సంస్థ నుంచి ఇటీవల అతడిని తొలగించారు. దీనికి కారకుడైన మేనేజర్‌ను బెదిరించేందుకని ఓ కత్తిని కొని మంగళవారం ఆయన ఇంటికి వెళ్లాడు. ఆయన ఇంటి వద్ద లేకపోవడంతో కంపెనీకి వెళ్లేందుకు బస్సు ఎక్కాడు. ఫుట్‌బోర్డు నుంచి లోపలకు రావాలని కండక్టర్ యోగేశ్ అతనికి సూచించడంతో అప్పటికే అసహనంతో రగిలిపోతున్న హరి లోపలకు వచ్చి కిటికీ అద్దాన్ని పగలగొట్టాడు. అనంతరం కండక్టర్‌పై దాడి చేసి, వెంటతెచ్చుకున్న కత్తితో పొడిచాడు. ప్రయాణికులు అప్రమత్తమై నిందితుణ్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఉద్యోగం కోల్పోయి.. జీవనాధారం ప్రశ్నార్థకమైన దశలో నేరం చేసి జైలుకెళ్లాలనే ఉద్దేశంతోనే దాడి చేశానని అతడు చెప్పడంతో పోలీసులు విస్తుపోయారు. కండక్టర్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని తెలిపారు.

అమరరాజ సంస్థల సౌజన్యంతో.. విద్యార్థులకు ఉపకార వేతనాల అందజేత

స్వీయచరిత్ర పుస్తకాలు అమ్మగా వచ్చిన రూ.50 లక్షలు అందించిన గల్లా అరుణకుమారి



నగదు చెక్కును శ్రీకృష్ణదేవరాయ విద్యా, సాంస్కృతిక సంఘానికి అందజేస్తున్న గల్లా అరుణకుమారి

పూతలపట్టు, న్యూస్‌టుడే: దాతల సౌజన్యంతో విద్యనభ్యసించిన విద్యార్థులు కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి, తితిదే విశ్రాంత జేఈవో శ్రీనివాసరాజు ఆకాంక్షించారు. చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం పేటమిట్ట మంగళ విద్యాలయంలో శ్రీకృష్ణదేవరాయ విద్యా సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అమరరాజ సంస్థల అధినేత గల్లా రామచంద్రనాయుడు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల అభ్యున్నతే ధ్యేయంగా 1968లో రూ.వెయ్యి పెట్టుబడితో ఏర్పాటుచేసిన ఈ సంఘం.. నేడు రూ.10 కోట్ల నిధికి చేరిందన్నారు. జీవితంలో స్థిరపడ్డ విద్యార్థులు ఈ సంస్థకు చేయూతనిస్తే మరికొందరికి సాయం అందించవచ్చని సూచించారు. మాజీ మంత్రి గల్లా అరుణకుమారి మాట్లాడుతూ తన 'స్వీయ చరిత్ర' మొదటి ఐదు వేల ప్రతులు అమ్మగా వచ్చిన నగదు రూ. 50 లక్షలు ఈ ట్రస్ట్‌కు అందజేసినట్లు తెలిపారు. సంఘం అధ్యక్షురాలు గౌరినేని రమాదేవి, పీఈఎస్ విశ్వవిద్యాలయం ప్రో ఛాన్సలర్ జవహర్ దొరస్వామి మాట్లాడారు. అనంతరం పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్, సీఏ కోర్సుల్లో ప్రతిభ చాటిన 200 మంది విద్యార్థులకు రూ. 40 లక్షల ఉపకార వేతనాలు అందజేశారు. రచయితలు నామిని సుబ్రహ్మణ్యం, సాకం నాగరాజ, సంఘం కార్యదర్శి గల్లా విజయ నాయుడు, సర్పంచి గల్లా రాధాకృష్ణ పాల్గొన్నారు.

మనం సీట్లో ఉంటేనే అందరికీ మంచి చేయగలం

- వైకాపాను దేశంలోనే బలమైన పార్టీగా చేద్దాం
- పార్టీ అనుబంధ విభాగాల ప్రతినిధుల భేటీలో మాజీ సీఎం జగన్



ఈనాడు, అమరావతి: 'దేశంలో బలమైన పార్టీగా వైకాపాను తయారుచేసే దృఢ సంకల్పంతో సంస్థాగత నిర్మాణం చేపడుతున్నాం. మీరంతా స్ఫూర్తిమంతంగా పనిచేయాలి..' అని వైకాపా అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ అనుబంధ విభాగాల ప్రతినిధులకు పిలుపునిచ్చారు. 'పార్టీకి 24 అనుబంధ విభాగాలున్నాయి. వీటన్నింటినీ గ్రామస్థాయి వరకూ బలోపేతం చేయాలి. ఇవి బలంగా ఉంటేనే పార్టీ మరింత శక్తిమంతమవుతుంది. రాష్ట్రస్థాయిలో ఇక్కడి నుంచి పిలుపునిస్తే గ్రామాల్లోనూ కార్యక్రమాలు చేపట్టే పరిస్థితి రావాలి. అనుబంధ విభాగాల్లోనే కాదు.. పార్టీ జిల్లా అధ్యక్షులు సహా కష్టపడినవారికే ప్రాధాన్యం ఉంటుంది. మనల్ని ప్రేమించిన కార్యకర్తలు లక్షల మంది ఉన్నారు. అభిమానించే ఓటర్లు కోట్ల మంది ఉన్నారు. వారందరి కోసం మనం నిలబడాలి. వారికి మంచి చేయాలంటే మనం సీట్లో ఉండాలి. దీని కోసం మనం కచ్చితంగా యుద్ధం చేయాల్సి వస్తుంది..' అని పేర్కొన్నారు. వైకాపా అనుబంధ విభాగాల అధ్యక్షులు, ప్రతినిధులతో బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో జగన్ మాట్లాడారు. 'నాలుగు నెలలకే ప్రభుత్వంపై వ్యతిరేకత తారాస్థాయికి చేరింది. సూపర్-6, 7 ఏమీ లేవు. అన్నీ అబద్ధాలే. అవి మోసంగా మారాయి. ఈ మోసాలపై అసహనం ప్రజల్లో కోపంగా మారుతోంది. అన్ని విషయాల్లోనూ ప్రభుత్వం కుప్పకూలే పరిస్థితి ప్రారంభమైంది. అందువల్లే డైవర్షన్ రాజకీయాల్లో భాగంగా ఎప్పటికప్పుడు కొత్త అంశాన్ని తెరపైకి తెస్తున్నారు. తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో చంద్రబాబు చెప్పినవన్నీ అబద్ధాలని తేలిపోయింది. ప్రభుత్వంలో పారదర్శకత లేదని వరద బాధితులకు సాయం పంపిణీలోనే తేలిపోయింది. పరిహారం కోసం బాధితులు కలెక్టరేట్‌ను చుట్టుముట్టే పరిస్థితి ఏర్పడింది. మరోవైపు కీలకమైన విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలు తిరోగమనంలోకి వెళ్లాయి' అని జగన్ పేర్కొన్నారు.



మీ పిల్లలున్నప్పుడు ఫోన్ చూస్తున్నారా?

మీకు, మీ పిల్లలకు మధ్య అనుబంధాన్ని బలహీనపరిచే శక్తి మీ చేతిలో ఉన్న ఫోన్‌కు ఉందంటే నమ్మగలరా? మీ పిల్లలు ఇంట్లో ఉన్నప్పుడు మీరు ఫోన్ చూస్తూ గడుపుతున్నారంటే మీరు తప్పు చేస్తున్నట్లే. తమ తల్లిదండ్రులు తమ కన్నా ఫోన్‌కే ఎక్కువ విలువ ఇస్తారన్న భావన మీ పిల్లల మనసుల్లో ముద్రించుకుపోతుంది. దానివల్ల మీ పిల్లలు ప్రేమరాహిత్యంతో, ఆత్మన్యూనతతో పెరుగుతారు. ఈ పరిస్థితి ఏ పిల్లాడికీ రాకూడదు. ఫోన్ పక్కనపెట్టి మీ పిల్లల ఆటల్లో పాలుపంచుకోండి. వారితో కలిసి తినండి. అందులో ఉన్న ఆనందమేంటో మీకే అర్థమవుతుంది.

– ల్యూక్ అడిన్స్, పేరెంటింగ్ కోచ్

EENADU Vol: 51, Iss: 54 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఒకప్పటి మిత్రులే!

• బద్ధ విరోధులుగా మారిన ఇరాన్, ఇజ్రాయెల్

ఇంటర్నెట్ డెస్క్: బద్ధ శత్రువులుగా మారిన ఇరాన్, ఇజ్రాయెల్ ఒకప్పటి మిత్రులే. అప్పట్లో అమెరికానూ లెక్క చేయకుండా ఇరాన్‌కు ఇజ్రాయెల్ సాయం చేసింది. 1960లలో ఇరాన్, ఇజ్రాయెల్‌కు ఉమ్మడి శత్రువు ఇరాక్. అరబ్ దేశాల ముప్పుతో నాడు ఇజ్రాయెల్ ఇబ్బంది పడేది. షియాల పాలనలోని ఇరాన్.. ఇరాక్‌లోని సున్నీ నాయకత్వాన్ని తమ ప్రాంతీయ విస్తరణ లక్ష్యాలకు ముప్పుగా పరిగణించేది. దీంతో ఇరాన్‌కు చెందిన సీక్రెట్ పోలీస్ యూనిట్ సావక్, ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ (మొసాద్) కలిసి కుర్దు వేర్పాటు వాదులను బలోపేతం చేసేవి. ఇరాక్‌లోని అరబ్ నాయకత్వానికి ఇవి ఇబ్బందికరంగా తయారయ్యాయి. ఈ క్రమంలో ఇరాన్, ఇజ్రాయెల్‌తో తుర్కియే కూడా కలిసింది. మూడు దేశాలు కలిసి ట్రైడెంట్ అనే కోడ్‌నేమ్‌తో గ్రూపును ఏర్పాటు చేశాయి. మొదట్లో ఇవి నిఘా సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకునేవి.. కౌంటర్ ఇంటెలిజెన్స్ ఆపరేషన్లు చేపట్టడం వంటివి చేసేవి.

ఇజ్రాయెల్‌కు అమెరికాతో ఉన్న బంధం, భౌగోళిక రాజకీయాల్లో బలపడటం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని ఇరాన్ నేత మహమ్మద్ రెజా పహ్లవీ ఈ బంధాన్ని బలోపేతం చేశారు. అమెరికాలో నాటి కెన్నడీ ప్రభుత్వం పహ్లవీ పాలనపై అసంతృప్తితో ఉన్నా ఇది కొనసాగింది. ఫలితంగా 1960లలో టెహ్రాన్‌లో ఇజ్రాయెల్ అప్రకటిత దౌత్య కార్యాలయం ఏర్పాటైంది. కానీ, అరబ్ ప్రపంచంలో ఇజ్రాయెల్‌పై వ్యతిరేకతను గుర్తెరిగి.. బహిరంగంగా మిత్రులు కాకుండా ఇరాన్ జాగ్రత్త పడింది.

ఆపరేషన్ ఫ్లవర్..

1977లో వివాదాస్పద ఆయుధ విక్రయ లావాదేవీలను మించి వీరి బంధం బలపడింది. ఇరాన్ కోసం ఏకంగా ఇజ్రాయెల్ ఉపరితలంపై నుంచి ఉపరితలంపైకి ప్రయోగించే అణు క్షిపణులను సిద్ధం చేసే ప్రాజెక్టు చేపట్టింది.



లెబనాన్ రాజధాని బీరుట్‌లో బుధవారం ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేయడంతో మంటల్లో చిక్కుకున్న అపార్ట్‌మెంట్ భవనం

దీనికి ఆపరేషన్ ఫ్లవర్ అని పేరు పెట్టింది. ఇందుకోసం అడ్వాన్స్‌గా నాటి షా ప్రభుత్వం 260 మిలియన్ డాలర్ల చమురును ఇజ్రాయెల్‌కు సరఫరా చేసింది. ఈ విషయాన్ని 1986లో న్యూయార్క్ టైమ్స్ బయటపెట్టింది.

ఇరాక్‌తో యుద్ధం వేళ..

1980-88 మధ్య జరిగిన ఇరాన్, ఇరాక్ యుద్ధంలో కూడా ఇజ్రాయెల్ సహకారం కొనసాగింది. ఇరాక్‌కు అమెరికా, సోవియట్ యూనియన్ నుంచి ఆయుధాలు వచ్చేవి. అప్పటికే ఇరాన్‌లో ఇస్లామిక్ క్రాంతి వచ్చింది. ఆ దేశంలో అమెరికన్లు కొందరిని బందీలుగా చేశారు. కానీ ఇరాక్ నేత సద్దాం హుస్సేన్ అణు బాంబు తయారీ ఆశలు ఇజ్రాయెల్‌ను భయపెట్టాయి. నాటి ప్రధాని మేనాహెమ్ బెగిన్ అమెరికా ఆంక్షలున్నప్పటికీ ఇరాన్‌కు ఆయుధాలను పంపేందుకు అంగీకరించారు. దీనికి ప్రతిగా ఇరాన్‌లోని యూదులను అమెరికా, ఇజ్రాయెల్‌లకు వలస వెళ్లేందుకు అంగీకరించింది. 1980లలో ఇరాన్, ఇరాక్ యుద్ధం తార స్థాయికి చేరిన వేళ ఇరాన్‌కు వనరులు ఆయుధ, ఆర్థిక శక్తి హరించుకుపోయాయి. దీనిని ఆసరాగా చేసుకుని.. అమెరికాలోని రీగన్ సర్కారు ఇజ్రాయెల్ సాయం తీసుకుంది. ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేసేందుకు అంగీకరించింది. ప్రతిగా లెబనాన్‌లో హెజ్‌బొల్లా చేతిలో బందీలుగా ఉన్న అమెరికన్ల విడుదలను సులభతరం చేసుకుంది.

యుద్ధ విమానాల టైర్ల సరఫరా..

ఇరాన్ 1980లలో అమెరికా తయారీ ఎఫ్-4 ఫాంటమ్ ఫైటర్ జెట్లు వాడేది. ఇస్లామిక్ విప్లవం తర్వాత ఆ దేశానికి అమెరికా విడి భాగాలను ఇవ్వడం నిలిపేసింది. ఇరాక్‌తో యుద్ధం మొదలైన తొలినాళ్లలో ఇరాన్‌కు ఎఫ్-4 విమానాల టైర్లు అవసరమయ్యాయి. దీంతో నాడు ఇజ్రాయెల్ వీటిని రహస్యంగా ఫ్రాన్స్‌కు తరలించి.. అక్కడి నుంచి చార్టర్డ్ విమానాల్లో ఇరాన్‌కు పంపించి. 1981లో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఒకవైపు అమెరికాకు చెందిన 51 మంది దౌత్యవేత్తలు టెహ్రాన్‌లో బందీలుగా ఉన్నా ఇజ్రాయెల్ వీటిని పంపడం విశేషం. ఇరాక్ విజయాన్ని అడ్డుకోవడమే నాడు ఇజ్రాయెల్ లక్ష్యం.

విభేదాలు పెరిగాయిలా..

1990ల నాటికి ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య సహకారం తగ్గిపోయింది. ఇరాక్ ముప్పు తొలగిపోవడం, అరబ్ సోషలిజం, సోవియట్ ప్రభావం ఇరుదేశాల మధ్య దూరం పెంచింది. మరోవైపు ఇజ్రాయెల్ వ్యతిరేక హెజ్‌బొల్లా, హమాస్‌లకు ఇరాన్ మద్దతివ్వడం మొదలుపెట్టింది. ఇక అధ్యక్షుడిగా మహ్మూద్ అహ్మది నెజాద్ అధికారంలోకి రావడంతో ఈ దూరం మరింత పెరిగింది. 2006లో హెజ్‌బొల్లాతో, 2008లో హమాస్‌తో ఇజ్రాయెల్ పోరాడాల్సి వచ్చింది. ఈ గ్రూపులకు టెహ్రాన్ మద్దతు ఇచ్చింది. దీంతో ఇజ్రాయెల్-ఇరాన్ బద్ధ శత్రువులుగా మారాయి.

ఇజ్రాయెల్ 200 రాత్రులు..

70 సీక్రెట్ ఆపరేషన్లు..

ఇంటర్నెట్ డెస్క్: హెజ్‌బొల్లాపై పేజర్ పేలుళ్లకు కొన్ని నెలల ముందు నుంచే ఇజ్రాయెల్ సీక్రెట్ ఆపరేషన్లు మొదలు పెట్టింది. లెబనాన్‌లోకి చొచ్చుకెళ్లిన ఐడీఎఫ్ కమాండోలు వందల స్థావరాలను లోలోపలే ధ్వంసం చేస్తూ వచ్చారు. 'అక్టోబర్ 7' తరహాలో హెజ్‌బొల్లా చేపట్టిన 'కాంకర్ ది గలీలీ' ఆపరేషన్‌ను లోలోపలే నిర్వీర్యం చేశారు. ఆ సంస్థ రద్వాన్ ఫోర్స్‌ను పూర్తిగా ధ్వంసం చేసింది.

ఏమిటీ 'కాంకర్ ది గలీలీ'?

అక్టోబర్ 7వ తేదీన హమాస్ దళాలు ఒక్కసారిగా విరుచుకుపడి ఇజ్రాయెల్‌లో భయోత్పాతం సృష్టించాయి. ఫలితంగా 1,200 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. హెజ్‌బొల్లా ఇజ్రాయెల్ సరిహద్దుల్లోని గలీలీ అనే పర్వత ప్రాంతంలోని ఆవాసాలను లక్ష్యంగా చేసుకుని ఇలాంటి ఆపరేషన్ నిర్వహించాలని నిర్ణయించింది. ఆ సంస్థ అత్యున్నత కమాండో దళమైన రద్వాన్ ఫోర్స్‌కు చెందిన 2,400 మంది, పాలస్తీనా ఇస్లామిక్ జిహాద్‌కు చెందిన 500 మందికి ఇందుకు శిక్షణ ఇచ్చారు. వీరంతా ఇజ్రాయెల్ సరిహద్దుల్లోని గ్రామాలపై దాడులకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఇది మొత్తం అక్టోబరు 7 ఘటన జరిగిన కొన్ని రోజుల్లోనే చోటుచేసుకుంది.

ఊహించని ఇజ్రాయెల్ దళాలు..

లెబనాన్‌వైపు నుంచి దాడులు ఖాయమని భావించిన ఇజ్రాయెల్ దళాలు సరిహద్దుల్లో రక్షణ ఏర్పాట్లను బలోపేతం చేశాయి. దీంతోపాటు సమీపంలోని హెజ్‌బొల్లా స్థావరాలపై వరుస దాడులను నిర్వహించాయి. దీంతో చాలావరకు రద్వాన్ దళ సభ్యులు తిరిగి లెబనాన్ లోపలికి వెళ్లిపోయారు. అనంతరం ఐడీఎఫ్ కమాండోలు, కంబాట్ ఇంజినీరింగ్ ఫోర్స్ రంగంలోకి దిగి ఉత్తర గుట్ట సొరంగాలు, హెజ్‌బొల్లా వ్యవస్థలను, ఆర్సినల్, యాంటీ ట్యాంక్ క్షిపణులు, పేలుడు పదార్థాలు, మోర్టార్లు, ఇతర ఆయుధాలను స్వాధీనం చేసుకొని.. తిరిగి ఇజ్రాయెల్‌కు తీసుకురావడం లేదా ధ్వంసం చేశాయి. వీటిలో ఇరాన్ నుంచి దిగుమతి చేసుకున్నవే ఉన్నాయి. దాదాపు 70 సీక్రెట్ ఆపరేషన్లు నిర్వహించారు.. ఇందుకు దాదాపు 200 రాత్రులు పట్టినట్లు ఐడీఎఫ్ ప్రతినిధి డేనియల్ హగారీ వెల్లడించారు. వీటిలో మొత్తం 1,000 హెజ్‌బొల్లా స్థావరాలను నాశనం చేసినట్లు చెప్పారు. కొన్ని ఆపరేషన్లు రెండు నుంచి నాలుగు రోజులు పట్టేదంటే వాటి తీవ్రతను అర్థం చేసుకోవచ్చన్నారు.

నెతన్యాహు బంకర్‌లోకి పరుగెత్తడం ఉత్తిదే

• పాత వీడియోను పోస్టు చేసిన నెటిజన్లు

ఇంటర్నెట్ డెస్క్: ఇరాన్ దాడి వేళ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు సంబంధించినదిగా చెబుతున్న ఓ వీడియో వైరల్‌గా మారింది. ఇందులో ఆయన వేగంగా ఓ గదిలోకి పరుగెడుతున్న దృశ్యాలున్నాయి. మంగళవారం రాత్రి ఇరాన్ హైపర్ సోనిక్ క్షిపణి ఇజ్రాయెల్ గగనతలంలోకి ప్రవేశించడంతో ఆయన రక్షణ కోసం బంకర్‌లోకి పరుగెడుతున్నారంటూ సోషల్ మీడియాలో ఇరాన్ మద్దతుదారులు ప్రచారం చేశారు. వాస్తవానికి ఈ వీడియోపై కొన్ని సంస్థలు ఫ్యాక్ట్ చెక్ చేయగా.. మూడేళ్ల క్రితం వీడియోగా తేలింది. 2021లో ఇజ్రాయెల్ పార్లమెంటు భవనలోని కారిడార్లలో ఆయన హడావుడిగా పరుగెడుతున్న దృశ్యమది. అప్పట్లో ఓ సమావేశంలో పాల్గొనేందుకు ఆయన ఆ విధంగా వెళ్లినట్లు తెలుస్తోంది.







మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా బుధవారం దిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రధాని మోదీ ✦ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ✦ గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రిల జయంతి సందర్భంగా దిల్లీలోని సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో నివాళులు అర్పించిన లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్‌సింగ్, సోనియాగాంధీ, జేపీ నడ్డా, మల్లికార్జున ఖర్గే తదితరులు

మహాత్మాగాంధీ, శాస్త్రిలకు రాష్ట్రపతి, ప్రధాని నివాళులు

దిల్లీ: జాతిపిత మహాత్మా గాంధీ, భారత రెండో ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రిల జయంతిని పురస్కరించుకుని బుధవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నివాళులర్పించారు. ఉదయం దిల్లీలోని గాంధీ స్మారకం రాజ్‌ఘాట్ వద్దకు చేరుకుని అంజలి ఘటించారు. అంతకుముందు ఎక్స్ వేదికగా ప్రధాని మోదీ మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. 'సత్యం, సామరస్యం, సమానత్వం అనే సిద్ధాంతాలతోనే బాపు జీవితం గడిచింది. ఆయన ఆదర్శాలు దేశప్రజలకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తాయి. జాతిపిత మహాత్మా గాంధీ సత్యం, అహింసా మార్గాలను దృఢంగా అనుసరించారు. ప్రపంచవ్యాప్తంగా తరతరాల నాయకులకు, కార్యకర్తలకు ఆదర్శంగా నిలిచారు' అని 155వ జయంతి రోజున గాంధీని గుర్తు చేసుకున్నారు. అనంతరం విజయ్‌ఘాట్‌లో లాల్ బహదూర్ శాస్త్రికి నివాళులర్పించారు. బహదూర్ శాస్త్రి ఇచ్చిన 'జై జవాన్, జై కిసాన్' నినాదం భావితరాలకు ప్రేరణగా నిలుస్తుందని, దేశ స్వాభిమానం కోసం ఆయన జీవితం అంకితం చేశారని ప్రధాని మోదీ కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో విపక్షనాయకుడు రాహుల్‌గాంధీ, కేంద్ర మంత్రి జేపీ నడ్డా, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డి.వై చంద్రచూడ్ తదితరులు గాంధీ, శాస్త్రిలకు నివాళులర్పించారు.

గాంధీ జీవిత చరిత్రపై పరీక్ష.. నాసిక్ జైల్లో 80మంది ఖైదీల హాజరు

మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని నాసిక్ సెంట్రల్ జైలులో ఓ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహించిన పరీక్షకు ఎనిమిది మంది అధికారులు సహా 80 మంది ఖైదీలు హాజరయ్యారు. వీరిలో 10 మంది మహిళలు కాగా 70 మంది పురుష ఖైదీలు. గాంధీ ఆత్మకథ, జీవిత చరిత్రపై బాంబే సర్వోదయ మండల్ అనే స్వచ్ఛంద సంస్థ 'గాంధీ శాంతి పరీక్ష'ను మంగళవారం నిర్వహించింది. ఈ పరీక్షలో అగ్రస్థానంలో నిలిచిన ముగ్గురికి బుధవారం బహుమతులు అందించింది. శాంతి, అహింసా సిద్ధాంతాలను ప్రచారం చేయడం కోసం ఈ సంస్థ ప్రతి సంవత్సరం వివిధ జైళ్లలో పరీక్షను నిర్వహిస్తుంటుంది.

బయోగ్యాస్ ప్లాంట్ల నిర్మాణాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ

గువాహటీ: అస్సాంలో ఆయిల్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలోని నాలుగు కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంట్ల నిర్మాణాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభించారు. దేశవ్యాప్తంగా పలు సీబీజీ ప్లాంట్ల శంకుస్థాపనలో భాగంగా దిల్లీ నుంచి వర్చువల్‌గా ఈ కార్యక్రమం జరిగింది. 'స్వచ్ఛభారత్ దివస్' సందర్భంగా స్థిరమైన, పర్యావరణ అనుకూల శక్తిని ప్రోత్సహించే లక్ష్యంతో వీటిని విస్తరించనున్నారు. అస్సాంలో గువాహటి, జోర్హాట్, శివసాగర్, తిన్‌సుకియా ప్రాంతాల్లో కీలక ఆయిల్ ప్రాజెక్టులు ఉన్నాయి. "మన గ్రామాల్లో ఆవుపేడ ఎన్నో మార్పులు తెస్తోంది. అందుకే గ్రామాల్లో వందల సంఖ్యలో ఈ బయోగ్యాస్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నాం. ఇది రైతులకు ఎంతో ఉపయోగకరం" అని మోదీ పేర్కొన్నారు. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వశాఖ సమన్వయంతో 2024-25 ఆర్థిక సంవత్సరంలో 25 బయోగ్యాస్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు ఆయిల్ ఇండియా లిమిటెడ్ వెల్లడించింది.

నెతన్యాహుకు మోదీ శుభాకాంక్షలు

దిల్లీ: యూదుల నూతన సంవత్సరం 'రోష్ హషానా'ను పురస్కరించుకుని ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్, ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

✦ జపాన్ ప్రధానిగా ఇటీవల పగ్గాలు చేపట్టిన షిగెరు ఇషిబాకు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు.

ఇజ్రాయెల్ బలవంతంగా మమ్మల్ని లాగింది

• ఖతార్‌లో ఇరాన్ అధ్యక్షుడి వెల్లడి

దోహా: ఇజ్రాయెల్ బలవంతంగా తమను ఘర్షణలోకి లాగిందని ఇరాన్ స్పష్టం చేసింది. తాము యుద్ధం కోరుకోవడం లేదని, శాంతిని ఆశిస్తున్నామని తేల్చి చెప్పింది. ఇజ్రాయెల్‌తో ఘర్షణ నేపథ్యంలో దేశాల మద్దతు కూడగట్టేందుకు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ బుధవారం ఖతార్ చేరుకున్నారు. ఖతార్‌తో ద్వైపాక్షిక చర్చలతోపాటు ఇజ్రాయెల్ దాడులకు వ్యతిరేకంగా ఆసియా దేశాల మద్దతును కూడగట్టేందుకు ప్రయత్నించనున్నారు. అధ్యక్షుడిగా ఎన్నికయ్యాక పెజెష్కియాన్ జరుపుతున్న తొలి విదేశీ పర్యటన ఇదే. ఖతార్‌లో ఆయన మాట్లాడుతూ.. 'మేం భద్రత, శాంతిని కోరుకుంటున్నాం. కానీ ఇజ్రాయెల్ నేరాలకు పాల్పడుతోంది. ఇరాన్‌లోనే హమాస్ నేత హనియేను చంపేసింది. వారంపాటు ప్రశాంతంగా ఉంటే గాజాలో శాంతిని నెలకొల్పుతామని అమెరికా, ఐరోపా దేశాలు కోరాయి. దానికి మేం కట్టుబడి ఉన్నాం. కానీ ఇజ్రాయెల్ ఇంకా హత్యలు చేస్తూనే ఉంది. అది నేరాలను ఆపకపోతే తీవ్ర ప్రతిఘటన తప్పదు' అని పెజెష్కియాన్ స్పష్టం చేశారు. 'శాంతి కోసం ప్రశాంతంగా ఉండాలని మమ్మల్ని కోరారు. దీంతో స్వీయ నియంత్రణ పాటిస్తున్నాం. ఇజ్రాయెల్ గనక దాడి చేస్తే మరింత భయంకరంగా ప్రతి దాడి చేస్తాం' అని హెచ్చరించారు.

ఇజ్రాయెల్‌కు సహాయపడిన దేశాలకు ఇరాన్ హెచ్చరిక

టెహ్రాన్: తాము సంధించిన క్షిపణులను మార్గమధ్యలోనే అడ్డుకుంటూ ఇజ్రాయెల్‌కు సాయపడిన దేశాలపై ఇరాన్ మండిపడింది. ఇజ్రాయెల్‌కు సాంకేతిక తోడ్పాటునందిస్తున్న దేశాలనూ బాధ్యులుగా ప్రకటిస్తామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ బుధవారం హెచ్చరించారు. మంగళవారం రాత్రి ఇరాన్ ప్రయోగించిన 180కి పైగా క్షిపణుల్లో కొన్నింటిని మధ్యలోనే అడ్డుకునేందుకు జోర్డాన్, మరికొన్ని దేశాలు సహకరించాయని వచ్చిన వార్తల విషయమై విలేకరులు ప్రశ్నించగా అబ్బాస్ ఈ సమాధానమిచ్చారు. అమెరికా మిత్ర పక్షమైన జోర్డాన్ ఏప్రిల్ నెలలోనూ ఇరాన్ క్షిపణులను కూల్చివేసి ఇజ్రాయెల్‌కు అండగా నిలిచింది. మరోవైపు ఇరాన్ సుప్రీంలీడర్ అయతొల్లా అలీ ఖమేనీ... అమెరికా, ఐరోపా దేశాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ దేశాల జోక్యం వల్లే పశ్చిమాసియాలో ఘర్షణలు తలెత్తుతున్నాయని ఆక్షేపించారు.

అది చిన్నపిల్లల కొట్లాట

• ఇరాన్-ఇజ్రాయెల్ ఘర్షణపై ట్రంప్ వ్యాఖ్యలు

వాషింగ్టన్: పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఘర్షణను అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్... ఇద్దరు చిన్న పిల్లల కొట్లాటతో పోల్చారు. పశ్చిమాసియాలో జరిగే సంఘటనలపై అమెరికా మరింత లోతుగా జోక్యం చేసుకుంటుందని వెల్లడించారు. 'ఇది నిజంగా చెడు విషయం. కానీ, వారు ఆ యుద్ధ ప్రక్రియను పూర్తిచేయాలి. ఇద్దరు చిన్నారులు పాఠశాల ప్రాంగణంలో కొట్లాడుకుంటున్నట్లు ఉంది. ఆ ప్రాంతాల్లో ఏం జరుగుతుందో మేము చూస్తున్నాం. ఇది భయంకరమైన యుద్ధం. కానీ, ఇది సరైన పద్ధతి కాదు. ప్రతిఒక్కరూ జీవించాలి. కాబట్టి ఈ అంశంపై అమెరికా మరింత దృష్టిపెట్టాల్సి ఉంది' అని పేర్కొన్నారు.

దేశానికి 'తండ్రులు' ఉండరు.. ముద్దుబిడ్డలే ఉంటారు: కంగనా

• మహాత్ముడిపై వ్యాఖ్యలతో మరో వివాదం రాజేసిన మండీ ఎంపీ

దిల్లీ: వ్యవసాయ చట్టాలపై ఇటీవల చేసిన వ్యాఖ్యలకు సొంత పార్టీ నుంచే వ్యతిరేకతను ఎదుర్కొన్న ప్రముఖ సినీనటి, మండీ లోక్‌సభ సభ్యురాలు కంగనా రనౌత్ తాజాగా మరో వివాదానికి నిప్పు రాజేశారు. బుధవారం జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాన మంత్రి లాల్‌బహదూర్ శాస్త్రిల జయంతుల సందర్భంగా సామాజిక మాధ్యమాల్లో ఆమె చేసిన పోస్టు ఒకటి కొత్త వివాదానికి కారణమైంది. శాస్త్రీజీ 120వ జయంతిని ఉద్దేశించి ఇన్‌స్టాగ్రాంలో పోస్టు పెట్టిన కంగనా.. మహాత్ముణ్ని తక్కువ చేసి చూపినట్టు భావం వచ్చేలా వ్యాఖ్య జోడించారు. 'దేశానికి 'తండ్రులు' ఉండరు.. ముద్దుబిడ్డలే ఉంటారు. ఈ భరతమాత బిడ్డలు ధన్యులు" అని ఇన్‌స్టాలో ఆమె రాశారు. దేశంలో స్వచ్ఛతా ఉద్యమం కొనసాగిస్తూ గాంధీ వారసత్వాన్ని ప్రధాని మోదీ ముందుకు తీసుకుపోతున్నారని కూడా పేర్కొన్నారు. కంగనా పోస్టు మహాత్ముని అవహేళన చేసేలా ఉందంటూ కాంగ్రెస్ నాయకురాలు సుప్రియా శ్రీనేత్ విమర్శించారు.

ఝార్ఖండ్‌లో తగ్గుతున్న హిందువులు, ఆదివాసీల జనాభా: ప్రధాని

హజారీబాగ్ (ఝార్ఖండ్): చొరబాటుదారులకు మద్దతునిస్తున్న ఝార్ఖండ్‌లోని సంకీర్ణ సర్కారు ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా రాష్ట్రంలో హిందువులు, ఆదివాసీల జనాభా తగ్గుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కారణంగా రాష్ట్ర ఉనికి, సంస్కృతి, వారసత్వాలకు ప్రమాదం ఏర్పడిందన్నారు. ఝార్ఖండ్‌లోని మొత్తం 81 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా భాజపా చేపట్టిన దాదాపు 5,400 కి.మీ.ల 'పరివర్తన్ యాత్ర' ముగింపు సమావేశంలో బుధవారం మోదీ పాల్గొని మాట్లాడారు. ఝార్ఖండ్‌లో అవినీతి ప్రభుత్వాన్ని సాగనంపి.. 'మాటీ, బేటీ, రోటీ' (భూమి, ఆడపిల్ల, ఆహారం) పరిరక్షణకు పరివర్తన రావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్ర శాసన సభ గడువు జనవరి 5తో ముగియనున్నందున త్వరలో ఎన్నికలకు సిద్ధం కానున్న ఝార్ఖండ్‌లో గత రెండు వారాల్లో ప్రధాని పాల్గొంటున్న రెండో కార్యక్రమమిది.

✦ ఝార్ఖండ్ ప్రగతిలో భాగంగా రూ.83,700 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. దేశవ్యాప్తంగా గిరిజనుల సమగ్ర అభివృద్ధికి ఉద్దేశించిన రూ.79,150 కోట్ల 'ధర్తీ ఆబా జన్‌జాతీయ్ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్'ను ప్రారంభించారు. ఈ అభియాన్‌తో 65,000 గిరిజన గ్రామాలను అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే రూ.1,360 కోట్ల 'పీఎం జన్ జాతీ ఆదివాసీ న్యాయ మహా అభియాన్' కింద వివిధ ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. దాదాపు మూడు వేల గ్రామాల్లోని బలహీన గిరిజన వర్గాలకు చెందిన 75,800 గృహాలకు విద్యుదీకరణ చేస్తామన్నారు.

అపహరించిన బస్సులో.. దూకుడుగా ఉ.కొరియా వైపు!

• సరిహద్దు వంతెనపై యువకుడి అరెస్ట్

ఇంటర్నెట్ డెస్క్: అదృష్టం ఎంతగానో కలిసివస్తేనే ఎవరైనా నియంత పాలన సాగుతున్న కిమ్ రాజ్యం ఉత్తర కొరియా నుంచి బయటపడతారని అందరూ భావిస్తారు. గత 70 ఏళ్లలో 34 వేలమంది ఉ.కొరియా రాజధాని ప్యాంగ్యాంగ్ నుంచి ద.కొరియా రాజధాని సియోల్‌కు వలస వచ్చినట్లు చూపుతున్న గణాంకాలే ఇందుకు నిదర్శనం. ఇప్పటికీ ఉ.కొరియా నుంచి పారిపోయి ఏటా కనీసం వెయ్యిమంది ద.కొరియా వైపు వస్తుంటారు. 30 ఏళ్ల ఓ యువకుడికి అదృష్టం కలిసొచ్చి ఉ.కొరియా నుంచి బయటపడినా.. కొన్నాళ్లకు మళ్లీ కిమ్ రాజ్యానికే బయల్దేరాడు. అదీ బస్సును అపహరించి మరీ! కాకపోతే.. ద.కొరియా భద్రతా సిబ్బంది ఉభయ కొరియాల మధ్య ఉన్న యూనిఫికేషన్ వంతెనపైనే అతడిని అరెస్టు చేశారు. ఈ యువకుడు పదేళ్ల క్రితం ఉ.కొరియా నుంచి పారిపోయి వచ్చినట్లు గుర్తించారు. ద.కొరియాలోనూ చాలా కష్టాలు పడిన అతడు మంగళవారం మధ్యాహ్నం గ్యారేజిలో ఉన్న ఒక బస్సును అపహరించి అందులో ఉ.కొరియా వైపు దూసుకుపోయాడు. ద.కొరియా సైనికులు ఆపినా ఆగకుండా నేరుగా వెళ్లి బారికేడ్లను ఢీకొట్టాడు. చివరికి అతడిని అదుపులోకి తీసుకొన్నారు.



ఉత్తర, దక్షిణ కొరియాల నడుమ గల ఏకీకరణ వంతెన మార్గం

యాజమాన్య నిర్లక్ష్యానికి కార్మికులు బలి

టెన్నెసీ: హెలెన్ తుపాను తీవ్రత పెరిగిపోతున్నా సిబ్బందిని త్వరగా ఇళ్లకు పంపడానికి ఓ ప్లాస్టిక్ ఫ్యాక్టరీ యాజమాన్యం మొరాయించడం అమెరికాలో ఇద్దరు కార్మికుల మరణానికి కారణమైంది. టెన్నెసీలోని ఎర్విన్‌లో ఉన్న ఇంపాక్ట్ ప్లాస్టిక్ ఫ్యాక్టరీలోకి సమీపంలోని నదీ వరద జలాలు వచ్చాయి. వరద దెబ్బకు 11 మంది కార్మికులు కొట్టుకుపోగా వారిలో అయిదుగురిని కాపాడగలిగారు. ఇద్దరు మరణించగా నలుగురి జాడ ఇంకా తెలియలేదు. మృతులిద్దరూ మెక్సికో నుంచి వలస వచ్చిన కార్మికులే. ఒకవైపు కుండపోతగా వర్షం కురుస్తున్నా ఫ్యాక్టరీ యాజమాన్యం కార్మికులతో పని చేయిస్తూనే ఉంది. వరద నీరు ఫ్యాక్టరీ పార్కింగ్ స్థలంలోకి ప్రవేశించి.. విద్యుత్ సరఫరా ఆగిపోయిన తర్వాతే దానిని మూసి సిబ్బందిని బయటకు పంపారు.

వాడీవేడిగా అమెరికా ఉపాధ్యక్ష అభ్యర్థుల చర్చ

న్యూయార్క్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రటిక్, రిపబ్లికన్ ఉపాధ్యక్ష అభ్యర్థిత్వాలకు నామినేట్ అయిన టిమ్ వాజ్, జేడీ వాన్స్ మధ్య మంగళవారం చర్చ జరిగింది. సీబీఎస్ న్యూస్ నిర్వహించిన టీవీ చర్చలో వాన్స్ మాట్లాడుతూ.. 2020 అధ్యక్ష ఎన్నికలో డొనాల్డ్ ట్రంప్ ఓడిపోయారని అంగీకరించడానికి ససేమిరా అన్నారు. వాజ్.. 2021 జనవరి 6న క్యాపిటల్ హిల్‌పై ట్రంప్ మద్దతుదారుల దాడి గురించి ప్రస్తావించారు. దానికి వాన్స్.. 2020 అధ్యక్ష ఎన్నిక ఫలితంలో సమస్యలున్నాయని ట్రంప్‌తో పాటు తానూ అభిప్రాయపడుతున్నానని చెప్పారు. వీటి గురించి బహిరంగంలో శాంతియుతంగా చర్చించుకుంటే బాగుంటుందని తామిద్దరం భావిస్తున్నట్లు వివరించారు. ఇంతకీ ట్రంప్ 2020 ఎన్నికల్లో ఓడిపోయారంటారా.. లేదా అని వాజ్ ప్రశ్నించగా.. తాను గతం గురించి కాకుండా భవిష్యత్తు గురించే ఆలోచిస్తున్నానని వాన్స్ సమాధానమిచ్చారు. ఇంకా వలసదారుల గురించి, వాతావరణ మార్పులు, తుపాకులు స్వేచ్ఛగా లభ్యమవడం, స్త్రీల గర్భస్రావ హక్కు, ఆర్థిక వ్యవస్థ గురించి ఉభయులూ చర్చించారు.

రేపు 'బ్రహ్మ కుమారీస్ ప్రపంచ సదస్సు'

• ప్రారంభించనున్న రాష్ట్రపతి ముర్ము

జైపుర్: రాజస్థాన్..సిరోహి జిల్లాలోని బ్రహ్మ కుమారీస్ అంతర్జాతీయ ప్రధాన కార్యాలయంలో నిర్వహించనున్న నాలుగు రోజుల ప్రపంచ సదస్సును ఈ నెల 4న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించనున్నారు. ఈ సదస్సులో కేంద్రమంత్రులు నితిన్ గడ్కరీ, శివరాజ్ సింగ్ చౌహాన్, అర్జున్ రామ్ మేఘవాల్, గజేంద్ర సింగ్ షెకావత్, చిరాగ్ పాశ్వాన్, రవ్‌నీత్ సింగ్ బిట్టూ, దుర్గాదాస్‌లతో పాటు రాజస్థాన్ గవర్నర్, ముఖ్యమంత్రి, 15 దేశాలకు చెందిన వివిధ రంగాల ప్రముఖులు పాల్గొంటారు. కర్ణాటక గవర్నర్‌తో పాటు తెలంగాణ, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రులు ఈ సదస్సుకు హాజరై ప్రసంగించనున్నారు.

'గడియారం' కోసం న్యాయపోరాటం

• సుప్రీంను ఆశ్రయించిన శరద్ పవార్

ముంబయి: మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ న్యాయపోరాటం చేపట్టారు. ఎన్నికల్లో అజిత్ వర్గం 'గడియారం' గుర్తును వినియోగించకుండా నిరోధించాలని కోరుతూ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఎన్నో ఏళ్ల పాటు ఎన్సీపీ అధ్యక్షుడిగా వ్యవహరించిన శరద్ పవార్.. ఆ పార్టీ, గుర్తు (గడియారం)తో తనకున్న అనుబంధాన్ని వెల్లడించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. ఇది ఓటర్లలో గందరగోళం సృష్టించే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. అజిత్ పవార్ పార్టీ కొత్త గుర్తు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇటీవల పార్లమెంటరీ ఎన్నికల సమయంలో ఓటర్లలో నెలకొన్న గందరగోళాన్ని ఆయన పిటిషన్‌లో ప్రస్తావించారు. శరద్ వేసిన ఈ పిటిషన్‌పై సుప్రీం కోర్టు ఈ నెల 15న విచారణ చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

బర్డ్‌ఫ్లూతో 47 పులుల మృత్యువాత

హనోయి: దక్షిణ వియత్నాంలో బర్డ్‌ఫ్లూ వైరస్ (హెచ్5ఎన్1) తీవ్ర కలకలం రేపుతోంది. ఈ వైరస్ బారిన పడి పలు జూలలో 47 పులులు, మూడు సింహాలు, ఒక పాంథర్ మృతిచెందినట్లు అక్కడి అధికారిక మీడియా వెల్లడించింది. ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో ఈ మరణాలు చోటుచేసుకున్నట్టు వియత్నాం న్యూస్ ఏజెన్సీ తెలిపింది. లాంగ్ యాన్ ప్రావిన్స్‌లోని ప్రైవేట్ మై క్విన్ సఫారీ పార్క్, హోచి మిన్ సిటీకి సమీపంలోని డాంగ్ నైలోని వూన్ జోయ్ జూలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. వీటి శాంపిల్స్‌ను నేషనల్ సెంటర్ ఫర్ యానిమల్ హెల్త్ డయాగ్నోసిస్‌కు పంపగా.. హెచ్5ఎన్1 టైప్ ఏ రకం కారణంగానే జంతువులు మరణించినట్లు వార్తలు వస్తున్నాయి.

తైవాన్‌లో తీవ్ర తుపాను

• ఇద్దరి మృతి, 70 మందికి గాయాలు

కౌసింగ్: తైవాన్ పశ్చిమ తీరంలో తీవ్ర తుపాను కారణంగా వీచిన పెను గాలులు, భారీ వర్షంతో ఇద్దరు మృతి చెందారు. 70 మందికిపైగా గాయపడ్డారు. వరదలతో వేల మంది నిరాశ్రయులయ్యారు.

జపాన్ ఎయిర్‌పోర్టులో బాంబు పేలుడు



టోక్యో: జపాన్‌లోని మియాజాకీ విమానాశ్రయంలో రెండో ప్రపంచ యుద్ధకాలం నాటి అమెరికాకు చెందిన బాంబు పేలింది. దీని కారణంగా ఆ ప్రాంతంలో భారీ గొయ్యి ఏర్పడింది. పేలుడు సమయానికి సమీపంలో విమానాలు ఏమీ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి హాని కలగలేదని తెలుస్తోంది. గొయ్యి కారణంగా దాదాపు 80కి పైగా విమానాల రాకపోకలను రద్దు చేసినట్లు అధికారులు వెల్లడించారు. సమాచారం అందుకున్న సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. 500 పౌండ్ల బరువున్న యూఎస్ బాంబు వల్ల ఈ పేలుడు సంభవించినట్లు గుర్తించారు. 1943లో మియాజాకీ ఎయిర్‌పోర్టును నిర్మించారు. మాజీ ఇంపీరియల్ జపనీస్ నేవీ ఫ్లైట్ ట్రైనింగ్ ఫీల్డ్‌గా దీన్ని ఉపయోగించేవారు. ఆత్మాహుతి దాడి మిషన్‌లో భాగంగా కొందరు పైలట్లు ఇక్కడి నుంచి బయలుదేరేవారు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో అమెరికా సైన్యం వేసిన కొన్ని బాంబుల్లో.. పేలనవి ఈ ప్రాంతంలో ఉన్నట్లు రక్షణ మంత్రిత్వశాఖ అధికారులు తెలిపారు.

దిల్లీలో రూ.2వేల కోట్ల కొకైన్ స్వాధీనం


దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో భారీగా డ్రగ్స్ బయటపడ్డాయి. దాదాపు 560 కిలోలకు పైగా కొకైన్‌ను దిల్లీ పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.2వేల కోట్లు ఉంటుందని అంచనా. సౌత్ దిల్లీలోని మహరౌలీలో సోదాలు జరిపిన పోలీసులు ఈ భారీ డ్రగ్స్ రాకెట్‌ను ఛేదించారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న నలుగురిని అరెస్టు చేశారు. ఈ భారీ కొకైన్ తరలింపు వెనుక అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమ రవాణా సిండికేట్ హస్తం ఉందని అనుమానిస్తున్నారు.

ఎర్ర సముద్రంలో నీట మునిగిన పడవలు

• 45 మంది వలసదారుల మృతి

జిబూతీ: ఎర్ర సముద్రంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆఫ్రికా వలసదారులతో ప్రయాణిస్తున్న రెండు పడవలు జిబూతీ తీర సమీపంలో ప్రమాదానికి గురయ్యాయి. తీరానికి 150 మీటర్ల సమీపంలో నీటమునిగాయి. దీంతో 45మంది మృతిచెందినట్లు అంతర్జాతీయ వలసదారుల సంస్థ మంగళవారం వెల్లడించింది. 115మందిని రక్షించినట్లుగా పేర్కొంది. కాగా యెమెన్ నుంచి 310మంది వలసదారులతో బయల్దేరిన రెండు పడవలు సోమవారం వాయవ్య ఖోర్ అంగార్ ప్రాంతంలో ప్రమాదానికి గురయ్యాయి.

ఈక్విటీ మదుపర్లపై లాభాల వర్షం



ఈ ఏడాదిలో స్టాక్ మార్కెట్లు, మదుపర్లపై లాభాల వర్షాన్ని కురిపించాయి. సెన్సెక్స్, నిఫ్టీ కొత్త శిఖరాలను అధిరోహించడంతో మదుపర్ల సంపద ఏకంగా రూ.110.57 లక్షల కోట్లు పెరిగింది.

దిల్లీ: 2024లో ఇప్పటివరకు బీఎస్ఈలో మదుపర్ల సంపదగా పరిగణించే నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ రూ.474.86 లక్షల కోట్ల (5.67 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. సెప్టెంబరు 27న రూ.477.93 లక్షల కోట్ల వద్ద జీవనకాల గరిష్ఠాన్ని నమోదుచేసింది. భారత ఆర్థిక వ్యవస్థ బలమైన మూలాలు, నగదు లభ్యత పెరగడం, ఎఫ్ఐఐ-డీఐఐ ల కొనుగోళ్లు, అమెరికాలో వడ్డీ రేట్ల కోతలు వంటివి మన మార్కెట్ల జోరుకు కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. తాజాగా పశ్చిమాసియాలో పెరిగిన ఉద్రిక్తతల వల్ల గత 3 ట్రేడింగ్ రోజుల్లో మార్కెట్లు కొంత నష్టపోయాయి.

సెన్సెక్స్ లాభం (పాయింట్లు)

సంవత్సరం	పాయింట్లు	శాతం
2024	11,994.35	16.60%
2023	11,399.52	18.73%

- సెన్సెక్స్ జీవనకాల గరిష్ఠం 85,978.25 పాయింట్లు (సెప్టెంబరు 27న)
- బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ లాభం 12,645 పాయింట్లు (34.32%)
- బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 14,777 పాయింట్లు (34.62%)

ఏడాది ప్రారంభంలో సెన్సెక్స్ (పాయింట్లు): 72,271.94

ప్రస్తుతం: 84,266.29

సెన్సెక్స్ మైలురాళ్లు (పాయింట్లు)

సెప్టెంబరు 17	సెప్టెంబరు 24	సెప్టెంబరు 25
83,000	84,000	85,000

మదుపర్ల సంపద



2023 నవంబరు 29	2024 మే 21
4 లక్షల కోట్ల డాలర్లు	5 లక్షల కోట్ల డాలర్లు

అత్యంత విలువైన కంపెనీలివే..

కంపెనీ	విలువ
రిలయన్స్ ఇండస్ట్రీస్	రూ.19.82 లక్షల కోట్లు
టీసీఎస్	రూ.15.50 లక్షల కోట్లు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	రూ.13.16 లక్షల కోట్లు
ఎయిర్‌టెల్	రూ.9.67 లక్షల కోట్లు
ఐసీఐసీఐ బ్యాంక్	రూ.8.98 లక్షల కోట్లు

మార్కెట్‌కు గండాలున్నాయి.. జాగ్రత్త

- అంతర్జాతీయ పరిణామాలను గమనించాలి
- పెట్టుబడులపై దూకుడు వద్దు
- మదుపర్లకు మార్కెట్ నిపుణుల సలహా



ప్రస్తుత సంవత్సరంలో ఇప్పటివరకు దేశీయ స్టాక్ మార్కెట్లు అత్యుత్తమ పని తీరు కనబర్చినా, ఇకపై మదుపర్లు అప్రమత్తతతో వ్యవహరించాలని విశ్లేషకులు సూచిస్తున్నారు. అంతర్జాతీయంగా పలు ప్రతికూల పరిణామాలు ఎదురవుతున్నందున పెట్టుబడి నిర్ణయాల్లో దూకుడుగా వ్యవహరించడం మంచిది కాదని సలహా ఇస్తున్నారు.

✦ ఇరాన్– ఇజ్రాయెల్ యుద్ధం వల్ల పెరుగుతున్న ముడి చమురు ధరలు

✦ చైనా ఉద్దీపన ప్యాకేజీ

✦ జపాన్ కీలక రేట్లను పెంచే అవకాశం లాంటివి భారత స్టాక్ మార్కెట్లపై ప్రభావం చూపించే అవకాశం ఉందని అంటున్నారు.

'దేశీయ పెట్టుబడుల వల్లే రాణింపు

ఈ ఏడాదిలో ఇప్పటివరకు సెన్సెక్స్, నిఫ్టీ 16% పెరిగాయి. చైనా, బ్రిటన్, జపాన్, ఇండోనేషియా, ఫిలిప్పిన్స్, కొరియా లాంటి మార్కెట్లతో పోలిస్తే మన మార్కెట్లే రాణించాయి. ఇందులో దేశీయ మదుపర్ల పెట్టుబడులే ప్రధాన భూమిక పోషించాయన్నది దిగ్గజ విశ్లేషకులందరూ చెబుతున్న మాట.

✦ ఇప్పుడు రేసులోకి చైనా వచ్చింది. కొన్నేళ్లుగా నష్టాలను చవిచూస్తున్నందున.. షేర్ల ధరలు తక్కువగా ఉన్నందున, చైనా మార్కెట్లు అంతర్జాతీయ పెట్టుబడిదార్లను ఆకర్షించొచ్చు. భారత మార్కెట్లు వ్యవస్థాగతంగా బలంగా కనిపిస్తున్నా, ఈ సమయంలో పెట్టుబడుల విషయంలో దూకుడుగా వెళ్లకూడద'ని మార్కెట్ నిపుణుడు శంకర్ శర్మ సూచించారు.

✦ జీఎస్‌టీ వసూళ్లు, తయారీ రంగ పీఎంఐ గణాంకాలు, కార్పొరేట్ కంపెనీల ఫలితాలు లాంటి సూక్ష్మ ఆర్థిక పరిస్థితులు కూడా ఆశించిన స్థాయిలో ఉండటం లేదనే విషయాన్ని మదుపర్లు దృష్టిలో ఉంచుకోవాలని చెబుతున్నారు.

✦ అంతర్జాతీయ ప్రతికూలతల్లో ఏ ఒక్కటి తీవ్ర రూపం దాల్చినా భారత మార్కెట్లపైనా ప్రభావం పడొచ్చు. దేశీయంగా నిధుల లభ్యత తగ్గడం ప్రారంభమైనా.. అది ఇబ్బందికరమే అవుతుంది.

ఈనాడు బిజినెస్

దీర్ఘకాలిక దృక్పథంతోనే వ్యవహరించాలి

భారత స్టాక్ మార్కెట్లపై విదేశీ సంస్థాగత మదుపర్ల (ఎఫ్ఐఐ) పెట్టుబడుల ప్రభావం గతంలో మాదిరి ప్రస్తుతం పెద్దగా కనిపించడం లేదు. అయితే జపాన్‌లో వడ్డీ రేట్లను పెంచితే భారత్‌లోకి సహా ప్రపంచవ్యాప్తంగా విదేశీ పెట్టుబడుల రాక తగ్గొచ్చు. ఈ నేపథ్యంలో దీర్ఘకాలిక దృక్పథంతోనే షేర్లలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రముఖ మదుపరి విజయ్ కేడియా సలహా ఇస్తున్నారు. సెన్సెక్స్, నిఫ్టీ లాంటి ప్రామాణిక సూచీలు రికార్డు స్థాయిలో పెరిగినా, కంపెనీల షేర్ల విలువలు ఈ స్థాయిలో రాణించలేదు. 'భారత్ దీర్ఘకాలంలో మరింతగా రాణిస్తుంది. అయితే మధ్య కాలానికి స్టాక్ మార్కెట్లలో ఒడుదొడుకులుంటాయి. మదుపర్లు అప్రమత్తతతో నిర్ణయాలు తీసుకోవాల'ని మార్కెట్ నిపుణులు సలహా ఇస్తున్నారు.

ఫిబ్రవరి 1 నుంచి మదుపర్లకు 3 ఇన్ 1 అకౌంట్

లేదంటే యూపీఐ ఆధారిత బ్లాక్ మెకానిజం

దిల్లీ: స్టాక్ మార్కెట్ మదుపర్లకు మంచి వెసులుబాటు కలగనుంది. 2025 ఫిబ్రవరి 1 నుంచి స్టాక్ బ్రోకర్లు యూపీఐ ఆధారిత బ్లాక్ మెకానిజంతో సెకండరీ మార్కెట్లో ట్రేడింగ్ సదుపాయాన్ని అందజేస్తారు. లేదంటే 3 ఇన్ 1 ట్రేడింగ్ అకౌంట్ సదుపాయాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. ఈ రెండింటిలో ఏదో ఒకటి కచ్చితంగా అర్హతగల స్టాక్ బ్రోకర్లు (క్యూఎస్‌బీలు) చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత కరెంట్ మోడ్ ఆఫ్ ట్రేడింగ్‌కు ఇది అదనంగా ఉంటుంది. అంటే క్లయింట్లు కొత్త విధానాన్ని వాడుకోవచ్చు. లేదంటే పాత పద్ధతిలో నిధులను బ్రోకరేజీ సంస్థలకు బదిలీ చేసి ట్రేడింగ్ చేయొచ్చు. ఈ ప్రతిపాదనకు సెబీ బోర్డు అంగీకరించింది.

3 ఇన్ 1 ట్రేడింగ్ ఖాతా: ఇందులో ఒక సేవింగ్స్ ఖాతా, ఒక డీమ్యాట్ ఖాతా, ఒక ట్రేడింగ్ ఖాతా కలిసి ఉంటాయి. ఒక వేళ క్లయింట్లు తమ నిధులను తమ సేవింగ్స్ ఖాతాలో ఉంచితే.. అందుకు వడ్డీ పొందుతారు.

యూపీఐ బ్లాక్ మెకానిజంలో: యూపీఐ బ్లాక్ మెకానిజంలో, క్లయింట్లు సెకండరీ మార్కెట్‌లో ట్రేడింగ్‌ను సైతం తమ బ్యాంక్ ఖాతాల్లోని నిధులను బ్లాక్ చేయడం ద్వారా చేయొచ్చు. బ్రోకర్లు/ట్రేడింగ్ సభ్యుడికి నిధులను బదిలీ చేయాల్సిన అవసరం రాదు. ఈ విధానాన్ని 2019 జనవరి నుంచి ఐపీఓలకు అమలు చేస్తున్నారు.

ఆతిథ్య రంగంలో స్థానికులకు ఉద్యోగాలు

ఎఫ్‌హెచ్‌ఆర్ఏఐ అధ్యక్షుడు శ్యామరాజు



హైవేల్లో మెరుగైన సదుపాయాలతో హోటళ్లు

ఈనాడు, బెంగళూరు: 'పర్యాటకంలో కీలకం ఆతిథ్య రంగమే. అయితే హోటళ్లు/రెస్టారెంట్లలో చూస్తే, ఉత్తరాది వారే ఎక్కువగా ఉద్యోగాల్లో ఉంటున్నారు. వారికి భాషాపరమైన సౌలభ్యంతో పాటు నైపుణ్య శిక్షణావకాశాలూ అందుబాటులో ఉండటమే ఇందుకు కారణం. హోటళ్లలో భద్రతా సిబ్బంది నుంచి మేనేజర్ స్థాయి వరకు స్థానికులకే ఉద్యోగాలివ్వాలంటే, అందుకు తగిన శిక్షణ అవసరం. గ్రామీణ ప్రాంత యువతకు ఇందువల్ల మేలు కలుగుతుంది. ఈ దిశగా సత్వరం చర్యలు తీసుకుంటున్నామ'ని ఫెడరేషన్ ఆఫ్ హోటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌హెచ్‌ఆర్ఏఐ) నూతన అధ్యక్షుడు కె.శ్యామరాజు వెల్లడించారు. మౌర్య హోటల్ ఎండీ, కర్ణాటక పర్యాటక సంఘానికి అధ్యక్షుడు, దక్షిణ భారత హోటల్, రెస్టారెంట్ సమాఖ్య (ఎస్ఐహెచ్ఆర్ఏ) అధ్యక్షుడిగా ఉన్న శ్యామరాజు ఇటీవల జాతీయ సంఘానికి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. వివిధ అంశాలపై 'ఈనాడు'తో ఆయన మాట్లాడారు. ముఖ్యాంశాలివీ..

ఆంధ్రప్రదేశ్ తరహాలో పరిశ్రమ హోదా

ఆతిథ్య రంగంలో లాభాలు చూడాలంటే కనీసం పుష్కర కాలం వేచి చూడాలి. తక్కువ వడ్డీకి దీర్ఘకాలిక రుణాలు, హేతుబద్ధ పన్నుల సదుపాయం ఉంటేనే హోటళ్లకు మనుగడ. ఈ రంగానికి పరిశ్రమ హోదా ద్వారానే ఇది సాధ్యమవుతుంది. ఆతిథ్య రంగానికి పరిశ్రమ హోదా కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుకు వచ్చింది. దేశంలోని మిగిలిన రాష్ట్రాలు కూడా ఇందుకు ముందుకు వస్తే, ఈ రంగంలోకి మరిన్ని పెట్టుబడులు వస్తాయి.

తెలుగు రాష్ట్రాల్లో శిక్షణ కేంద్రాలు

ఎఫ్‌హెచ్‌ఆర్ఏఐ ఆధ్వర్యంలో దిల్లీ సమీపంలో క్యాటరింగ్ ఇన్‌స్టిట్యూట్ ఉంది. ఇదే తరహాలో చెన్నైలో ఎస్ఐహెచ్ఆర్ఏ సహకారంతో నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని నెలకొల్పాం. తెలుగు రాష్ట్రాలతో పాటు మిగిలిన ప్రాంతాల్లోనూ ఇలాంటివి నెలకొల్పి, గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ ఇప్పిస్తే, స్థానికంగా ఉపాధి లభిస్తుంది. ఈ రంగమూ అభివృద్ధి చెందుతుంది.

జాతీయ రహదారుల వెంబడి

జాతీయ రహదారుల వెంబడి పరిశుభ్రమైన శౌచాలయాలు, ఆహ్లాదకర హోటళ్లకు అధిక గిరాకీ ఉంటోంది. ఇందుకోసం జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)తో చర్చించి, కొన్ని స్థలాలు కేటాయించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. మధ్యతరగతి వర్గీయులకు అనువైన వసతులతో హోటళ్లు నెలకొల్పాలన్నది మా యోచన. హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార నాణ్యతను పరిరక్షించేందుకు ఎఫ్ఎస్ఎస్ఏఐ ల్యాబ్‌ల ఏర్పాటు, ధరలపై స్వీయ నియంత్రణ విధానాలను అమలు చేసేందుకు ఎఫ్‌హెచ్‌ఆర్ఏఐ యత్నిస్తోంది. ఆయా రాష్ట్రాల్లోని ఆధ్యాత్మిక ప్రదేశాలను కలుపుతూ ప్రత్యేక రోడ్ మ్యాప్ తయారు చేస్తాం.

ఎస్‌బీఐ మరో 600 శాఖలు

ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి

దిల్లీ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో మరో 600 శాఖలు తెరవాలని ప్రణాళిక సిద్ధం చేసినట్లు బ్యాంక్ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి వెల్లడించారు. అధికులు నివాసముండే టౌన్‌షిప్‌లతో పాటు, కొత్తగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో వ్యాపార అవకాశాలు దక్కించుకునేందుకు ఈ శాఖలను ప్రారంభించనున్నామని పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో 137 శాఖలను బ్యాంక్ ప్రారంభించింది. ఇందులో 59 శాఖలను గ్రామీణ ప్రాంతాల్లో తెరిచింది. 2024 మార్చి చివరకు బ్యాంక్ నెట్‌వర్క్‌లో 22,542 శాఖలున్నాయి. బ్యాంక్‌కు 65,000 ఏటీఎంలతో పాటు 85,000 మంది బిజినెస్ కరస్పాండెంట్లు ఉన్నారు. 50 కోట్ల మంది ఖాతాదార్లకు బ్యాంక్ సేవలందిస్తోందని, దేశంలోని ప్రతి పౌరుడి కోసం ఈ బ్యాంక్ ఉందని శ్రీనివాసులు వెల్లడించారు.

హెచ్ఐవీ ఔషధంపై గిలీడ్ సైన్సెస్‌తో డాక్టర్ రెడ్డీస్, హెటెరో ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: మనదేశంతో పాటు మరో 120 దేశాల్లో లెనకపవిర్ అనే హెచ్ఐవీ ఔషధాన్ని అందుబాటులోకి తీసుకురావటానికి డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్, హెటెరో ల్యాబ్స్ సన్నద్ధమవుతున్నాయి. ఈ ఔషధం ఉత్పత్తి, విక్రయాల కోసం అమెరికా బయో ఫార్మా సంస్థ గిలీడ్ సైన్సెస్‌తో స్వచ్ఛంద లైసెన్సింగ్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు డాక్టర్ రెడ్డీస్, హెటెరో వెల్లడించాయి. ఇది నాన్-ఎక్స్‌క్లూజివ్ ఒప్పందం. అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) అనుమతి లభించిన లెనకపవిర్ ఔషధాన్ని హెచ్ఐవీ-1 ఇన్ఫెక్షన్ సోకిన వారికి వినియోగిస్తున్నారు.

కోడి గుడ్లు

3న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

ప్రాంతం	ధర
హైదరాబాద్	510
వరంగల్	512
విజయవాడ	535
గోదావరి	535
విశాఖపట్నం	535
చిత్తూరు	523

వెనుకవైపూ డిస్‌ప్లే: లావా



దిల్లీ: దేశీయ మొబైల్ తయారీ సంస్థ లావా, తమ సరికొత్త స్మార్ట్‌ఫోన్ అగ్ని3ని ఈనెల 4న ఆవిష్కరించనుంది. ఈ ఫోన్‌కు ముందువైపు పెద్ద డిస్‌ప్లే ఉంటుందని, వెనుకవైపు కూడా కెమెరా పక్కన చిన్న డిస్‌ప్లే ఉంటుందని సంస్థ వెల్లడించింది. దీనిసాయంతో కాల్స్ మాట్లాడుకునేందుకు, ఎస్ఎంఎస్‌లు చూసేందుకు వీలవుతుందని, సెల్ఫీలు కూడా తీసుకోవచ్చని వివరించింది. ఈ ఫోన్ ధర రూ.30,000 సమీపంలో ఉండొచ్చని సంకేతాలిచ్చింది. షియోమీ కూడా వెనుకవైపు చిన్న డిస్‌ప్లే కలిగిన స్మార్ట్‌ఫోన్‌ను మూడేళ్ల క్రితం ఆవిష్కరించింది. అందులో సమయం, బ్యాటరీ ఛార్జింగ్ చూసుకునేందుకే వీలయ్యేది.

రిలయన్స్‌తో భాగస్వామ్యం కొనసాగుతుంది: బీపీ



దిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో అంతర్జాతీయ చమురు దిగ్గజం బీపీ పీఎల్‌సీ ప్రత్యేక ఒప్పందం ముగిసినప్పటికీ.. భారత్‌లో చమురు-గ్యాస్‌తో పాటు మొబిలిటీ వెంచర్లలో ఆ సంస్థ వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతుందని బీపీ ఇండియా అధిపతి శశి ముకుందన్ పేర్కొన్నారు. 2011లో రిలయన్స్‌కు చెందిన 23 చమురు-గ్యాస్ బ్లాక్‌ల్లో 30% వాటాను 7.2 బిలియన్ డాలర్లు వెచ్చించి బీపీ కొనుగోలు చేసింది. ఈ లావాదేవీలో భాగంగా 10 ఏళ్ల ప్రత్యేక కాలవ్యవధిని నిర్దేశించుకున్నారు. దీని ప్రకారం భారత్‌లో ఇంధన ప్రాజెక్టులు లేదా పెట్టుబడులను రిలయన్స్ భాగస్వామ్యంతోనే బీపీ చేపట్టాలి. కేజీ-డీ6లోని లోతైన సహజ వాయువు ప్రాజెక్టులు సహా ఇంధన కార్యకలాపాల్లోకి బీపీ పీఎల్‌సీ ఇప్పటివరకు 12 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టింది. 2005 ప్రారంభంలో అప్పటి బీపీ సీఈఓ లార్డ్ జాన్ బ్రౌన్ భారత పర్యటన నుంచి రిలయన్స్‌తో కలిసి పనిచేస్తున్నామని ముకుందన్ వెల్లడించారు. గత 13 ఏళ్ల నుంచి రిలయన్స్‌తో భాగస్వామ్యంలో ఉన్నామని, ఇది కాంట్రాక్టు కాదని, నమ్మకం, అనుబంధంపై ఆధారపడినదని తెలిపారు. ఏదైనా సమస్య తలెత్తితే నేరుగా రిలయన్స్ అధిపతి ముకేశ్ అంబానీ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పీఎంఎస్ ప్రసాద్‌లో కలిసి పరిష్కరించుకునే వాళ్లమని వివరించారు.

'మేడ్ ఇన్ ఇండియా' బ్రాండ్ ప్రోత్సాహానికి పథకం!

దిల్లీ: ప్రపంచ మార్కెట్లలో బ్రాండ్ ఇండియాకు ప్రాచుర్యం కల్పించేందుకు 'మేడ్ ఇన్ ఇండియా' లేబుల్ కోసం ఒక పథకాన్ని రూపొందించేందుకు ప్రభుత్వం చర్చిస్తోంది. పథకం వివరాలను ఉన్నత స్థాయి కమిటీ పరిశీలిస్తోందని ఒక అధికారి తెలిపారు. 'మేడ్ ఇన్ జపాన్', 'మేడ్ ఇన్ స్విట్జర్లాండ్' తరహాలో మన దేశానికి బలమైన బ్రాండ్ గుర్తింపును సృష్టించడం దీని లక్ష్యమని పేర్కొన్నారు.

✦ స్విట్జర్లాండ్ అనగానే వారి గడియారాలు, చాక్లెట్లు, బ్యాంకింగ్ వ్యవస్థ గుర్తుకొస్తాయి. ప్రపంచ విపణుల్లో మన దేశానికి అలాంటి గుర్తింపు ఎలా తేవాలనే విషయమై చర్చలు జరుపుతున్నాయని, మనకు బలం ఉన్న టెక్స్‌టైల్స్ వంటి నిర్దిష్ట రంగాలను ఇందుకు పరిశీలిస్తున్నామని సదరు అధికారి తెలిపారు. బ్రాండ్ ఇండియాకు నాణ్యతే కీలకం. భారతీయ ఉత్పత్తులు, సేవల వ్యాప్తి కోసం ఇండియా బ్రాండ్ ఈక్విటీ ఫౌండేషన్ (ఐబీఈఎఫ్)ను వాణిజ్య విభాగం స్థాపించింది.

బుధవారం మార్కెట్లు పనిచేయలేదు

గాంధీ జయంతి సందర్భంగా బుధవారం నాడు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ పనిచేయలేదు. ఫారెక్స్, బులియన్, కమొడిటీ మార్కెట్లకు కూడా సెలవే.

మస్క్ కొన్నాక.. 'ఎక్స్' విలువ 80% పతనం



- పెట్టుబడి దిగ్గజం ఫెడెలిటీ నివేదిక
- అంగీకరించని ఇతర విశ్లేషకులు

ఒకప్పటి ట్విటర్.. ఇప్పటి ఎక్స్ విలువ రెండేళ్ల క్రితం ఎలాన్ మస్క్ కొనుగోలు చేసిన సమయంతో పోలిస్తే, ఏకంగా 80% తగ్గింది. మస్క్ యాజమాన్యంలో కంపెనీ ఆర్థిక పనితీరు, భవితవ్యంపై తలెత్తిన ఆందోళనలే ఇందుకు కారణమని ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం ఫెడెలిటీ పేర్కొంది.

రూ.3.7 లక్షల కోట్ల నుంచి రూ.78,000 కోట్లకు: 2022 అక్టోబరులో ట్విటర్‌ను మస్క్ స్వాధీనం చేసుకున్నారు. అప్పటి ఒప్పందం విలువ 44 బిలియన్ డాలర్లు. మన రూపాయల్లో 3.7 లక్షల కోట్లు. ఆ తర్వాత ఎక్స్ఛేంజీల్లో ఎక్స్ షేరు ట్రేడ్ కాకపోయినప్పటికీ, ఫిడెలిటీ మాత్రం ఎక్స్‌లో తనకున్న షేర్ల విలువను వెల్లడిస్తోంది. తాజా నివేదిక ప్రకారం.. ఫెడిలిటీకి ఎక్స్‌లో ఉన్న షేర్ల విలువ 2022 అక్టోబరులో 19.66 మిలియన్ డాలర్లు కాగా, 2024 ఆగస్టు చివరకు 4.2 మి. డాలర్లకు పతనమైంది. అంటే 79% క్షీణించినట్లు లెక్క. ఈ గణాంకాల ప్రకారం చూస్తే ఎక్స్ మొత్తం విలువ 9.4 బిలియన్ డాలర్లు (సుమారు రూ.78,000 కోట్లు) అవుతుంది. మస్క్ కొన్న విలువతో పోలిస్తే ఇది చాలా తక్కువ. అయితే ఫెడెలిటీ అంచనాలను చాలా మంది విశ్లేషకులు ఒప్పుకోవట్లేదు. దీర్ఘ కాలంలో మస్క్ చెల్లించిన విలువ కంటే ఎక్కువ విలువకు ఎక్స్ చేరుకుంటుందనే విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఇపుడు ఎక్స్ విలువ 15 బి. డాలర్లకు చేరి ఉండొచ్చని వెడ్‌బుల్ సెక్యూరిటీస్ ఎండీ డాన్ ఐవెస్ అంటున్నారు. వినియోగదార్లతో ఎక్స్ గట్టిగా అనుసంధానమై ఉందనీ.. అయితే ఒత్తిడిని ఎదుర్కొంటోందని అన్నారు.

పబ్లిక్ నుంచి ప్రైవేటుకు మారడంతో..

ఏ కంపెనీ అయినా ప్రైవేటుగా ఉంటే, త్రైమాసిక ఫలితాలను వెల్లడించాల్సిన అవసరం ఉండదు. ఎక్స్ కూడా పబ్లిక్ నుంచి ప్రైవేటుకు మారడంతో, ఆ సంస్థ ఆర్థిక పనితీరును లెక్కవేయడం క్లిష్టమే. ఎక్స్ విలువ క్షీణత.. ఆ కంపెనీ ఆదాయాలు తగ్గడాన్ని సూచిస్తోందని ఫెడెలిటీ పేర్కొంది. పలువురు విశ్లేషకులు కూడా.. వ్యాపార ప్రకటనదార్లను ఆకర్షించడంలో ఎక్స్ కష్టపడుతోందనే చెబుతున్నారు. ఎక్స్ కేవలం 4% 'బ్రాండ్ సేఫ్టీ'నే అందిస్తోందని.. గూగుల్ ఇచ్చే 39 శాతంతో పోలిస్తే ఇది చాలా తక్కువ అని ప్రకటనదార్లు భావిస్తున్నారు. వచ్చే ఏడాది ఎక్స్‌లో తమ వ్యయాలు తగ్గించుకోవాలని 26% మార్కెటర్లు భావిస్తున్నట్లు ఒక సర్వేలో తేలింది.

అలా చేస్తే ఆర్‌బీఐపై నమ్మకం పోతుంది

- వడ్డీ రేట్ల నిర్ణయంపై వచ్చిన సలహాలు తప్పు
- ఆర్‌బీఐ పూర్వ గవర్నర్ రఘురామ్ రాజన్



దిల్లీ: కీలక రేట్లను నిర్ణయించే సమయంలో ఆహార ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకోరాదన్న సలహాలు వచ్చిన నేపథ్యంలో, రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ స్పందించారు. అలా చేస్తే ఆర్‌బీఐపై ప్రజలకున్న 'గొప్ప నమ్మకం' వమ్ము అవుతుందని అన్నారు. 2023-24 ఆర్థిక సర్వేలో వచ్చిన సూచనలపై రాజన్ స్పందిస్తూ 'ద్రవ్యోల్బణంలో అత్యంత ముఖ్యమైన భాగాలను వదిలేస్తే.. అది అదుపులో ఉన్నట్లే కనిపిస్తుంది. అయితే ఆహార ధరలు ఆకాశాన్ని అంటిన పక్షంలో, అది ద్రవ్యోల్బణ గణనలో లేకపోతే మాత్రం.. ఆర్‌బీఐపై ఉన్న నమ్మకం ప్రజలకు పోతుంద'ని వివరించారు. పరపతి విధానం అనేది ఆహార ధరలపై ఆధారపడదని.. సరఫరా వైపు ఒత్తిళ్ల ఆధారంగా ఉంటుందని నాగేశ్వరన్ అభిప్రాయపడ్డారు. సగటు ధరల స్థాయిని ఆర్‌బీఐ లక్ష్యంగా చేసుకోవచ్చన్నారు.

ఉద్యోగులపై ఎక్కువ ఒత్తిడి తెచ్చే కంపెనీలు ముందుకెళ్లలేవు

జోహో సీఈఓ శ్రీధర్ వెంబు

దిల్లీ: పనిప్రదేశాల్లో ఉన్న అధిక ఒత్తిడిపై కార్పొరేట్ రంగంలో జరుగుతున్న తీవ్ర చర్చ నేపథ్యంలో జోహో సీఈఓ, సహ వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు స్పందించారు. 'ఉద్యోగులను తీవ్ర ఒత్తిడిలోకి నెట్టే కంపెనీలు స్థిరంగా ముందుకు వెళ్లలేవని.. వాటి మైండ్‌సెట్ మారాల్సిన అవసరం ఉంద'ని అన్నారు. దీర్ఘకాలం పాటు కొనసాగే, స్థిరమైన సంస్థలను నిర్మించాలంటే ఆయా కంపెనీల తీరులో మార్పు రావాలని శ్రీధర్ సూచించారు. 'ఎక్కువ పని, పెద్ద నగరాలకు వెళ్లాక ఒంటరితనం, ఆఫీసుకు ఎక్కువ దూరం ప్రయాణించడం, పని విషయంలో ఒత్తిడి పరిస్థితులు.. తదితరాలు ఉద్యోగులను ఒక పెద్ద ప్రెషర్ కుకర్‌లాంటి వాతావరణంలోకి నెడుతున్నాయ'ని శ్రీధర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి మారాలంటే పెద్ద టెక్ కంపెనీలు కూడా నియంత్రణ సంస్థల పరిధిలోకి రావాలని ఆయన గట్టిగా నొక్కి చెప్పారు.

సరకు రవాణా వ్యయాలు పెరగొచ్చు

- సరఫరాలోనూ జాప్యం
- చమురు, ఎలక్ట్రానిక్స్, వ్యవసాయ రంగాలపై ప్రభావం
- పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై ఎగుమతిదార్ల విశ్లేషణ



దిల్లీ: పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రికత్తలు పెరగడం వల్ల సరకు రవాణా వ్యయాలు మరింతగా పెరిగే అవకాశం ఉందని ఎగుమతిదార్లు అభిప్రాయపడుతున్నారు. చమురు, ఎలక్ట్రానిక్స్, వ్యవసాయ రంగాల పైనా ప్రభావం పడొచ్చని అంటున్నారు. యుద్ధంతో ప్రత్యక్షంగా సంబంధమున్న దేశాలకు చేసే ఎగుమతుల కోసం అధికంగా బీమా చెల్లించాల్సి రావొచ్చని, దీని వల్ల భారతీయ ఎగుమతిదార్ల నిర్వహణ మూలధనంపై ప్రభావం పడుతుందని విశ్లేషిస్తున్నారు. ఉద్రిక్తతల వల్ల ఇజ్రాయెల్, జోర్డాన్, లెబనాన్ లాంటి దేశాలతో భారత వాణిజ్యం నెమ్మదిస్తుందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) తెలిపింది. ఇరాన్- ఇజ్రాయెల్ యుద్ధం ప్రపంచ వాణిజ్యంతో పాటు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థపైనా పలు రూపాల్లో గణనీయ ప్రభావం చూపించే అవకాశం ఉందని భారత ఎగుమతిదార్ల సమాఖ్య (ఫియో) పేర్కొంది.

చమురు ధరలు పెరుగుతాయ్

'చమురు విపణిలో ఇజ్రాయెల్ కీలక దేశం. ఉద్రిక్తతలు పెరిగితే చమురు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. చమురు ధరల్లో పెరుగుదలకు ఇది దారితీస్తుంది. ఈ ప్రభావం అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థపై పడుతుంది. ముఖ్యంగా చమురు దిగుమతులపై ఆధారపడిన దేశాలపై మరింతగా ఉంటుంది. చమురు ధర ఇప్పటికే బ్యారెల్‌కు 4 డాలర్ల మేర పెరిగింద'ని ఫియో డీజీ అజయ్ సహాయ్ తెలిపారు. ఉద్రిక్తతలు పెరిగితే మధ్యప్రాచ్యంలో అనిశ్చితులు అధికమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల ప్రపంచ చమురు సరఫరా అధికంగా జరిగే హోర్ముజ్ జలసంధి లాంటి మార్గాల్లో వాణిజ్యంపై ప్రభావం పడుతుందని సహాయ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. దీని వల్ల ఓడ రవాణా వ్యయాలు పెరగడమే కాకుండా, సరఫరా ఆలస్యం అవుతుందని వివరించారు. ఒకవేళ పాశ్చాత్య దేశాలు ఏవైనా దేశాలపై వాణిజ్య ఆంక్షలు విధిస్తే, అంతర్జాతీయ వాణిజ్యం మరింత క్లిష్టమవుతుందని.. ప్రపంచ మార్కెట్లలో తీవ్ర ఒడుదొడుకులకు కారణం అవుతుందని తెలిపారు.

పశ్చిమాసియా దేశాలతో భారత వాణిజ్యం (కోట్ల డాలర్లలో)

దేశం	ఎగుమతులు ఏప్రిల్-జులై (2024-25)	ఎగుమతులు 2023-24	దిగుమతులు ఏప్రిల్-జులై (2024-25)	దిగుమతులు 2023-24
ఇజ్రాయెల్	63.9	452	46.94	200
ఇరాన్	53.85	122	14.06	62.51
జోర్డాన్	22.85	146	69.92	140
లెబనాన్	11.68	34.49	3.9	11.3

పశ్చిమాసియా దేశాలకు భారత్ ప్రధాన ఎగుమతులు

బాస్మతీ బియ్యం, వస్త్రాలు, నూలు, రత్నాలు, ఆభరణాలు, పత్తి నూలు

2 ఆసియాలో భారత్‌కు ఇజ్రాయెల్ రెండో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి

నెమ్మదించిన ఎగుమతులు..

ఇజ్రాయెల్- హమాస్ యుద్ధం 2023 అక్టోబరులో ప్రారంభమైంది. ఈ ఉద్రిక్తతలు లెబనాన్, సిరియాకు విస్తరించాయి. జోర్డాన్, ఇరాన్‌లకు కూడా ఈ యుద్ధం పాకింది. 'ఈ ప్రాంతాలకు ఆర్డర్లు నిలిచిపోతాయి. ఈ ప్రాంతాలతో వాణిజ్యం మరింత కష్టంగా మారొచ్చు. ఎగుమతుల బీమా వ్యయాలు పెరుగుతాయి. ఒక్కోసారి బీమా రక్షణ (కవర్) కూడా లభించకపోవచ్చ'ని హ్యాండ్ టూల్ అసోసియేషన్ ఛైర్మన్ ఎస్.సి.రాల్హాన్ తెలిపారు. 'ఇజ్రాయెల్‌కు భారత ఎగుమతులు 63.5% తగ్గాయి. జోర్డాన్‌కు 38.5%, లెబనాన్‌కు 6.8% చొప్పున ఎగుమతులు క్షీణించాయ'ని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ తెలిపారు.

ఈనాడు సినిమా

పుట్టిన రోజున కింగ్ తీపి కబురు!


షారుక్ ఖాన్

గతేడాది హ్యాట్రిక్ హిట్లతో ప్రేక్షకుల్ని అలరించిన బాలీవుడ్ అగ్రకథానాయకుడు షారుక్ ఖాన్.. ఈ ఏడాది పూర్తి కావొస్తున్నా ఇంకా తన రాబోయే చిత్రాన్ని ప్రకటించలేదు. ఆయన, తన కుమార్తె సుహానా ఖాన్‌తో కలిసి 'కింగ్' అనే చిత్రంలో నటిస్తున్నట్లు వార్తలు వస్తోన్నా ఇప్పటి వరకూ ఈ ప్రాజెక్టును అధికారికంగా వెల్లడించలేదు. ఇప్పుడీ సినిమా గురించి ఓ ఆసక్తికర విషయం బయటికొచ్చింది. సుజోయ్ ఘోష్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని షారుక్ పుట్టిన రోజున ప్రకటించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. "కింగ్' సినిమాకు సంబంధించిన అప్‌డేట్‌ల కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న అభిమానులకు.. నవంబరు 2న ఓ తీపి కబురు వినిపించనుంది చిత్ర బృందం. యాక్షన్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతమందిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరిలో షూటింగ్‌ను ప్రారంభించాలని నిర్ణయించింది చిత్రబృందం" అని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

జపాన్‌లో జవాన్


'మేము జవాన్లం. దేశం కోసం మా ప్రాణాలు ఒక్కసారి కాదు వెయ్యిసార్లైనా పోగొట్టుకోవడానికి సిద్ధమే" అంటూ గతేడాది 'జవాన్'తో ప్రేక్షకుల్ని మెప్పించారు షారుక్. ఆయన ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని అట్లీ తెరకెక్కించారు. యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో తీర్చిదిద్దిన ఈ సినిమా బాక్సాఫీసు వద్ద భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ చిత్రాన్ని జపాన్‌లో విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ వీడియోను పంచుకున్నారు షారుక్. "న్యాయం కోసం పోరాడిన ఓ యువకుడి కథ 'జవాన్'. మరి తన యాక్షన్‌ను చూడడానికి సిద్ధంగా ఉన్నారా..? నవంబరు 29న జపాన్ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు 'జవాన్" అని వ్యాఖ్యల్ని జోడించారు.

త్వరలో గాంధీ టాక్స్


విజయ్ సేతుపతి

ఇటీవల 'మహారాజ' చిత్రంతో ప్రేక్షకులను అలరించారు విజయ్ సేతుపతి. వైవిధ్యమైన పాత్రలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆయన నటిస్తోన్న మరో విభిన్న చిత్రం 'గాంధీ టాక్స్'. సత్యం, శాంతి, ప్రేమ, అహింస నేపథ్యంలో సాగే మూకీ చిత్రమిది. దీనిని కిశోర్ పాండురంగ బేలేకర్ రూపొందిస్తున్నారు. ఇందులో అరవింద్ స్వామి, అదితి రావ్ హైదరీ, సిద్ధార్థ్ జాదవ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఉద్యోగం కోసం ఎన్నో ప్రయత్నాలు చేసి విఫలమైన మహదేవ్ అనే ఓ నిరుద్యోగి.. వ్యాపారంలో నష్టాలను ఎదుర్కొంటున్న బోస్‌మన్‌తో స్నేహం చేసి తన జీవితాన్ని మార్చుకోవాలనుకుంటాడు. ఈ ప్రయాణంలో మహదేవ్ ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నాడనేది ఈ సినిమాలో చూపించనున్నారు. ఈ చిత్రాన్ని గతేడాది ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియాలో ప్రదర్శించారు. గాంధీ జయంతి సందర్భంగా ఈ సినిమా చిత్రీకరణకు సంబంధించిన ఓ వీడియోను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది చిత్రబృందం. త్వరలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.

జాన్వీ.. పరమ్ సుందరి!


జాన్వీ కపూర్

దేవర'తో థియేటర్లలో సందడి చేస్తోంది బాలీవుడ్ అందాల తార జాన్వీ కపూర్. ప్రస్తుతం కథల ఎంపికలో జోరు ప్రదర్శిస్తున్న ఆమె..కథానాయకుడు సిద్ధార్థ్ మల్హోత్రాతో ఓ సినిమా కోసం జోడీ కట్టిన సంగతి తెలిసిందే. 'దస్వీ' ఫేమ్ తుషార్ జలోటా దీన్ని తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు 'పరమ్ సుందరి' అనే పేరును ఖరారు చేసినట్లు తెలుస్తోంది. "ఓ స్వచ్ఛమైన ప్రేమకథా నేపథ్యంలో దీన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇప్పుడీ చిత్రానికి 'పరమ్ సుందరి' అనే పేరును నిర్ణయించింది చిత్రబృందం. నవంబరులో చిత్రీకరణను ప్రారంభించుకోనున్న ఈ చిత్రంలో సిద్ధార్థ్, జాన్వీల కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తుంది. త్వరలో ఈ ప్రాజెక్టును అధికారికంగా ప్రకటించడానికి సన్నాహాలు చేస్తున్నారు నిర్మాత దినేశ్ విజన్" అని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

సెలెబ్రిటీ ఆట షురూ

ముసుగులో ఉంటూ భయపెడుతున్న అతని ఆట కట్టించాలంటే, మన ఆట షురూ చేయాల్సిందే అంటూ రంగంలోకి దిగాడు ఓ యువకుడు. అతని కథేమిటో తెలియాలంటే 'మిస్టర్ సెలెబ్రిటీ' చూడాల్సిందే. పరుచూరి వెంకటేశ్వరరావు మనవడు పరుచూరి సుదర్శన్ కథానాయకుడిగా పరిచయం అవుతున్న చిత్రమిది. వరలక్ష్మీ శరత్ కుమార్, శ్రీదీక్ష, నాజర్, రఘుబాబు కీలక పాత్రలు పోషించారు. చందిన రవికిశోర్ దర్శకుడు. చిన్న రెడ్డయ్య, ఎన్.పాండురంగారావు నిర్మాతలు. ఈ నెల 4న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా బుధవారం కథానాయకుడు రానా దగ్గుబాటి ట్రైలర్‌ని విడుదల చేశారు. సెలెబ్రిటీని చేసి చంపేస్తా అంటూ భయపెట్టే ఓ ముసుగువీరుడి చుట్టూ సాగే ఓ క్రైమ్ థ్రిల్లర్ కథతో ఈ చిత్రం రూపొందినట్టు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ఇందులో విలన్ ఎవరనేది కీలకమని, యాక్షన్ ఘట్టాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని సినీ వర్గాలు తెలిపాయి.


రానా దగ్గుబాటి

బాక్సాఫీస్‌కి పండగ కళ

- ఈ నెలలో పదుల సంఖ్యలో చిత్రాలు
- కళొస్తున్న దసరా, దీపావళి

మన పండగ సంబరాల్లో సినిమాది ప్రధాన భూమిక. ఇంట్లో పూజలు, విందు వేడుకలు ముగిశాక థియేటర్‌లో కొత్త సినిమా ఏముందా అని ఆరా తీస్తుంటాం. ఆ అభిరుచికి తగ్గట్టే పండగలు వస్తున్నాయంటే బాక్సాఫీస్ ముందుకు సినిమాలు వరుస కడుతుంటాయి. ఈ నెలలో రెండు పండగలు. దసరా, దీపావళి. వరుసగా సెలవులే. ఇక వినోదాలకు కొదవేం ఉంటుంది? నెల ఆరంభం నుంచి చివరి వరకూ కొత్త సినిమాల హంగామానే.


రజనీకాంత్


గోపీచంద్

తెలుగు సినిమాకి పెద్ద సీజన్లలో దసరా ఒకటి. పాఠశాలలు, కళాశాలలకు సెలవులు కావడంతో, ఇంటిల్లిపాదీ కలిసి థియేటర్‌కి వెళ్లేందుకు అనువైన సమయం ఇది. అందుకే ఈ సీజన్‌ని లక్ష్యంగా చేసుకుని అగ్ర తారలు నటించిన సినిమాలు పోటాపోటీగా విడుదలవుతుంటాయి. అయితే ప్రతి ఏటా ఉన్నట్టుగా ఈసారి దసరాకి అగ్ర తారల సినిమాల సందడి లేదు కానీ, కొత్త విడుదలలకు లోటు లేదు. అనువాద చిత్రాలు, మధ్యస్థ వ్యయంతో రూపొందిన చిత్రాలు ప్రేక్షకుల ముందుకొస్తున్నాయి. ఈ ఏడాది వేసవి సీజన్‌ని వృథా చేసినట్టే, టాలీవుడ్‌కి సరైన ప్రణాళిక లేకపోవడంతో ఈ దసరాకీ చెప్పుకోదగ్గ ఆకర్షణలు తోడు కాలేదు. సెప్టెంబరు 27న ఎన్టీఆర్ 'దేవర' విడుదలైంది. వసూళ్లతో అదరగొడుతోంది. పండగ వరకూ ఈ సినిమా జోరు కొనసాగనుంది. అనుకూలమైన ఈ వాతావరణం చూస్తుంటే మరికొన్ని పెద్ద సినిమాలు విడుదలైనా మంచి వసూళ్లే రాబట్టేవని ట్రేడ్ వర్గాలు చెబుతున్న మాట. అగ్ర తారల సినిమాలు లేకపోతేనేం? యువ కథానాయకులు ఈ సీజన్‌పై గురిపెట్టారు. శ్రీవిష్ణు కథానాయకుడిగా నటిస్తున్న 'శ్వాగ్' ఈ నెల 4న విడుదలవుతున్న సంగతి తెలిసిందే. మంచి కథల్ని ఎంచుకుంటారని పేరున్న శ్రీవిష్ణు సినిమాపై మంచి అంచనాలే ఉన్నాయి. దానికితోడు 'కలి', 'మిస్టర్ సెలెబ్రిటీ', 'దక్షిణ' తదితర చిత్రాలు ఈ వారం ప్రేక్షకుల ముందుకొస్తున్నాయి.

నాలుగు సినిమాలు

దసరాని టార్గెట్ చేసుకుని ఈసారి విడుదలవుతున్న మన పెద్ద సినిమా అంటే.. గోపీచంద్ - శ్రీనువైట్ల కలయికలో రూపొందిన 'విశ్వం' అనే చెప్పాలి. ఈ చిత్రం అక్టోబరు 11న విడుదలవుతోంది. ఈ కలయిక, శ్రీను వైట్ల మార్క్ వినోదంపై అంచనాలు ఈ సినిమాపై ప్రత్యేకమైన ఆసక్తిని పెంచుతున్న అంశాలు. దీని కంటే ఒక రోజు ముందు రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన అనువాద చిత్రం 'వేట్టయన్' విడుదలవుతోంది. అమితాబ్ బచ్చన్, రానా దగ్గుబాటి, ఫహాద్ ఫాజిల్ తదితరులు ఇందులో కీలక పాత్రలు పోషించారు. రజనీ చిత్రంపై సహజంగానే ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన ఆసక్తి ఉంటుంది. పండగ సీజన్‌లో విడుదలవుతున్న ఈ సినిమా ఏ స్థాయిలో సందడి చేస్తుందో చూడాలి. వీటితో పాటు, సుధీర్‌బాబు కథానాయకుడిగా నటించిన 'మా నాన్న సూపర్ హీరో' 11వ తేదీన, సుహాస్ కథానాయకుడిగా నటించిన 'జనక అయితే గనక' 12వ తేదీన ప్రేక్షకుల ముందుకొస్తున్నాయి. 11వ తేదీనే బాలీవుడ్ నుంచి అలియాభట్, వేదాంగ్ రైనా ప్రధాన పాత్రధారులుగా రూపొందిన 'జిగ్రా' అనువాదంగా ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఇలా మూడు రోజులపాటు వరుసగా కొత్త సినిమాల విడుదలలే. తదుపరి వారం కూడా ఈ సినిమాలే ప్రదర్శితం కానున్నాయి.


విష్వక్‌సేన్


సుధీర్‌బాబు

తదుపరి వారం

దసరా తర్వాత 18, 25 తేదీలు లక్ష్యంగా మరికొన్ని చిత్రాలు ముస్తాబవుతున్నాయి. 'లగ్గం', 'గ్యాంగ్‌స్టర్', 'రివైండ్' తదితర చిత్రాలు అందులో ఉన్నాయి. 'శ్రీశ్రీశ్రీ రాజావారు', 'రోటి కపడా రొమాన్స్' తదితర చిత్రాలూ ఈ నెలలోనే విడుదలకు సన్నద్ధమయ్యాయి.

మళ్లీ దీపావళికి

తెలుగు సినిమా పరిశ్రమకి దీపావళి కూడా మంచి సీజనే. ఈ వారంలో తెలుగు నుంచి కొన్ని, తమిళం నుంచి కొన్ని సినిమాలు విడుదలవుతుంటాయి. ఈసారి కూడా అంతే. దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా నటించిన 'లక్కీ భాస్కర్', విష్వక్‌సేన్ కథానాయకుడిగా నటించిన 'మెకానిక్ రాకీ', సత్యదేవ్, డాలీ ధనంజయ నటించిన 'జీబ్రా', వీటితోపాటు తమిళ కథానాయకుడు శివకార్తికేయన్, సాయిపల్లవి జంటగా నటించిన 'అమరన్' ఈ నెల 31న విడుదల కానున్నాయి. తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి పాన్ ఇండియా స్థాయిలో రూపొందించిన చిత్రమే 'లక్కీ భాస్కర్'. పీరియాడిక్ కథతో తెరకెక్కించారు. విష్వక్‌సేన్ కథానాయకుడిగా, రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో 'మెకానిక్ రాకీ' తెరకెక్కింది. రామ్ తాళ్లూరి నిర్మాత. శివ కార్తికేయన్ కథానాయకుడిగా బయోగ్రాఫికల్ యాక్షన్ చిత్రంగా 'అమరన్' తెరకెక్కింది. ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్ అనే పుస్తకంలోని మేజర్ వరదరాజన్ ఛాప్టర్ ఆధారంగా రాజ్‌కుమార్ పెరియసామి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. పలు భాషల్లో ఈ చిత్రం విడుదలవుతోంది. సత్యదేవ్, డాలీ ధనంజయ కథానాయకులుగా నటించిన 'జీబ్రా' కూడా దక్షిణాది భాషలతోపాటు, హిందీలో విడుదలవుతోంది. రజనీకాంత్ మినహా అగ్ర తారలు లేకపోయినా, కథలే బలంగా రూపొందిన ఆయా సినిమాలు ప్రేక్షకుల్ని ఊరిస్తున్నాయి. 'దేవర'తో బాక్సాఫీస్‌కి వచ్చిన ఊపు, హుషారు మిగతా సినిమాలు కొనసాగిస్తాయేమో చూడాలి.


దుల్కర్ సల్మాన్

ఆ చప్పట్ల స్ఫూర్తితోనే ఇక్కడిదాకా వచ్చాం


టీజీ విశ్వప్రసాద్, రీతూ వర్మ, హసిత్ గోలి, శ్రీవిష్ణు

"ద్విపాత్రాభినయం కూడా అనుభవం లేని నేను, ఈ సినిమాలో నాలుగు పాత్రల్ని పోషించా. ఆ పాత్రలన్నీ చాలా బాగుంటాయి" అన్నారు శ్రీవిష్ణు. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'శ్వాగ్'. రీతూవర్మ కథానాయిక. మీరా జాస్మిన్, దక్ష నాగర్కర్ కీలక పాత్రల్ని పోషించారు. హసిత్ గోలి దర్శకుడు. టి.జి.విశ్వప్రసాద్ నిర్మించారు. శుక్రవారం ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించారు. వివేక్ ఆత్రేయ, అనుదీప్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వేడుకని ఉద్దేశించి శ్రీవిష్ణు మాట్లాడుతూ "తరాలకు సంబంధించిన చాలా పెద్ద కథ ఇది. ఇలాంటి కథని చెప్పడం అంత సులభం కాదు. దర్శకుడు హసిత్‌పైనా, చిత్రబృందంపైనా నమ్మకంతో రంగంలోకి దిగా. తెలుగు ప్రేక్షకుల ప్రోత్సాహం వల్ల మేం గెలుస్తూ ఉంటాం. అలా ఎన్నో విజయాలు దక్కాయి. ఈ సారి మాత్రం ప్రేక్షకుల్ని గెలిపించాలని మేం కష్టపడ్డాం. సినిమా నచ్చితే చివర్లో రెండు చప్పట్లు కొట్టమని ప్రేక్షకుల్ని కోరుతున్నాం. ఆ చప్పట్ల స్ఫూర్తితోనే ఇక్కడిదాకా వచ్చాం. ఈ సినిమాలో కథతోపాటు, అద్భుతమైన కామెడీ, స్వచ్ఛమైన భావోద్వేగాలు ఉంటాయి. చాలా రోజుల పాటు గుర్తుండిపోవడమే కాకుండా, ప్రేక్షకులపై గొప్ప ప్రభావం చూపించే చిత్రమిది" అన్నారు. నిర్మాత టి.జి.విశ్వప్రసాద్ మాట్లాడుతూ "మార్కెట్‌ని మించిన పరిధితో కొన్ని సినిమాల్ని చేస్తుంటాం. 'గూఢచారి', 'ఓ బేబి', 'కార్తికేయ 2' అలా చేసినవే. 'శ్వాగ్' కూడా ఆ జాబితాలోకి చేరడంతోపాటు, అంత పెద్ద విజయాన్ని అందించే చిత్రం అవుతుంది. ఇందులో శ్రీవిష్ణు చేసిన పాత్రలు వేటికవే కొత్తగా ఉంటాయి. రీతూవర్మ, మీరాజాస్మిన్, ఇతర తారాగణం, సాంకేతిక బృందం పనితీరు గుర్తుండిపోతుంది" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "తాను హీరో అవ్వాలని కాకుండా, కథే హీరో కావాలని సినిమాలు చేసే కథానాయకుడు శ్రీవిష్ణు. నాలుగు పాత్రల్లో చాలా బాగా నటించారు. దసరా అయిపోయిన తర్వాత కూడా ఈ సినిమాని చూస్తూనే ఉంటార"న్నారు. రీతూ వర్మ మాట్లాడుతూ "నా గత చిత్రాలకి పూర్తి భిన్నమైన పాత్రని ఇందులో చేశా. శ్రీవిష్ణు, హసిత్‌లతో కలిసి పనిచేయడం గుర్తుండిపోతుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో సినిమా నటీనటులు, సాంకేతిక బృందం పాల్గొంది.

ధర్మం గెలిచిందా?


వైష్ణవి, ప్రవీణ్, మౌనిక

ప్రవీణ్.కె.వి కథానాయకుడిగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న చిత్రం 'మహిష'. యషిక, పృథ్వీరాజ్, వైష్ణవి, మౌనిక ప్రధాన పాత్రధారులు. స్క్రీన్‌ప్లే పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుందీ చిత్రం. ఈ సందర్భంగా చిత్రబృందం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించింది. కథానాయకుడు, దర్శకుడు మాట్లాడుతూ 'సందేశంతోపాటు ప్రేక్షకులకు కావల్సిన వినోదం ఉన్న చిత్రమిది. ధర్మాన్ని గెలిపించడం కోసం ఎవరు ఎలా యుద్ధం చేశారు? ధర్మం గెలిచిందా లేదా? అనేది ఈ కథలో కీలకం. టీజర్‌కి మంచి స్పందన లభించింది. త్వరలోనే చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అన్నారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు శ్రీవెంకట్, నటులు శ్రీలత, మౌనిక, విజయ్‌రాజ్, పి.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

థ్రిల్ చేసే 'ఫణి'

కేథరిన్



ప్రేమకథలు, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌లతో ప్రేక్షకులను మెప్పించిన కథానాయిక కేథరిన్.. ఇప్పుడు ఓ మహిళా ప్రాధాన్య చిత్రంతో తెరపైకి రావడానికి ముస్తాబవుతోంది. యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో దర్శకుడు వీఎన్ ఆదిత్య దీన్ని తెరకెక్కిస్తున్నారు. ఓఎమ్‌జీ ప్రొడక్షన్స్ పతాకంపై మీనాక్షి అనిపిండి నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు 'ఫణి' అనే పేరుని ఖరారు చేశారు. అమెరికాలోని డల్లాస్‌లో జరిగిన వేడుకలో ముఖ్య అతిథులుగా హాజరైన తోటకూర ప్రసాద్ ఈ సినిమా టైటిల్‌ను, నిర్మాత అనిల్ సుంకర్ నిర్మాణ సంస్థ లోగోను ఆవిష్కరించారు.

సీరియల్ కిల్లర్ పనిపట్టే రీటా ఫెరీరా

వైవిధ్యమైన పాత్రల్ని ఎంచుకుంటూ ప్రేక్షకుల్ని మెప్పిస్తోంది బాలీవుడ్ కథానాయిక భూమి పెడ్నేకర్. త్వరలో ఆమె 'దల్దాల్' అనే వెబ్‌సిరీస్‌తో రావడానికి ముస్తాబవుతోంది. అమృత్ రాజ్‌గుప్తా దీన్ని రూపొందిస్తున్నారు. ఇందులో డీసీపీ రీటా ఫెరీరా పాత్రలో కనిపించనుందామె. తాజాగా ఈ సిరీస్ చిత్రీకరణ పూర్తిచేసుకున్నట్లు సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టింది భూమి. "విజయవంతంగా డీసీపీ రీటా ప్రయాణం ముగిసింది. ఇప్పటి వరకు నేను పోషించిన అత్యంత సవాలుతో కూడుకున్న పాత్రల్లో ఇదీ ఒకటి. ఇలాంటి ఓ భిన్నమైన ప్రాజెక్టులో అవకాశం కల్పించిన దర్శకుడికి కృతజ్ఞతలు" అని వ్యాఖ్యల్ని జోడించింది. వరుస హత్యలు చేస్తున్న ఓ సీరియల్ కిల్లర్‌ను పట్టుకునేందుకు ఓ పోలీసు అధికారి చేసిన ప్రయత్నాల చుట్టూ ఈ సిరీస్ కథ తిరుగుతుంది. త్వరలో విడుదల తేదీని ప్రకటించనున్నట్లు తెలిపారు.


భూమి పెడ్నేకర్

మకరందం

■ makarandam@eenadu.in

20 గురువారం అక్టోబరు 3, 2024 ఈనాడు

మా చిరునామా: మకరందం, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512

నేడు దేవీ నవరాత్రులు ప్రారంభం



ఆదిపరాశక్తి అపరావతారాలే నవ దుర్గలు, సప్త మాతృకలు. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకు దేవీ నవ రాత్రులు. శుంభ, నిశుంభ, చండ, రక్త బీజ, మహిషాసుర, ధూమ్రలోచనాది రాక్షసులను మట్టుపెట్టి తన బిడ్డలైన ప్రజలను రక్షించిన అపరశక్తి స్వరూపిణి ఆ మాత...

సకల శక్తి స్వరూపిణి.. సర్వజగద్రక్షిణి

జగన్మాత నవదుర్గలుగా రూపాలను దాల్చి.. రాక్షసులను హతమార్చింది. లోకమాతే స్వయంగా యుద్ధానికి దిగటానికి కారణం- ఈ రాక్షసులందరూ స్త్రీని అబలగా భావించి ఏ పురుషుని చేతిలోనూ మరణించకూడదని వరం పొందటం. అందుకే సకల దేవతల శక్తులనూ తాను పొంది పరాశక్తిగా రూపొందింది. బ్రహ్మదేవుని శక్తితో బ్రాహ్మిగా, మహేశ్వరుని శక్తితో మాహేశ్వరిగా, కుమారస్వామి శక్తితో కౌమారిగా, విష్ణుశక్తితో వైష్ణవిగా, వరాహస్వామి శక్తితో వారాహిగా, మహేంద్రుని శక్తితో మాహేంద్రిగా, కాళిక శక్తితో చాముండిగా అవతారాలు దాల్చి.. దుష్టశక్తులను చీల్చి చెండాడింది. అంతేనా! సప్త మాతృకలుగా వెలసి శిష్టులను రక్షించుకుంది. దుష్టశిక్షణ, శిష్టరక్షణ అనేది లోకసామాన్యం. కానీ అంతరార్థాన్ని అర్థం చేసుకుంటే.. రాక్షసులంటే వేరెక్కడో కాదు మనలోనే ఉగ్రతాండవం చేస్తున్నారు. అంటే మనలోని దుష్ట శక్తులూ, దుర్మార్గపు ఆలోచనలే మనల్ని రాక్షసులుగా చేస్తున్నాయి. చెడు మార్గంలో నడిపిస్తున్నాయి. మనలో దుర్మార్గం నశిస్తే మనసు సాత్వికమవుతుంది. అప్పుడు జగన్మాత సాక్షాత్కారిస్తుంది. అమ్మని పిలవాలి, కొలవాలి, పూజించాలి, ధ్యానించాలి. అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లే.

ఆడపిల్ల జీవనక్రమాన్ని సూచించే రూపాలు..

విష్ణువు దశావతారాలు జీవ పరిణామక్రమాన్ని సూచిస్తున్నట్లుగా దుర్గాదేవి నవరూపాలూ ఆడపిల్ల జీవనక్రమాన్ని స్పష్టం చేస్తున్నాయి. ప్రథమం శైలపుత్రి. జన్మించి పుత్రిగా విలసిల్లడం. ద్వితీయం బ్రహ్మచారిణి. అంటే బాల్య, కౌమార దశల్లో ఆట పాటలు, చదువుసంధ్యలు. తృతీయం చంద్రఘంట యౌవనం. మంచి భర్త కోసం తపంచేస్తూ ఎదురుచూడటం. చతుర్థం వివాహం, సాంసారిక జీవనం. పంచమం స్కంద మాత. మాతృత్వంతో పరిపూర్ణతను సాధించటం. షష్ఠం కాత్యాయని. పిల్లలను తీర్చిదిద్దటం. సప్తమం శుభకరి. కుటుంబానికి శుభం చేకూర్చటం. అష్టమం మహాగౌరి. కుటుంబాన్ని వృద్ధి చేయటం. నవమం సిద్ధిధాత్రి. అందరి కోరికలనూ నెరవేర్చి గృహిణిగా విరాజిల్లడం. అంతేకాదు... 'కరాంగుళి నఖోత్పన్న నారాయణ దశాకృతిః' అన్నారు. అంటే శ్రీహరి దశావతారాలు కూడా అమ్మవారి చేతివేళ్ల గోళ్ల నుంచే రూపొందాయని అర్థం. ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి- ఇలా అమ్మవారు మూడు శక్తులతో కూడి.. సర్వలోకాలనూ సంరక్షించే శక్తిమాత. ఎవరెప్పుడు పిలిచినా ఆనందంతో పొంగిపోతూ.. వారి కోరికలను తీర్చే కరుణామయి. అమ్మ కదా మరి! మాతృ రూపమే కాదు బుద్ధి, శాంతి, శ్రద్ధ, కాంతి, విద్య, లక్ష్మి, స్మృతి, నిద్ర, దయ, తుష్టి, భ్రాంతి.. ఇలా అనేకానేక రూపాలతో సకల జీవరాశినీ ఆదుకుంటోంది.

పిల్లలు జగన్మాత స్వరూపాలు

మన సంప్రదాయంలో ఆడపిల్లలను అమ్మ వారిగా భావిస్తాం. చిన్నవయసులో అమ్మాయిలను జగజ్జనని ప్రతిరూపాలుగా పూజించి తరిస్తాం. ఏడాది పాపను కుమారిగా, మూడేళ్ల పాపను త్రిమూర్తిగా, నాలుగేళ్లకి కళ్యాణిగా, ఐదేళ్లకి కాళికగా, ఏడేళ్లకి చండికగా, ఎనిమిదేళ్లకి శాంభవిగా, తొమ్మిదేళ్లకి దుర్గాదేవిగా, పదేళ్ల చిన్నారిని సుభద్రాదేవిగా అలంకరించి అర్చిస్తాం. ఇలా బాలను పూజించటం అంటే బాలాత్రిపుర సుందరిని ఆరాధించటమే.

సర్వదోషాలూ నశిస్తాయి

అమ్మవారు దుర్గమాసురుణ్ణి చంపడం వల్ల 'దుర్గ' అనే పేరు వచ్చింది. దుర్గ అంటే సకల దోష నివారిణి. సర్వశుభప్రదాయిని. 'ద' కారం దైత్యగుణాన్ని 'ఉ' కారం విఘ్నాలను, 'ర' కారం రోగాలను, 'గ' కారం పాపాలను, 'అ' కారం భయాలను నశింపచేస్తాయి. అందువల్ల దుర్గను స్మరిస్తే చాలు.. చెడుగుణాలు, అడ్డంకులు, అనారోగ్యాలు, పాపాలు, భయాలు అన్నీ నశిస్తాయి. ఈ విషయం సాక్షాత్తూ పరమ శివుడే చెప్పినట్లుగా బ్రహ్మ మార్కండేయ మహర్షికి తెలిపాడన్నది పురాణ వచనం.

ఏ రోజు.. ఏ నైవేద్యం


దేవీ ఆలయాల్లో ఒక్కో రోజు ఒక్కో అవతారంగా అలంకరించి నివేదనలు సమర్పిస్తారు. పాడ్యమి నాడు బాలాత్రిపుర సుందరిగా అర్చించి పులిహోర నివేదిస్తారు. విదియనాడు గాయత్రీమాతగా కొబ్బరన్నం నైవేద్యంగా పెడితే, తదియనాడు అన్నపూర్ణాదేవిగా ఆరాధించి మినపగారెలు సమర్పిస్తారు. చవితినాడు శ్రీలలితాదేవిగా పూజించి పెరుగన్నం నివేదిస్తే, షష్ఠినాడు మహాలక్ష్మిగా పూజించి కేసరి పెడతారు. సప్తమినాడు మహాసరస్వతిగా అర్చించి అల్లంగారెలు సమర్పిస్తే, అష్టమినాడు దుర్గాదేవిగా పూజించి శాకాన్నం నివేదిస్తారు. నవమినాడు మహిషాసుర మర్దినిగా అలంకరించి చక్రపొంగలి పెడితే, దశమినాడు శ్రీరాజరాజేశ్వరిగా అర్చించి పరమాన్నం సమర్పిస్తారు. ఈ పదిరోజుల్లో సరస్వతీ సప్తమి, దుర్గాష్టమి, మహానవమి, విజయదశమి అత్యంత ప్రధానమైనవి.

దేవీ నవరాత్రులు ఎప్పుడు మొదలయ్యాయి..

అన్ని కాలాల్లోకీ శరత్కాలమంటే తనకెంతో ప్రీతి అని, ఆ మాసాల్లో పూజిస్తే మరింత ఆనందిస్తానని దుర్గామాతే స్వయంగా చెప్పింది. కనుక ఈ కాలంలో అమ్మను స్మరించినా సంతుష్టి చెందుతుంది. శరత్కాలంలో మొదటి తొమ్మిది రోజులు నవదుర్గలను పూజించి దశమినాడు రాజ రాజేశ్వరీదేవిని అర్చించి అమ్మ అనుగ్రహాన్ని పొందుతారు. దేవీ నవరాత్రుల్లో లలితా సహస్రనామాలు, దుర్గాసప్తశతి పారాయణ చేస్తారు. ఈ రోజుల్లో ఏనాడు ఏ రూపంలో ఎలా పూజించాలో కృతయుగంలో సుకేతనుడనే మహారాజుకి అంగీరస మహర్షి ఉపదేశించాడు. నాడు మొదలైన దేవీ నవరాత్రులు నేటికీ వైభవంగా కొనసాగుతున్నాయి. ద్వాపరయుగంలో ఈ ఉత్సవాలను భక్తి పూర్వకంగా తాను చేసి, ప్రజల చేత కూడా చేయించాడు శ్రీకృష్ణుడు. అష్టాదశ మహాపురాణాలు అన్నీ నవరాత్రుల విశిష్టతను చాటి చెప్పాయి. విశేషించి బ్రహ్మాండ పురాణం, దేవీ భాగవతం అమ్మ వారిని పరాశక్తి, అపరాజిత, లలితాదేవి, త్రిపురసుందరి, రాజ రాజేశ్వరి, కాత్యాయని, చిద్రూపిణి, పరదేవత, అపరదేవత, భగవతి- అని స్తుతించాయి.


\- డా.పి.లలితవాణి

జ్ఞానభక్తి.. ప్రేమభక్తి..



ముగ్గురు స్నేహితులు అడవిలో నడుస్తున్నారు. హఠాత్తుగా పెద్దపులి ఎదురుపడింది. మొదటి వ్యక్తి భయపడిపోతూ 'మిత్రులారా! మనకు కాలం తీరిపోయింది. ఇక బతికి బట్టకట్టటం అసాధ్యం' అని నీరుగారిపోయాడు. రెండో వ్యక్తి 'భయపడాల్సిన పనిలేదు, భగవంతుడున్నాడు. ఆయన్ని ప్రార్థిస్తే తప్పకుండా మనల్ని రక్షిస్తాడు' అని భరోసా ఇచ్చాడు. మూడో వ్యక్తి జోక్యం చేసుకుని 'ఇంత చిన్న విషయానికి భగవంతుణ్ణి ఎందుకు ఇబ్బంది పెట్టాలి? ఇదిగో ఈ చెట్టునెక్కి ప్రాణాలు కాపాడుకుందాం!' అన్నాడు. గృహస్థభక్తులకు ఈ కథను చెప్పిన రామకృష్ణపరమహంస 'కాలం తీరిపోయింది' అని ప్రాణాలపై ఆశలు వదులుకున్న వ్యక్తి నాస్తికుడు. అతడికి భగవంతుడి ఉనికే తెలియదు. ప్రార్థించి రక్షణ కోరదామన్న వ్యక్తిది జ్ఞానభక్తి. భగవంతుడు ఉన్నాడని, సర్వవ్యాపి అయిన ఆయనే మనల్ని కాపాడతాడని తెలిసినవాడతను. పరమాత్మను ప్రేమిస్తూ, తనను రక్షిస్తాడన్న నమ్మకం ఉన్నప్పటికీ, ఆయన్ను కష్టపెట్టకూడదన్న భావనతో స్వప్రయత్నానికి కూడా ప్రాధాన్యం ఇచ్చేవాడిది ప్రేమభక్తి' అంటూ వివరించారు. సాధారణ భక్తుల్లో చాలామంది జ్ఞానభక్తుల విభాగంలోకి, బృందావన గోపికల వంటివారు ప్రేమభక్తుల వర్గంలోకి వస్తారని ప్రవచించారు. జ్ఞాన భక్తులు పరమాత్మ రాజ ప్రాసాదం వరకు వెళ్లగలరు. కానీ ప్రేమభక్తి ఉన్నవాళ్లు ఆయన అంతఃపురంలోకి కూడా ప్రవేశించగలరని పరమహంస స్పష్టం చేశారు.

\- ప్రహ్లాద్



భగవంతుడు భావప్రియుడు

ఒకసారి కంచి పరమాచార్యులు సికింద్రాబాదులో మకాం చేశారు. దగ్గర్లోని ఆలయానికి వెళ్లి వస్తుంటే.. ఓ వ్యక్తి దగ్గరికొచ్చి, తాను తపాలా బట్వాడా ఉద్యోగినని పరిచయం చేసుకున్నాడు. 'స్వామీ! ఈ గుడిలో పూజారికి సంస్కృతం రాదు. మంత్రాలు చదువుతాడు కానీ, వాటికి అర్థం తెలియదు. అతను పూజారిగా ఉండి కూడా దండగే' అంటూ ఫిర్యాదు చేశాడు. పరమాచార్య నవ్వి.. 'అది సరేగానీ.. ఉత్తరాల్లో 'పిన్ కోడ్' అంటారు కదా.. ఇంతకీ పిన్ అంటే ఏంటయ్యా?' అనడిగారు. 'అదొక సంఖ్య స్వామీ! ప్రాంతాన్ని తెలియజేస్తుంది. ఉత్తరాల విభజనకు, బట్వాడాకు ఉపయోగపడుతుంది' అన్నాడు. 'ఇంతకీ పిన్ నిర్వచనం ఏమిటి?' అని మళ్లీ అడిగితే, తెలియదన్నాడు. 'నువ్వు తపాల ఉద్యోగివయ్యుండీ అదేంటో తెలియదా? పిన్ అంటే పోస్టల్ ఇండెక్స్ నంబర్. అది తెలియక పోయినా నీకేం సమస్య రాలేదు. ఉత్తరాల బట్వాడా సక్రమంగానే చేస్తున్నావు. అలాగే అర్చకుడికి సంస్కృత మంత్రాలకు అంతగా అర్థం తెలియకున్నా సమస్య ఎదురవలేదు. వేళకు బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. పూజారికి మంత్రాల అర్థం తెలియకుంటేనేం... దైవానికి తెలుసు. పూజాది కార్యక్రమాలు సక్రమంగా పూర్తిచేస్తాడు కనుక దేవుడు వాటిని స్వీకరిస్తాడు. భగవంతుడు భావప్రియుడే కానీ, భాషాప్రియుడు కాదు. ఒకరి దోషాలను వెతికే కంటే భగవంతుడిపై దృష్టి నిలపడం మంచిది' అంటూ హితవు పలికారు. ఉద్యోగి తన తప్పు తెలుసుకుని క్షమించమన్నాడు.


\- పరాశరం సచ్చిదానందమూర్తి

అక్టోబరు 5 ప్రపంచ గురు దినోత్సవం

అచంచల గురుభక్తి

జగద్గురు ఆదిశంకరాచార్య నలుగురు ప్రధాన శిష్యుల్లో పద్మపాదుడు ఒకరు. అతని అసలు పేరు సనందన. ఒక సారి శంకరాచార్యులు, సనందుని గురుభక్తిని లోకానికి నిరూపించాలనుకున్నారు. గంగానదికి ఒక వైపు సనందన గురువుగారి బట్టలు ఉతికి ఆరేస్తున్నాడు. నదికి ఆవలివైపున స్నానం చేసి తడి బట్టలతో బయటకు వచ్చిన ఆదిశంకరులు - పొడి బట్టలు తెమ్మని సనందుని పిలిచారు. గురువుపట్ల అమిత భక్తి ఉన్న సనందన- గురువర్యులు తడి వస్త్రాల్లో ఉండటం చూడలేకపోయాడు. వెంటనే పొడిదుస్తులు ఇవ్వాలనుకున్నాడు. ఉధృత ప్రవాహాన్ని చూసి భయపడ లేదు. కనీసం నదిని దాటడానికి పడవలో వెళ్లాలని కూడా అతడికి తోచలేదు. నేలమీద నడిచినట్లు, గంగానదిలో నడుచుకుంటూ ముందుకు సాగాడు సనందన. మునిగి పోతానన్న భయం కానీ, చేతిలోని పొడి బట్టలు ఆ నీళ్లలో పడి తడుస్తాయన్న సందేహం కానీ లేవు. అంతటి అచంచల భక్తి చూపుతున్న భక్తుణ్ణి ఆదిశంకరులు ఆదుకోకుండా ఉండరు కదా! సనందుడి అడుగు పడే ప్రతి చోటా తామర పువ్వులను పరిచి దోవ చేసింది గంగాదేవి. సనందుడు శరవేగంగా అడుగులు వేస్తున్నాడే కానీ.. తాను కుసుమాల మీద నడుస్తున్నట్టు గ్రహించలేదు. చుట్టూ ఉన్న వాళ్లు ఆశ్చర్యంగా చూస్తుండగానే సనందుడు నదిని దాటేసి గురువుకు వస్త్రాలు అందించాడు. శంకరాచార్యులు నవ్వుతూ 'సనందనా! ఇంత త్వరగా నదిని ఎలా దాటగలిగావు?' అనడిగారు. 'గురువర్యా! మిమ్మల్ని తలచుకుంటే ఎలాంటి కష్టమైనా మాయమై పోతుంది. మీ అనుగ్రహంతో దేన్నయినా దాటేయొచ్చు' అన్నాడు. అప్పటికి కూడా అతడికి నది మీద నడుస్తూ వచ్చానన్న స్పృహ లేదు. శంకరులు 'వెనుతిరిగి చూడు.. నువ్వు అడుగు వేసిన ప్రతీచోట ఓ పద్మం వెలసింది. వాటి మీదే అడుగులేస్తూ వచ్చావు. ఈరోజు నుంచీ నువ్వు పద్మపాదుడిగా ప్రసిద్ధి చెందుతావు' అని ఆశీర్వదించారు. ఎవరికైతే గురువు పట్ల అచంచలమైన భక్తి, ప్రేమ, నమ్రత, నమ్మకం ఉంటాయో, వారిని గురువు కంటికి రెప్పలా కాపాడుతారు, వారికి ఏ లోటూ రాకుండా చూసుకుంటారని ఈ ఉదంతం రుజువు చేస్తుంది.

\- పరిమి శ్యామల రాధాకృష్ణ



ఇస్లాం సందేశం

నాతో జగడమాడకు..



సర్వ జీవులూ మన వంటివేనంటూ భూతదయకు ప్రాధాన్యత ఇచ్చింది ఇస్లాం. జీవులపట్ల దయ స్వర్గ ప్రవేశానికి కారణమవుతుందని పేర్కొని, దాన్ని చట్టబద్ధం కూడా చేసింది. జంతువుల పట్ల హృదయపూర్వకంగా సానుభూతి చూపితే పుణ్యఫలం లభిస్తుందని మహా ప్రవక్త (సఅసం) తెలిపారు. ఎడ్లపందేలు, గుర్రప్పందేలు వంటివి నిషేధించి, జంతువుల ఆకలి తీర్చకపోవడం నేరమంది. అవి తినేంత మేత వేయాలని, ఆ మేత నాసిరకంగా ఉండకూడదని చెప్పింది. వాటి అవసరాలను తీర్చాల్సిన బాధ్యత యజమానిపై ఉంటుంది. అలా చేయకుంటే అమ్మేయాలి లేదా మేత లభించే అడవుల్లో వదిలేయాలి. వినోదం కోసం జంతువుల వేట నిషేధం. జంతువులను కొట్టడం, ప్రయాణాల్లో శిక్షించటం వంటివి జరగకుండా చూడటం తనిఖీ అధికారుల బాధ్యతగా ఉండేది. వాటి మీద అతిగా భారం వేయకూడదు, శక్తికి మించిన పనులు చేయించకూడదు. గాడిదలపై వేయాల్సిన బరువు పరిమాణాన్ని నిర్ణయించింది. గురి చూసి కొట్టే అభ్యాసం కోసం జంతువుల్ని ఉపయోగించకూడదు. గుర్తించడం కోసం వాటికి వాతలు పెట్టకూడదు. 'ప్రతి ప్రాణి పట్ల ఔదార్యం చూపాలి, దేన్నయినా చంపాల్సివస్తే మంచి పద్ధతిలో చంపాలి' అని ప్రబోధించారు ప్రవక్త. జంతువుల సంరక్షణ విషయంలో ధర్మజ్ఞులు ఉత్తమ ఆజ్ఞలను రూపొందించారు. వాటిని బాధించక, కరుణతో మెలగాలని ఖలీఫాలు హితవు చెబుతారు. ఆనాడు జంతు సంరక్షణ సంస్థలు కూడా ఎక్కువ సంఖ్యలో ఉండేవి. వ్యాధిగ్రస్త జీవుల కోసం చికిత్సాలయాలు ఉండేవి. ముసలిజీవులు మేయడానికి ప్రత్యేక పచ్చిక మైదానాలు ఉండేవి. ఒకసారి జంతువుల పట్ల దయావర్తనులైన హజ్రత్ అబు అల్ దర్దా(రజి)- తన మరణ సమయంలో.. 'ఇదిగో ఒంటె! నీకిదే చెబుతున్నాను.. ప్రళయ దినాన ప్రభువు సమక్షంలో నువ్వు నాతో జగడం ఆడకూడదు. ఎందుకంటే నీ శక్తికి మించిన బరువును ఎన్నడూ నీపై వేయలేదు' అంటూ ఒంటెను ఉద్దేశించి మాట్లాడారు.

\- ఖైరున్నీసాబేగం

సాయి ప్రబోధ

మంచైనా.. చెడైనా..



'పాపపుణ్య కర్మల ఫలితాన్ని ఎప్పటికైనా అనుభవించాలంటారు కదా! అది నిజమేనా బాబా?' అన్న ఒక భక్తుడి ప్రశ్నకు సాయిబాబా ఇలా చెప్పారు..

అతి చిన్న అపకారమైనా.. అది తెలిసి చేసినా, తెలియక చేసినా ఫలితం అనుభవించక తప్పదు. పరీక్షిత్తు మహారాజు సరదా కోసం.. చచ్చిన పామును శమీక మహర్షి మెడలో వేసిన ఉదంతమే అందుకు ఉదాహరణ. ఆ కారణం వల్లే పరీక్షిత్తు రాజు తక్షకుడనే మహా సర్పం వల్ల మరణించాడు. కనుక పాప కర్మల జోలికి వెళ్లకూడదు.

ఇక పుణ్యఫలితం గురించి చెప్పాలంటే.. సభలో ద్రౌపది వస్త్రాపహరణకు గురవుతుంటే.. తనవారు కూడా కాపాడలేకపోయారు. అప్పుడామె కృష్ణుణ్ణి వేడుకుంది. నల్లనయ్య ఆమె గురించి సంపూర్ణంగా తెలిసినవాడు. అయినప్పటికీ ద్రౌపదిని తాను రక్షించాలంటే.. దానికి ఆమె గతంలో చేసిన పుణ్య కార్యాలు తప్పనిసరి. ఆ పుణ్యమే ఆమెకి సాయపడుతుంది. అందువల్ల ద్రౌపది గత జన్మలో ఎలాంటి పుణ్యం చేసిందా అని దివ్య దృష్టితో చూశాడు. గతం కళ్లముందు ప్రత్యక్షమైంది.. ఒకసారి ఆమె సముద్రస్నానానికి వెళ్లింది. అక్కడే మరో పక్కగా స్నానం చేస్తున్న ఒక సాధువు గోచి నీళ్లలో కొట్టుకు పోయింది. దాంతో అతడు నీళ్లలోంచి బయటకు రావడానికి సిగ్గుపడుతూ.. దిక్కు తోచక అలాగే ఉండిపోయాడు. ఆ సంగతి గ్రహించి.. తన చీర కొంగులోని కొంత భాగాన్ని చింపి నీటి వాలులో విడిచిపెట్టగా.. అది సాధువును చేరింది. అలా పుణ్యం సంపాదించిన ద్రౌపది మానం రక్షించేలా అనుగ్రహించాడు కృష్ణుడు. ఆమె ఆనాడు సాధువుకి ఇచ్చిన చీర ముక్కే అక్షయ వస్త్రమై ఆపదలో ఆదుకుంది. ఇందులో తెలుసుకోవాల్సిన విషయం ఏమంటే, హృదయపూర్వకంగా చేసిన దానం కానీ సహాయం కానీ ఆపద సమయంలో అనంత ఫలితాలను ఇస్తుంది.

\- డా.జయదేవ్ చల్లా

పుణ్యప్రదం గరుడసేవ దర్శనం

అక్టోబరు 8 తిరుమల శ్రీవారి గరుడోత్సవం



తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో గరుడసేవ అతి ముఖ్యమైంది, ఎంతో ప్రసిద్ధమైందని భవిష్యోత్తర పురాణం పేర్కొంది. తొమ్మిది రోజులు నిర్వహించే ఈ ఉత్సవాల్లో ఐదోరోజు రాత్రి గరుత్మంతుని వాహనసేవ ఉంటుంది. ఈ వైభవం చూసి తీరాల్సిందే తప్ప వర్ణించనలవి కాదు. గరుడ వాహనాన్ని అధిరోహించి విహరిస్తున్న స్వామిని సేవిస్తే మోక్షం లభిస్తుందన్నది పురాణ వచనం. ఉత్సవ సమయాల్లో స్వామివారు అనేక వాహనాలపై తిరువీధుల్లో విహరిస్తాడు. గరుడోత్సవం రోజున శ్రీవిల్లిపుత్తూరు నుంచి వచ్చే తులసిమాలలూ, చెన్న పట్నం నుంచి వచ్చే గొడుగులు శ్రీవారి సేవలో ఉపయోగించడం విశేషం. లక్ష్మీసహస్ర నామ మాలను ధరించి గరుడ వాహనంపై ఊరేగే స్వామివారిని దర్శించుకోవడం మహాపుణ్యప్రదంగా భావిస్తారు. ఇలా దర్శించుకోవటం వల్ల సకల బాధలూ తొలగి పోతాయి. ఆధ్యాత్మిక జ్ఞానమూ చేకూరుతుంది. సత్సంతానంతో వంశం వృద్ధి చెందుతుంది. గరుడ వాహనారూఢుడైన స్వామివారిని భక్తి శ్రద్ధలతో దర్శిస్తే సమస్త భయాలూ నశిస్తాయి, దురాలోచనలు దూరమై, సద్భావనలు సిద్ధిస్తాయని అథర్వసంహిత చెబుతోంది. అన్నమయ్య కూడా గరుడోత్సవ శోభను అపురూపంగా వర్ణించాడు. ఎక్కడెక్కడి నుంచో భక్తజనం తరలివచ్చి ఈ దివ్యదృశ్యం దర్శించి ధన్యులవుతారు. కాలసర్ప తదితర దోషాలు తొలగించుకుని, సుఖసంతోషాలతో జీవిస్తారు. గరుడుని మాతృభక్తి పరాయణత అందరికీ స్ఫూర్తిదాయకం. అందుకే గరుడసేవకు ఎనలేని విశిష్టత ఏర్పడింది.

\- నూతి శివానందం

దయ చాలా గొప్పది

జెన్ కథ



పూర్వం ఒక జెన్ మాస్టర్ దగ్గర ఇరవై మంది యువ సన్యాసులు అభ్యాసం చేస్తున్నారు. వారికి తోడు ఎషున్ అనే సన్యాసిని కూడా ఆశ్రమంలో చేరింది. ఆమె మహా సౌందర్యవతి. మోహాతీతంగా గుండు చేయించుకున్నా కాస్త కూడా అందం తగ్గలేదు. ముఖంలో చిత్రమైన కళా కాంతులు భాసించేవి. రోజూ అందరూ కలిసి ధ్యానం చేసేవారు. ఆ యువకుల్లో కొందరు ఎషున్‌తో ప్రేమలో పడ్డారు. ఎవరికి వారు ఆమె వంక దొంగచూపులు చూసేవారు. వారిలో ఓ సన్యాసి ఒకరోజు ప్రేమలేఖ రాసి, ఆమెకి అందేలా చేశాడు. ఏకాంత ప్రదేశంలో కలుసుకుందామని, అందుకు అంగీకారం తెలియజేయమని బతిమాలాడు. ఉత్తరం చదివిన ఎషున్ బదులీయలేదు. మెదలకుండా ఊరుకుంది. ఆ మర్నాడు జెన్ గురువు అందరినీ సమావేశపరిచి నాలుగు మంచి మాటలు చెప్పారు. ఉపన్యాసం అయిపోయాక.. ఎషున్ లేచి నిలబడింది. అందరి వంకా చూస్తూ.. 'నాకు లేఖ రాసింది ఎవరో తెలీదు. ఎవరైతేనేం.. ఆ వ్యక్తి నిజంగా నన్ను ఇష్టపడుతున్నట్టయితే ధైర్యంగా ముందుకు వచ్చి, నన్ను ఆలింగనం చేసుకోవచ్చు' అంది. అందరూ బిత్తర పోయారు. నిజమైన ప్రేమలో దయ, సానుభూతి, ధైర్యం ఉంటాయి. అలాంటి ప్రేమ ఉదాత్తమైంది. అంతే తప్ప.. తప్పు చేస్తున్నామనే బాధ, భయం, దొరకకుండా జాగ్రత్తపడాలనే పిరికితనం ఉండవని - ఎషున్ చెప్పకనే చెప్పింది. ఆ తర్వాత ఎవరి మనసూ పక్క దారి పట్టలేదు. ధ్యానం మీదే లగ్నమైంది.

\- నాగరత్న

క్రీస్తువాణి

ప్రతిఫలం పరలోకం నుంచే



దేవునికి సమర్పించటం అన్నది ఆరాధనలో భాగమంటుంది బైబిల్. 'నీ సంపాదనలో ప్రథమఫలాన్ని, నీ ఆస్తిలో భాగాన్ని ఇచ్చి, యెహోవాను ఘనపరచు' అన్నది దేవుడి వాక్యం. మందలో తొలిచూలు పిల్లని, పంటలో ప్రథమఫలాన్ని దేవునికి సమర్పించటం గురించి పాత నిబంధనలో ఉంది. తనకు కలిగింది అంతా అర్పించిన స్త్రీ గురించి కొత్త నిబంధనలో ప్రశంసించాడు ఏసు. ధారాళంగా, త్యాగపూరితంగా దేవునికి సమర్పించటం అంటే ఆ ధనంతో దేవునికి అవసరం ఉందని కాదు, ఆయనను మనం ఎంతగా ప్రేమిస్తున్నామో తెలియజేయటం. దేవుని పట్ల విధేయత, కృతజ్ఞత, నమ్మకం వ్యక్తం చేయటానికి ఇదో మార్గం. మనకు అన్నీ దేవుడు అనుగ్రహించినవేనని గ్రహిస్తే ఆయనను ఆరాధించి, కానుకలు ఇచ్చే హృదయాన్ని పెంపొందించుకుంటాం. అనిర్వచనీయమైన సంతోషం సొంతం చేసుకోగలుగుతాం. మనం ఒకరికి ఆసరా అందిస్తే.. మన అవసరాలన్నీ దేవుడు తీరుస్తాడని పౌలు చెప్పాడు. ఏసుప్రభువు కూడా మనకు ప్రతిఫలం పరలోకం నుంచే వస్తుందన్నాడు. ఇవ్వటం అంటే ధనాన్ని విసిరేయటం కాదు. అది విత్తనాల్ని నాటడం అన్నమాట. ఎంత విస్తారంగా విత్తనాలు నాటితే అంత సమృద్ధిగా ఫలం లభిస్తుంది. ప్రపంచంలో ఎంతోమందికి ఇంకా సువార్త అందలేదు. దాన్ని చేరవేయటానికి తన దాసులకు అవసరమైన ధనం సమకూర్చాలని దేవుని అభిమతం. అంటే దేవుడు మనకు ముందుగా ఇస్తాడు, మనం ఆయనకు తిరిగివ్వాలి. ఇదే దైవనిర్ణయం. ఇచ్చేటప్పుడు సణుక్కుంటూనో, బలవంతంగానో, దుఃఖిస్తూనో కాకుండా, సంతోషంగా ఇస్తే అది సత్ఫలితాన్నిస్తుంది. ఇలా మనం మన ఆదాయంలో కనీసం పదో వంతుగానైనా ఉత్సాహంగా ఇవ్వాలని తీర్మానించుకుందాం.

\- డా.పి.మాధురి

వందే విష్ణుం!

అమోఘః

విష్ణుసహస్రనామావళిలో 110వది. తనను పూజించేవారికి నిశ్చయంగా సత్ఫలాలను ప్రసాదిస్తాడు ఆ స్వామి. మోఘం అంటే వ్యర్థం, నిరర్థకం అని నిఘంటువులు అర్థం చెబుతున్నాయి. ఇలా చూస్తే అమోఘం అంటే వ్యర్థం కానిది, అర్థవంతమైంది, విశేష ఫలితాన్ని ఇచ్చేది అనే అర్థాలు ఈ నామంలో కనిపిస్తాయి. ఆ స్వామిపై చూపే భక్తి ఎన్నటికీ వ్యర్థం కాదు, విజయమే చేకూరుతుంది - అనేది ఈ నామంలోని అంతరార్థం.

\- వై.తన్వి



కాలక్రమేణా జనాభా మార్పును వివరించే నమూనాయే జనాభా పరిణామ సిద్ధాంతం. జనన, మరణాల రేట్లలోని మార్పుల ప్రభావాలు జనాభా వృద్ధి రేటుపై ఏ విధంగా ఉంటాయో ఈ సిద్ధాంతం వివరిస్తుంది. జనాభా పరిణామ సిద్ధాంతం అనేది దేశంలోని జనన, మరణాల రేటుకు; ఆర్థికాభివృద్ధిలోని మార్పులకు మధ్యగల సంబంధాన్ని తెలుపుతుంది. ఆధునిక జనాభా పరిణామ సిద్ధాంతాన్ని 1929లో అమెరికన్ డెమోగ్రాఫర్స్ వారెన్ థామ్సన్, ఫ్రాంక్ వాలెస్ నోట్‌స్టెయిన్ ప్రతిపాదించారు.



ఏపీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ ఎకానమీ

‘భూమిపై పుట్టే ప్రతి బిడ్డ ఒక అభివృద్ధి కారకం!’

జనాభా పరిణామ సిద్ధాంతం (Demographic transition theory)

మాల్థస్ శాస్త్రీయ జనాభా సిద్ధాంతం

థామస్ రాబర్ట్ మాల్థస్ 1798లో తన పుస్తకం ‘An Essay on the Principle of Population’ లో తొలిసారిగా శాస్త్రీయ జనాభా సిద్ధాంతాన్ని వివరించారు. అందులో ఆయన పెరుగుతున్న జనాభాతో పని చేసే శ్రామికుల సంఖ్య పెరుగుతుందని అయితే, వేతనాలు తగ్గుతాయని పేర్కొన్నారు. పెరుగుతున్న జనాభా పేదరికానికి దారితీస్తుందని మాల్థస్ అభిప్రాయపడ్డారు.

సిద్ధాంతంలోని మౌలిక అంశాలు: ✦ వనరుల పరిమితికి లోబడి జనాభా ఉంటుంది.

✦ ఏవైనా శక్తిమంతమైన నిరోధకాలు ఉంటే తప్ప వనరులు పెరిగితే జనాభా పెరుగుతుంది.

✦ ప్రజలు సంతానాన్ని వద్దనుకోవడం, వ్యసనాలు, ఆర్థిక కష్టాలు మొదలైన నిరోధకాలు వనరులకు లోబడి జనాభా ఉండేలా సంతానోత్పత్తి శక్తిని తగ్గిస్తాయి.

✦ జనాభా పెరుగుదలను అడ్డుకునేందుకు బలమైన నిరోధకాలు ఎప్పుడూ ఉంటాయి. ఎలాంటి నిరోధకాలు లేకపోతే జనాభా సహజ పెరుగుదల ఎలా ఉంటుంది?, ఆహార ఉత్పత్తులు ఎలా ఉంటాయి? అనే విషయాలపై మాల్థస్ రెండు అంశాలను ప్రతిపాదించారు. అవి:

ఎ) జనాభా ప్రతి 25 ఏళ్లకు రెట్టింపు అవుతుంది. జనాభా జాతీయ నిష్పత్తిలో అంటే జనాభా ‘గుణోత్తర శ్రేణి’లో (Geometrical Progression) 1, 2, 4, 8, 16, 32, 64, 128, 256... ఈ విధంగా పెరుగుతుందని మాల్థస్ సిద్ధాంతం తెలుపుతుంది.

బి) అన్ని పరిస్థితులు అనుకూలించినప్పుడు వ్యవసాయోత్పత్తి ప్రతి 25 ఏళ్లకు ప్రస్తుత ఉత్పత్తికి సమాన స్థాయిలో పెరుగుతుంది. వ్యవసాయోత్పత్తి గణాంక నిష్పత్తిలో అంటే అంకగణిత శ్రేణిలో (Arithmetical Progression) 1, 2, 3, 4, 5, 6, 7, 8, 9. ... ఇలా పెరుగుతుంది.

◆ ఆహార పదార్థాల సప్లయ్ వృద్ధికి, జనాభా వృద్ధికి మధ్య ఉన్న సంబంధాన్ని మాల్థస్ సిద్ధాంతం వివరిస్తుంది.

◆ ఆహార ధాన్యాల ఉత్పత్తి కంటే జనాభా వేగంగా పెరిగి, ఈ రెండిటి మధ్య సమతూకం దెబ్బతింటే అది జనాభా విస్ఫోటనానికి దారి తీస్తుంది.

◆ మాల్థస్ అభిప్రాయం ప్రకారం, రెండు శతాబ్దాల్లో జనాభా, ఆహారోత్పత్తి 256 : 9 నిష్పత్తిలో ఉంటాయి. తరుగుదల సూత్రం ప్రకారం వ్యవసాయ ఉత్పత్తి క్రమంగా తగ్గుతుందని ఆయన అంచనా వేశారు.

జనాభా పెరుగుదల నిరోధకాలు: ఆహారోత్పత్తికి అనుగుణంగా జనాభా పెరుగుదలను నియంత్రించేందుకు మాల్థస్ కింది నిరోధకాలను పేర్కొన్నారు. అవి:

నివారణ నిరోధకాలు: ఇవి స్వచ్ఛందమైనవి. జనాభా అపరిమిత పెరుగుదల వల్ల కలిగే నష్టాలను గమనించి వివాహం, కుటుంబ నియంత్రణ, బ్రహ్మచర్యం లాంటివి చేపట్టడం అనేవి ఈ పద్ధతిలోని ముఖ్యాంశాలు.

సానుకూల నిరోధకాలు: రోగాలు, యుద్ధాలు, కరవు కాటకాలు, వరదలు, ప్రకృతి వైపరీత్యాలు మొదలైన కారణాల వల్ల మానవుల జీవిత కాలం తగ్గుతోంది.

● జనాభా నిరోధకాలు ప్రతి దేశంలో ఉన్నప్పటికీ, జనాభా పెరుగుదల ఆహారోత్పత్తికి మించి ఉంటోంది. జనాభా నియంత్రణే ధ్యేయంగా ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేయాలని మాల్థస్ తెలిపారు.

● శాస్త్ర సాంకేతికత ద్వారా ఆహారోత్పత్తి పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

మాల్థస్ జనాభా పరిణామ సిద్ధాంతంపై విమర్శలు

జనాభా పెరుగుదల స్థాయిలో ఆహారోత్పత్తి సాధ్యం కాదన్న మాల్థస్ వాదనను అనేక మంది ఆర్థికవేత్తలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఆహారోత్పత్తిని గణనీయంగా పెంచడం సాధ్యమని వారి అభిప్రాయం.

▮ దారిద్ర్యానికి అధిక జనాభాయే కారణమన్న మాల్థస్ భావనను కూడా అనేకమంది వ్యతిరేకించారు. సామాజిక వ్యవస్థను ఆయన సరిగ్గా అంచనా వేయలేదని విమర్శకులు పేర్కొన్నారు.

▮ మాల్థస్ జనాభా సిద్ధాంతాన్ని కార్ల్ మార్క్స్ తిరస్కరించారు. జనాభాకు సంబంధించి విశ్వవ్యాప్తమైన సిద్ధాంతమేదీ లేదని ఆయన స్పష్టం చేశారు. సమాజంలో నెలకొన్న పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాల కారణంగా మానవుడు తన అస్తిత్వం కోసం, పెట్టుబడి తరహా ఆర్థిక వ్యవస్థ కొనసాగింపు కోసం ఎక్కువ సంతానాన్ని కనక తప్పడం లేదని కార్ల్ మార్క్స్ అభిప్రాయం.

“ ప్రముఖుల వ్యాఖ్యానాలు

“కుటుంబంలో ప్రతి జననం ఒక శుభఘడియ. కానీ ఈ జననాలు అధికమైతే కుటుంబం, దేశం భరించగలదా అనేది పెద్ద ప్రశ్న.” - మాలిని బాలసింగం

“భూమిపై పుట్టే ప్రతి బిడ్డ ఆర్థికంగా నరకాన్ని పెంపొందించే వాడవుతాడు.” - టి.ఆర్.మాల్థస్

“భూమిపై పుట్టే ప్రతి బిడ్డ ఒక అభివృద్ధి కారకం.” - ఎడ్విన్ కానన్, బ్రిటిష్ ఆర్థికవేత్త

“ఒక దేశ జనాభా అభిలషణీయ స్థాయి కంటే తక్కువగా ఉంటే జనాభా పెరుగుదల ఆ దేశ ఆర్థికాభివృద్ధికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. అయితే ఈ జనాభా అభిలషణీయ స్థాయిని దాటి ఇంకా పెరుగుతూ పోతే అది అభివృద్ధికి ఆటంకమవుతుంది. అంతేకాక సాధించిన ఆర్థికాభివృద్ధి పెరుగుదలను కూడా హరించి, అనర్థాలకు దారితీస్తుంది.” - వివిధ ఆర్థికవేత్తల అభిప్రాయం

“జనాభా పరిణామం జనాభా చక్రానికి సంబంధించింది. ఈ జనాభా చక్రం మరణాల రేటు తగ్గుదలతో ప్రారంభమై, జనాభా వృద్ధి వేగంగా ఉండే దశలో కొనసాగి, జననాల రేటు తగ్గుదలతో ముగుస్తుంది.” - ఈ.జి.డోలోన్

జనాభా పరిణామ సిద్ధాంతం - దశలు

జనాభా పరిణామ సిద్ధాంతాన్ని వారెన్ థామ్సన్, ఫ్రాంక్ వాలెస్ నోట్‌స్టెయిన్ (Frank Wallace Notestein) నాలుగు దశల్లో వివరించారు. అవి:

మొదటి దశ: మొదటి దశలో జననాలు, మరణాల రేటు ఎక్కువగా ఉంటాయి.

▼ ఆర్థికాభివృద్ధి స్థాయి చాలా తక్కువ.

▼ వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఉంటుంది. దేశంలో ఎక్కువ శాతం జనాభా దీనిపైనే ఆధారపడి జీవిస్తారు.

▼ బాల్య వివాహాలు, సాంఘిక కట్టుబాట్లు, నిరక్షరాస్యత, మూఢనమ్మకాలు, కుటుంబ నియంత్రణపై అవగాహన లేకపోవడం మొదలైనవన్నీ ఈ దశలో జననాల రేటు ఎక్కువగా ఉండటానికి కారణాలు.

▼ పోషకాహారలోపం, మెరుగైన ఆరోగ్యం, వైద్య సదుపాయాలు లేకపోవడం, అపరిశుభ్రత, ఆరోగ్య నిబంధనల గురించి తెలియకపోవడం మొదలైనవి మరణాల రేటు ఎక్కువగా ఉండటానికి కారణాలు.

▼ ఈ దశలో జనన, మరణాలు ఎక్కువగా ఉండటంతో జనాభాలో పెరుగుదల స్పష్టంగా కనిపించదు.

▼ ఇది ఆర్థికాభివృద్ధిలోని ప్రాథమిక దశ. వాస్తవిక అభివృద్ధి తక్కువ స్థాయిలో ఉంటుంది.

రెండో దశ: రెండో దశలో మరణాల రేటు కంటే జననాల రేటు ఎక్కువగా ఉంటుంది. కొంతకాలం ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి దిశగా ప్రయాణిస్తుంది.

▼ ప్రజల్లో ఆరోగ్యంపై వికాసం కలిగి, మరణాల రేటు తగ్గించే ప్రయత్నాలు జరుగుతాయి.

▼ ఆర్థికాభివృద్ధి స్వల్పంగా పెరుగుతుంది.

▼ ప్రజల ఆదాయాలు పెరిగి, పోషకాహారం తీసుకుంటారు.

▼ రవాణా వసతులు పెరుగుతాయి. ఇతర ప్రాంతాల నుంచి ఆహారధాన్యాలు సరఫరా అవుతాయి.

▼ ఆరోగ్య, వైద్య సౌకర్యాలు మెరుగుపడతాయి.

▼ అంటువ్యాధుల నిర్మూలన వల్ల మరణాల రేటు తగ్గుతుంది.

▼ సాంఘిక పరిస్థితులు, ఆచార వ్యవహారాలు, మూఢనమ్మకాలు, ఆలోచనా విధానాల్లో మార్పు రాకపోవడం మొదలైనవి ఈ దశలో జననాల రేటు ఎక్కువగా ఉండటానికి కారణాలు.

▼ మరణాల రేటు తగ్గుతూ జననాల రేటు పెరగడం వల్ల మొత్తం జనాభాలో పెరుగుదల కనిపిస్తుంది. ఈ విధంగా పెరుగుతున్న జనాభా వృద్ధిని ‘జనాభా విస్ఫోటనం’ అంటారు.

మూడో దశ: ఈ దశలో తగ్గిన మరణాల రేటుకు అనుగుణంగా జననాల రేటు కూడా తగ్గుతుంది.

▼ వెనుకబడిన లేదా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఆర్థికాభివృద్ధి రేటు పెరిగే అవకాశం ఎక్కువ.

▼ వ్యవసాయరంగానికి ప్రాధాన్యం తగ్గుతుంది.

▼ పాక్షిక పారిశ్రామికీకరణతో ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది.

▼ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయి.

▼ ప్రజలు గ్రామాల నుంచి పట్టణాలకు వలసవెళ్తారు.

▼ ఉద్యోగాల్లో మహిళలు భాగస్వాములవుతారు.

▼ ప్రజల ఆదాయాలు పెరగడంతో విద్య అభివృద్ధి చెందుతుంది.

▼ ప్రజలు అధిక సంతానం భారమని గ్రహించి, చిన్న కుటుంబాల ప్రాముఖ్యతను గుర్తిస్తారు.

▼ మూడో దశలో జనన, మరణాల రేటు తగ్గడం వల్ల జనాభా వృద్ధి తగ్గుతుంది.

నాలుగో దశ: ఈ దశలో జనన, మరణాల రేట్ల మధ్య సమన్వయం సాధించి రెండిటిని తగ్గించే ప్రయత్నాలు జరుగుతాయి.

▼ విజ్ఞానశాస్త్రం అభివృద్ధితో వైద్య సౌకర్యాలు విస్తరించి, మనిషి సగటు జీవనకాలం పెరుగుతుంది. మరణాల రేటు గణనీయంగా తగ్గుతుంది.

▼ చిన్న కుటుంబం, కుటుంబ సంక్షేమం, అధిక జీవన ప్రమాణస్థాయి, కుటుంబ నియంత్రణ పాటించడం లాంటి కారణాల వల్ల జననాల రేటు కూడా గణనీయంగా తగ్గుతుంది.

▼ విద్యా ప్రమాణాల స్థాయి పెరిగి యాంత్రిక పరికరాల ఉపయోగం విస్తరించి, వస్తు ఉత్పాదకత అధికమవుతుంది. ఈ పరిణామాల వల్ల ఆర్థికాభివృద్ధి జరిగి ప్రజల జీవన ప్రమాణస్థాయి పెరుగుతుంది. తగ్గుతున్న మరణాల రేటు స్థాయికి జననాల రేటును తగ్గించడం ఈ దశలోని ప్రత్యేకత.

☛ పై నాలుగు దశలను పరిశీలిస్తే జనన, మరణాల రేటు ఎక్కువగా ఉండి పెరుగుదలలో మార్పు కనిపించని ప్రథమ దశ ప్రమాదకరం కాదని చెప్పొచ్చు. ఈ దశ నుంచి రెండో దశకు చేరినప్పుడు మరణాల రేటు కంటే జననాల రేటు ఎక్కువగా ఉండి కొంతకాలం తర్వాత ఆర్థిక వ్యవస్థలో అసమానతలు ఏర్పడతాయి.

☛ శాస్త్రవిజ్ఞానాభివృద్ధి వల్ల మరణాలరేటు తగ్గించినంత సులభంగా జననాల రేటుకు కారణమైన సాంఘిక దురాచారాలను, మూఢనమ్మకాలను తొలగించడం సాధ్యం కాదు. అందువల్ల రెండో దశలో జనాభా విస్ఫోటనం అన్ని విధానాల్లో ప్రమాదకరం. ఈ అసమానతలను తొలగించేందుకు పరిణామదశ అవసరం. దీన్నే జనాభా పరిణామ సిద్ధాంతం అంటారు.

☛ మూడో దశలో మరణాల రేటు స్థాయికి జననాల రేటును తగ్గించడం వల్ల జనాభా పరిణామం చెంది ఆర్థికాభివృద్ధికి అనుకూల వాతావరణం ఏర్పడుతుంది.

☛ నాలుగో దశలో తగ్గిన జనన, మరణాల రేటు మనిషి సగటు జీవన కాలాన్ని, వస్తు ఉత్పాదక శక్తిని, ఆర్థికాభివృద్ధిని, ప్రజల జీవన ప్రమాణాన్ని పెంచుతాయి. దీంతో జనాభా పెరుగుదల ఒక సమస్యగా మారదు.



రచయిత
బండారి ధనుంజయ
విషయ నిపుణులు

429 Word of the Day

Cognizance

Telugu meaning: గుర్తింపు, అంగీకారం

English meaning: The word 'cognizance' is a noun that describes knowledge, awareness, or notice of something.

Synonyms: Awareness, Understanding

Antonyms: Ignorance, Unawareness

Usage: **1.** The court took cognizance of the new evidence, which shifted the direction of the trial.
2. He had no cognizance of the complex regulations governing the business.

Latest Updates

Graduate/ Diploma Engineer Trainee Posts

Joint venture of Indian Oil Corporation Limited, NTPC Limited, Coal India Limited Hindustan Urvarak and Rasayan Limited (HURL), Jharkhand state Sindri invites applications for the post of Graduate/Diploma Engineer Trainees. The total number of posts is 212. The application fee is Rs.750. Eligible candidates can apply online before 21 October 2024.

Protection Officer, Educator Posts

● District Women & Child Welfare & Empowerment Officer, Eluru, Eluru District invites the applications for various posts on Contract basis.

● District Women & Child Welfare & Empowerment Officer, Sri Satyasai District invites the applications from Women candidates for various posts on Contract/ Out Sourcing basis.

☛ The last date for online application is 8 October 2024.

Technician Posts

Konkan Railway Corporation Limited (Konkan Railway) Navi Mumbai is conducting interview for the vacant posts on fixed term contract basis. The total number of posts is 23. Eligible candidates can appear online on 8 October 2024.

Did You Apply..?

Today (October 3) is the last date for the following Posts/ Scholarships


☛ 20 Business Development posts in InspireLeap Company, Hyderabad. **Skills:** Content, Digital, Email, LinkedIn Marketing, Effective Communication, Sales.

☛ 70 Apprentice posts in Nuclear Power Corporation of India Limited (NPCIL), Bulandshahr. **Qualification:** ITI, Diploma, Degree in relevant discipline following the post.

☛ BA Programme Spot Admissions in SSCTU, Mulugu. **Eligibility:** With a minimum of 60% marks at +2 level. Qualified in CUET-UG 2024.

For more information and other notifications - scan QR code

ఈ-బుక్ (కరెంట్ అఫైర్స్)



‘వర్తమాన అంశాలపై పట్టుంటే.. విజయం మీ వెంటే!’

అన్ని పోటీపరీక్షల్లోనూ కరెంట్ అఫైర్స్ ఎంతో కీలకం. ముఖ్యమైన విషయాలను జాతీయం, అంతర్జాతీయం, ఆర్థికరంగం, వార్తల్లో వ్యక్తులు, నియామకాలు, క్రీడలు, సైన్స్ అండ్ టెక్నాలజీ తదితర అంశాల వారీగా ‘ఈనాడు ఈప్రతిభ’ వెబ్‌సైట్, యాప్ ద్వారా ఎప్పటికప్పుడు మీకు అందిస్తోంది. ఇవేకాకుండా వర్తమాన అంశాలను మరింత విశ్లేషణాత్మకంగా మంత్లీ ఈ-బుక్ రూపంలోనూ అందుబాటులో ఉంచుతోంది.

2024 సెప్టెంబరు కరెంట్ అఫైర్స్ ఈ-బుక్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Current Affairs



Indian shooter Parth Rakesh Mane won double gold medals at the ISSF Junior World Championship 2024 on October 1. He clinched the gold medal in the men's 10m air rifle held in Lima, Peru. Parth also won a team victory alongside Ajay Malik and Abhinav Shaw in the men's 10m air rifle team event with a total score of 1883.5.



Claudia Sheinbaum (62) takes office as Mexico's first female President on 1 October 2024. She is a climate scientist and former Mexico City mayor. Sheinbaum replaced outgoing President Andrés Manuel López Obrador.



The Union Government has launched the PM Electric Drive (E-DRIVE) scheme, with an outlay of Rs.10,900 crore. The scheme will be implemented from October 1, 2024, until March 31, 2026, and is designed to accelerate the adoption of electric vehicles (EVs) across India.



Former Netherlands Prime Minister Mark Rutte took over as the Secretary-General of the North Atlantic Treaty Organisation (NATO) in Brussels on 1 October 2024. He is the 14th Secretary General of NATO. Rutte succeeds Norway's Jens Stoltenberg, who had led the alliance since 2014.

For more Current Affairs: Scan QR code

Analogy

Directions (Qs. 1 - 30): *Select the related letter/ word/ number from the given alternatives.*

1. Handwriting : Calligraphy :: Ancient Societies : ?
A) Mineralogy B) Archaeology
C) Gemology D) Petrology

2. 115 : 7 :: 324 : ?
A) 1 B) 8 C) 7 D) 9

3. Tomb of Sand : Geetanjali Shree :: ? : S. Hareesh
A) The Bench B) Adam
C) To Hell and Back: Humans of COVID
D) Asoca: A Sutra

4. ACE : CEG :: XFY : ?
A) VSH B) BQK
C) HSK D) ZHA

5. Loud : Resounding :: ? : Hearted
A) Quiet B) Kind
C) Small D) Cruel

6. Assam : Bihu :: Arunachal Pradesh : ?
A) Wancho B) Kolatam
C) Bhortal D) Saila

7. 341 : 13 :: 562 : ?
A) 17 B) 15 C) 32 D) 45

8. Fail : Achieve :: ? : Humble
A) Arrogant B) Complicated
D) Married D) Honour

RRB Exams
Reasoning

9. BHU : YSF :: MNP : ?
A) NMK B) GEJ
C) HEI D) BSO

10. Hindu : Bhagavad Gita :: ? : Bible
A) Sikh B) Jains
C) Christians D) Muslims

11. Sound : Wave :: ? : Rays
A) Sand B) Light
C) Water D) Temperature

12. Andhra Pradesh : Chandrababu Naidu :: Arunachal Pradesh : ?
A) Pema Khandu B) Himanta
C) Nitish Kumar D) Vishnu Deo Sai

13. 1650 : 66 :: 2315 : ?
A) 78 B) 23 C) 13 D) 38

14. Afghanistan : Kabul :: Algeria : ?
A) Buenos Aires B) Luanda
C) Andorra la Vella D) Algiers

15. DEG : GFD :: HAK : ?
A) KBH B) BAO
C) BSU D) BWO

16. Horses : Neigh :: Donkey : ?
A) Scream B) Buzz
C) Meow D) Boom



17. School : Teacher :: Police station : ?
A) Judge B) Lawyer
C) Criminal D) Doctor

18. 5231 : 103 :: 2472 : ?
A) 738 B) 344
C) 282 D) 814

19. TYU : UXV :: JWK : ?
A) KVL B) HWO
C) WGH D) HSO

20. Silkworms : Sericulture :: Grapes : ?
A) Dibbling B) Viticulture
C) Agriculture D) Pisciculture

21. South : North-West :: West : ?
A) South-East B) none
C) North-East D) South-West

22. 4 : 12 :: 7 : ?
A) 72 B) 42 C) 73 D) 54

23. Albania : Lek :: Angola : ?
A) New Kwanza
B) East Caribbean Dollar
C) Euro D) Dinar

24. Players : Team :: Fish : ?
A) Shoal B) Stock
C) Flock D) Army

25. Balance : Mass :: Ammeter : ?
A) Waves B) Current
C) Wind D) Temperature

26. Wish : Desire :: Touch : ?
A) Quarrel B) Shout
C) Rage D) Push

27. Butter : Milk :: ? : Fibre
A) Silk B) Wool
C) Cloth D) Chemical

28. Editor : News paper :: Tailor : ?
A) Furniture B) Bust
C) Clothes D) Crop

29. Chef : Knife :: Carpenter : ?
A) Needle B) Saw
C) Sun D) Scalpel

30. Bull : Cow :: Bullock : ?
A) Goose B) Nun
C) Witch D) Heifer

For Key scan the QR code

*These model questions were prepared by subject experts of **QnA Academy,** Hyderabad*

కరెంట్ అఫైర్స్



■ 18వ లోక్‌సభ తొలి సమావేశాల్లో సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎంపీగా అచ్చ తెలుగులో ప్రమాణ స్వీకారం చేసిన తమిళనాడుకు చెందిన తెలుగు ఎంపీ ఎవరు? (ఈయన తమిళనాడులోని కృష్ణగిరి నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. గతంలో హోసూరు ఎమ్మెల్యేగా పనిచేసిన ఈయన తమిళనాడు శాసనసభలోనూ మాతృభాష తెలుగులోనే మాట్లాడేవారు.)

జ: కె. గోపీనాథ్

■ సంఘర్షణ, హింస, మానవ హక్కుల ఉల్లంఘనల

మాదిరి ప్రశ్నలు

ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఎంతమందికి పైగా నిరాశ్రయులైనట్లు ఐక్యరాజ్యసమితి శరణార్థుల హైక మిషన్ (యూఎన్‌హెచ్‌సీఆర్) ఇటీవల వెల్లడించింది?

జ: 11.7 కోట్లు (వీరిలో 6.83 కోట్ల మంది సంఘర్షణలు, ఇతర సంక్షోభాల కారణంగా సొంత దేశాల్లోనే ఇతర ప్రాంతాలకు చెదిరిపోయారు. దాదాపు 4.5 కోట్ల మంది పొట్ట చేతపట్టుకుని శరణార్థులుగా విదేశాలకు వలస వెళ్లారు. వీరిలో దాదాపు మూడొంతులు (72 శాతం) అఫ్గానిస్థాన్ (64 లక్షలు), సిరియా (64 లక్షలు), వెనిజువెలా (61 లక్షలు), ఉక్రెయిన్ (60 లక్షలు), పాలస్తీనా (60 లక్షలు) దేశాల నుంచే వచ్చారు.)

■ ప్రపంచదేశాల అభివృద్ధి, అంతర్జాతీయ వ్యాపార విస్తరణలకు కృషిచేస్తోన్న ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రత్యేకవిభాగం యూఎన్‌సీటీఏడీ (వాణిజ్యం, అభివృద్ధిపై ఐరాస సదస్సు) ఇటీవల ఎన్నో వార్షికోత్సవ సమావేశం నిర్వహించింది?

జ: 60వ

మరింత సమాచారం

ప్రిపరేషన్ టెక్నిక్

సబ్జెక్టు ఏదైనా మౌలికాంశాలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. పరీక్షల కోసం ప్రశ్నలు-జవాబులను బట్టీ పట్టడం వల్ల ఉపయోగం ఉండదు. అవగాహన పెంచుకుని చదవడం వల్ల ఎలాంటి ప్రశ్నలకైనా సమాధానాలు రాయగలుగుతారు.

డీఎస్సీ/ టెట్ - 2024
గణితం మెథడాలజీ

JUNIOR INTER Mathematics - 1A Q&A

Then prove that..

2 Marks — **FUNCTIONS**



1) If $f : R\backslash\{0\} \to R$ is defined by $f(x) = x + \frac{1}{x}$ then prove that $(f(x))^2 = f(x^2) + f(1)$

A: $f(x) = x + \frac{1}{x}$

$f(x^2) + f(1) = \left(x^2 + \frac{1}{x^2}\right) + \left(1 + \frac{1}{x}\right)$

$= x^2 + \frac{1}{x^2} + 2 = \left(x + \frac{1}{x}\right)^2$; $f(x)^2 + f(1) = (f(x))^2$

2) If $f : R - \{0\} \to R$ is defined by $f(x) = x^3 - \frac{1}{x^3}$, then show that $f(x) + f\left(\frac{1}{x}\right) = 0$

A: $f(x) + f\left(\frac{1}{x}\right) = \left(x^3 - \frac{1}{x^3}\right) + \left(\frac{1}{x^3} - x^3\right) = 0$

3) If $f : R \to R$ is defined by $f(x) = \frac{1 - x^2}{1 + x^2}$, then show that $f(\tan\theta) = \cos 2\theta$.

A: $f(x) = \frac{1 - x^2}{1 + x^2} \Rightarrow f(\tan\theta) = \frac{1 - \tan^2\theta}{1 + \tan^2\theta} = \cos 2\theta$

4) If $f : R\backslash\{\pm 1\} \to R$ if defined by $f(x) = \log\left|\frac{1 + x}{1 - x}\right|$, then show that $f\left(\frac{2x}{1 + x^2}\right) = 2f(x)$

A: $f(x) = \log\left|\frac{1 + x}{1 - x}\right|$

$f\left(\frac{2x}{1 + x^2}\right) = \log\left|\frac{1 + \frac{2x}{1 + x^2}}{1 - \frac{2x}{1 + x^2}}\right| = \log\left|\frac{1 + x^2 + 2x}{1 + x^2 - 2x}\right|$

$= \log\left|\left(\frac{1 + x}{1 - x}\right)^2\right| = 2\log\left|\frac{1 + x}{1 - x}\right|$; $f\left(\frac{2x}{1 + x^2}\right) = 2f(x)$

Some More Important Questions — 2 Marks

for answers

1) If $A = \left\{0, \frac{\pi}{6}, \frac{\pi}{4}, \frac{\pi}{3}, \frac{\pi}{2}\right\}$ and $f : A \to B$ is a surjection defined by $f(x) = \cos x$ then find B.


2) If $A = \{-2, -1, 0, 1, 2\}$ and $f : A \to B$ is a surjection defined by $f(x) = x^2 + x + 1$ then find B.

3) If $f(x) = \frac{\cos^2 x + \sin^4 x}{\sin^2 x + \cos^4 x}$ $\forall x \in R$ then show that $f(2012) = 1$.

– U.Prasanna Kumar

భిన్నాల సరళీకరణలో సాయం!

రెండు వాహనాలు ఏక కాలంలో, ఒకే స్థానానికి చేరాలంటే ఎంత సమయం పడుతుందో కసాగు చెప్పేస్తుంది. విభిన్న పొడవులున్న రెండు కర్రలను సమాన భాగాలుగా చేయాలంటే గసాభా సాయపడుతుంది. భిన్నాలను కూడటం, తీసివేయడం, సరళీకరించడం కోసం ఆ రెండు ప్రక్రియలూ ఉపయోగపడతాయి. రెండు లేదా అంతకంటే ఎక్కువ సంఖ్యల మధ్య సంబంధాలను అవి వివరిస్తాయి. వీటిపై పట్టు పెంచుకోవాలంటే సామాన్య కారణాంకాలు కట్టడాన్ని, ఇతర గణిత పరిక్రియలను అభ్యర్థులు తెలుసుకోవాలి. సాధారణ గుణకార, భాగహారాలను వేగంగా చేయడం నేర్చుకోవాలి.



జనరల్ స్టడీస్
అరిథ్‌మెటిక్

కసాగు - గసాభా

కసాగు: రెండు లేదా అంతకంటే ఎక్కువ సంఖ్యల కారణాంకాల్లో మిక్కిలి చిన్నదాన్ని కసాగు (కనిష్ఠ సామాన్య గుణిజం) అంటారు.

గసాభా: రెండు లేదా అంతకంటే ఎక్కువ సంఖ్యల భాజకాల్లో మిక్కిలి పెద్దదాన్ని గసాభా (గరిష్ఠ సామాన్య భాజకం) అంటారు.

∴ రెండు సంఖ్యల లబ్ధం = ఆ రెండు సంఖ్యల కసాగు × గసాభా

సహ ప్రధాన సంఖ్యలు: రెండు సంఖ్యల గసాభా 1 అయితే అవి సహ ప్రధాన సంఖ్యలు. భిన్నరూపంలో ఉండే భిన్నాలు.

కసాగు = $\frac{\text{లవాల కసాగు}}{\text{హారాల గసాభా}}$

గసాభా = $\frac{\text{లవాల గసాభా}}{\text{హారాల కసాగు}}$

మాదిరి ప్రశ్నలు

1. రెండు సంఖ్యల కసాగు వాటి గసాభాకు 45 రెట్లు. వాటి గసాభా, కసాగుల మొత్తం 1150. అందులో ఒక సంఖ్య 125 అయితే రెండో సంఖ్య ఎంత?

1) 200 2) 215 3) 225 4) 235

సాధన: కసాగు = l, గసాభా = h అనుకుందాం.

దత్తాంశం ప్రకారం $l = 45h$; $l + h = 1150$

$l + h = 1150$ లో $l = 45h$ ను ప్రతిక్షేపించగా

$45h + h = 1150$, $46h = 1150$

$h = \frac{1150}{46} = 25$

$l + h = 1150 \Rightarrow l + 25 = 1150$, $l = 1125$

రెండు సంఖ్యల లబ్ధం = వాటి కసాగు × గసాభా

$125 \times x = 25 \times 1125$

$x = \frac{25 \times 1125}{125} = 225$

రెండో సంఖ్య = 225 అవుతుంది. **జ: 3**

సంక్షిప్త పద్ధతి:

```
        45
      ┌────┐
      5 × 9
  × 25 |    | × 25
     125    225
```

2. $\frac{3}{5}, \frac{6}{25}, \frac{9}{20}, \frac{27}{50}$ ల గసాభా x, కసాగు y అయితే కింది వాటిలో ఏది సత్యం?

1) y = 90 x 2) y = 180 x
3) y = 270 x 4) y = 360 x

సాధన: భిన్నరూపంలో ఉంటే

i) కసాగు = $\frac{\text{లవాల కసాగు}}{\text{హారాల గసాభా}}$

ii) గసాభా = $\frac{\text{లవాల గసాభా}}{\text{హారాల కసాగు}}$

```
i) 3 | 3, 6, 9, 27        5, 25, 20, 50
   3 | 1, 2, 3, 9         5) 50 (10
     |   2, 1, 3             50
                              0
```

కసాగు = 54 గసాభా = 5

$y = \frac{54}{5}$

```
ii) గసాభా 3, 6, 9, 27    5 | 5, 25, 20, 50
3) 27 (9                 5 | 1, 5, 4, 10
   27                    2 |   1, 4, 2
    0
```

$x = \frac{3}{100}$ కసాగు = 100

$\frac{y}{x} = \frac{\frac{54}{5}}{\frac{3}{100}} = \frac{54}{5} \times \frac{100}{3}$

$\frac{y}{x} = 360 \Rightarrow y = 360x$ **జ: 4**

3. $x^2 + 5x + 6$, $x^2 + 8x + 15$ ల గసాభా (x + k) అయితే k విలువ ఎంత?

1) 5 2) 3 3) 2 4) 1

సాధన:

x^2+5x+6	$x^2+8x+15$
$x^2+2x+3x+6$	$x^2+3x+5x+15$
$x(x+2)+3(x+2)$	$x(x+3)+5(x+3)$
$(x+2)(x+3)$	$(x+3)(x+5)$

రెండింటిలో ఉమ్మడిగా ఉంటేనే గసాభా అవుతుంది.

కాబట్టి గసాభా (x + 3) = (x + k)

∴ k = 3 అవుతుంది **జ: 2**

4. కిందివాటిలో పరిపూర్ణసంఖ్య ఏది?

1) 6 2) 9 3) 15 4) 20

సాధన: ఏ సంఖ్య యొక్క కారణాంకాల మొత్తం (ఆ సంఖ్య తప్ప) ఆ సంఖ్యకు సమానం కావాలి.

6 కారణాంకాలు 1, 2, 3 = 6
9 కారణాంకాలు 1, 3 = 4
15 కారణాంకాలు 1, 3, 5 = 9
20 కారణాంకాలు 1, 2, 4, 5, 10 = 22

∴ కాబట్టి కారణాంకాల మొత్తం ఆ సంఖ్యకు సమానం అవుతుంది. కాబట్టి 6 అవుతుంది. **జ: 1**

5. రెండు అవిభాజ్య సంఖ్యలు a, b (a > b) ల కసాగు 319 అయితే a – 2b విలువ ఎంత?

1) –8 2) 9 3) 8 4) 7

సాధన: a విలువ b కంటే పెద్దది

319 = 29 × 11
↓ ↓
a b

దత్తాంశం ప్రకారం = a – 2b = 29 – 2(11)

= 29 – 22 = 7 **జ: 4**

6. రెండు సంఖ్యల మొత్తం 125. వాటి గసాభా 25, కసాగు 150. అయితే ఆ సంఖ్యల వ్యుత్క్రమాల (విలోమాల) మొత్తం ఎంత?

1) $\frac{1}{65}$ 2) $\frac{1}{50}$ 3) $\frac{1}{40}$ 4) $\frac{1}{30}$

సాధన: రెండు సంఖ్యలు వరుసగా x, y అనుకుందాం. అప్పుడు దత్తాంశం ప్రకారం

x + y = 125

కావాల్సినవి $\frac{1}{x} + \frac{1}{y} = \frac{y + x}{xy}$

$= \frac{125}{25 \times 150} = 30$

xy = రెండు సంఖ్యల కసాగు × గసాభా

∴ కావాల్సిన జవాబు = $\frac{1}{30}$ **జ: 4**

7. ఒక సంఖ్య kతో 3026, 5053 లను భాగించినప్పుడు వరుసగా వచ్చే శేషాలు 11, 13. అయితే k గరిష్ఠ విలువ ఎంత?

1) 45 2) 36 3) 15 4) 60

సాధన:

```
 5053    3026
  –13     –11
 ────    ────
 5040    3015
```

రెండింటికి గసాభా కనుక్కోవాలి.

```
3015) 5040 (1
      3015
      ────
      2025) 3015 (1
            2025
            ────
             990) 2025 (2
                  1980
                  ────
                    45) 990 (22
                        990
                        ───
                          0
```



గసాభా k = 45 అవుతుంది. **జ: 1**

8. రెండు ధనపూర్ణాంకాల మొత్తం 594. వాటి గసాభా 33. ఈ నియమాలను తృప్తిపరిచే క్రమయుగ్మాల సంఖ్య ఎంత?

1) 2 2) 3 3) 4 4) 5

సాధన: రెండు సంఖ్యలు x, y అనుకుందాం.. వాటి గసాభా 33 అయితే అప్పుడు ఆ సంఖ్యలు 33x, 33y. దత్తాంశం ప్రకారం

33x + 33y = 594, 33(x + y) = 594

$x + y = \frac{594}{33} = 18$, x + y = 18

1 + 17 – 1, 2 + 16, 3 + 15,
4 + 14, 5 + 13 – 2, 6 + 12,
7 + 11 – 3, 8 + 10, 9 + 9

పక్కన రాసిన వాటి గసాభా 1 అయితే తృప్తిపరుస్తుంది.


జ: 2



రచయిత: బిజ్జుల విష్ణువర్ధన్‌రెడ్డి

రాజ్యాంగ మౌలిక సూత్రాలకు రక్షాకవచం!

భారత రాజ్యాంగం స్వయంప్రతిపత్తి, ఏకీకృత న్యాయవ్యవస్థను ఎంచుకుంది. రాజ్యాంగ మౌలిక సూత్రాల్లో స్వతంత్ర న్యాయవ్యవస్థ అతిముఖ్యమైంది. ప్రజాస్వామ్యం, పౌరహక్కులకు రక్షణ, సమన్యాయ పాలన, సమాఖ్య వ్యవస్థల మధ్య సమన్వయం లాంటి బాధ్యతలన్నీ న్యాయవ్యవస్థే నిర్వర్తిస్తోంది.



అన్నింటికీ మించి రాజ్యాంగ మౌలిక సూత్రాలను పరిరక్షిస్తోంది. ఇన్ని విశిష్టతలతో కూడిన భారత న్యాయవ్యవస్థ నిర్మాణం, పరిధి, పనితీరు, పౌర, నేర శిక్షాస్మృతుల్లోని ప్రాథమికాంశాలపై పోటీ పరీక్షల అభ్యర్థులకు తగినంత పరిజ్ఞానం ఉండాలి. వివిధ అంచెల్లో కోర్టులకు ఉన్న విచారణ పరిధి, అధికారాలు, సుప్రీంకోర్టు, హైకోర్టుల నేపథ్యం, ప్రస్తుత కూర్పు, ప్రాథమిక హక్కులపై అత్యున్నత న్యాయస్థానం చేసిన వ్యాఖ్యానాలు, ఇచ్చిన తీర్పులు, వాటి పూర్వాపరాలు, ప్రజాప్రయోజన వ్యాజ్యానికి ఉన్న ప్రాధాన్యం, ప్రభావవంతమైన కోర్టు కేసుల గురించి అవగాహనతో ఉండాలి.

డీఎస్సీ/టెట్ - 2024
సోషల్ స్టడీస్ - పౌర శాస్త్రం

న్యాయవ్యవస్థ

1. న్యాయవ్యవస్థ 'వివాదాల పరిష్కారం' అనే అంశాలకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
ఎ) పౌరులకు-ప్రభుత్వానికి మధ్య తలెత్తే వివాదాలను పరిష్కరించడం.
బి) రెండు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య తలెత్తే వివాదాలను పరిష్కరించడం.
సి) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య తలెత్తే వివాదాలను పరిష్కరించడం.
డి) నదీజలాల వివాదాలను పరిష్కరించడం.
1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

2. పార్లమెంటు రూపొందించిన చట్టాలు రాజ్యాంగ మౌలిక స్వరూపానికి వ్యతిరేకంగా ఉంటే, న్యాయవ్యవస్థ వాటిని రద్దు చేస్తుంది. దీన్ని ఏమని పేర్కొనవచ్చు?
1) న్యాయసమీక్ష 2) అమికస్ క్యూరీ
3) పార్డన్ 4) కంపెన్‌సేషన్

3. మనదేశంలో 'ఫెడరల్ కోర్ట్ ఆఫ్ ఇండియా' ఏ కాలంలో పార్లమెంట్ హౌస్‌లోని 'ఛాంబర్ ఆఫ్ ప్రిన్సెస్'లో తన విధులు నిర్వహించింది?
1) 1935-1947 2) 1937-1947
3) 1937-1949 4) 1935-1950

4. భారత రాజ్యాంగ చట్టం ప్రకారం 'ఫెడరల్ కోర్ట్ ఆఫ్ ఇండియా' స్థానంలో సుప్రీంకోర్టు ఎప్పుడు ఏర్పడింది?
1) 1950, జనవరి 28 2) 1950, జనవరి 24
3) 1949, నవంబరు 26 4) 1949, జనవరి 26

5. 'ఫెడరల్ కోర్టు'కు చివరి న్యాయమూర్తిగా, సుప్రీంకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించిన వారు?
1) మారిస్ గ్వేయర్ 2) జాన్‌హైడ్
3) హరిలాల్ జె కానియా 4) సత్యేంద్ర సిన్హా

6. జీవించే ప్రాథమిక హక్కులోనే ఆరోగ్య హక్కు కూడా ఇమిడి ఉందని ఏ కేసు సందర్భంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది?
1) హకీమ్ షేక్ అనే వ్యవసాయ కార్మికుడు
2) రాగ్యా నాయక్ అనే మత్స్యకారుడు
3) నందన్‌వాలా అనే పారిశ్రామికవేత్త
4) దండేకర్ అనే వీధివ్యాపారి

7. కింది అంశాల్లో సరికానిదాన్ని గుర్తించండి.
1) ఆర్టికల్ 21 జీవించే హక్కు గురించి పేర్కొంటుంది.
2) ఆర్టికల్ 32 ప్రకారం సుప్రీంకోర్టు ప్రాథమిక హక్కుల రక్షణ కోసం 'రిట్స్' జారీ చేస్తుంది.
3) ఆర్టికల్ 226 ప్రకారం హైకోర్టులు ప్రాథమిక హక్కుల రక్షణ కోసం 'రిట్స్' జారీ చేస్తాయి.
4) ఆర్టికల్ 238 ప్రకారం జిల్లా కోర్టులు ప్రాథమిక హక్కుల రక్షణ కోసం 'రిట్స్' జారీ చేస్తాయి.

8. అత్యవసర సమయంలో రోగుల ప్రాథమిక ఆరోగ్య సంరక్షణకు తీసుకుంటున్న 'మార్గసూచీ' (బ్లూప్రింట్)తో రావాలని సుప్రీంకోర్టు ఏ కేసు సందర్భంగా పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది?
1) పశ్చిమ బెంగాల్ ఖేత్ మజ్దూర్ సమితి వర్సెస్ పశ్చిమ బెంగాల్ రాష్ట్రం, 1996
2) పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం వర్సెస్ ప్రజా మజ్దూర్ కర్షక పరిషత్, 1996
3) నందినీ శతపతి వర్సెస్ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, 1996
4) నళినీ ముఖర్జీ వర్సెస్ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, 1996

9. కింది అంశాల్లో సరైన వాక్యాలను గుర్తించండి.
ఎ) ప్రభుత్వ శాఖల మధ్య అధికారాల విభజన అనేది భారత రాజ్యాంగం ముఖ్య లక్షణం.
బి) శాసన, కార్యనిర్వాహక శాఖలు 'న్యాయవ్యవస్థ' కార్యకలాపాల్లో జోక్యం చేసుకోలేవు.
సి) భారత రాజ్యాంగం 'స్వయంప్రతిపత్తి' ఉన్న న్యాయ వ్యవస్థను ఏర్పాటు చేసింది.
డి) న్యాయస్థానాలు ప్రభుత్వ నియంత్రణలో ఉండవు.
1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

10. కింది అంశాల్లో సరైన వాక్యాలను గుర్తించండి.
ఎ) భారతదేశంలో 3 స్థాయుల్లో న్యాయస్థానాలు ఉన్నాయి.
బి) దేశంలో అత్యున్నత న్యాయస్థానం న్యూదిల్లీలోని సుప్రీంకోర్టు.
సి) రాష్ట్ర స్థాయిలో అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు.
డి) హైకోర్టు న్యాయమూర్తులను గవర్నర్ నియమిస్తారు.
1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

11. కింది అంశాల్లో సరైన వాక్యాలను గుర్తించండి.
ఎ) సాధారణంగా అనేకమంది ప్రజలు ఆశ్రయించే న్యాయస్థానాలను 'సబార్డినేట్ న్యాయస్థానాలు' అంటారు.
బి) సబార్డినేట్ న్యాయస్థానాలు సాధారణంగా జిల్లా / తహశీల్/పట్టణాల స్థాయిలో ఉంటాయి.
సి) ప్రతి జిల్లాలో జిల్లా న్యాయమూర్తి ఆధ్వర్యంలో ఒక న్యాయస్థానం పనిచేస్తుంది.
డి) జిల్లా స్థాయిలో అత్యున్నత క్రిమినల్ కోర్టు 'సెషన్స్ కోర్టు'.
1) ఎ, బి, డి 2) ఎ, బి, సి
3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి

12. కింది అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
ఎ) ప్రజాస్వామ్యం విజయవంతం కావడంలో స్వయం ప్రతిపత్తి ఉండే న్యాయవ్యవస్థ తోడ్పడుతుంది.
బి) శాసన, కార్యనిర్వాహక శాఖలు తమ అధికారాలను దుర్వినియోగం చేయకుండా ఉండేందుకు స్వయం ప్రతిపత్తి ఉండే న్యాయవ్యవస్థ అవసరం.
సి) పదవిలో ఒకసారి నియమితులయ్యాక న్యాయమూర్తులను తొలగించడం చాలా కష్టం.
డి) రాజ్యాంగానికి సంరక్షకుడిగా రాష్ట్రపతి వ్యవహరిస్తారు.
1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

13. ఇండియన్ కౌన్సిల్ చట్టం, 1861 ప్రకారం 1862లో హైకోర్టులను నెలకొల్పిన ప్రెసిడెన్సీ నగరాలను గుర్తించండి.
1) కోల్‌కతా, సతారా, ముంబయి
2) కోల్‌కతా, ముంబయి, మద్రాసు
3) కోల్‌కతా, దిల్లీ, ముంబయి
4) కోల్‌కతా, అలహాబాద్, ముంబయి

14. కింది అంశాల్లో సరైన వాక్యాలను గుర్తించండి.
ఎ) దిల్లీ హైకోర్టు 1966లో ఏర్పాటైంది.
బి) ప్రస్తుతం మన దేశంలో హైకోర్టుల సంఖ్య 25.
సి) పంజాబ్, హరియాణా రాష్ట్రాలకు చండీగఢ్‌లో ఉమ్మడి హైకోర్టు ఉంది.
డి) కేరళ, గోవా రాష్ట్రాలకు తిరువనంతపురంలో ఉమ్మడి హైకోర్టు ఉంది.
1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

15. ఆంధ్రప్రదేశ్ (అమరావతి), తెలంగాణ (హైదరాబాద్)లలో హైకోర్టులు ఎప్పటి నుంచి అమలులోకి వచ్చాయి?
1) 2019, ఏప్రిల్ 1 2) 2019, జులై 1
3) 2019, జనవరి 1 4) 2019, నవంబరు 1

16. గువాహటి (గౌహతి) హైకోర్టు పరిధిలోకి వచ్చే ఈశాన్య రాష్ట్రాలను గుర్తించండి.
1) నాగాలాండ్, మిజోరం, త్రిపుర, అస్సాం
2) నాగాలాండ్, అస్సాం, మిజోరం, అరుణాచల్ ప్రదేశ్
3) అస్సాం, త్రిపుర, గోవా, అరుణాచల్ ప్రదేశ్
4) అస్సాం, త్రిపుర, మణిపుర్, అరుణాచల్ ప్రదేశ్

17. గువాహటి హైకోర్టు బెంచ్ ఎక్కడ ఏర్పాటైంది?
1) ఐజ్వాల్ (మిజోరం) 2) పనాజీ (గోవా)
3) అగర్తల (త్రిపుర)
4) కోహిమా (నాగాలాండ్)

18. కిందివాటిలో నేర శిక్షాస్మృతి (క్రిమినల్ లా)కి సంబంధం లేని అంశాన్ని గుర్తించండి.
1) దొంగతనం 2) కొట్లాట, హత్య
3) కట్నం కోసం మహిళలను హింసించడం
4) విడాకులు

19. కిందివాటిలో పౌర శిక్షాస్మృతి (సివిల్ లా)కి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
ఎ) వ్యక్తుల మధ్య జరిగే ఒప్పందం ఉల్లంఘన వల్ల జరిగే నష్టానికి సంబంధించింది.
బి) నష్టపోయిన వ్యక్తి న్యాయస్థానంలో దావా వేయాలి.
సి) భూమి అమ్మకానికి సంబంధించిన వివాదాలు, వస్తువుల కొనుగోలుకు సంబంధించిన వివాదాలు.
డి) నేరం ధ్రువీకరణ అయితే జైలుశిక్ష, జరిమానా విధిస్తారు.
1) ఎ, బి, డి 2) ఎ, బి, సి
3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి

20. అన్నివర్గాల వారికి న్యాయాన్ని అందించేందుకు 1980వ దశకం ప్రారంభంలో సుప్రీంకోర్టు దేనికి శ్రీకారం చుట్టింది?
1) ప్రజాప్రయోజనాల వ్యాజ్యం (పిల్)
2) న్యాయ సమీక్ష (జ్యుడిషియల్ రివ్యూ)
3) తీర్పుల పునఃసమీక్ష
4) కోర్ట్ ఆఫ్ రికార్డ్

21. 2001లో ఏ రాష్ట్రంలో కరవు సంభవించడంతో లక్షలాది మంది తీవ్రమైన ఆహార కొరత ఎదుర్కొన్నారు?
1) పంజాబ్, హరియాణా
2) బిహార్, పశ్చిమ బెంగాల్
3) రాజస్థాన్, ఒడిశా
4) ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్

22. PUCL అంటే?
1) పీపుల్స్ యూనియన్ ఆఫ్ సివిల్ లిబర్టీస్
2) పబ్లిక్ యూనియన్ ఆఫ్ సివిల్ లిబర్టీస్
3) ప్రైవసీ యూనియన్ ఆఫ్ చాప్టర్ లింకేజ్
4) ప్రోగ్రెసివ్ అల్టిమేట్ ఫర్ సివిల్ లయబిలిటీస్

23. PUCL అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం సందర్భంగా ఆహారపు హక్కును ఏ ప్రాథమిక హక్కులో అంతర్భాగమని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది?
1) భావ ప్రకటన హక్కు 2) సమానత్వపు హక్కు
3) జీవించే హక్కు
4) పీడనాన్ని నిరోధించే హక్కు

24. ప్రజాప్రయోజన వ్యాజ్యం వల్ల కలిగిన ప్రయోజనాన్ని గుర్తించండి.
ఎ) అమానుషమైన పరిస్థితుల్లో వెట్టిచాకిరీ చేస్తున్న కార్మికుల రక్షణ.
బి) శిక్షా కాలం పూర్తయిన తర్వాత కూడా జైలులో ఉంచిన బిహార్‌లోని ఖైదీలను విడుదల చేయడం.
సి) ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా ఆహారాన్ని ప్రజలకు అందించడం.
డి) ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు
1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

25. సుప్రీంకోర్టు 1985లో ఏ కేసు సందర్భంగా ఇచ్చిన తీర్పు మురికివాడల్లో నివసించే వారి జీవితాలను కాపాడేలా ఉంది?
1) ప్రథమ్ ఇండియా వర్సెస్ బాంబే మున్సిపల్ కార్పొరేషన్
2) ఓల్గా టెల్లీస్ వర్సెస్ బాంబే మున్సిపల్ కార్పొరేషన్
3) నవీన్ జిందాల్ వర్సెస్ బాంబే మున్సిపల్ కార్పొరేషన్
4) రణ్‌వీర్ వర్సెస్ బాంబే మున్సిపల్ కార్పొరేషన్



రచయిత: బంగారు సత్యనారాయణ

సమాధానాలు

1-4; 2-1; 3-3; 4-1; 5-3; 6-1; 7-4; 8-1; 9-4; 10-1; 11-4; 12-3; 13-2; 14-1; 15-3; 16-2; 17-1; 18-4; 19-2; 20-1; 21-3; 22-1; 23-3; 24-4; 25-2.

పీజీ అర్హతే గెలిపిస్తుందా?

యూపీఎస్సీ నివేదిక విశ్లేషణ



రాజ్యాంగంలోని ఆర్టికల్ 323(I) ప్రకారం వార్షిక నివేదిక- 2022-23ను ఇటీవలే యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) రాష్ట్రపతికి సమర్పించింది. దీనికి అంత ప్రాముఖ్యం ఏముంటుందని విద్యార్థులు అనుకోవచ్చు. పరీక్షకూ, సన్నద్ధతకూ దీంతో సంబంధం లేదని భావించవచ్చు. కానీ నివేదికలో వ్యక్తమైన ధోరణులను బట్టి సివిల్స్ అభ్యర్థులు తమకు ఉపయోగపడే విలువైన అంశాలు గమనించవచ్చు. వాటిని పాటిస్తే విజయానికి చేరువ కావొచ్చు!

యూపీఎస్సీ నివేదికను గమనిస్తే.. ప్రిలిమినరీకి హాజరైనవారిలో మహిళల కంటే పురుషుల సంఖ్యే ఎక్కువ. 2021లో ప్రిలిమినరీ పరీక్షకు 5,08,619 మంది హాజరైతే అందులో 3,40,671 మంది పురుషులు, 1,67,944 మంది మహిళలు. అంతిమంగా 9,214 మంది అర్హత సాధించారు. వారిలో 7,855 మంది పురుషులు, 1,359 మంది మహిళలు. సక్సెస్ రేటు పురుషుల్లో 2.31 శాతం కాగా, మహిళలది 0.81 శాతం. మహిళలతో పోలిస్తే.. పురుషుల సక్సెస్ రేటు చాలా ఎక్కువ.

1 **ప్రిలిమినరీ:** సివిల్ సర్వీసెస్ పరీక్షకు 2022లో దరఖాస్తు చేసిన అభ్యర్థుల సంఖ్య 11,52,566. గడిచిన సంవత్సరాలతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. గత ఏడాది 5,79,008 మంది (50.23 శాతం) మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. 2021లో 46.5 శాతం మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. పెరుగుతున్న పోటీని 4 శాతం పెరుగుదల సూచిస్తోంది.

ఏం చేయాలి: పరీక్షపై అవగాహన పెరగడం వల్ల ప్రతి సంవత్సరం పోటీ కూడా పెరుగుతోంది. ప్రైవేటు రంగంలో వెంటనే ఉద్యోగావకాశాలు లేకపోవడం, యునైటెడ్ స్టేట్స్‌లో ఆర్థిక మాంద్యం, ఇటీవల ప్రైవేటు రంగంలో లేఆఫ్‌లు ఎక్కువ కావడం... ఇవన్నీ పోటీ పెరగడానికి కారణమయ్యాయి. ఏటా పోటీ పెరుగుతుందని అంచనా వేసుకుని దానికి అనుగుణంగా సన్నద్ధత కొనసాగించాలి. మాక్ టెస్ట్‌లకు హాజరవుతూ ప్రిలిమినరీలో తప్పనిసరిగా 50 శాతం మార్కులు సాధించడానికి ప్రయత్నించాలి.

2 **పీజీ వర్సెస్ డిగ్రీ:** పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసుకున్న వారి కంటే యూజీ డిగ్రీ చేసినవారి సక్సెస్ రేటు ఎక్కువ. డిగ్రీ చదివిన అభ్యర్థుల్లో 1402 మంది ఇంటర్వ్యూ దాకా వచ్చారు. వారిలో 585 మంది సర్వీసు పొందారు. దీనికి విరుద్ధంగా పీజీ పూర్తయినవారిలో 417 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూ దశకు చేరారు. వీరిలో 163 మంది సర్వీసు పొందారు.

ఏం చేయాలి: 2010కి ముందు వరకూ సివిల్స్‌కు పీజీ అవసరమనీ, అదో ఎసెట్ అనీ భావించేవారు. కొత్త విధానాన్ని ప్రవేశపెట్టిన తర్వాత పరిస్థితి మారింది. అభ్యర్థులు పీజీ పట్టా వచ్చేవరకూ ఎదురుచూడకుండా.. గ్రాడ్యుయేషన్ అయిన వెంటనే సివిల్స్ రాసేలా ప్రణాళిక వేసుకోవటం ఉత్తమం. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌కు రెండేళ్లు కేటాయించడం వల్ల పరిపక్వత సాధించవచ్చునేది నిజమే కానీ సివిల్స్ పరీక్షలో నెగ్గడానికి పీజీ అవసరం తప్పనిసరి కాదు.

3 **ఈడబ్ల్యూఎస్:** ఈ కేటగిరీ కింద 2022లో పరీక్షకు హాజరైనవారి సంఖ్య రిజర్వేషన్లు ఉన్న ఇతర కేటగిరీల కంటే చాలా తక్కువ. ఇది 55,669 మాత్రమే. దరఖాస్తు చేసినవారిలో 30,715 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు

ఏం చేయాలి: చాలామంది అభ్యర్థులకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ ప్రయోజనాలపై అవగాహన లేదు. జనరల్ కేటగిరీకి చెందిన ఖాళీల్లో పది శాతం ఈడబ్ల్యూఎస్‌కు కేటాయిస్తారనేది గుర్తుంచుకోవాలి. ఆర్థికంగా వెనకబడిన అభ్యర్థులు ఈడబ్ల్యూఎస్ కేటగిరీ కింద రిజర్వేషన్ పొందగలరేమో పరిశీలించుకోవాలి. రిజర్వేషన్ పొందాలనుకుంటే.. సంబంధిత సర్టిఫికెట్లను సంపాదించాలి. పూజా ఖేడ్కర్ ఉదంతం తర్వాత ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్/ పీహెచ్ అభ్యర్థుల సర్టిఫికెట్ల విషయంలో యూపీఎస్సీ కఠినంగా వ్యవహరిస్తోంది. కాబట్టి సర్టిఫికెట్లన్నీ చట్టబద్ధంగా పొందాలి.

4 **కొన్ని సర్వీసుల తగ్గింపు:** ఎంపిక ప్రక్రియను సాధారణంగా 22-23 సర్వీసుల కోసం నిర్వహిస్తారు. 2022లో అవి 20 మాత్రమే. మూడు రైల్వే సర్వీసులను ఒక్క ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్‌గా విలీనం చేశారు.

ఏం చేయాలి: భవిష్యత్తులో సర్వీసుల సంఖ్య తగ్గే అవకాశం ఉందనుకోవచ్చు. ఎందుకంటే ఇతర సర్వీసులనూ విలీనం చేసే ప్రణాళికలు ప్రభుత్వ దగ్గరున్నాయి. ఉదా: అకౌంటింగ్ సర్వీసులను ఒకటి చేయనున్నారు. అయినప్పటికీ పోస్టుల సంఖ్యలో మాత్రం అంత వ్యత్యాసమేమీ ఉండబోదు.

5 **ఇంజినీరింగ్ జోరు:** ప్రిలిమినరీ ఉత్తీర్ణులలో సైన్స్, హ్యూమానిటీస్ నేపథ్యం ఉన్నవాళ్లకంటే.. ఇంజినీరింగ్ డిగ్రీ వాళ్లే ఎక్కువ. మెయిన్ పరీక్షకు అర్హత సాధించిన వారిలో ఇంజినీరింగ్ డిగ్రీ నేపథ్యమున్నవాళ్లు 998 మంది. హ్యూమానిటీస్ విద్యార్థులు 184 మంది, సైన్స్ విద్యార్థులు 119 మంది.

ఏం చేయాలి: డిగ్రీ స్థాయిలో ఎక్కువమంది ఇంజినీరింగ్‌ను ఎంపిక చేసుకుంటున్నందున ప్రిలిమినరీలో అర్హత సాధించినవారిలో వీళ్లే ఎక్కువగా ఉంటున్నారు. పైగా ప్రిలిమినరీ పరీక్షలోని పేపర్-2 (సీశాట్)ను వీరు మెరుగ్గా రాయగలుగుతున్నారు. హ్యూమానిటీస్ నేపథ్యం ఉన్నవారిలో చాలామందికి లెక్కలంటే అంత ఇష్టం ఉండదు. వీరు సీశాట్ పేపర్ రాయడానికి ఎక్కువ శ్రమపడాలి.

6 **ఆప్షనల్స్ ఎంపిక:** పాపులర్ ఆప్షనల్స్‌గా పేరున్న సబ్జెక్టులను ఎంచుకున్నవారికంటే...డిగ్రీలో చదువుకున్న సబ్జెక్టుపై పట్టు సాధించినవారికే విజయావకాశాలు ఎక్కువ. 2021లో పాపులర్ ఆప్షనల్స్ సంగతి పరిశీలిస్తే... పొలిటికల్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్‌ను ఆప్షనల్‌గా 1571 మంది రాస్తే 140 మంది నెగ్గారు (విజయశాతం 8.9). పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఆంత్రోపాలజీ, జాగ్రఫీల్లో విజయ శాతం వరుసగా 8.6, 8.5, 7.8, 6.1. దీనికి భిన్నంగా తమ సబ్జెక్టుల్లో స్పెషలైజ్ స్టడీ చేసినవారి విజయశాతం ఉంది. మేనేజ్‌మెంట్ ఆప్షనల్‌ను 31 మంది ఎంచుకుని రాస్తే 5 మంది నెగ్గారు. అంటే 16.1 శాతం. కామర్స్ అండ్ అకౌంటెన్సీ, మెడికల్ సైన్స్, లా ఆప్షనల్‌గా తీసుకున్న అభ్యర్థుల విజయశాతం వరుసగా 15, 12.2, 11.7.

ఏం చేయాలి: సబ్జెక్టు స్పెషలైజేషన్‌కు పేరుపొందిన యూనివర్సిటీ నుంచి పట్టా పొంది వుంటే.. ఆ సబ్జెక్టును ఆప్షనల్‌గా ఎంచుకోవచ్చు. ఉదాహరణకు- ఐఐఎం నుంచి పీజీ చేసివుంటే మేనేజ్‌మెంట్‌ను ఆప్షనల్‌గా తీసుకోవచ్చు. అలాగే బీకామ్ (ఆనర్స్) చదువుకున్నా, సీఏ పూర్తిచేసుకున్నా.. కామర్స్, అకౌంటెన్సీని ఎంచుకోవడం సముచితం. విశ్లేషణ చేశాక ఆప్షనల్‌పై నిర్ణయం తీసుకోవాలి కానీ.. టాపర్లు తీసుకున్నారన్న కారణంతో ఆ సబ్జెక్టును గుడ్డిగా ఎంపిక చేసుకోవడడం నష్టదాయకం. చదవటానికి సౌలభ్యం ముఖ్యం. జనరల్ స్టడీస్‌లోని అంశాలు కూడా కలిసొచ్చేలా ఉంటే ఆ ఆప్షనల్ సాధారణంగా మెరుగైనది అని భావించవచ్చు.




వి. గోపాలకృష్ణ
డైరెక్టర్
బ్రెయిన్ ట్రీ

ఉద్యోగ సాధన ఎలా?

బీటెక్ (ఈసీఈ) 2015లో, ఎంటెక్ (వీఎల్ఎస్ఐ) 2018లో, బీఈడీ (మ్యాథ్స్, ఫిజిక్స్) 2022లో పూర్తిచేశాను. గ్రూప్-2, 3, 4 పరీక్షలు రాసినా ఉద్యోగం సాధించలేకపోయాను. ఇప్పుడు ప్రైవేటు ఉద్యోగ ప్రయత్నాలు ఫలించడం లేదు. నా వయసు 31 ఏళ్లు. ఏ అర్హతతో ప్రయత్నిస్తే మేలు?

– ఉపేందర్



■ మీకు బోధన రంగంలో ఆసక్తి ఉంటే ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల్లో అధ్యాపక వృత్తి చేపట్ట వచ్చు. పరిశోధనలపై ఆసక్తి ఉంటే ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ చేసే అవకాశం ఉంది. కానీ పీహెచ్‌డీ పూర్తి అయ్యేసరికి మీ వయసు మరో ఐదేళ్లు పెరుగుతుంది. అందుకని అధ్యాపక వృత్తి కొనసాగిస్తూనే పరిశోధన చేయొచ్చు. పాఠశాల బోధనపై ఆసక్తి ఉంటే ఏదైనా ఇంటర్నేషనల్ స్కూల్‌లో మ్యాథ్స్/ ఫిజిక్స్ టీచర్‌గా పని చేసే విషయం ఆలోచించండి. ఎడ్యుకేషన్ సబ్జెక్ట్‌లో ఆసక్తి అంటే ఎంఈడీ చేసి, ఎంఈడీ/బీఈడీ/డీఈడీ కళాశాలల్లో అధ్యాపకుడిగా స్థిరపడవచ్చు. ప్రస్తుతం డిమాండ్ ఎక్కువగా ఉన్న డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటి సబ్జెక్టుల్లో శిక్షణ పొంది ఆ రంగాల్లో ఉద్యోగ ప్రయత్నాలు చేయండి. ఇంజినీరింగ్, బీఈడీ విద్యార్హతలతో ఎడ్యుటెక్ కంపెనీల్లో ఉద్యోగ ప్రయత్నాలు చేయండి. చాలామంది ఇంజినీరింగ్ పట్టభద్రులు జూనియర్ కళాశాలల్లో మ్యాథ్స్, ఫిజిక్స్ లాంటివి బోధిస్తూ మెరుగైన వేతనాలు పొందుతున్నారు. మీకు మేనేజ్‌మెంట్ రంగంపై ఇష్టం ఉంటే ఎంబీఏ చేయొచ్చు. ప్రైవేటు ఉద్యోగం పొందాలంటే విషయపరిజ్ఞానంతో పాటు కమ్యూనికేషన్, ప్రోగ్రామింగ్, కోడింగ్, సమస్యా పరిష్కార నైపుణ్యాలు చాలా అవసరం.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

ఎన్ఐటీఎంలో టెక్నికల్ అసిస్టెంట్లు

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్‌కు చెందిన కర్ణాటక, బెళగావిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రెడిషనల్ మెడిసిన్ (ఎన్ఐటీఎం).. తాత్కాలిక ప్రాతిపదికన 4 టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్ డిగ్రీతో పాటు పని అనుభవం.
దరఖాస్తు ఫీజు: రూ.300
దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'ది డైరెక్టర్, ఐసీఎంఆర్ - నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెడ్రిషనల్ మెడిసిన్, నెహ్రూనగర్, బెళగావి' చిరునామాకు పంపించాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: 18-10-2024
వెబ్‌సైట్: https://icmrnitm.res.in/

బెల్‌లో సీనియర్ ఇంజినీర్ ఖాళీలు

బెంగళూరులోని ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్).. పర్మినెంట్ ప్రాతిపదికన 5 సీనియర్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ (ఎలక్ట్రానిక్స్), ఎంఈ/ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్)తో పాటు పని అనుభవం.
వయసు: 1.10.2024 నాటికి 32 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు.
దరఖాస్తు ఫీజు: రూ.600; ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూబీడీ/ ఎక్స్-సర్వీస్‌మెన్‌లకు మినహాయింపు.
వేతనం: నెలకు రూ.50,000-రూ.1,60,000.
ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూల ఆధారంగా.
దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'ది మేనేజర్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, జాలహళ్లి పోస్ట్, బెంగళూరు' చిరునామాకు పంపించాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: 24-10-2024.
వెబ్‌సైట్: https://bel-india.in/

వాక్ ఇన్

సీ-మెట్‌లో ప్రాజెక్ట్ ఫెలోలు

హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ మెటీరియల్స్ ఫర్ ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ (సీ-మెట్) తాత్కాలిక ప్రాతిపదికన 4 ప్రాజెక్ట్ ఫెలో పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ (మెటలర్జీ/ కెమికల్/ఇన్‌స్ట్రుమెంటేషన్/ ఎన్విరాన్‌మెంటల్), ఎమ్మెస్సీ (ఫిజిక్స్/ కెమిస్ట్రీ/ మెటీరియల్ సైన్స్), ఎంటెక్‌తో పాటు పని అనుభవం.
వయసు: 28 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
వేతనం: నెలకు రూ.40,300.

ప్రాజెక్ట్ అసిస్టెంట్ ఖాళీలు


హైదరాబాద్‌లోని సీ-మెట్ తాత్కాలిక ప్రాతిపదికన 3 ప్రాజెక్ట్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో డిప్లొమా (మెటలర్జీ/ కెమికల్/ మెకానికల్), బీఎస్సీ(ఫిజిక్స్/ కెమిస్ట్రీ)తో పాటు పని అనుభవం.
వయసు: 28 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
వేతనం: నెలకు రూ.26,300.

ఈ రెండు రకాల పోస్టులకూ...

దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా.
ఎంపిక: ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూల ఆధారంగా.
ఇంటర్వ్యూ తేదీ: 16-10-2024.
వేదిక: సెంటర్ ఫర్ మెటీరియల్స్ ఫర్ ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ (సీ-మెట్), ఐడీఏ ఫేజ్-3, చర్లపల్లి, హెచ్‌సీఎల్, హైదరాబాద్.
వెబ్‌సైట్: https://cmet.gov.in/jobs

పోటీ పరీక్షలు రాస్తున్నారా?

'గ్రూప్స్, యూపీఎస్సీ.. లాంటి పోటీ పరీక్షల్లో ప్రశ్నలు అన్నింటికీ సరైన సమాధానాలు రాశాం. పరీక్షలో విజయం సాధించడం ఖాయం' అనుకుంటారు కొందరు అభ్యర్థులు. కానీ కొన్నిసార్లు వారి అంచనాలకు భిన్నంగానూ ఫలితాలు వస్తుంటాయి. సమాధానాలు రాసే క్రమంలో నిపుణులు చెప్పే విషయాలను గుర్తుంచుకుంటే.. అలాంటి ఇబ్బందులను అధిగమించడానికి ప్రయత్నించొచ్చు.



▲ సమాధానాన్ని పేజీ నిండుగా పెద్ద వ్యాసంలా రాసేయకుండా చిన్నచిన్న భాగాలుగా విభజించుకోవాలి. ప్రతి భాగమూ విశ్లేషణాత్మకంగా ఉండాలి. ఒక భాగానికీ మరో దానికీ మధ్య పొంతన లేకుండా రాయకూడదు. ఒక భాగానికి మరోటి కొనసాగింపుగా ఉండాలిగానీ.. సంబంధంలేని అంశాలను ఒకచోట చదువుతున్నట్టుగా ఉండకూడదు.

▲ ప్రతి భాగానికి సబ్ హెడ్డింగ్ పెట్టుకుని దాన్ని విశ్లేషించాలి. ఇలా చేయడం వల్ల ప్రతి పేరాలోనూ ఒక విషయాన్ని గురించి ప్రత్యేకంగా చర్చించినట్టు అవుతుంది.

▲ విషయాన్ని పైపైన చర్చించినట్టుగా కాకుండా.. లోతైన అవగాహనతో సమాధానాలు రాయాలి. సమస్యకు గల వివిధ కారణాలను సహేతుకంగా విశ్లేషించాలి. చివరగా చక్కని సమతుల్యాన్ని పాటిస్తూ పరిష్కారాన్ని సూచించాలి.

▲ వివిధ కోణాల్లో సమస్యను చర్చించగలగాలి. వ్యతిరేకిస్తూ కొంత సమాచారాన్ని, అనుకూలంగా మరికొంత జోడించాలి. కొన్ని ఉదాహరణలనూ జోడిస్తే సమాధానం మరింత అర్థవంతంగా ఉంటుంది.

▲ చర్చించాల్సిన అంశానికి సంబంధించి అవసరమైతే అదనపు సమాచారాన్నీ, ఉదాహరణలనూ జోడించవచ్చు. గతంలో జరిగిన విషయాలను ఉదాహరణలుగా సూచిస్తారు. అయితే ఆ అంశానికి సంబంధించిన వర్తమానాంశాలనూ జోడించాలి.

▲ ప్రభుత్వ పథకాన్ని గురించి వివరించమంటే ప్రయోజనాలనే ఏకరువు పెట్టకూడదు. నష్టాలూ విశ్లేషించగలగాలి.

▲ సమస్య వల్ల తలెత్తే పర్యవసానాలను వివరాలతోసహా అర్థమయ్యేలా చెప్పగలగాలి.

▲ ఒక అంశాన్ని చర్చించిన తర్వాత మీ అభిప్రాయాన్ని కూడా వెల్లడించాలి. దాని ప్రభావాన్నీ, ప్రాముఖ్యాన్ని కూడా తెలియజేయాలి.

▲ ఒక్కోసారి రెండు వేర్వేరు అంశాల గురించి చెప్పాల్సి రావొచ్చు. అలాంటప్పుడు వాటి మధ్య సారూప్యతలు, వ్యత్యాసాల గురించి తెలియజేయాలి. వీటి ఆధారంగా మీ అభిప్రాయాన్ని స్పష్టం చేయగలగాలి.

▲ వాదనకు బలం చేకూర్చే కారణాలు, తార్కాణాలను చూపగలగాలి. వివరణ ఎప్పుడూ తార్కికంగా ఉండేలా జాగ్రత్తపడాలి.

వైద్య సంబంధ కోర్సుల్లో దరఖాస్తులకు ఆహ్వానం

ఆంధ్రా యూనివర్సిటీ.. బొల్లినేని మెడ్‌స్కిల్స్ సంస్థతో అనుసంధానమై వైద్య సంబంధిత కోర్సుల ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

- **మాస్టర్ ఆఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్:** రెండేళ్ల వ్యవధి గల ఈ కోర్సులో చేరేందుకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఏడాదికి రూ.55 వేల ఫీజు. మొత్తం 40 సీట్లు ఉన్నాయి.
- **పీజీ డిప్లొమా ఇన్ క్రిటికల్ కేర్ టెక్నాలజీ:** కోర్సు వ్యవధి ఒక ఏడాది. ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ, బి.ఫార్మసీ, నర్సింగ్, బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్ తదితర అర్హతలున్న విద్యార్థులు దరఖాస్తు చేయవచ్చు. మొత్తం 15 సీట్లు. ఏడాదికి రూ.60 వేల ఫీజు.
- **పీజీ డిప్లొమా ఇన్ ఎమర్జెన్సీ మెడిసిన్ టెక్నాలజీ/గ్యాస్ట్రో ఎంటరాలజీ టెక్నాలజీ:** రెంటికీ వ్యవధి ఒక్క ఏడాదే. ముందు చెప్పిన విధమైన అర్హతలున్నవారు ఇందులో చేరవచ్చు. వరుసగా రూ.60 వేలు, రూ.40 వేల ఫీజు.

అర్హతలు

- 20 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపున్న విద్యార్థులు దరఖాస్తు చేయవచ్చు.
- దరఖాస్తును www.audoa.andhrauniversity.edu.in సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. నింపిన దరఖాస్తులను ఆఫ్‌లైన్‌లో అందజేయాలి.
- అక్టోబరు 15వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఇవి చేరాలి. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.500. మరిన్ని వివరాలు ఇదే వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
- కౌన్సెలింగ్ అక్టోబరు 16వ తేదీ జరుగుతుంది. దీనికి సంబంధించి లేఖలేవీ పంపరు.
- రిజర్వేషన్లను అనుసరించి పరీక్షలో చూపిన ప్రతిభతో ప్రవేశాలుంటాయి.

రాత్రి పఠనం మంచిదే!

చాలా మంది విద్యార్థులకు రాత్రి వేళల్లో చదవడం అలవాటు. అయితే అది సరైన పద్ధతి అవునో కాదో, నిద్ర వల్ల ఆటంకం కలుగుతుందేమో అనుకుని ఇది ఇచ్చే ఫలితాలపై సందేహపడుతూ ఉంటారు. కానీ ఈ రీతిలోనూ కొన్ని ప్రయోజనాలున్నాయి అంటున్నారు నిపుణులు. అవేంటో చూద్దామా..

అంతరాయాలు లేకుండా: పగటి పూటతో పోలిస్తే రాత్రి అంతరాయాలు కలిగే అవకాశాలు తక్కువ. దీంతో ఏకధాటిగా సాఫీగా చదివే వీలుంటుంది. ఇది ఏకాగ్రతకు దారితీస్తుంది. చదివే అంశం పట్ల లోతైన అవగాహన పొందటానికి వీలుంటుంది. చూపు మరల్చకుండా పాఠ్యాంశాల్లో నిమగ్నం కావొచ్చు.

వాతావరణం: సాధారణంగా పగటి పూటతో పోలిస్తే రాత్రి వాతావరణం నిశ్శబ్దంగా, ప్రశాంతంగా ఉంటుంది. ఇటువంటి సమయాల్లో కొత్త విషయాలు నేర్చుకునేందుకూ, అవి ఎక్కువ కాలం గుర్తుంచుకునేందుకూ ఆస్కారం ఉంటుంది. దేన్నయినా ఏకాంతంగా సాధన చేయడం ద్వారా మెరుగ్గా ఆపోశన పట్టే వీలుండటమే ఇందుకు కారణం.

సృజనాత్మకత: చాలామంది విద్యార్థులు రోజంతటితో పోలిస్తే.. రాత్రి ఎక్కువ సృజనాత్మకంగా ఆలోచించగలరని పరిశోధనల్లో తేలింది. ఈ సమయంలో క్లిష్టమైన, అంతగా పట్టు లేని సబ్జెక్టులను చదివితే సమస్యా పరిష్కార నైపుణ్యాలు పెరిగేందుకూ, కొత్త కొత్త ఆలోచనలకూ ఉపయోగపడుతుంది.

షెడ్యూల్: రోజంతా తరగతులు, కోచింగ్, ఇతర వ్యాపకాలు, పనులతో బిజీగా ఉంటున్నప్పుడు.. రాత్రి చదవడం కాస్త వీలుగా ఉంటుంది. షెడ్యూల్ ఇబ్బంది లేకుండా ఈ సమయాన్ని కాస్త వినియోగించుకోవచ్చు. విద్యార్థులు సవాలుగా అనిపించే విషయాలపై ఇటువంటి సమయాల్లో ఎక్కువ శ్రద్ధ వహించే వీలుంటుంది.

జ్ఞాపకశక్తి: కొన్ని అంచనాల ప్రకారం.. రాత్రి సమయాల్లో తెలుసుకున్న విషయాలు ఎక్కువ సమయం గుర్తుండే వీలుంటుంది. అదే సమయంలో సరిపడా నిద్ర ఉండేలా చూసుకోవడం వల్ల.. అది మరింత ఎక్కువ కాలం గుర్తుండేలా మెదడు సిద్ధం అవుతుంది. అలాగే కష్టమైన సబ్జెక్టులను రాత్రి చదవడం.. ఆ సవాలును మరింత సమర్థంగా స్వీకరిస్తుంది.

పునశ్చరణ: ఆఖరి నిమిషంలో నోట్స్, మెటీరియల్ వంటివి పునశ్చరణ చేసేందుకు.. రాత్రి వేళలు ఉపయోగం. ఇలా లక్ష్యాలను పూర్తిచేయడం ద్వారా 'అనుకున్నది సాధిస్తున్నాం' అనే సానుకూల దృక్పథం పెరుగుతుంది.



చదువు

ఉన్నతవిద్య, కెరియర్ ఎంపికలకు సంబంధించి విద్యార్థులకూ, ఉద్యోగార్థులకూ అనుమానాలు, ఊగిసలాట సహజం. సంబంధిత సందేహాలను సకాలంలో నివృత్తి చేసుకోవాలనుకుంటున్నారా?

మీ ప్రశ్నలను మాకు పంపండి. అనుభవజ్ఞులైన నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా:
చదువు
ఈనాడు కార్యాలయం,
అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రామోజీ ఫిల్మ్‌సిటీ -501 512
edc@eenadu.in

తాజా ఇంటర్న్‌షిప్‌లు

హైదరాబాద్‌లో

సోషల్ మీడియా మార్కెటింగ్

సంస్థ: హెన్స్‌సోషల్-వన్ సొల్యూషన్స్
నైపుణ్యాలు: కంటెంట్ మార్కెటింగ్, కంటెంట్ రైటింగ్, క్రియేటివ్ రైటింగ్, డిజిటల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్
స్టైపెండ్: రూ.10,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 15
☛ internshala.com/i/10b485

రిటెయిల్ ఆపరేషన్ అండ్ కార్పొరేట్ గిఫ్టింగ్

సంస్థ: సోల్‌ఫ్లవర్
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, సేల్స్, సేల్స్‌ఫోర్స్
స్టైపెండ్: రూ.11,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 25
☛ internshala.com/i/15a2c0

స్పోర్ట్స్ అన్‌గ్రౌండ్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్

సంస్థ: పడెల్ ఇండియా
నైపుణ్యం: స్పోర్ట్స్ అన్‌గ్రౌండ్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.15,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 18
☛ internshala.com/i/a3f041

అగ్రికల్చర్ అండ్ ఫుడ్ ఇంజినీరింగ్

సంస్థ: పిక్ యువర్ ప్లాంట్
నైపుణ్యం: అగ్రికల్చర్ అండ్ ఫుడ్ ఇంజినీరింగ్
స్టైపెండ్: రూ.8,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 16
☛ internshala.com/i/7a81ac

కంటెంట్

సంస్థ: రిజల్
నైపుణ్యాలు: కంటెంట్ రైటింగ్, వీడియో మేకింగ్
స్టైపెండ్: రూ.15,000
☛ internshala.com/i/e46b97

గ్రాఫిక్ డిజైన్

సంస్థ: మొసాచీ
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, క్రియేటివ్ సూట్, ఇలస్ట్రేటర్, ఇన్‌డిజైన్, ఫొటోషాప్, ఫొటోషాప్ లైట్‌రూమ్ సీసీ, ప్రీమియర్ ప్రో, కేన్వా, కోరల్‌డ్రా, ఫిగ్మా, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్, వీడియో ఎడిటింగ్
స్టైపెండ్: రూ.7,000-10,000
☛ internshala.com/i/f8508f

వీటికి దరఖాస్తు గడువు: అక్టోబరు 24

ఆపరేషన్స్ అనలిస్ట్

సంస్థ: జీడబ్ల్యూఆర్ సర్వీసెస్
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-పవర్‌పాయింట్, ఆపరేషన్స్, ప్రొడక్ట్ స్ట్రాటజీ
స్టైపెండ్: రూ.5,000
☛ internshala.com/i/c928ef

మోషన్ గ్రాఫిక్స్

సంస్థ: ఐడియల్ డిజైన్స్
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఫ్లాష్, ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, యానిమేషన్, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్
స్టైపెండ్: రూ.8,000
☛ internshala.com/i/3ac712

ఎఫ్ఎంసీజీ రిసెర్చ్

సంస్థ: లిక్విడ్ రీచ్ మీడియా సొల్యూషన్స్ ప్రై.లి.
నైపుణ్యాలు: బిజినెస్ రిసెర్చ్
స్టైపెండ్: రూ.15,000
☛ internshala.com/i/fe9f54

వీటికి దరఖాస్తు గడువు: అక్టోబరు 26

రైల్వే ప్రాజెక్టుల పనులు కూత పెట్టాల్సిందే..

- విశాఖలో రైల్వేజోన్ పనులు వెంటనే ఆరంభించాలి
- అమరావతి లైన్‌కు డీపీఆర్‌కు పరుగులుపెట్టించాలి
- ఇంకా డీపీఆర్ దశలోనే విజయవాడ-విశాఖ మూడో లైన్
- గతంలో సర్వేచేసి ఆపేసిన కీలక లైన్లకు ఒత్తిడి తేవాలి
- రద్దీకి తగినట్లు వివిధ మార్గాల్లో కొత్త రైళ్లు అవసరం
- రేపు ఎంపీలతో రైల్వే జీఎం సమావేశం



ఈనాడు-అమరావతి: రాష్ట్రంలో కీలకమైన రైల్వే ప్రాజెక్టులు గత ఐదేళ్లలో పడకేశాయి. జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులేవీ పూర్తికాలేదు. కొత్తవి మంజూరు చేయించుకోవాలనే ధ్యాస ఏమాత్రం కనిపించలేదు. విశాఖ కేంద్రంగా మంజూరైన కొత్త జోన్ కార్యాలయాల నిర్మాణానికి భూములు అప్పగించలేక చేతులెత్తేసింది. రాజధాని అమరావతికి మంజూరైన కొత్తలైన్‌ను విస్మరించింది. ఇలా గత వైకాపా ప్రభుత్వంలో రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టుల పరంగా తీవ్ర నష్టమే జరిగింది. ఇప్పుడీ నష్టాన్ని పూరించుకొని, వేగంగా ప్రాజెక్టులు పరుగులు పెట్టించి, కొత్తవి మంజూరు చేయించేందుకు సువర్ణ అవకాశం లభించింది. కేంద్రం, రాష్ట్రంలోనూ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో విరివిగా అనేక ప్రాజెక్టులు రాష్ట్రానికి తెచ్చుకునే వీలుంది. మన రాష్ట్ర ఎంపీలు రైల్వేశాఖపై ఏమేరకు ఒత్తిడి తెస్తే అంతలా పనులు వేగంగా సాగేందుకు వీలుంటుంది. దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోని మన రాష్ట్రంలో ఉన్న విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్ల పరిధిలోకి వచ్చే లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో.. రైల్వే జోనల్ మేనేజర్ శుక్రవారం విజయవాడలో సమావేశం నిర్వహించనున్నారు. ఎంపీలు ఇచ్చే ప్రతిపాదనలపై చర్చించనున్నారు. ఈ సందర్భంగా ఎంపీలు రాష్ట్రానికి అవసరమైన కీలక ప్రాజెక్టులు, కొత్త రైళ్ల ఆవశ్యకతను జీఎం దృష్టికి తీసుకెళ్లి, వాటిపై సానుకూల నిర్ణయం వచ్చేలా చూడాల్సి ఉంది.

అమరావతి లైన్ శరవేగంగా..

రాజధాని అమరావతి ప్రాంతాన్ని అనుసంధానం చేసే కీలకమైన కొత్తలైన్ ప్రాజెక్టు గత ఐదేళ్లూ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. ఎర్రుపాలెం-అమరావతి-నంబూరు, అమరావతి-పెదకూరపాడు, సత్తెనపల్లి-నరసరావుపేట లైన్..కలిపి మొత్తం 106 కి.మీ.తో ప్రాజెక్టు గతంలో మంజూరైంది. దీనికి డీపీఆర్ కూడా సిద్ధమయ్యే దశలో.. ఆగిపోయింది. అయితే ముందుగా ఎర్రుపాలెం-అమరావతి-నంబూరు మధ్య సింగిల్ లైన్ నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని రైల్వేబోర్డు సూచించింది. దీనికి కూడా గత ప్రభుత్వం సహకరించలేదు. తాజాగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ప్రాజెక్టుకు కదలిక మొదలైంది. ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు 56.53 కి.మీ.మేర కొత్తలైన్ నిర్మాణానికి రైల్వే శాఖ సమగ్ర పథక నివేదిక (డీపీఆర్) రూపొందిస్తుండటంతోపాటు, భూసేకరణకు నోటిఫికేషన్లు ఇస్తోంది. గతంలో రాష్ట్ర వాటా ఇవ్వాలని, భూసేకరణ వ్యయం రాష్ట్రమే భరించాలని కొర్రీలు వేసిన రైల్వేశాఖ.. ఇప్పుడవన్నీ తమ నిధులతోనే చేసేందుకు ముందుకొచ్చింది. అయితే త్వరగా దీనికి డీపీఆర్ తయారుచేసి, వేగంగా భూసేకరణ జరిగేలా చూస్తే.. తొందరలోనే ఈ రైల్వేలైన్ పట్టాలు ఎక్కేందుకు అవకాశం ఏర్పడుతుంది.

కీలక ప్రాజెక్టులను పరుగులు పెట్టించాలి

* విజయవాడ-చెన్నై ప్రధాన రైల్వే లైన్‌కు ప్రత్యామ్నాయంగా నిర్మిస్తున్న 309 కి.మీ. నడికుడి-శ్రీకాళహస్తి లైన్ గత జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో పనులు వేగంగా సాగలేదు. 2011-12లో ఈ ప్రాజెక్టు మంజూరుకాగా, 2016లో పట్టాలెక్కింది. అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో పనులు శరవేగంగా జరిగాయి. దీంతో న్యూపిడుగురాళ్ల నుంచి శావల్యాపురం వరకు 47 కి.మీ. పూర్తయింది. తర్వాత గుండ్లకమ్మ-దర్శి మధ్య 27 కి.మీ. పూర్తై అందుబాటులోకి వచ్చింది. మిగిలిన పనులు నెమ్మదిగా జరుగుతున్నాయి.

* కోటిపల్లి-నరసాపురం మధ్య 57.21 కి.మీ. మేర 2011-12లో మొదలైన కొత్తలైన్ పనుల్లో పురోగతి ఉండటంలేదు. కోనసీమ ప్రాంతంలో ఈ రైల్వేలైన్ చిరకాల స్వప్నం. రైల్వేశాఖ దీనికి పెద్దగా ప్రాధాన్యం ఇవ్వకుండా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోంది. దీంతో ఇంతకాలం కేవలం గౌతమి, వైనతేయ, వశిష్ఠ గోదావరిలపై వంతెనల నిర్మాణపనులు ఏళ్ల తరబడి నెమ్మదిగా సాగుతున్నాయి.

- కడప-బెంగళూరు మధ్య రైల్వేలైన్ పనులు ముందుకు సాగకుండా గత జగన్ ప్రభుత్వం మోకాలడ్డింది. 205 కి.మీ. మేర ఉన్న ఈ ప్రాజెక్టు కడప నుంచి పెండ్లిమర్రి, రాయచోటి, వాయల్పాడు, మదనపల్లెరోడ్డు, మదగట్ట మీదుగా వెళ్తుంది. ఇందులో కడప-పెండ్లిమర్రి మధ్య 21.8 కి.మీ. మాత్రమే పూర్తయింది. అయితే దీని అలైన్‌మెంట్ మార్చాలని, ముద్దనూరు నుంచి పులివెందుల మీదుగా ముదిగుబ్బ వరకు లైన్ వేసి, ధర్మవరం-బెంగళూరు లైన్‌కు అనుసంధానం చేయాలని వైకాపా ప్రభుత్వం ప్రతిపాదించింది. రైల్వే శాఖ మాత్రం పాత అలైన్‌మెంట్ ప్రకారమే నిర్మిస్తామని, దానికే సమ్మతి తెలపాలంటూ కోరుతూ వచ్చింది. దీంతో ఈ ప్రాజెక్టు స్తంభించిపోయింది.
- అనంతపురం జిల్లా రాయదుర్గం నుంచి కర్ణాటకలోని తుముకూరు మధ్య 207 కి.మీ. రైల్వేలైన్ ఇంకా పూర్తి కాలేదు. రాయదుర్గం నుంచి కళ్యాణదుర్గం మీదుగా కదిరిదేవరపల్లి వరకు 63 కి.మీ.మాత్రమే పూర్తయింది. ఇంకా ఏపీ పరిధిలోని 31 కి.మీ., కర్ణాటకలోని 113 కి.మీ పనులు జరగాల్సి ఉంది.

మూడో లైన్‌లో జాప్యం

- విజయవాడ-నెల్లూరు మార్గంలో మూడో లైన్ నిర్మాణ పనులు దాదాపు కొలిక్కి వస్తున్నాయి. అయితే విజయవాడ-దువ్వాడ (విశాఖపట్నం) మార్గంలో ఇప్పటికీ మూడో లైన్ నిర్మాణం డీపీఆర్ దశలోనే ఉంది. త్వరగా నిర్మాణ పనులు ఆరంభించేలా చూడాల్సి ఉంది. ఈ మార్గంలో కొత్తగా నాలుగో లైన్ కూడా మంజూరైంది. దీనికి వేగంగా సర్వే జరిగేలా చూడాలి.
- ధర్మవరం-పాకాల-కాట్పాడి మధ్య రెండో లైన్ నిర్మాణం ఎంతో కీలకమైంది. డీపీఆర్ సిద్ధమైనాసరే పనులు చేపట్టలేదు.

కొత్త రైళ్లు పెంచాలి

- విజయవాడ నుంచి బెంగళూరు, షిర్డీ, ముంబయిలకు రైళ్ల కొరత ఉంది. రద్దీకి తగినన్ని రైళ్లు లేవు.
- గతంలో విజయవాడ-హుబ్లీ, విజయవాడ-బెంగళూరు ప్యాసింజర్ ఉండేవి. కొవిడ్ సమయంలో వీటిని నిలిపేసి, తర్వాత పునరుద్ధరించలేదు.
- గుంటూరు-సికింద్రాబాద్ మధ్య రైళ్లను పెంచాలనే డిమాండ్ ఉంది.

సర్వే చేశాక.. అటకెక్కించారు..

రాష్ట్రంలో అనేక ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ ఉండేలా.. కొత్త లైన్ల నిర్మాణాలకు గతంలో సర్వేలు చేసి నివేదికలను రైల్వేబోర్డుకు పంపారు. అయితే వీటిపై నిర్ణయం తీసుకోకుండా పక్కనపెట్టారు. ఎంపీలు ఈ కొత్తలైన్లు మంజూరు చేయించేలా ఒత్తిడి తీసుకురావాల్సి ఉంది.

సర్వేచేసిన లైన్	కి.మీ.
ఒంగోలు-దొనకొండ	87.45
భద్రాచలంరోడ్-విశాఖపట్నం	257
నంద్యాల-జద్చర్ల	182.37
మార్కాపురంరోడ్-శ్రీశైలం	65
నంద్యాల-మహానంది-ఆత్మకూరు	58.2
గిద్దలూరు-భాకరాపేట	118.2
ఓబుళవారిపల్లె-రాయచోటి	80
తుని-నర్సీపట్నం-చోడవరం-కొత్తవలస	155
చిత్తూరు-కుప్పం	135
కడప-కదిరి-హిందూపురం	235
కంభం-ఒంగోలు	113
మంత్రాలయంరోడ్-కర్నూలు టౌన్	101
దర్శి-నరసరావుపేట	67.43

- మచిలీపట్నం-రేపల్లె మధ్య కొత్త లైన్ వేయాలని మచిలీపట్నం ఎంపీ బాలశౌరి పదేపదే డిమాండ్ చేస్తున్నారు.
- నరసాపురం-మచిలీపట్నం మధ్య నేరుగా లైన్ వేయాలని కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ కోరుతున్నారు.

పూర్తికాని కొత్తలైన్ ప్రాజెక్టులివి..

ఎక్కడి నుంచి ఎక్కడికి	కి.మీ.	అంచనా విలువ	పూర్తయిన కి.మీ.
నడికుడి-శ్రీకాళహస్తి	309	రూ. 2,289 కోట్లు	74
కడప-బెంగళూరు	268	రూ. 3,037 కోట్లు	21.8
కోటిపల్లి-నరసాపురం	51.21	రూ. 2,120 కోట్లు	0
రాయదర్గం-తుముకూరు	207	రూ. 2,404 కోట్లు	63

- విజయవాడ నుంచి చెన్నై వైపు వెళ్లే పలు రైళ్లు నేరుగా తెనాలి వైపు కాకుండా.. విజయవాడ నుంచి న్యూ గుంటూరు మీదుగా తెనాలి వెళ్లి, అక్కడి నుంచి చెన్నై వైపు వెళ్లేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ఉండవల్లిలోని నివాసంలో మంత్రి లోకేశ్‌ను కలిసిన పారా క్రీడాకారులు

వేలిముద్రల స్కానర్ల సేకరణ టెండర్లలో ప్రతిష్టంభన

- యూఐడీఏఐ సమాచారంతో ఒప్పందం నిలిపివేత

ఈనాడు, అమరావతి: పింఛన్ల పంపిణీ కోసం అధునాతన ఫింగర్ ప్రింట్ స్కానర్ల సేకరణకు సంబంధించిన టెండర్ల వ్యవహారం మొదటికొచ్చింది. టెండర్ దక్కించుకున్న అక్షర సంస్థ సరఫరా చేయబోయే స్కానర్లకు సెక్యూరిటీ ఫీచర్లు లేవంటూ యునిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఆ సంస్థతో ఒప్పంద ప్రక్రియను అధికారులు నిలిపివేశారు. తదుపరి నిర్ణయం కోసం రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కమ్యూనికేషన్ శాఖ కార్యదర్శి ఛైర్మన్‌గా ఉన్న ప్రత్యేక కమిటీకి నివేదించారు. రాష్ట్రంలో ప్రతి నెలా పింఛన్ల పంపిణీకి వినియోగిస్తున్న ఎల్‌ఓఆర్డీ సర్వీస్ ఫింగర్ ప్రింట్ స్కానర్లు తక్షణం మార్చేసి, వాటి స్థానంలో ఎల్‌వన్ ఆర్డీ ఫింగర్ ప్రింట్ స్కానర్లు సేకరించి వినియోగించాలని యూఐడీఏఐ అన్ని రాష్ట్రాలనూ ఆదేశించింది. వీటి సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన రూ.53.78 కోట్లతో 1,34,450 స్కానర్ల సేకరణకు టెండర్లు పిలిచే బాధ్యతను గ్రామ, వార్డు సచివాలయాల శాఖ.. రాష్ట్ర టెక్నికల్ సర్వీసెస్ సంస్థకు అప్పగించింది. రెండు సంస్థలు టెండర్లు వేశాయి. గత నెల 27న టెండర్లు తెరిచారు. ఎల్1గా అక్షర సంస్థ నిలిచిందని, లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ (ఎల్‌టీఏ) కోసం అధికారులు ఆహ్వానించారు. ఒక్కో స్కానర్ ప్రాథమిక ధర రూ.4 వేలుగా నిర్ణయించగా.. రూ.1,989కే సరఫరా చేస్తామని అక్షర ముందుకొచ్చింది. అయితే ఆ సంస్థ సరఫరా చేయబోయే ఫింగర్ ప్రింట్ స్కానర్లకు సెక్యూరిటీ ఫీచర్లు లేవని యూఐడీఏఐ సమాచారం ఇవ్వడంతో ఒప్పంద ప్రక్రియను అధికారులు నిలిపివేశారు.

టీబీ నిర్మూలనకు అందరూ సహకరించాలి: గవర్నర్

ఈనాడు, అమరావతి: టీబీ నియంత్రణ కోసం చేపట్టిన 75వ టీబీ సీల్ సేల్ ప్రచార కార్యక్రమాన్ని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ బుధవారం రాజ్‌భవన్‌లో ప్రారంభించారు. దేశంలో 2025 నాటికి టీబీని నిర్మూలించే దిశగా సాగుతున్న ఈ సీల్ సేల్ ప్రచారంలో స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గవర్నర్ మాట్లాడుతూ..'టీబీ ప్రాణాంతక వ్యాధిగా విస్తరిస్తుండడం అభివృద్ధి చెందిన దేశాల్లోనూ ఆందోళనకరంగా మారింది. ఆంధ్రప్రదేశ్‌లో టీబీ వ్యాధిగ్రస్తులు కోలుకుంటున్న రేటు 91 శాతంగా ఉంది. ఈ వ్యాధి నివారణలో భాగస్వాములైన వివిధ విభాగాల కృషి అభినందనీయం' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీబీ సీల్ సేల్ ప్రచారం కోసం ఏఎంజీ ఇంటర్‌నేషనల్ ప్రతినిధులు రూ.5.01 లక్షల చెక్కును గవర్నర్‌కు అందజేశారు. రాష్ట్ర టీబీ నియంత్రణ అధికారి టి.రమేష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

జాతీయస్థాయి విద్యార్థి సంఘంగా పీడీఎస్‌యూ

అఖిల భారత కన్వీనర్‌గా ప్రియంబసు



హైదరాబాద్, న్యూస్‌టుడే: వివిధ రాష్ట్రాలలో కొనసాగుతున్న ప్రగతిశీల, విప్లవ, విద్యార్థి సంఘాలన్నీ ఏకమై.. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి యూనిటీ(పీడీఎస్‌యూ) పేరుతో జాతీయస్థాయి విద్యార్థి సంఘం నూతనంగా ఆవిర్భవించింది. సెప్టెంబరు 30న హైదరాబాద్‌లో జరిగిన పీడీఎస్‌యూ-తెలంగాణ స్వర్ణోత్సవాల్లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామని నేతలు తెలిపారు. సంబంధిత వివరాలను బుధవారం హైదరాబాద్ విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో జరిగిన. . ఆయా రాష్ట్రాల విద్యార్థి సంఘాల సమావేశంలో వెల్లడించారు. కొత్తగా ఆవిర్భవించిన యూనిటీకి అఖిల భారత కన్వీనర్‌గా పశ్చిమబెంగాల్‌కు చెందిన ప్రియంబసును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మరో 13 మందిని సభ్యులుగా నియమించారు. వారిలో నామాల ఆజాద్, రామకృష్ణ, నర్సింహారావు(తెలంగాణ), రాజేష్, పవిత్ర(ఏపీ) ఉన్నారు. అనంతరం కన్వీనర్ ప్రియంబసు మాట్లాడుతూ.. విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, నూతన విద్యావిధానం-2020 అమలు.. తదితర విద్యార్థి వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న మోదీ ప్రభుత్వంపై ఉద్యమించేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

'రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ఇప్పించండి'

ఈనాడు, అమరావతి: రేషన్ డీలర్లకు తెలంగాణలో ఇస్తున్న విధంగా గౌరవ వేతనంతో కూడిన కమీషన్ ఇప్పించాలని ఆ సంఘం అధ్యక్షుడు దివి లీలా మాధవరావు కోరారు. బుధవారం ఆయన అనకాపల్లి రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు శేషు, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి పి.హేమలత తదితరులతో కలిసి ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు.

చెత్త పన్ను రద్దుపై మంత్రి సవిత హర్షం

ఈనాడు, అమరావతి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చెత్త పన్ను రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడంపై బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత హర్షం వ్యక్తం చేశారు. జగన్ తీసుకున్న తుగ్లక్ నిర్ణయాల్లో చెత్త పన్ను ఒకటని ఆమె బుధవారం ఒక ప్రకటనలో దుయ్యబట్టారు.



సంతృప్తికర జీవితంతోనే మానసిక ఆరోగ్యం

నేటి యువతలో మానసిక ఆరోగ్య సమస్యలు ఎక్కువవుతున్నాయి. కానీ ఆ విషయాన్ని కూడా గుర్తించలేనంత హడావుడి జీవితాన్ని గడుపుతున్నారు. సరైన పౌష్టికాహారం, కంటి నిండా నిద్ర లేకుండా, వ్యాయామం చేయకుండా తెలియని గమ్యం వైపు పరిగెత్తుతున్నారు. ఉద్యోగాలు, బంధాల నుంచి ఎక్కువ ఆశిస్తున్నారు. చేస్తున్న పనితో సంతృప్తి చెందడం లేదు. కాస్త ఆగి నెమ్మదిగా జీవించడం అలవాటు చేసుకోండి. బంధాల్లో పరిపూర్ణత కోసం చూడకుండా వాటికి విలువివ్వండి. చేసే పని చిన్నదా, పెద్దదా అని ఆలోచించకుండా దాన్ని ప్రేమించండి. సంతృప్తికర జీవితంతోనే మానసిక ఆరోగ్యం సొంతమవుతుంది.

– బి.ఎస్.గుప్తా, యోగా శిక్షకులు

గాంధీజీ శాంతి బాట ప్రపంచానికి స్ఫూర్తి

- గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

ఈనాడు, అమరావతి: జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రిలకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ నివాళులు అర్పించారు. రాజ్‌భవన్‌లో బుధవారం నిర్వహించిన గాంధీ, శాస్త్రిల జయంతి వేడుకల్లో గవర్నర్ వారి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. 'మహాత్ముడి నిరాడంబర జీవనం, ఆయన చూపిన సత్యం, అహింసా మార్గం ఆచరణీయం. ఆయన పయనించిన శాంతియుత బాట నేటికీ ప్రపంచ నేతలకు స్ఫూర్తిగా నిలుస్తోంది' అని అన్నారు. 'దేశంలో వ్యవసాయ అభివృద్ధికి లాల్ బహదూర్ శాస్త్రి అందించిన సేవలు గణనీయమైన ప్రభావాన్ని చూపించాయి. ఆయన ఇచ్చిన జై జవాన్, జై కిసాన్ నినాదం లక్షల మందికి స్ఫూర్తినిచ్చాయి' అని గుర్తు చేశారు.

ఒకరు దేశాన్ని నిలిపారు.. మరొకరు నడిపారు: సీఎం చంద్రబాబు

వలస పాలన నుంచి దేశానికి మహాత్మాగాంధీ విముక్తి కలిగిస్తే... 'జై జవాన్-జై కిసాన్' నినాదంతో మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి ముందుకు నడిపారని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. ఉండవల్లిలోని ఆయన నివాసంలో గాంధీజీ, శాస్త్రిల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ' 'అహింసా మార్గంలో గాంధీజీ ఉద్యమించి బానిస సంకెళ్లు తెంచారు. ఆత్మాభిమానం, ఆత్మగౌరవం.. మనకు మనమే కాపాడుకోవాలని ఆయన చెప్పిన మాటలు స్ఫూర్తిదాయకం. నిజాయతీ, నిరాడంబరత, త్యాగశీలతకు శాస్త్రి నిలువెత్తు నిదర్శనం. వీరిద్దరు చూపిన మార్గం నిరంతరం అనుసరణీయం'' అని చంద్రబాబు పేర్కొన్నారు. మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారం చేయడమే మన కర్తవ్యమన్నారు.

- డాలస్ పర్యటనలో ఉన్న శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు అక్కడ గాంధీ విగ్రహాన్ని సందర్శించారు. మహాత్ముడి జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో స్పీకర్‌తోపాటు రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, తెదేపా ఎన్నారై సమన్వయకర్త కోమటి జయరాం, ఎన్నారై పెట్టుబడిదారుల సమన్వయకర్త రామకృష్ణ గుళ్లపల్లి, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.
- వైకాపా అధ్యక్షుడు జగన్ ఆయన క్యాంపు కార్యాలయంలో గాంధీ, శాస్త్రిల చిత్రపటాలకు నివాళి అర్పించారు.
- తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ అశోక్‌బాబు, నేతలు జంగా కృష్ణమూర్తి, ఉండవల్లి శ్రీదేవి పాల్గొని దేశానికి గాంధీ, శాస్త్రిల సేవలు గుర్తు చేసుకున్నారు.





రాజ్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నివాళులర్పిస్తున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ★ గాంధీజీ, శాస్త్రిల చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



గాంధీజీ, శాస్త్రిల చిత్రపటాలకు నమస్కరిస్తున్న లోకేశ్

అస్సాంలో రోడ్ అసెట్ మేనేజ్‌మెంట్‌పై అధ్యయనం

- పర్యటించనున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, అధికారులు

ఈనాడు, అమరావతి: అస్సాంలో రోడ్ అసెట్ మేనేజ్‌మెంట్ విధానాన్ని అమలు చేస్తున్న తీరును పరిశీలించేందుకు ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఆ శాఖ ఉన్నతాధికారులతో కూడిన బృందం గురు, శుక్రవారాల్లో పర్యటించనుంది. బ్రహ్మపుత్ర నదిపై నిర్మిస్తున్న గువాహటి-ఉత్తర గువాహటి వంతెన, తదితరాలను వీరు పరిశీలించనున్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి

ఈనాడు, అమరావతి: సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ)లో పని చేస్తున్న ఉద్యోగులకు ఆగస్టు, సెప్టెంబరు నెలల వేతనాలు చెల్లించాలని ఉద్యోగ సంఘాల నాయకులు రత్నమాలిని, సైకం శివకుమారి కోరారు. ప్రతి నెలా 1న జీతాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.



తెలంగాణ రాష్ట్రమంతటా బతుకమ్మ వేడుకలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తీరొక్క పూలతో చేసిన బతుకమ్మలతో పల్లెలు, పట్టణాలన్నీ వర్ణరంజితమయ్యాయి. ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా వరంగల్ నగరంలోని చారిత్రక రుద్రేశ్వర వేయిస్తంభాల దేవాలయం వద్దకు భారీగా తరలివచ్చిన మహిళలు ఆడిపాడారు.

-న్యూస్‌టుడే, హనుమకొండ చౌరస్తా

ప్రధాని మోదీ నిజమైన కర్మయోగి

- దేశాన్ని సమున్నతంగా నిలపడానికి శ్రమిస్తున్నారు..
- ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు డిజిటల్, అమరావతి: ప్రధాని మోదీ నిజమైన కర్మయోగి అని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వ్యాఖ్యానించారు. దేశాన్ని ప్రపంచంలోనే సమున్నతంగా తీర్చిదిద్దడానికి ఆయన అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని బుధవారం 'ఎక్స్' వేదికగా కొనియాడారు. 'పరమశివుడి స్వరూపంగా పూజలందుకున్న ఆదిశంకరాచార్యులు సనాతన ధర్మ రక్షణకు దేశవ్యాప్తంగా పర్యటించి ఎంతగానో కృషి చేశారు. వివిధ ఆరాధనా విధానాలు, ఆధ్యాత్మిక పద్ధతుల్ని ఏకతాటిపైకి తెచ్చారు. ఉప్పుసత్యాగ్రహం పేరుతో స్వాతంత్ర్య ఉద్యమాన్ని మహాత్మాగాంధీ మలుపు తిప్పారు. ఆచార్య వినోబాభావే దేశమంతటా పర్యటించి భూస్వాముల భూముల్ని పేదలకు పంచారు. కొంతమంది కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు నడిచినా మార్పులు జరగవు. ఉన్నత లక్ష్యం లేని నడకలు ప్రజల్లో స్ఫూర్తి నింపవు. దేశాన్ని ఏకం చేయలేవు. అది కేవలం నడకగానే మిగిలిపోతుంది. ప్రధాని మోదీ నడవనప్పటికీ ప్రపంచ వేదికలపై మనదేశ స్థానాన్ని సుస్థిరం చేశారు. ఇందుకు ఆయనకు కృతజ్ఞతలు. తమిళనాడుకు చెందిన సనాతన ధర్మ పవిత్ర చిహ్నమైన 'సెంగోల్'ను దేశ పార్లమెంటులో ఏర్పాటుచేశారు. ఇది మన ఐక్యత, సంప్రదాయానికి నిదర్శనం' అని పవన్ పేర్కొన్నారు.

పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు తొలగించాలి: సీపీఎం

ఈనాడు డిజిటల్, అమరావతి: విద్యుత్తు ఇంధన సర్దుబాటు ఛార్జీల ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండు చేశారు. వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు తొలగించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు బుధవారం లేఖ రాశారు.

7న పాలస్తీనా సంఘీభావ దినం

- 10 వామపక్ష పార్టీల పిలుపు

ఈనాడు డిజిటల్, అమరావతి: గాజాపై ఇజ్రాయెల్ దాడులు మొదలుపెట్టి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా యుద్ధాన్ని ఆపాలని అక్టోబరు 7న 'పాలస్తీనా సంఘీభావ దినం'గా పాటించాలని సీపీఐ, సీపీఎంతో సహా 10 వామపక్ష పార్టీలు ప్రజలకు పిలుపునిచ్చాయి. ఆ రోజు సభలు నిర్వహించి అమెరికా, ఇజ్రాయెల్ దాడులు, ప్రపంచ శాంతి అంశాలపై చర్చించాలని ఓ ప్రకటనలో పేర్కొన్నాయి.

పర్యాటకాభివృద్ధి సంస్థలో జీఎం పోస్టుకు పోటాపోటీ

- ఒక అధికారికి పర్యాటకశాఖ మంత్రి సిఫార్సు లేఖ
- ఇతరత్రా ప్రయత్నాల్లో మరో ఇద్దరు అధికారులు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థలో కీలకమైన హోటళ్ల విభాగం జనరల్ మేనేజర్ పోస్టుకు ముగ్గురు అధికారులు పోటీ పడుతున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి సిఫార్సు లేఖలు తెచ్చుకుంటున్నారు. వీరిలో ఒకరికి పర్యాటకశాఖ మంత్రి లేఖ ఇచ్చారు. మరో ఇద్దరు ఇతర మంత్రులు, ఎమ్మెల్యేల ద్వారా ప్రయత్నిస్తున్నారు. జీఎం పోస్టుకు ప్రయత్నిస్తున్న వారిలో గత ప్రభుత్వంలో అప్పటి పెద్దల అండతో సంస్థలో చక్రం తిప్పిన వారూ ఉన్నారు. రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ)లో హోటళ్ల విభాగం జనరల్ మేనేజర్ హరనాథ్ ఈ ఏడాది మేలో ఉద్యోగ విరమణ చేయడంతో అప్పటి నుంచి పోస్టు ఖాళీగా ఉంది. ఏపీటీడీసీకి చెందిన హోటళ్లు, రిసార్ట్‌లు జీఎం పరిధిలోకి వస్తాయి. హోటళ్లకు సరకుల కొనుగోళ్లకు సంబంధించిన బిల్లుల మంజూరు చేయించడంలో జీఎందే క్రియాశీలక పాత్ర. హోటళ్లు, రిసార్టుల్లో ఆక్యుపెన్సీ, రోజువారీ ఆదాయం సంస్థకు జమ చేయించడం వంటివి ఆయనే చూస్తుంటారు. జిల్లాల్లోని డివిజినల్ మేనేజర్లు, హోటల్ యూనిట్ మేనేజర్లపై పర్యవేక్షణ బాధ్యత జీఎందే. ఈ పోస్టులో ఉంటే జీతం కంటే కమీషన్ల కింద ఎక్కువ ఆదాయం వస్తుందన్న ప్రచారం ఉంది. ఈ పోస్టు కోసం కాకినాడ, నెల్లూరు డివిజనల్ మేనేజర్లు పవన్‌కుమార్, శ్రీనివాసరావు, పర్యాటకాభివృద్ధి సంస్థ ప్రధాన కార్యాలయంలోని మార్కెటింగ్ విభాగం సహాయ జనరల్ మేనేజర్ వీరనారాయణ ప్రయత్నిస్తున్నారు. పవన్‌కుమార్ వైకాపా ప్రభుత్వంలో సంస్థ ప్రధాన కార్యాలయంలో కీలకంగా వ్యవహరించారు. ఆయనపై వచ్చిన ఒక అభియోగంపై అప్పటి ఎండీ విచారణకు ఆదేశించారు. అప్పట్లో సంస్థలో చక్రం తిప్పే ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఒకరు పవన్‌కుమార్‌కు సహకరించారు. ఆ తరువాత కాకినాడ డీవీఎంగా పవన్‌కుమార్ వెళ్లారు.